اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيْمَ

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 3 సంచికలు 6 & 7 జనవరి & ఫిబ్రవరి 2012 రూ. 34/-





Saanthibaata


# శాంతిబాట

మాసపత్రిక రూ. 34/-

సంపుటి 3 సంచిక 6&7 జనవరి-ఫిబ్రవరి 2012

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

www.saanthibaata.net

www.saanthibaata.com

Email:velugubaata@gmail.com

Cell : 9491103017



**ఎడిటర్:**
ఎమ్‌డి. అతహరుల్లా

**ఎడ్వయిజరీ బోర్డ్:**
డా॥ సలీమ్ పాషా
డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు
ఎమ్‌డి. అఫ్ఫాన్ ఉమ్రీ

**Editor**
Md. Athaharullah

**Advisory Board**
Dr. Salim Pasha
Dr. Nagireddi Srinivasa Rao
Md. Affan Omri



**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440
and

**Printed at**
Saanthibaata Printing House,
19-1-447, Hanuman Statue Center
Samalkot - 533440
and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)


## జనవరి - ఫిబ్రవరి' 2012

**సఫర్ హి. 1433 - రబీ అల్-ఆఖిర్ 1433**


**4** **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం :** ఖుర్‌ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ అల్-బఖరా తఫ్సీర్ : 30 - 33 ఆయత్‌లు ...

**8** **ప్రపంచ శాంతిదూత 'ముహమ్మద్(స)' వారి బోధనలు, ఆచరణలు :** సమాజంలోని సమస్యలకు పరిష్కార మార్గం - ఈ నెల ప్రత్యేకం : ఉత్తమ సమాజం - సంపూర్ణ మధ్యపాన నిషేధం ...

**14** **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర :** తన సహచరులలో విశ్వాస పునాది ...

**19** **రెండవ ఖలీఫా ఉమర్ బిన్ ఖత్తాబ్ (రజి) వారి జీవిత చరిత్ర :** ఉహద్ యుద్ధం ...

**22** **హదీస్ విజ్ఞానం :** బుఖారీ(ర) (ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్) ...

**26** **జ్ఞానం -అజ్ఞానం :** రాష్ట్రంలో పెరుగుతున్న రక్షీల సంఖ్య ...

**37** **ఇబ్నె అబ్బాస్ (రజి) :** ఖుర్‌ఆన్ తఫ్సీర్‌లో ఈ ఉమ్మత్ యొక్క విద్వాంసుడు ...

**42** **రాతియుగం - ఓ చారిత్రక అబద్ధం :** ఈ భూమిపై మానవ జీవితం ఎప్పుడు ప్రారంభమైనది...

**45** **తిరిగి గూటికి :** ఏ సృష్టి ధర్మంతో బిడ్డ జన్మించిందో, తిరిగి ఆ ధర్మానికే చేరుకున్న సోదరుడు లేదా సోదరి గురించి (వారి మాటలలో). నవముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం- సుమయ్యా(రజి)

**49** **ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం :** నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్‌ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

**50** **జిన్నులు మరియు చేతబడి :** షైతాన్ నివాసం మరియు ఆహారం ...

**58** **ముస్లిమ్ మహిళ :** ఇస్లామ్‌లో వివాహ వ్యవస్థ ...



**సంవత్సర చందా :**

**రూ. 200/-**

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:
**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్,
సామర్లకోట-533440
**మీ ఫోన్ నంబర్ తప్పనిసరిగా వ్రాయండి**

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా **M.O.** ఫారమ్‌పై వ్రాయండి.
లేదా
క్రింది నెంబర్‌కు మీ వివరాలను **SMS** చేయండి.
**Cell : 9491103017**

ఇతర వివరాలకై సంప్రదించండి
**డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు,** *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

**M.O. పంపినా లేక బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేసినా, వెంటనే ఫోన్ చేసి చెప్పవలసిందిగా కోరుతున్నాము**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# 21వ శతాబ్దపు కృత్రిమ ప్రజాస్వామ్యం - ఎన్నికలు - రక్తపాతం

ఈ మధ్యనే మత కలహాలను రెచ్చగొట్టడానికి కర్ణాటక రాష్ట్రంలో ఓ ప్రయత్నం జరిగింది. ఆధునిక సమాజంలో మతకలహాలు ఎందుకొస్తాయో మన భారతీయులకు బాగా తెలుసు. ఓ రాజకీయ నాయకుని ప్రయోజనం కోసం ఇటువంటి వాటిని రెచ్చగొడతారు. ఆ ప్రయోజనం స్థాయి పెద్దదైతే, మారణహోమం కూడా పెద్ద స్థాయిలోనే జరుగుతుంది. 'ద హిందూ' దినపత్రికలో జనవరి 11వ తారీఖున 8వ పేజీలో ఓ న్యూస్ ఐటమ్ "Pakistan flag hoisting was Hindutva plot : Police" పబ్లిష్ అయింది.

ఆ వార్తలో అందించిన విషయాలు : జనవరి 1వ తారీఖున కర్ణాటకలోని సిందగి పట్టణంలోని తహసిల్దార్ ఆఫీస్ ఎదురుగా పాకిస్తాన్ జాతీయ జెండాను కొందరు ఎగురవేశారు. పోలీసులు తెలిపిన సమాచారాన్ని బట్టి మతకలహాలను రెచ్చగొట్టేందుకు 'శ్రీరామసేన' సభ్యులే ఆ జెండా (flag)ను ఎగురవేశారు. అంతవరకూ మొత్తం 7గురిని అరెస్ట్ చేసి బళ్ళారి జిల్లా జైలుకు తరలించారు. 'శ్రీరామసేన' అనేది ఓ pro-hindutva outfit. శ్రీరామసేన సభ్యులే పాకిస్తాన్ జెండా ఎగురువేసి దానిని ముస్లిములు ఎగురవేశారని నమ్మించి, మత సామరస్యాన్ని పాడు చేయడానికి పథకం పన్నారు. పోలీసులు దానిని భగ్నం చేశారు.

అయితే అరెస్ట్ అయిన ఏడుగురు తమ సభ్యులు కాదని మరియు వారు RSS కు చెందినవారని 'శ్రీరామసేన' సభ్యులు చెప్పారు. వారు ఓ విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి, అరెస్ట్ అయినవారికి మరియు RSS కి మధ్య సంబంధాలున్నాయని తెలిపే ఫొటోలను సాక్ష్యాలుగా చూపారు. అంతేకాకుండా RSS పేరును ఈ గొడవలోకి రాకుండా చేయడానికి పోలీసులపై ఒత్తిడి ఉందని కూడా ఆరోపించారు. పోలీసుల దగ్గర నుండి 'ద హిందూ' విశ్వసనీయంగా సేకరించిన సమాచారాన్ని బట్టి ఈ మొత్తం పథకం వెనుక ఎన్నికైన ఓ బిజెపి పార్టీ ప్రజాప్రతినిధి హస్తం ఉంది. జిల్లాలో మతకలహాలు రెచ్చగొట్టి లాభపడాలనేది ఆయన వేసిన రాజకీయ ఎత్తుగడేనని ఈ సంఘటన ద్వారా అర్థమౌతుంది.

ఒకవేళ పోలీసులు ఈ పన్నాగాన్ని భగ్నం చేసి ఉండకపోతే, రాజకీయ లాభం కోసం ఓ వ్యక్తి రెచ్చగొట్టే కలహాలకు ఎన్ని ప్రాణాలు బలి అయిపోయి ఉండేవో! ఎన్ని సంవత్సరాలపాటు ఆ చిచ్చు రగులుతూ ఉండేదో? ఈ 21వ శతాబ్దంలో కొందరు రాజకీయ నాయకులు నరరూప రాక్షసులుగా మారిపోతున్నారు. ఇది పాశ్చాత్య దేశాల సంస్కృతి. ఒకప్పుడు బ్రిటిష్‌వాడు మనదేశాన్ని పరిపాలించడానికి సోదరుల వలే బ్రతికే హిందూ ముస్లిముల మధ్య కలహాలు రెచ్చగొట్టాడు. తప్పుడు చరిత్ర పుస్తకాలను తయారుచేయించాడు. మన దురదృష్టవశాత్తు నేటికీ అవే మన పాఠ్యాంశాలు.

ఇది ఏ ఒక్క కర్ణాటక రాష్ట్రానికో, గుజరాత్ రాష్ట్రానికో పరిమితం కాలేదు. రాష్ట్ర స్థాయిలో అయితే ఒకటో రెండో ఊర్లు తగలబడతాయి. అంతర్జాతీయ స్థాయిలో అయితే కొందరు రాజకీయ నాయకుల ప్రయోజనం కోసం ఒకటో రెండో చిన్న దేశాలు తగలబడిపోతాయి. అమెరికాలో ఎన్నికలొస్తే, అక్కడి అధ్యక్షుడు రెండవసారి నెగ్గాలంటే, ఏదో ఒక గల్ఫ్ దేశాన్ని గాని లేదా ముస్లిములు ఎక్కువగా ఉండే దేశంపైగాని బాంబులు వేసి నాశనం చేసి హీరో అనిపించుకోవాలి. అప్పుడే అతడు నెగ్గుతాడు. అంటే అమెరికాలో అధ్యక్షుడిగా రెండవసారి సింహాసనంపై కూర్చోవాలంటే ముస్లిముల రక్తంతో అభిషేకం చేయించుకోవాలా? అసలు కారణమేమిటి? అమెరికాలో నివశిస్తున్న యూదుల ఓట్లు అధ్యక్షుని ఎన్నికలో కీలకమైనవి. కాబట్టి అక్కడి యూదులను తనవైపు తిప్పుకోవాలంటే, యూదుల దేశమైన ఇజ్రాయెల్ చెప్పినట్లు అమెరికా రాజకీయనాయకులు వినాలి.

నరరూప రాక్షసుడు అయితేనే అమెరికాకు అధ్యక్షుడు కాగలుగుతాడేమో! బుష్ రెండవసారి అధ్యక్షుడు కావడానికి ఆఫ్ఘనిస్తాన్ మరియు ఇరాక్ దేశాలను నాశనం చేశాడు. అందుకోసం ఏదో ఒక వంక కావాలి. తమ టవర్స్‌ని స్వయంగా కూల్పించుకుని, అల్-ఖైదా టెర్రరిస్టులే చేశారని ప్రపంచాన్ని నమ్మించాడు. నమ్మించాడు అనేకంటే అన్ని దేశాలను నమ్మమని సీరియస్‌గా హెచ్చరించాడు అంటే సరిపోతుంది.

కర్ణాటకలో కేవలం పాకిస్తాన్ జెండా మాత్రమే ఎగురవేశారు. బుష్ అయితే ఎప్పుడో 2001లోనే చనిపోయిన బిన్‌లాడెన్‌ని ఇంకా బ్రతికి ఉన్నాడని నమ్మబలికి, అతనికి ఇరాక్‌తో సంబంధాలున్నాయని, మరియు ఇరాక్‌లో విధ్వంసకర ఆయుధాలున్నాయని బొంకాడు. అక్కడ అటువంటి ఆయుధాలు లేవని నిపుణుల కమిటీ ఋజువుచేసినా సరే ఇరాఖ్‌పై దాడి చేసి లక్షలాదిమందిని పొట్టన పెట్టుకున్నాడు.

అమెరికాలో నివశించే యూదులు మనదేశంలో ఓటుకి డబ్బులిచ్చినట్లు, డబ్బులిస్తే ఓటువేయరు. వాళ్ళు ఓట్లు వేయాలంటే ముస్లిములను చంపాలి. ముస్లిముల ఇళ్ళను ధ్వంసం చేయాలి. అప్పుడే యూదులు ఓట్లు వేస్తారు. ఇప్పుడు ఒబామా రెండవసారి అధ్యక్షుడు కావడానికి 'ఇరాన్'ను బలిపశువును చేయడానికి సిద్ధపడ్డాడు. ఇరాన్‌లోని అణుశాస్త్రవేత్తలలో కొందరిని ఇప్పటికే ఇజ్రాయెల్ గూఢచారి సంస్థ హత్య చేసింది. ఇజ్రాయెల్ దగ్గర అణ్వాయుధాలు ఉండవచ్చుగాని, ఇరాన్ దగ్గర ఉండకూడదట.

మాలెగావ్ బాంబుదాడుల తరువాత ముస్లిములు కాకుండా వేరే మతానికి ఒక సంస్థ సభ్యులు వాటికి బాధ్యులని తేలిన తరువాత, ఏ దాడైనా జరిగితే వెంటనే ఏ నిర్ణయానికీ రావడం లేదు. అంతకు పూర్వమయితే ఏ దాడి జరిగినా, దానిని ముస్లిములపైకి నెట్టివేసి, మీడియాలో ముస్లిములపై దుష్ప్రచారం జరిగేది. అమాయక యువకులను అరెస్ట్ చేసి వేధించేవారు.

పాపాలు చేసి చేసి అమెరికా పాపపు వాపును పెంచుకుంటుంది. ఆ రోగం పెరిగి పెరిగి ఏదో ఒక రోజు అమెరికా పతనానికి దారితీస్తుంది. కాబట్టి ఆ పరిస్థితి రాకుండా అక్కడి ప్రజలు తమ ప్రభుత్వ రాక్షసనీతిని మార్చడానికి ప్రయత్నించాలి. హిట్లర్ ఇలాగే రెచ్చిపోయి అడ్రస్ లేకుండా పోయాడు. దాదాపు 65 లక్షల మంది యూదులను హిట్లర్ ఊచకోత కోశాడు. వాడి బారినుండి తప్పించుకుని, ప్రాణాలు అరచేత పట్టుకుని యూదులు పాలస్తీనా ముస్లిముల ఆశ్రయాన్ని పొందారు. సోదరులుగా భావించి ఆశ్రయమిస్తే, పాలు తాగి తల్లి రొమ్మునే కోసి వేసే రాక్షసుల వలే వారు పాలస్తీనా భూమిని ఆక్రమించి, ముస్లిములను చంపడం ప్రారంభించారు.

**కట్టు కథలతో గాజాపై ఇజ్రాయెల్ దాడులు** (సాక్షి, మార్చి 18, 2012, పేజి.4) : ఈ ఏడాది నవంబర్‌లో అమెరికా అధ్యక్షుని ఎన్నికలు మరియు వచ్చే సంవత్సరం 'ఇజ్రాయెల్'లో ఎన్నికలు జరుగనున్నాయి. జనాదరణ కరువైన ఇజ్రాయెల్ ప్రధాని ఎన్నికలు వచ్చేలోగా ఏదో ఒకటి చేసి చూపించాలని తెగ తొందరపడుతున్నాడు. ఇరాన్ అణుకేంద్రాలపై దాడిచేయడానికి ఇజ్రాయెల్ ఉవ్విళ్ళూరుతుంది. ఈ మధ్యనే ఇతడు అమెరికా అధ్యక్షునితో భేటీ అయివచ్చాడు. **ప్రజల సంక్షేమం కోసం పాటుపడి పేరు తెచ్చుకోవాలి గాని, రక్తపాతం సృష్టించి ప్రజాదరణ పొందడమా? ఇదేనా ప్రజాస్వామ్యం?**

నాలుగురోజుల పాటు ఇజ్రాయెల్ ఎఫ్-16 బాంబర్లతో గాజాపై బాంబులు, క్షిపణులు కురిపించి విధ్వంసం సృష్టించింది. ఈ దాడులలో కనీసం 25మంది పాలస్తీనా పౌరులు మరణించారు. యూదులు ఆక్రమించుకోగా మిగలిన పాలస్తీనా కొద్ది భూభాగం రెండు చీలికలుగా మిగిలింది. ఒక భాగం హమాస్ పాలనలో ఉండగా, రెండవదైన వెస్ట్‌బ్యాంక్ ఫతా పాలనలో ఉంది. హమాస్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దేశాలు ఉగ్రవాద ముద్రను వేసేశాయి. **ప్రపంచంలో ఏ దేశంపై అనుకుంటే ఆ దేశంపై ఉగ్రవాద ముద్రలు ఈ దేశాలు వేసేస్తుంటాయి.** ఈ లైసెన్స్ వీరికి ఎవరిచ్చారో? ముద్ర వేయడం మరియు వెంటనే రాక్షసులుగా మారిపోయి వారిని చంపేయడం.

హమాస్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు తమపై దాడులు చేసారని ఆరోపిస్తూ ఇజ్రాయెల్ గాజాపై దాడులు జరిపి మరో 30 మందిని పొట్టన పెట్టుకుంది. కాని వాస్తవానికి ఆ దాడికి మరియు గాజాలోని ఎవరికీ ఎటువంటి సంబంధమూ లేదు. దానికి ఈజిప్టు సైనిక ప్రభుత్వమే సాక్షి. ఆ దాడులు పాలస్తీనా నుండి కాకుండా, ఈజిప్టు వైపు నుండి జరిగాయి. ఆ దాడికి పాల్పడిన వారిని గత ఏడాది నవంబర్‌లో ఈజిప్టు సైన్యం అరెస్ట్ కూడా చేసింది.

అమెరికా దన్నుతో వెస్ట్ బ్యాంకులోకి యూదుల వలస పెరిగిపోతుంది. 30 సంవత్సరాల క్రితం వెస్ట్‌బ్యాంక్‌లో అక్రమంగా స్థిరపడిన ఇజ్రాయేలీల సంఖ్య 12,000 కాగా ఇప్పుడు అది 3 లక్షలు దాటింది. ఐక్యరాజ్యసమితి తీర్మానాలు ఇజ్రాయెల్ ఖాతరు చేయడం లేదు. మిగతా సభ్యదేశాలు అమెరికాకు భయపడి నోరు మూసుకున్నాయి. అంతేకాకుండా ఈ కుంటి సాకులతో చేస్తున్న దాడుల వెనుక మరో కారణం కూడా ఉందని తెలుస్తుంది. 'ఐరన్ డోమ్' అనే యాంటీ మిస్సైల్ వ్యవస్థను ఇజ్రాయెల్ రూపొందించింది. దాని రక్షణ సామర్థ్యాన్ని పరీక్షించుకోవడానికే ఈ దాడులు చేస్తుందని భావిస్తున్నారు.

**కుంటి సాకులు చెప్పి రాక్షసంగా ప్రజలను చంపే ఇజ్రాయెల్ వైపు నుండి ప్రపంచానికి ప్రమాదం లేదా?** ఇరాన్ వైపు నుండి మాత్రమే వస్తుందా? అణ్వాయుధాలు ఒక్క ఇరాన్ దేశంలోనే కాదు, ప్రపంచంలోని ఏ దేశం కూడా వాటిని కలిగి ఉండకూడదు మరియు తయారు చేయకూడదు. అమెరికా, ఇజ్రాయెల్ వంటి రాక్షస దేశాలలో అణ్వాయుధాలు ఉంటే ప్రపంచానికి ఎప్పటికైనా ప్రమాదమే!

ఉగ్రవాద దాడులు చేసి ముస్లిములను చంపేయడమే కాకుండా, ఆ దాడులకు కారణం ముస్లిములేనని చెప్పి తిరిగి ఆ అపనిందను ముస్లిములపైనే రుద్దుతున్నారు. **ఇంతకంటే నరరూప రాక్షసులుంటారా?**

ప్రపంచానికి దాదాపు 1400 సంవత్సరాల క్రితం నిజమైన ప్రజాస్వామ్యాన్ని పరిచయం చేసింది ఇస్లామ్. విజయవంతం కాబడిన ప్రజాస్వామ్యం అది. ఎందరో నాయకులు ఆ ప్రజాస్వామ్యాన్ని ప్రశంసించకుండా ఉండలేకపోయారు. అటువంటి ప్రజాస్వామ్యాన్ని ఇంతవరకూ ప్రపంచంలోని ఏ ప్రాంతం కూడా సాధించలేకపోయింది. కొత్త చట్టాల కోసం ఈ రోజున ప్రపంచవ్యాప్తంగా ఎన్నో నిరసన ప్రదర్శనలు, ఆందోళనలు చేస్తున్నారు. ప్రజలలోని క్రింది స్థాయి వ్యక్తికి కూడా సమాన గౌరవాన్నిచ్చి మరియు ఆ వ్యక్తికి దేశాధ్యక్షుడినే ప్రశ్నించే స్వాతంత్ర్యాన్ని ఆనాటి ముస్లిమ్ పాలకులు కల్పించారు. ఇతర మతధర్మాల వారికి రక్షణ కల్పిస్తూ, వారి ప్రార్థనా మందిరాలను, వారి ఆస్తులను కాపాడుతూ పరమత సహనంతో కూడిన ఓ ఆదర్శప్రాయమైన మరియు సువర్ణ ప్రజాస్వామ్యాన్ని ఇస్లామ్ ప్రపంచానికి అందించింది. ఆ ప్రజాస్వామ్యం ఏ విధంగా ఉండేదో పూర్తి వివరాలతో మరియు వాస్తవ సంఘటనలతో ఇన్షా అల్లాహ్ ఈ పత్రికలో అందిస్తాము.

"....నిశ్చయంగా ఒక వ్యక్తి (హత్యకు) బదులుగా గాని లేదా కల్లోలాన్ని వ్యాపింప జేసి నందుకుగానీ కాక, ఎవడైనా **ఒక వ్యక్తిని (అన్యాయంగా) చంపితే, అతడు సర్వమానవజాతిని చంపినట్లే మరియు ఎవడైనా ఒక మానవుని ప్రాణాన్ని కాపాడితే, అతడు సర్వ మానవజాతి ప్రాణాలను కాపాడినట్లే! ....**" (ఖుర్'ఆన్ 5:32)

---

"మరియు మీరు శిక్షించదలచుకుంటే, మీకు జరిగిన దానికి (అన్యాయానికి) సమానమైన శిక్ష మాత్రమే ఇవ్వండి. **కాని మీరు సహనం వహిస్తే నిశ్చయంగా, సహనం వహించేవారికి ఎంతో మేలు కలుగుతుంది.**" (ఖుర్'ఆన్ 16:126)

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰہِ الرَّحۡمٰنِ الرَّحِیۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

**21**

## ఖుర్'ఆన్ తఫ్సీర్

**2. సూరహ్ అల్-బఖరా**

( గత సంచిక తరువాయి )

● మరణం తరువాత మొదలయ్యే ఒకరకమైన జీవితం గురించి 28వ ఆయత్‌లో ప్రస్తావించబడింది. కాని ఆ ఆయత్‌లో సమాధి జీవితం గురించి ఏమీ చెప్పలేదు. ప్రజలు సమాధులలో తమ విశ్వాసం గురించి ఏ విధంగా ప్రశ్నించబడతారో మరియు అందులో కూడా కొంత అనుగ్రహం లేదా శిక్ష ఏవిధంగా పొందుతారో దివ్య ఖుర్'ఆన్ మరియు హదీస్‌లు సవివరంగా చెప్పాయి.

అంటే మరణం తరువాత ఈ జీవితం మధ్యస్థమైనది (బర్‌జఖ్). ఇది ఇహలోక జీవితానికి మరియు పరలోకంలో గడపబోయే జీవితానికి మధ్యన ఉన్నది. మరో విధంగా చెప్పాలంటే ఇది రెండింటి మధ్య ఉండే స్థితి, ఒక వ్యక్తి కలగంటూ ఉన్నప్పటి జీవితాన్ని పోలి ఉంటుంది. అంటే ఇహలోక జీవితానికి కొనసాగుగానూ మరియు పరలోక జీవితాన్ని ముందుగా సూచించేదిగా ఉంటుంది. క్లుప్తంగా చెప్పాలంటే, ఈ మధ్యస్థ జీవితం స్పష్టమైనదేమీ కాదు. కాబట్టి దీని గురించి విడిగా ఇక్కడ ప్రస్తావించబడలేదు.

● ఇక 29వ ఆయత్ ప్రకారం విశ్వంలోని ప్రతీది మనిషి కోసం సృష్టించ బడింది. అంటే దీని అర్థం మనిషి ఏదో విధంగా ప్రత్యక్షంగానో లేదా పరోక్షంగానో ప్రతీదానిని ఉపయోగించు కుంటాడని మరియు ఉపయోగించుకోకుండా మిగిలినది ఏదీ ఉండదని అర్థం కాదు. మనిషి తన ఆహారం కోసం మరియు మెడిసిన్ కోసం లేదా ఇతరత్రా అవసరాలకోసం విశ్వంలో ఉన్న కొన్నింటిని ఉపయోగించుకుంటాడు.

అతనికి తెలియకుండా అతనికి ఉపయోగపడేవి ఎన్నో ఉంటాయి. అతనికి నిషేధించబడినవి కూడా పరోక్షంగా అతనికి మేలు చేయవచ్చు. విషపూరితమైనవి మరియు ప్రమాదకరమైన వాటిలో కూడా మనకు తెలియకుండా ఏదో మేలు ఉండి ఉండవచ్చు. **దాదాపు ఉనికిలో ఉన్న ప్రతీది మనిషికి ఏదో ఒక పాఠాన్ని బోధించవచ్చు లేదా పరలోక జీవితంపై ఆసక్తి కలిగేలా మనలో జ్ఞానాన్ని కలుగ జేయవచ్చు.**

మనిషి మేలు కొరకు అల్లాహ్ ఎన్నింటినో సృష్టించినప్పుడు, మనిషి అల్లాహ్‌కు ఎంత కృతజ్ఞుడుగా ఉండాలి? **అలా ఉంటున్నాడా?**

● ఈ ఆయత్‌పై ఆధారపడి కొంతమంది విద్వాంసులు ఒక నిర్ణయానికి వచ్చారు. అదేమిటంటే, ఈ ప్రపంచంలోని ప్రతీది మానవుని కొరకే సృష్టించబడింది కాబట్టి, అది ప్రధానంగా హలాల్ మరియు ప్రతీ దానిని ఉపయోగించు కోవడానికి అనుమతించబడి (ముబాహ్) ఉండాలి, షరీఅహ్ నిషేధించినవి తప్ప. కాబట్టి దివ్య ఖుర్'ఆన్ మరియు హదీస్ నిషేధించనంత వరకూ వాటిలో ఏదైనా ఉపయోగించు కోవడం ధర్మ సమ్మతమే. అయితే దీనికి భిన్నంగా మరికొందరు విద్వాంసులు చెప్పేది ఏమిటంటే అది అనాలోచితం (ఆటోమెటిక్)గా ధర్మసమ్మతం అయిపోదు, దానిని ఖుర్'ఆన్ మరియు హదీస్ సవివరంగా చెబితేనే అది హలాల్ (ధర్మ సమ్మతం) అవుతుంది.

మరి కొందరు ప్రామాణిక విద్వాంసులు ఈ రెండు అభిప్రాయాలలో ఏవైపూ లేరు. ఇబ్నె హయ్యాన్ తన వ్యాఖ్యానంలో అల్-బహ్ర్ అల్ ముహీత్‌లో ఇలా సూచించారు, 29వ ఆయత్‌లో రెండు అభిప్రాయాలకి ధృడమైన ఆధారాలేమీ ఇవ్వలేదు. ఎందుకంటే 'ఖలఖ లకుమ్' అనే పద సముదాయంలోని 'లామ్' అనే అక్షరం కార్యకారణ సంబంధాన్ని సూచిస్తుంది. **'నీ కారణంగా సృష్టించబడింది'** అనే అర్థాన్నిస్తుంది.

కాబట్టి ఆయత్‌లో చెప్పిన ఆ పదసముదాయాన్ని బట్టి ప్రతీది హలాల్ అని గాని లేదా ప్రతీది హరామ్ అనిగాని ఓ నిర్ణయానికి రావడం సరికాదు. ఖుర్'ఆన్ మరియు హదీస్‌లు నిర్దేశించినదాని ప్రకారమే నడవాలి.

● ఆయత్ 29ని బట్టి, ఆకాశాల కంటే భూమి ముందుగానే సృష్టించబడింది అని **'సుమ్మ'** (తరువాత) అనే పదం సూచిస్తుంది. అయితే ఖుర్'ఆన్‌లో 79:30లో **"మరియు ఆ పిదప భూమిని పరచినట్లు చేశాడు."** అని ఉంటుంది. అంటే ఈ ఆయత్ ముందు ఆయత్‌ని వ్యతిరేకించినట్లు కాదు. దీని అర్థం ఆకాశాల తరువాత భూమి సృష్టించబడినట్లు కాదు. ఇది వాస్తవంగా సూచించేది ఏమిటంటే భూమి ముందుగా సృష్టించబడినప్పటికీ, దాని యొక్క తుది రూపం ఆకాశాల సృష్టి తరువాత జరిగి ఉండవచ్చు.

30. మరియు (జ్ఞాపకం చేసుకో!) నీ ప్రభువు తనదూతలతో : "వాస్తవంగా నేను భూమిలో ఒక ప్రతినిధిని సృష్టించ బోతున్నాను!" అని చెప్పినప్పుడు, వారు : "ఏమీ? నీవు భూమిలో కల్లోలం రేకెత్తించే వానిని మరియు నెత్తురు చిందించే వానిని నియమించ బోతున్నావా? మేము నీ స్తోత్రం చేస్తూ, నీ పవిత్రతను కొనియాడుతూనే ఉన్నాము కదా!" అని విన్నవించుకున్నారు. దానికి ఆయన : "నిశ్చయంగా, మీకు తెలియనిది నాకు తెలుసు!" అని అన్నాడు.

31. మరియు ఆయన (అల్లాహ్) ఆదమ్‌కు సకల వస్తువుల పేర్లను నేర్పాడు, ఆ పిదప వాటిని అల్లాహ్ దూతల ఎదుట ఉంచి : "మీరు సత్యవంతులే అయితే, వీటి పేర్లను నాకు తెలుపండి." అని అన్నాడు.

32. వారు (అల్లాహ్ దూతలు) : "నీవు సర్వలోపాకు అతీతుడవు. నీవు తెలిపినదే తప్ప మాకు మరేమీ తెలియదు. నిశ్చయంగా నీవే సర్వజ్ఞుడవు, మహా వివేకవంతుడవు" అని అన్నారు.

33. ఆయన (అల్లాహ్) : "ఓ ఆదమ్! వీటి (ఈ వస్తువుల) పేర్లను వీరికి తెలుపు" అని అన్నాడు. ఎప్పుడైతే అతను (ఆదమ్) ఆ వస్తువుల పేర్లను వారికి తెలిపాడో) ఆయన

| وَاِذْ | 30వ ఆయత్ నుండి 33వ ఆయత్ వరకూ | | | | | | |
|---|---|---|---|---|---|---|---|
| మరియు అప్పుడు | | | | | | | |
| الْاَرْضِ | فِي | جَاعِلٌ | اِنِّيْ | لِلْمَلٰٓئِكَةِ | رَبُّكَ | قَالَ | |
| భూమి | లో | ఉంచుతాను | వాస్తవానికి నేను | అల్లాహ్ దూతలకు | నీ ప్రభువు | చెప్పాడు | |
| فِيْهَا | يُّفْسِدُ | مَنْ | فِيْهَا | اَتَجْعَلُ | قَالُوْٓا | خَلِيْفَةً | |
| అందులో | కల్లోలం వ్యాపించేవాడు | ఎవరు | అందులో | నీవు ఉంచుతావా? | వారు అన్నారు | (ఖలీఫా) ప్రతినిధి | |
| بِحَمْدِكَ | نُسَبِّحُ | وَنَحْنُ | الدِّمَآءَ | وَيَسْفِكُ | | | |
| నీ స్తోత్రాలతో | కొనియాడతాము | మరియు మేము | రక్తం | మరియు చిందించేవాడు | | | |
| لَا تَعْلَمُوْنَ | | مَا | اَعْلَمُ | اِنِّيْٓ | قَالَ | لَكَ | وَنُقَدِّسُ |
| మీకు తెలిసినది | లేదు | ఏది | (నాకు) ఎక్కువతెలుసు | నిశ్చయంగా నేను | ఆయన చెప్పాడు | నీ(కు) | మరియు మేము నీ పవిత్రతను కీర్తిస్తాము |
| عَرَضَهُمْ | ثُمَّ | كُلَّهَا | الْاَسْمَآءَ | اٰدَمَ | وَعَلَّمَ | ٣٠ | |
| ఆయన వాటిని ఎదుట ఉంచాడు | తరువాత | అవన్నీ | ఆ పేర్లు | ఆదమ్ | మరియు ఆయన నేర్పాడు | (30) | |
| اِنْ | هٰٓؤُلَآءِ | بِاَسْمَآءِ | اَنْۢبِـُٔوْنِيْ | فَقَالَ | عَلَى الْمَلٰٓئِكَةِ | | |
| అయితే | వీటి (యొక్క) | పేర్లను | నాకు తెలుపండి | తరువాత అన్నాడు | అల్లాహ్ దూతలు | కు | |
| لَنَآ | لَا عِلْمَ | سُبْحٰنَكَ | قَالُوْا | ٣١ | صٰدِقِيْنَ | كُنْتُمْ | |
| మా కొరకు | జ్ఞానం లేదు | నీవు పవిత్రుడవు | వారు చెప్పారు | (31) | సత్యవంతులు | మీరు | |
| الْعَلِيْمُ | اَنْتَ | اِنَّكَ | عَلَّمْتَنَا | مَا | اِلَّا | | |
| సర్వజ్ఞుడవు | నీవు | నిశ్చయంగా నీవు | నీవు మాకు నేర్పావు | ఏది | తప్ప | | |
| فَلَمَّآ | بِاَسْمَآئِهِمْ | اَنْۢبِئْهُمْ | يٰٓاٰدَمُ | قَالَ | ٣٢ | الْحَكِيْمُ | |
| మరియు అప్పుడు | వాటి యొక్క పేర్లు | వారికి తెలుపు | ఓ ఆదమ్ | ఆయన చెప్పాడు | (32) | మహా వివేక వంతుడవు | |

అన్నాడు : "నిశ్చయంగా నేను మాత్రమే భూమ్యాకాశాల అగోచర విషయాలను ఎరుగుదునని మీతో చెప్పలేదా? మరియు మీరు ఏది బహిర్గతం చేస్తారో మరియు ఏది దాస్తారో కూడా నాకు బాగా తెలుసు!"

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| اِنِّيٓ | لَّكُمْ | اَقُلْ | اَلَمْ | قَالَ | بِاَسْمَآئِهِمْ | اَنْۢبَاَهُمْ |
| నిశ్చయంగా నేను | మీకు | నేను చెప్పాను | లేదా | ఆయన చెప్పాడు | వాటి పేర్లు | అతడు వారికి చెప్పాడు |

| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| تُبْدُوْنَ | مَا | وَاَعْلَمُ | وَالْاَرْضِ | السَّمٰوٰتِ | غَيْبَ | اَعْلَمُ |
| మీరు తెలియజేశారు | ఏది | మరియు నాకు ఎక్కువ తెలుసు | మరియు భూమి | ఆకాశాలు | కనిపించనవి | ఎక్కువ తెలుసు |

| | | | |
|---|---|---|---|
| ٣٣ | تَكْتُمُوْنَ | كُنْتُمْ | وَمَا |
| 33 | మీరు దాచారు | మీరు | మరియు ఏది |

## సూరహ్ అల్-బఖరా (30 నుండి 33 ఆయత్‌లలో వచ్చిన అరబీ) పదాల అర్థాలు

| | | | |
|---|---|---|---|
| 263. నీ ప్రభువు | رَبُّكَ | 278. నాకు చెప్పు | أَنْبِئُوْنِي (ن ب ء) |
| 264. కు, కొరకు | لِ | 279. నన్ను | نِيْ |
| 265. అల్లాహ్ దూతలు | مَلَآئِكَةٌ | 280. ఇవి | هٰؤُلَاءِ |
| 266. నిశ్చయంగా నేను | إِنِّيْ | 281. నీవు పవిత్రుడవు | سُبْحَانَكَ |
| 267. తయారు చేసేవాడు | جَاعِلٌ | 282. మా కొరకు | لَنَا |
| 268. ప్రతినిధి | خَلِيْفَةٌ | 283. నీవు నేర్పావు | عَلَّمْتَ |
| 269. చిందించు | يَسْفِكُ | 284. సత్యంతో, నీవు | إِنَّكَ |
| 270. రక్తం | دِمَآءَ | 285. నీవు | أَنْتَ |
| 271. మేము కొనియాడుతాం | نُسَبِّحُ (س ب ح) | 286. సర్వజ్ఞుడు | عَلِيْمٌ |
| 272. మేము పవిత్రతను కీర్తిస్తాం | نُقَدِّسُ (ق د س) | 286. మహా వివేకవంతుడు | حَكِيْمٌ |
| 273. నీ కొరకు | لَكَ | 287. మరియు అప్పుడు | فَلَمَّا |
| 274. నేర్పాడు | عَلَّمَ | 288. నేను చెప్పలేదా? | أَ لَمْ أَقُلْ |
| 275. పేర్లు | أَسْمَآءَ | 289. నాకు ఎక్కువ తెలుసు | أَعْلَمُ |
| 276. అన్ని | كُلَّهَا | 290. నీవు తెలిపినది | تُبْدُوْنَ |
| 277. ప్రదర్శించాడు | عَرَضَ | 291. నీవు దాచినది | تَكْتُمُوْنَ (ك ت م) |

*మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...*

**ఖుర్‌ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదవండి. అర్థం చేసుకున్న విషయాలను ఆచరణలో పెట్టండి.**

ప్రపంచ శాంతి దూత

సన్మార్గ బోధకుడు
నాయకుడు
ఆదర్శనీయుడు

# ముహమ్మద్ (స) వారి

**బోధనలు**
**ఆచరణలు**

మంచిగా మానవత్వంతో బ్రతకమనే హితబోధను ప్రతి మనిషి తన ఊహతెలిసిన దగ్గరనుండి వింటూనే ఉంటాడు. అయితే ఏది మంచి? ఏది చెడు? కొంతమంది తమ దృష్టిలో ఫలానా విషయం మంచిది అని సమర్ధిస్తారు. అదే విషయాన్ని మరికొందరు పూర్తి చెడుగానూ తీసుకుంటారు. అంతెందుకు, ఒకే మనిషిలో ఒకే పనిపై, తన జీవితంలోని వివిధ దశలలో వేర్వేరు అభిప్రాయాలు జనిస్తాయి. నిజంగా మంచి చెడులపై మనుషులయొక్క వ్యక్తిగత అభిప్రాయాలనే గనుక పరిగణనలోకి తీసుకుంటే, అన్ని పనులూ మంచి పనులే. అలాగే అన్నీ కూడా చెడ్డపనులే అవుతాయి.

కేజీ బరువున్న వస్తువును, ప్రపంచంలో ఎక్కడకు తీసికెళ్ళినా అది కేజీ బరువే ఉంటుంది. అలాగే కొలతలకు కూడా ప్రపంచవ్యాప్తంగా ఒకటే ప్రమాణముంది.

మరి మనిషి జీవనానికి లేదా ఆచరణకు ప్రపంచవ్యాప్తంగా అలాంటి ఓ ప్రమాణం లేదా? ప్రపంచంలోని ఏ మారుమూలనుండి ఏ వ్యక్తిని తీసుకున్నా, అతని శారీరక నిర్మాణం, అతని అవయవాల పనితీరు తదితర అంశాలన్నీ మిగతా ప్రాంతాలలోని మనుషులలాగే ఒకే విధంగా ఉంటాయి కదా!

మనిషి అనే ఈ జీవయంత్రాన్ని తయారుచేసి, దానికి అవసరమైన ప్రోగ్రామింగ్‌ను చేసిన సృష్టికర్తకే తెలుసు - ఈ మనిషికి ఏది మంచి చేస్తుందో, ఏది చెడు చేస్తుందోనన్న విషయం.

మంచి చెడుల ప్రమాణాలు ఖుర్ఆన్‌లో ఉన్నాయి. అయితే ఆ ప్రమాణాల ప్రకారంగా ఎటువంటి సందేహానికి లోనవకుండా ఉండేందుకు ముహమ్మద్(స) మనందరి శిక్షణకై ఎన్నో విషయాలను ఆచరించి చూపారు. ఖుర్ఆన్ యొక్క ఆదేశాల ప్రకారంగా దైవప్రవక్త ముహమ్మద్ (స)ఆచరించిన పనులను మరియు ఆయన యొక్క ప్రవచనాలను హదీస్‌లు అంటారనే విషయం చాలామందికి తెలుసు. సమకాలీన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వేల సంఖ్యలో ఉన్న హదీసులలోని కొన్ని హదీసులను ఎన్నుకొని ఈ శీర్షిక ద్వారా ఇన్షాఅల్లాహ్ అందిస్తూ ఉంటాము.

## ఉత్తమ సమాజం 17

(క్రిందటి సంచిక తరువాయి భాగం)

**ఈ నెల ప్రత్యేకం : సంపూర్ణ మద్యపాన నిషేధం**

**"మరియు మీరు ప్రజలకు సాక్షులుగా ఉండటానికి మరియు సందేశహరుడు (ముహమ్మద్) మీకు సాక్షిగా ఉండటానికి మేము మిమ్మల్ని ఒక మధ్యస్థ (ఉత్తమ మరియు న్యాయశీలమైన) సమాజంగా చేశాము ....." (ఖుర్ఆన్ 2:143)**

"And thus we have made you a **median [i.e. just] community** that you will be witnesses over the people and the Messenger will be a witness over you ....." (Qur'an 2:143)

**"మీరే మానవజాతి (హితం) కొరకు నిలబెట్టబడిన ఉత్తమ సమాజం వారు. మీరు మంచిని ఆదేశించే (బోధించే)వారు మరియు చెడును నిరోధించే వారు మరియు మీరు అల్లాహ్ యందు విశ్వాసం కలిగి ఉన్నవారు ..." (ఖుర్ఆన్ 3:110)**

"You are the **best nation** produced [as an example] for mankind. You enjoin what is right and forbid what is wrong and believe in ALLAH ....." (Qur'an 3:110)



ఒక సమాజం ఉత్తమ సమాజం కావాలంటే జీవనోపాధి గురించి ఇతరులపై ఆధారపడకుండా, ఏ రిజర్వేషన్లు లేకుండానే ఏ విధంగా సాధించవచ్చో జూన్-జూలై'10 సంచికలోనూ, ఆర్థికంగా స్థిరపడిన తరువాత మనపై నున్న బాధ్యతలను తెలుసుకుని మసలుకోవాలని చెబుతూ, ముఖ్య బాధ్యతలను హదీస్‌ల ద్వారా క్లుప్తంగా తరువాయి సంచికలో వివరించడం జరిగింది. వ్యాపారం మరియు వ్యవసాయ ఉత్పత్తులు వాటికి సంబంధించిన విషయాలను, సంపాదన గురించి ఈ శీర్షికలోని గత మూడు వ్యాసాలలో అందించడం జరిగింది. హరామ్(నిషిద్ధ) వ్యాపారాలు చేయకూడదు. హలాల్ (ధర్మసమ్మతమైన) వ్యాపారంలో కూడా ఏ ఏ విషయాలు ప్రవక్త(స)వారిచే నిషేధించబడ్డాయో, ఏవి అనుమతించబడ్డాయో చెప్పడం జరిగింది.

వ్యాపారం గురించి, వ్యవసాయ ఉత్పత్తుల క్రయవిక్రయాల గురించి, సంపాదన గురించి ముఖ్య విషయాలను ముహమ్మద్(స)వారి బోధనల ద్వారా తెలుసుకున్నాము. కేవలం బోధనలు వినడం వలన ఉత్తమ సమాజం ఏర్పడదు. వాటిని ఆచరణలో పెట్టాలి. వాటిలో కొన్నింటిని ఆచరణలో పెట్టడానికి నాయకుడు కఠినంగా వ్యవహరించాలి కూడా.

ఇదే శీర్షికలో వెనుకటి వ్యాసంలో జ్ఞానాన్ని 'ప్రాపంచిక జ్ఞానం మరియు ధార్మిక జ్ఞానం' అని వేర్వేరుగా జ్ఞానాలుగా విభజించ నవసరం లేదని, ఇస్లామీయ జ్ఞానమున్నవానికి ప్రాపంచిక జ్ఞానం బాగా ఉంటుందని చెప్పడం జరిగింది. ఇస్లామ్ అంటే కేవలం బోధించబడే ధర్మం కాదు. దానితోపాటు ఆచరణ కూడా ఉండాలి. ఇస్లామీయ జ్ఞానమున్న వ్యక్తి ఏదైతే ప్రజలకు బోధిస్తాడో అతడు కూడా దానిని ఆచరిస్తాడు.

## సంపూర్ణ మద్యపాన నిషేధం

حـدَّثَـنا عُثمانُ بنُ أبي شَيْبَةَ قال : حَدَّثَنا وَكِيعُ بنُ الْجَرَّاحِ عـن عَبْـدِالْـعَزِيزِ بنِ عُمَرَ، عن [أَبي طُعْمَةَ] – مَوْلاهُمْ – وَعَبْـدِ الرَّحْمٰنِ بنِ عَبْدِ اللهِ الْغَافِقِيِّ وأَنَّهُمَا سَمِعَا ابنَ عُمَرَ يَقُولُ : قالَ رَسُولُ اللهِ ﷺ :((لَعَنَ اللهُ الْـخَمْرَ وَشَارِبَهَا وَسَاقِيَهَا وَبَائِعَهَا وَمُبْتَاعَهَا وَعَاصِرَهَا وَمُعْتَصِرَهَا وَحَامِلَهَا وَالْمَحْمُولَةَ إِلَيْهِ)).

ఇబ్నె ఉమర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "అల్లాహ్ శపించారు - ఖమ్ర్ (మద్యం)ని మరియు దానిని తాగిన వాడిని, దానిని పోసిన వాడిని, దానిని అమ్మినవాడిని, దానిని కొన్నవాడిని, దానిని పిండినవాడిని, ఎవని కొరకు అది పిండబడిందో వాడిని, దానిని మోసుకెళ్ళేవాడిని మరియు ఎవరి కోసమైతే తీసుకెళ్ళబడుతుందో వాడిని." **(అబూదావూద్, హసన్, 3674, పుస్తకం 25, అధ్యా.2, సంపుటి 4)**

**మద్యం తయారీ దగ్గర నుండి మద్యాన్ని కొని త్రాగేవాడి వరకూ, ఎంతమంది అయితే ఆ పనిలో పాలుపంచుకున్నారో అందరినీ అల్లాహ్ శపించారు.**

حَدَّثَنا زُهَيرُ بنُ حَرْبٍ قال: حَدَّثَنا وَكِيعٌ عن سُفْيَانَ، عن السُّـدِّيِّ، عـن أَبـي هُبَيْـرَةَ، عـن أَنَـسِ بنِ مَالِكٍ : أَنَّ أَبَا طَلْحَةَسَأَلَ رَسُولَ اللهِ ﷺ عَـنْ أَيْتَامٍ وَرِثُوا خَمْرًا، قال : ((أَهْرِقْهَا))، قال : أَفَلَا أَجْعَلُهَا خَلًّا، قال : ((لا)).

అనస్ బిన్ మాలిక్(రజి)వారి ఉల్లేఖనం. అబూ తల్హా, 'అల్లాహ్ యొక్క సందేశహరులు(స)'వారిని అడిగారు, కొంత మద్యాన్ని వారసత్వంగా పొందిన కొందరు అనాథల గురించి. ఆయన(స) చెప్పారు : **"దానిని పారవేయండి."** అతడు అన్నాడు : "నేను దానిని వినెగర్‌గా మార్చలేనా?" ఆయన(స) చెప్పారు : **"వద్దు"**. **(అబూదావూద్, సహీహ్, 3675, పుస్తకం 25, అధ్యా.3, సంపుటి 4)**

నిషేధించబడిన మద్యాన్ని మరో రూపంలోకి మార్చి ఉపయోగించు కోవడానికి కూడా అనుమతి నివ్వలేదు. నిషేధించబడినది మద్యం మాత్రమే కాదు, ఏ పదార్థమైనా సరే, దానిలో నుండి ఏ భాగాన్ని కూడా ఏ ఉపయోగం కొరకు వాడకూడదు. దానిలో ఏ నష్టముందో ఇప్పటి మన జ్ఞానానికి అందకపోవచ్చు. ఆ విషయం అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరుడు(స)కి మాత్రమే తెలుసు. అల్లాహ్ నిషేధించినది మానుకుంటే, మనకు ఆ నిషేధంలో మేలు ఉందని తెలుసుకోవాలి.

### మద్యం ఎన్నో రకాల పదార్థాల నుండి తయారుచేయబడుతుంది

حَـدَّثَـنا الْحَسَنُ بنُ عَلِيٍّ قال : حَدَّثَنا يَحْيَى بنُ آدَمَ قال : حَـدَّثَنا إِسْرَائِيلُ عن إِبراهِيمَ بنِ مُهَاجِرٍ، عن الشَّعْبِيِّ، عن النُّـعْـمـانِ بـنِ بَشِيرٍ قال : قال رَسُولُ اللهِ ﷺ : ((إِنَّ مِنَ الْعِنَبِ خَمْرًا وَإِنَّ مِنَ التَّمْرِ خَمْرًا، وإِنَّ مِنَ الْعَسَلِ خَمْرًا، وَإِنَّ مِنَ الْبُرِّ خَمْرًا، وإِنَّ مِنَ الشَّعِيرِ خَمْرًا)).

నూమాన్ బిన్ బషీర్ ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స)వారు చెప్పారు: "నిస్సందేహంగా మద్యం ద్రాక్షతో తయారుచేస్తారు. మద్యం ఖర్జూరంతో తయారుచేస్తారు. మద్యం తేనెతో తయారుచేస్తారు. మద్యం గోధుమలతో తయారుచేస్తారు. మరియు మద్యం బార్లీతో తయారుచేస్తారు." **(అబూదావూద్, హసన్, 3676, పుస్తకం 25, అధ్యా.4, సం.4)**

### మత్తు కలిగించే ప్రతీది నిషేధించబడినదే

ఆయిషా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) బిత్అ్(mead) గురించి అడగబడ్డారు. ఆయన(స) చెప్పారు, "మత్తు కలిగించే ప్రతీ పానీయం హరామ్(నిషేధం)" **(అబూదావూద్, సహీహ్, 3682, పుస్తకం 25, అధ్యా. 5, సంపుటి 4)**

నేడు కొందరు విస్కీ త్రాగడం మానివేసినట్లు, బీరు మాత్రమే త్రాగు తున్నట్లు చెబుతుంటారు. కాని రెండూ మత్తు పానీయాలే. ఈ రెండూ ఏయే పదార్థాలతో తయారు చేయబడతాయో పై హదీస్‌లో వివరించడం జరిగింది. ఇదీ, అదీ అని లేదు ఏ పానీయం అయినా సరే, అది త్రాగినప్పుడు మత్తు కలిగిస్తే, అది 'మద్యం' అవుతుంది. కాబట్టి మత్తు కలిగించే అటువంటి ఏ పానీయమైనా నిషేధించబడినది అని ప్రతీ ఒక్కరూ తెలుసుకోవాలి.

حَدَّثَنا عَبْدُ اللهِ بنُ مَسْلَمَةَ الْقَعْنَبِيُّ عن مَالِكٍ، عن ابن شِهَابٍ، عن أَبِي سَلَمَةَ، عن عَائِشَةَ قالَتْ : سُئِلَ رَسُولُ اللهِ ﷺ عن الْبِتْعِ ، فقال : ((كُلُّ شَرَابٍ أَسْكَرَ فَهُوَ حَرَامٌ)).

قالَ أَبُو دَاوُدَ : قَرَأْتُ علَى يَزِيدَ بنِ عَبْدِ رَبِّهِ الْجُرْجُسِيِّ، حَدَّثَكُم مُحَمَّدُ بنُ حَرْبٍ عن الزُّبَيْدِيِّ، عن الزُّهْرِيِّ بِهَذا الحَدِيثِ بِإِسْنَادِهِ. زَادَ : وَالْبِتْعُ نَبِيذُ الْعَسَلِ كَنَ أَهْلُ الْيَمَنِ يَشْرَبُونَهُ.

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : **"ఏదైతే మత్తు కలిగిస్తుందో పెద్ద పరిమాణంలోనైనా, చిన్న పరిమాణంలోనైనా అది హరామ్.** **(అబూదావూద్, సహీహ్, 3681, పుస్తకం 25, అధ్యా. 5, సంపుటి 4)**

## చల్లటి ప్రదేశాలలో మద్యం త్రాగడం మరింత ప్రమాదకరం

حَدَّثَنا هَنَّادُ بنُ السَّرِيِّ : أخبرنا عَبْدَةُ عن مُحَمَّدٍ يَعْني ابنَ إِسْحَاقَ، عن يَزِيدَ ابنِ أَبِي حَبِيبٍ، عن مَرْثَدِ بنِ عَبْدِ اللهِ الْيَزَنِيِّ، عن دَيْلَمٍ الْحِمْيَرِيِّ قال : سَأَلْتُ النَّبِيَّ ﷺ فَقُلْتُ : يَا رَسُولَ اللهِ! إِنَّا بِأَرْضٍ بَارِدَةٍ نُعَالِجُ فيها عَمَلًا شَدِيدًا، وَإِنَّا نَتَّخِذُ شَرَابًا مِنْ هٰذَا الْقَمْحِ نَتَقَوَّى بِهِ عَلَى أَعْمَالِنَا وَعَلَى بَرْدِ بِلَادِنَا. قال : ((هَلْ يُسْكِرُ؟)) قُلْتُ: نَعَمْ قال : ((فَاجْتَنِبُوهُ)). قال : فَقُلْتُ : فَإِنَّ النَّاسَ غَيْرُ تَارِكِيهِ. قال : ((فَإِنْ لَمْ يَتْرُكُوهُ فَقَاتِلُوهُمْ)).

దైలమ్ అల్-హిమ్యారి(రజి) చెప్పారు : "నేను ప్రవక్త(స)వారిని అడిగాను: ఓ రసూలల్లాహ్! మేము చల్లటి ప్రాంతంలో నివశిస్తున్నాము. అక్కడ మాకు పని ఎక్కువ. మరియు మేము గోధుమల నుండి పానీయం తయారు చేస్తాము మేము పనిచేయడానికి బలం కొరకు మరియు మా ప్రాంతపు చల్లదనాన్ని తట్టుకోవడానికి సహాయకారిగా." ఆయన(స) అడిగారు : **'అది మత్తు కలిగిస్తుందా?'**. నేను చెప్పాను, **'ఔను'**. ఆయన(స) చెప్పారు: **'దాని నుండి దూరంగా ఉండు'**. నేను చెప్పాను, 'నిస్సందేహంగా ప్రజలు దానిని వదలరు'. ఆయన(స) చెప్పారు : **"ఒకవేళ ప్రజలు దానిని వదలనట్లయితే, వారితో పోరాడండి" (అబూదావూద్, హసన్, 3683, పుస్తకం 25, అధ్యా.5, సంపుటి 4)**

ఏ ప్రాంతంలో ఉన్నా సరే, అది చల్లని ప్రాంతమైనా, ఉష్ణప్రాంతమైనా సరే మద్యం త్రాగకూడదు. మత్తు కలిగించే ఏ పానీయమైనా సరే అది హరామ్ అని స్పష్టంగా ప్రవక్త(స)వారు బోధించారు. ఒక ముస్లిమ్‌తో మరో ముస్లిమ్ పోరాడకూడదు కదా! కాని అతడు అల్లాహ్ ఆదేశించిన జకాత్ చెల్లించకపోయినా, అలాహ్ నిషేధించిన మద్యాన్ని వదలక పోయినా పోరాడవచ్చని తెలుస్తుంది.

**అయితే ముందుగా వారిచేత మద్యపానాన్ని మాన్పించడానికి ప్రయత్నం చేయాలి.** రెండ ఖలీఫా ఉమర్(రజి)వారు, త్రాగుడుకు అలవాటు పడిన ఓ ముస్లిమ్‌లో పరివర్తన కోసం ఎటువంటి ప్రయత్నం చేసి అల్లాహ్ దయవలన సఫలీకృతం అయ్యారో ఈ వ్యాసం చివరిలో అందించ బడింది.

## మద్యం త్రాగడం ఒకేసారిగా అకస్మాత్తుగా ఆపివేసినా కూడా ఆరోగ్యానికి ఏ విధమైన ప్రమాదం లేదు

రోజూ ఎక్కువగా మద్యం త్రాగేవారు ఒక్కసారిగా మద్యాన్ని మానివేసినా సరే, వారికి ఏమీ కాదు. కొద్ది కొద్దిగా త్రాగడాన్ని తగ్గిస్తూ కొన్నాళ్ళకి పూర్తిగా మానివేయడమనేది ప్రాక్టికల్‌గా జరిగేపని కాదు. ఒకేసారి త్రాగడం మానివేయడం వలన అతని శరీరానికి ఏమీ కాదు.

అయితే అతని మనస్సు ఆ మార్పుకు తట్టుకునేలా ఉండాలి. అంటే అతని మానసిక ఆరోగ్యం బాగుండాలి. అది విశ్వాసంపై ఆధారపడి ఉంటుంది. అల్లాహ్‌పై ఉండే విశ్వాసం మనస్సుకు తట్టుకోగలిగే శక్తిని ఇస్తుంది.

ఇస్లామ్ స్వీకరించిన ఎందరో సోదరులు మద్యాన్ని వెంటనే మానివేశారు. ఆ విధంగా స్వీకరించిన వారిలో మాకు ఒక ఆప్త మిత్రుడున్నారు. తాను ఖుర్ఆన్ చదివిన రోజు నుండి మద్యం త్రాగకూడదని నిర్ణయించుకుని పూర్తిగా మాని వేశారు. అంతకు ముందు అతని తల్లిదండ్రులు, బంధువులు ఎంత చెప్పినా మానలేకపోయారు. కాని ఖుర్ఆన్ చదివిన వెంటనే మానివేశారు.

మద్యం త్రాగకపోతే ఉండలేనని తన వారితో చెబుతుండేవారు. అటువంటి వ్యక్తి అకస్మాత్తుగా మానివేయడమే కాకుండా, మద్యం త్రాగేవారిని వెంటనే మానివేయమని కోరుతున్నారు. ఆయన ఇస్లామ్ గురించి, విశ్వాసం గురించి బాగా అర్థం చేసుకుని ధర్మాన్ని స్వీకరించారు. అందువల్లనే ఆయనకున్న విశ్వాసబలం అతని వ్యసనాన్ని దూరం చేయగలిగింది.

అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు(స) ఏదైనా నిషేధిస్తే వెంటనే దానిని మనస్ఫూర్తిగా అమలులో పెట్టేసేవారు విశ్వాసులు (మోమిన్‌లు). కాని నేడు ఎందరో ఉపన్యాసకులను చూస్తున్నాము. వారు బహిరంగం గానే అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు(స) ఆదేశాలను తిరస్కరిస్తూ బోధిస్తూ తిరుగుతున్నారు. మరియు ఇస్లామ్ బోధకులమని చెప్పుకుంటున్నారు.

ప్రారంభంలో నిషా స్థితిలో సలాత్ (నమాజ్) చేయకూడదని అల్లాహ్ ఆదేశించారు. తరువాత సంపూర్ణంగా మద్యపానం నిషేధించబడింది. ఆ వార్త వినగానే మదీనాలో ఏమి జరిగిందో క్రింది హదీస్ ద్వారా తెలుసు కోవచ్చు.

حَدَّثَنَا عُبَيْدُ اللهِ بْنُ عُمَرَ الْقَوَارِيرِيُّ: حَدَّثَنَا عَبْدُ الْأَعْلَى بْنُ عَبْدِ الْأَعْلَىٰ أَبُوهَمَّامٍ: حَدَّثَنَا سَعِيدٌ الْجُرَيْرِيُّ عَنْ أَبِي نَضْرَةَ، عَنْ أَبِي سَعِيدٍ الْخُدْرِيِّ قَالَ سَمِعْتُ رَسُولَ اللهِ ﷺ يَخْطُبُ بِالْمَدِينَةِ قَالَ : ((يَا أَيُّهَا النَّاسُ! إِنَّ اللهَ تَعَالَىٰ يُعَرِّضُ بِالْخَمْرِ، وَلَعَلَّ اللهَ سَيُنْزِلُ فِيهَا أَمْرًا، فَمَنْ كَانَ عِنْدَهُ مِنْهَا شَيْءٌ فَلْيَبِعْهُ وَلْيَنْتَفِعْ بِهِ)). قَالَ: فَمَا لَبِثْنَا إِلَّا يَسِيرًا حَتَّىٰ حَرَّمَ الْخَمْرَ فَمَنْ أَدْرَكَتْهُ هٰذِهِ الْآيَةُ وَعِنْدَهُ مِنْهَا شَيْءٌ فَلَا يَشْرَبْ وَلَا يَبِعْ)) قَالَ: فَاسْتَقْبَلَ النَّاسُ بِمَا كَانَ عِنْدَهُمْ مِنْهَا، فِي طَرِيقِ الْمَدِينَةِ، فَسَفَكُوهَا.

అబూ స‘ఈద్ ఖుద్రీ(రజి) చెప్పారు: “నేను విన్నాను మదీనాలో అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఖుత్బా ఇస్తుండగా, ఆయన(స) అన్నారు : ‘ఓ ప్రజలారా! అల్లాహ్ మద్యం గురించి సూచిస్తున్నారు మరియు బహుశా ఆయన ఏదైనా దాని గురించి అవతరింప జేయవచ్చు, కాబట్టి ఎవరి దగ్గరైనా ఏదైనా కొంచెం మద్యం కలిగి ఉంటే, అతనిని అమ్ముకోనివ్వండి మరియు దాని నుండి (అమ్మడం నుండి) మేలును పొందనివ్వండి.’ ప్రవక్త(స) చెప్పి ఎంతోకాలం కాలేదు, ఇంతలో ప్రవక్త(స)వారు చెప్పారు, “**నిస్సందేహంగా అల్లాహ్ మద్యాన్ని నిషేధించారు, కాబట్టి ఎవరైతే ఈ ఆయత్‌ని విన్నారో మరియు మద్యం ఏమైనా కలిగి ఉన్నారో, అతడు దానిని త్రాగకూడదూ, అమ్మకూడదు.**” ప్రజలు వెళ్ళి ఏదైతే వారు కలిగి ఉన్నారో, దానిని మదీనా వీధులలో పారవేశారు.” **(సహీహ్ ముస్లిమ్, 4043, సంపుటి 4)**

**ఎప్పుడైతే ఇంట్లో నిలువచేసుకున్న మద్యం ఆ విధంగా వీధులలో పారవేయబడిందో, వీధులలో మద్యం వర్షపు నీరులా ప్రవహించింది.**

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారు మక్కాలో ఉన్నప్పుడు మక్కా విజయం సాధించిన సంవత్సరంలో చెప్పగా ఆయన విన్నారు : “అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు ‘నిస్సందేహంగా మద్యాన్ని, చనిపోయిన జంతువు మాంసాన్ని, పంది మాంసాన్ని మరియు విగ్రహాల అమ్మకాలను’ నిషేధించారు.’ ఇలా చెప్పబడింది : ఓ రసూలుల్లాహ్! చనిపోయిన జంతువు యొక్క కొవ్వు విషయంలో మీరేమని అనుకుంటున్నారు, ఎందుకంటే అది ఓడలకు పూయడానికి, మరుగుపరిచే వాటికి పూయడానికి ఉపయోగించ బడుతుంది మరియు దీపాలకు ప్రజలు దానిని ఉపయోగిస్తున్నారు.” ఆయన(స) చెప్పారు, “లేదు, అది నిషేధం” ఆ సమయంలో అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : “అల్లాహ్ యూదులను నాశనం చేయుగాక, ఎందుకంటే అల్లాహ్ వారికి కొవ్వును నిషేధించారు, కాని వారు దానిని కరిగించి తరువాత దానిని అమ్ముకుని మరియు దాని సొమ్మును తింటున్నారు.” **(సహీహ్ ముస్లిమ్, 4048, పుస్తకం 22, అధ్యా 13, సం.4)**

అల్లాహ్ పట్ల ఎంతో భయభక్తులు గల షైతాన్, ఆదమ్(అ)వారికి సజ్దా చేయమని ఆదేశించినప్పుడు, ఒక్క ఆదేశాన్ని తిరస్కరించినందుకు అల్లాహ్‌చే శపించబడ్డాడు. వాడికి నరకం నిశ్చయమైపోయింది.

మద్యం త్రాగేవాడిని మాత్రమే కాదు, ఆ మద్యం కోసం చెట్లు పెంచేవారి దగ్గర నుండి త్రాగేవాని వరకూ ఎందరైతే ఈ పనిలో నిమగ్నమై ఉన్నారో, వారందరూ అల్లాహ్‌చేత శపించబడ్డారు. అల్లాహ్‌కు తౌబా చేసుకోవాలి. **మద్యపానాన్ని పూర్తిగా తమపై నిషేధించుకోవాలి.**

ముహమ్మద్(స)వారు కేవలం 23 సంవత్సరాలలోపే సంపూర్ణ మద్యపాన నిషేధం అరేబియాలో పూర్తిగా అమలులోకి వచ్చేటట్లు చేశారు. ఈ నిషేధం కోసం ఆయన ఎటువంటి రక్తపాతానికి ఆదేశం ఇవ్వలేదు. ఎటువంటి ఊరేగింపులుగాని, ఆందోళనలకు గాని పిలుపు నివ్వలేదు. త్రాగవద్దని, అమ్మవద్దని మరియు పారవేయమని ఆయన(స) చెప్పిన వెంటనే, ప్రజలంతా మనస్ఫూర్తిగా తమంతట తామే స్వయంగా మద్యపానాన్ని తమపై నిషేధించుకున్నారు.

### ఇది అద్భుతం కాదా?

మనకు బ్రిటిష్ మోసగాళ్ళ నుండి స్వాతంత్ర్యం వచ్చి 65 సంవత్సరాలు దాటింది. కాని నేటికీ మనదేశంలో **మద్యపాన నిషేధాన్ని సాధించలేకపోయాము.** దానికి కారణమేమిటి?

ముహమ్మద్(స)వారు సాధించి చూపారు. ఆ విధానాన్ని అనుసరిస్తే ఇప్పుడు కూడా అది సాధ్యమే! మద్యపానం వలన లక్షలాది కుటుంబాలు వీధిన పడుతున్నాయి. ఎక్కువ రోడ్డు ప్రమాదాలకు దారితీసేది కూడా ఈ మద్యమే. సమాజాన్ని సర్వనాశనం చేసే ఈ చెడు వ్యసనాన్ని ప్రభుత్వం అరికట్టాలి. కాని అందుకు విరుద్ధంగా, మద్యం వ్యాపారాన్ని ఒక ఆదాయ వనరుగా ప్రభుత్వం భావించడం వలన, ప్రభుత్వమే ఆ వ్యాపారాన్ని ప్రోత్సహిస్తుంది. కంచే చేనుమేయడం అంటే ఇదే కదా! వాస్తవానికి సమాజం నుండి మద్యాన్ని దూరం చేస్తే ప్రభుత్వం ప్రత్యేకంగా సంక్షేమ పథకాల కోసం నిధులు వెచ్చించ నవసరం లేదు. ఎన్నో కుటుంబాలు క్షేమంగా ఉంటాయి. ఆస్పత్రులలో రోగుల సంఖ్య కూడా గణనీయంగా తగ్గిపోతుంది. పిల్లలకు మంచి చదువు లభిస్తుంది. ఫీజు రియంబర్స్‌మెంట్ కోసం ఇప్పుడు వెచ్చిస్తున్నంత మొత్తంలో డబ్బు ఖర్చు చేయవలసిన అవసరం లేదు.

## ఆరోగ్యంపై మద్యపాన ప్రభావం

త్రాగుబోతుని చూసి అసహ్యించుకుంటారే గాని, **ఎవరూ గౌరవించరు.** అది గొప్పతనానికి చిహ్నం కాదు, దిగజారుడుతనానికి మాత్రమే చిహ్నం.

త్రాగుడు శారీరక ఆరోగ్యాన్ని సర్వనాశనం చేయడమే కాకుండా మానసిక ఆరోగ్యాన్ని కూడా తీవ్రంగా దెబ్బతీస్తుంది. శారీరక ఆరోగ్యాన్ని ఇది 4 దశలలో నాశనం చేస్తుంది. మొదటి దశలో ఉన్నవాడు అతడు త్రాగుతున్నప్పటికీ కంట్రోల్‌లో ఉన్నాడని అనుకుంటాడు. కాని తరువాయి దశలలో వాడు అనుభవించే బాధ అంతా ఇంతా కాదు. కూర్చోలేడు, నిలుచోలేడు, పడుకోలేడు, ఏదీ తినలేడు. అటువంటి పరిస్థితిలో కుటుంబ సభ్యులు కూడా వాడు పోతే పీడ వదిలింది అనుకుంటారు. చివరి దశలో కుటుంబ సభ్యుల ప్రేమాభిమానాలకు కూడా దూరమై ఘోరమైన చావు కోసమేనా ఈ త్రాగుడు?

ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వచనం ప్రకారం, ఆరోగ్యం అంటే అది శారీరక, మానసిక మరియు సామాజిక క్షేమాన్ని కలిగి ఉండాలి. ఈ మూడింటికి విఘాతం కలిగించేదే ఈ త్రాగుడు (మద్యపానం).


శారీరక వైకల్యానికి కారణమయ్యే పోలియో కోసం విస్తృత ప్రచారం చేసే ఆరోగ్యసంస్థలు, పోలియో కంటే ఘోరమైనది మరియు కుటుంబ వైకల్యానికే కారణమయ్యే 'త్రాగుడు'ని సంపూర్ణంగా సమాజం నుండి తుడిచివేయడానికి, ఎందుకు విస్తృత ప్రచారం చేయడం లేదు. దానికి కారణమేమిటి?

ఆ కారణాన్ని కొంతవరకూ మనం ఊహించవచ్చు. నేడు ప్రపంచాన్ని శాసించేది మరియు అన్ని రంగాలకు ఆర్థిక దన్నుగా ఉండేది ఈ మద్యం వ్యాపారమే. రాజకీయ నాయకులకు ఎలక్షన్లలో దన్నుగా ఉండి వారిని గెలిపించేది ఈ మద్యం వ్యాపారులేననే విషయం బహిరంగ రహస్యం.

ఇస్లామ్ ధర్మాన్ని తెలుసుకుని, అల్లాహ్‌పై విశ్వాసం గల ఏ ముస్లిమైనా, త్రాగుడిని అసహ్యించు కుంటాడు. ఇస్లామ్ వ్యాప్తి చెందితే ఏ విధంగా అయితే అలనాడు మదీనాలో మద్యాన్ని వీధుల్లో పారబోశారో అటువంటి పరిస్థితి ఏర్పడుతుంది. **అందుకనే ప్రపంచ వ్యాప్తంగా ఇస్లామ్‌పై బురద చల్లడానికి చేసే దుష్ప్రచారం కోసం లక్షల కోట్లు ఖర్చు పెడుతున్నారు.**

హెల్త్ టిప్స్ చెప్పే ఓ వెబ్‌సైట్ వారు ఆల్కహాల్‌వలన స్వల్ప కాలిక ప్రభావం ఏ విధంగా ఉంటుందో వివరిస్తూ ఓ వ్యాసాన్ని ఉంచారు "Short term effects of Alcohol, know and **stay away from it right now** friend..,". కొందరు ప్రజలు రిలాక్స్ కావాలని తాగుతారు. వారు అనుకుంటారు ఆల్కహాలు తమ ఒత్తిడిని తగ్గిస్తుందని మరియు సరదాగా గడపవచ్చని అనుకుంటారు. కాని వాస్తవానికి అది శారీరక వ్యవస్థపై ప్రభావం చూపి, బ్లడ్‌ప్రెషర్ (బి.పి.)ని తగ్గిస్తుంది. రక్తం ఇన్‌టాక్సికేట్ అవుతుంది. అది అవయవాల పనితీరుపై ప్రభావం చూపుతుంది.

**స్వల్పకాలిక ప్రభావం మెదుడుపై ఎలా ఉంటుందంటే, త్రాగినపుడు వారి మెదడు వారికున్న టెన్షన్‌లను తొలగించినట్లు భ్రమ కలిగిస్తుంది.** కాని కొన్ని గంటల తరువాత డిప్రెషన్ ఇంతకు పూర్వం కంటే ఎక్కువ పెరిగి పోతుంది. మరలా త్రాగితే ఆ డిప్రెషన్ మరింత పెరుగుతుంది.




ఎక్కువగా మద్యం త్రాగడం వలన వివిధ శరీర భాగాలకు సంక్రమించే వ్యాధులు

కాబట్టి ఒక సమస్యనుండి ఉత్పన్నమైన బాధను తట్టుకోవడానికి ఆల్కహాల్‌ను ఉపయోగించుకోవడం వలన మరింత కృంగదీస్తుంది. **సమస్యను తట్టుకునేలా చేయగలిగేది మన మనస్సు మాత్రమే.** దాని ఆరోగ్యాన్ని మరియు బలాన్ని పెంచాలి. అది **విశ్వాసంతోనే సాధ్యం అవుతుంది.** దెయ్యాలపై భయం కలిగిన వ్యక్తి, చీకట్లో గాలికి చిన్న ఆకు కదిలినా భయపడతాడు. తాను అల్లాహ్ రక్షణలో ఉన్నానని పూర్తిగా విశ్వసించినవాడు అన్నింటిని తట్టుకోవడానికి సిద్ధపడతాడు.

**ఇస్లామ్ యొక్క తొలి మూలస్తంభం ఇదే- ఈమాన్ (విశ్వాసం).**

ప్రవక్త(స)వారిని ప్రత్యక్షంగా కలిసి మాట్లాడితే, మక్కా ఖురైష్‌లు తనపై దాడి చేస్తారేమోననే భయంతో, చాలా రహస్యంగా ఆయన(స)ని కలిసిన అబూజర్(రజి), ముహమ్మద్(స)వారి నుండి ఈమాన్ గురించి తెలుసుకోగానే అతనిలోని భయం వెంటనే సంపూర్ణంగా తొలగి పోయింది.

ముస్లిముల బలం పెరిగే వరకూ రహస్యంగా ప్రార్థన చేసుకోవడానికి ఆయనకు ప్రవక్త(స)వారు అనుమతి నిచ్చినప్పటికీ ధైర్యంగా మార్కెట్‌లో అందరికీ వినిపించేలా అల్లాహ్‌పై మరియు ముహమ్మద్(స)వారిపై తనకున్న విశ్వాసాన్ని ప్రకటించారు. వాళ్ళు ఆయనను రాళ్ళతో కొట్టారు. ఆ దాడిలో ఆయన గాయపడ్డారు. ఆ గొడవ ఏదో విధంగా ఆగిపోయింది. కొడతారని తెలిసి కూడా మరలా రెండవ రోజు అదే ప్రాంతంలో తన విశ్వాసాన్ని బహిరంగంగా ప్రకటించారు. ఆయనను వారు మరలా కొట్టారు.

**పిరికితనంతో మక్కా ప్రవేశించిన ఆయనకు అంత ధైర్యం ఎక్కడి నుండి వచ్చింది?**

మూడవ ఖలీఫా ఉస్మాన్(రజి)వారి కాలంలో కూడా ఎవరైనా ధర్మానికి వ్యతిరేకంగా ప్రవర్తిస్తే వారిని అబూజర్(రజి) నిలదీసేవారు. పేదరికాన్నే ఆయన ప్రేమించారు. చివరి దశలో ఎందరు ఎన్ని బహుమతులిచ్చినా తిరస్కరించిన ఆయన దగ్గర ఉన్నవి కేవలం ఒక జత బట్టలు మరియు ఒక మేక. ఆయన మనశ్శాంతిగా బ్రతికారు. ఆయన మరణించినప్పుడు ఆయనపై కప్పడానికి వస్త్రం కూడా లేదు.

**చాలామంది పేదరికం వలన ఆత్మహత్యలు చేసుకుంటారు. కృంగిపోతుంటారు. సహాయం కోసం ఎల్లప్పుడూ ఎదురు చూస్తుంటారు. కాని ఈయన మనశ్శాంతితో సంతోషంగా పేదరికంలో కూడా ఎవరి సహాయం లేకుండా జీవించ గలిగారంటే, దాని కారణం ఈమాన్ (అల్లాహ్‌పై ఆయనకున్న విశ్వాసం).**

**కాబట్టి సమస్యలకు త్రాగుడు పరిష్కారం కాదు.** అది సమస్యలను పెంచుతుందిగాని తగ్గించదు. తల్లిదండ్రులు మద్యపానం చేసేవారైతే పిల్లలకు వారు ఓ పీడకలగా అయిపోతారు. త్రాగుడుకు బానిసలైన వారు కుటుంబ సభ్యులను శారీరకంగా మరియు మానసికంగా గాయ పరుస్తారు.

ఎందరో చనిపోవడానికి పరోక్షంగా వారు కారణమౌతున్నారు. రోడ్డు ప్రమాదాలలో 43శాతం ప్రమాదాలు మద్యం త్రాగి వాహనాలు నడపడం వల్లనే జరుగుతున్నాయని పోలీసుల పరిశోధనలలో తేలింది. 2011 సంవత్సరంలో పదినెలల కాలంలో మన రాష్ట్రంలో 35,795 రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వాటివలన 12,632 మంది మరణించారు. మరియు 46,960 మంది గాయపడ్డారు. అంటే రోజుకి 111 రోడ్డు ప్రమాదాలు జరుగుతుంటే, వాటివలన 48 మంది చనిపోతున్నారు.

మద్యం త్రాగడం ఆపితే వేల మరణాలు జరగకుండా ఆపవచ్చు, ఇన్షా అల్లాహ్. దేశంలోని మిగతా రాష్ట్రాలతో పోలిస్తే, 12 శాతం ప్రమాదాలు మన రాష్ట్రంలోనే జరుగుతున్నట్లు పోలీసుల పరిశోధనలలో స్పష్టమైంది. త్రాగుడు మైకంలో హత్యలు చేసిన సంఘటనల వంటివి ఎన్నో వార్తాపత్రికలలో చూస్తున్నాము.

చివరికి సమాజానికి, కుటుంబానికి మరియు తమకు తామే భారమై, ఆహారం తినలేక, పడుకోలేక, కూర్చోలేక మరియు నిలుచోలేక వారు పడే యాతన కళ్ళారా చూస్తే మరో వ్యక్తి త్రాగడానికి భయపడతాడు. చివరి దశలో తీవ్ర శారీరక బాధలుంటాయి. వాటికి మందులుండవు.

ఈ మధ్యకాలంలో చదువుకునే యువతులు మరియు ఉద్యోగాలు చేసుకునే యువతులలో కొందరు మన రాష్ట్రంలో కొన్ని నగరాల్లో రాత్రిపూట త్రాగి న్యూసెన్స్ చేయడం కూడా జరుగుతుంది. అది వారి స్టేటస్‌ని పెంచుతుందని వారు అనుకోవచ్చు. ప్రస్తుతం వారి సంఖ్య చాలా స్వల్పమే కాని అది ఇతరులకు కూడ వ్యాపించకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. స్త్రీలకు త్రాగే అలవాటుంటే, వారికి పుట్టే పిల్లలు తీవ్ర శారీరక రుగ్మతలతో జన్మించే ప్రమాదం ఉంది.

మీ సన్నిహితులు, స్నేహితులలో ఎవరైనా ఆల్కహాల్ త్రాగే వారుంటే వారిని పూర్తిగా ఆపండి. వారికి ముహమ్మద్(స)వారి బోధనలను తెలియజేసి మానసిక ధైర్యాన్ని పెంచుకునేలా చేయండి.

ఆల్కహాల్ త్రాగడం మహాపాపాలలో ఒకటి. దానిని సమాజం నుండి దూరం చేయడానికి సంపూర్ణ మద్యపాన నిషేధానికై అల్లాహ్ పేరుతో అందరూ ప్రయత్నం చేయాలి.

**కేవలం మద్యం ఒక్కటే కాదు.**
**మద్యం వంటివే మరికొన్ని**
**పదార్థాలు కూడా ఉన్నాయి.**
**వాటి గురించి మరియు**
**శారీరక, మానసిక మరియు సామాజిక**
**ఆరోగ్యంపై వాటి వలన ఎటువంటి**
**చెడు ప్రభావాలున్నాయో, ఇన్షా అల్లాహ్**
**వచ్చే సంచికలో, ఇదే శీర్షికలో కొనసాగిస్తాము**

## త్రాగుడికి అలవాటుపడిన సోదరుడిని ఆ వ్యసనం నుండి దూరం చేయడానికి మొట్టమొదట మనం ఏమి చేయాలి?

అష్-షామ్ (సిరియా మరియు దాని పరిసర ప్రాంతాల) నుండి ఓ వ్యక్తి తరచుగా ఉమర్(రజి)వారి సమావేశాలకు వస్తూ ఉండేవారు. కొన్ని రోజులుగా ఆయన ఉమర్(రజి)వారికి కనిపించకపోయేసరికి, అతని గురించి తనతో ఉండేవారిని వాకబు చేశారు.

అతడు మద్యానికి బానిస అయ్యాడని వారిలో ఒకరు ఉమర్(రజి)వారికి తెలిపారు. ఆ విచారకరమైన వార్త విని ఉమర్(రజి)వారు తన లేఖకునితో తాను చెప్పేది వ్రాయమన్నారు.

"ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి) నుండి 'ఫలానా'కు,

అస్సలాము అలైకుమ్! నేను నీకు చెబుతున్నాను, 'సకల పొగడ్తలు మరియు కృతజ్ఞతలన్నీ అల్లాహ్ కొరకే మరియు ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప. బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్'

ఉమర్(రజి)వారు క్రింది ఆయత్‌ను పఠించారు :

**హా-మీమ్. ఈ గ్రంథ (ఖుర్'ఆన్) అవతరణ సర్వశక్తిమంతుడు, సర్వజ్ఞుడు అయిన అల్లాహ్ తరపునుండి జరిగింది. పాపాలను క్షమించేవాడు మరియు పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు, శిక్షించటంలో కఠినుడు, ఎంతో ఉదార స్వభావుడు. ఆయన తప్ప మరొక ఆరాధ్యదైవం లేడు. (అందరి) మరలింపు ఆయన వైపునకే ఉంది!**

లేఖలో వ్రాయవలసినవి చెప్పిన తరువాత, ఉమర్(రజి)వారు తన వార్తాహరునితో చెప్పారు, "ఈ లేఖను అతనికి ఇవ్వకు అతడు మత్తులో లేకుండా పూర్తిగా (నిశ్చలంగా) ఉన్నాడని నీవు తెలుసుకునే వరకూ." తరువాత ఉమర్(రజి)వారు తనతో ఉన్నవారిని ఆ మద్యం త్రాగే వ్యక్తిని క్షమించమని **అల్లాహ్‌కు దు'ఆ చేయమని ఆదేశించారు.**

ఉమర్(రజి)వారి లేఖను అందుకుని త్రాగుడుకు బానిసయైన ఆ వ్యక్తి దానిని చదవడం మొదలుపెట్టాడు మరియు ఉమర్(రజి)వారు ఉదాహరించిన ఆ ఆయత్ యొక్క అర్థాన్ని గ్రహించాక, అతడు అన్నాడు, "నిశ్చయంగా, నా ప్రభువు నన్ను క్షమిస్తానని వాగ్దానం చేశాడు, మరియు ఆయన తన శిక్ష గురించి నన్ను హెచ్చరించారు." అవే మాటలను మరలా మరలా పునరావృత్తం చేస్తుండగా, అతని కళ్ళ నుండి నీళ్ళు కారాయి. అతడు తన రబ్ (ప్రభువు) నుండి క్షమాపణ వేడుకున్నాడు మరియు ఆ విధంగా పశ్చాత్తాప విషయంలో విజయవంతంగా తొలి అడుగు వేయగలిగాడు.

మరియు అతడు అక్కడితో ఆగిపోకూడదని నిర్ణయించుకుని, పశ్చాత్తాపాన్ని పూర్తి చేసుకోవడానికి జీవితంలో మరెన్నడూ ఆల్కహాల్‌ను ఒక్క చుక్క కూడా త్రాగనని ఒట్టు పెట్టుకున్నాడు.

తను వేసుకున్న ఒట్టును ఆచరణలో పెట్టడానికి, తన వ్యసనాన్ని పూర్తిగా మరియు వెంటనే ఆపేయడానికి టర్కీలోని ఓ చల్లని ప్రదేశానికి వెళ్ళిపోయాడు.

ఇందులో మొదటి అడుగు అల్లాహ్ సహాయంతో వేయగలిగాడు. మరియు పట్టుదల మరియు నిజాయితీగా పశ్చాత్తాపంతో ఆ వ్యక్తి సంపూర్ణంగా మరియు శీఘ్రంగా త్రాగుడు స్థితినుండి పూర్తిగా దానికి దూరమయ్యే స్థితికి **సున్నితంగా మారడం జరిగింది.**

ఉమర్(రజి)వారు ఈ శుభవార్త విని, తన అనుచరులతో చెప్పారు, "**ఇదే మీరు చేయవలసింది. మీలో ఒకరు దోషంలో పడటం చూస్తే, అతడు తనంతట తానే స్వయంగా సవరించుకోవడానికి అతనికి సహాయం చేయండి. కాని అతనికి వ్యతిరేకంగా పనిచేసే షైతాన్‌కి సహాయకారి కావద్దు.** అంటే అతనిని దూరంగా ఉంచడం ద్వారా, నిందించడం ద్వారా, అతనిని పశ్చాత్తాపం నుండి నిరాశపడేలా ఏదైనా చేయడం ద్వారా, సహాయ నిరాకరణ ద్వారా షైతాన్‌కి సహాయపడవద్దు అని అర్థం చేసుకోవాలి.

ముందుగా అతని కోసం దు'ఆ చేసుకుని, తరువాత ఖుర్'ఆన్ ద్వారా పశ్చాత్తాప పడటానికి ప్రోత్సహించాలి. అంతేగాని నిందలద్వారా, అవమానాల ద్వారా అతడు పశ్చాత్తాపపడకుండా చేయకూడదు.

మనం కూడా ఈ విధానాన్నే అనుసరిద్దాము. ఎందుకంటే ప్రవక్త(స)వారు సన్మార్గం పొందిన ఖలీఫాలను అనుసరించమన్నారు కాబట్టి.

జీవిత చరిత్ర

# ముహమ్మద్

సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి ఆయనపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

**14**

### విశ్వాస పునాది
### (ముహమ్మద్(స)వారి అనుచరులలో)

క్రిందటి సంచికలో రాత్రికి రాత్రే అకస్మాత్తుగా మార్పు రాదని, అది విశ్వ నియమాలకు వ్యతిరేకమని చెప్పుకున్నాం. హృదయంలో విశ్వాసం ధృడపడటానికి అంచెలంచెలుగా దివ్య సందేశం అవతరించింది. ఊహించని రీతిలో 40 సంవత్సరాలలో అద్భుతమైన మార్పు ప్రపంచం చూడగలిగింది. వీటన్నింటికి మూలం అల్లాహ్‌పై విశ్వాసం.

అంతటి మహత్తరమైన మార్పుకి కారణమైన ఆ విశ్వాస పునాదిని ఏ విధంగా ముహమ్మద్(స)వారు తన అనుచరులలో వేశారో చూద్దాం. విశ్వ నియమాలలో అల్లాహ్ ఏర్పరిచిన అతి ముఖ్యమైన నియమం :

**"ప్రతివాని ముందూ వెనుకా ఆయన నియమించిన ఒకరి వెంట ఒకరు వచ్చే కావలివారు (అల్లాహ్ దూతలు) ఉన్నారు. వారు అల్లాహ్ ఆజ్ఞానుసారం అతనిని (మనిషిని) కాపాడుతూ ఉంటారు. నిశ్చయంగా, ఒక జాతివారు తాము మార్చుకోనంత వరకు, అల్లాహ్ వారి స్థితిని మార్చడు. అల్లాహ్ ఒక జాతి వారికి కీడు(శిక్ష) చేయదలిస్తే దానిని ఎవ్వరూ తొలగించలేరు. మరియు వారికి ఆయన తప్ప మరొక స్నేహితుడు లేడు."** (ఖుర్'ఆన్ 13:11)

ఇస్లామ్‌ను ఆచరించేవారు అలవరచుకోవలసిన అతి ముఖ్యమైన లక్షణం సహనం. దీనితో మార్పు కోసం ప్రయత్నించాలి. ఆ ప్రయత్నమే అల్లాహ్ అనుగ్రహం పొందేలా చేసి మార్పు మనకు సాధ్యపడేలా చేస్తుంది. ఉదాహరణకు ఓ స్త్రీ వివాహం చేసుకున్న తరువాత మెట్టినింటిలో కాలు పెడుతుంది. అక్కడి వాతావరణం ఆమెకు కొత్తగా ఉంటుంది. ఆ కుటుంబంలో శాశ్వతంగా ఓ భాగం కావడానికై వచ్చిందామె. కాని అక్కడి పరిస్థితులు ఆమెను కలవరపెడితే ఏం చేయాలి? **ఆ కుటుంబాన్ని వదిలేయాలా?** లేక ఆ పరిస్థితులలో మార్పులు తీసుకు వచ్చి, తన కుటుంబాన్ని సంతోష మయం చేసుకోవాలా? ఇది సాధ్యమౌతుందా? ఇన్షా అల్లాహ్ తప్పక అవుతుంది. ఈ వ్యాసాన్ని అర్థం చేసుకుంటూ చదవండి.

**ముహమ్మద్(స)వారు ఖుర్'ఆన్ సూచించిన విధానాన్ని మాత్రమే అనుసరించారు. ఆయన విధానం తెలుసుకుని మనమూ అనుసరిద్దాం.**

ఒక జాతిలో రావలిసిన మార్పుకు మరియు ఆ జాతి విజయానికి మధ్య నున్న సంబంధం ఇప్పుడు మన జ్ఞానానికి స్పష్టంగా తెలుస్తుంది. ఈ విశ్వ నియమం యొక్క సూచనలను బట్టి, ఆ కాలంలో నెలకొని యున్న పరిస్థితులలో ముస్లిమ్ ఉమ్మత్ యొక్క స్థితి మెరుగుపడాలి. ముఖ్యంగా వారిలో ముందుగా మార్పు రావాలి. శాశ్వత అణుకువ స్థితిని వారు కోరుకుంటే తప్ప, అటువంటి పరిస్థితులలో ముస్లిములు కొనసాగడం కష్టం. అంటే ముస్లిములు చాలా అణుకువగా, వినయంగా ప్రవర్తించాలి.

మక్కాలో ఇస్లామ్ అరుదెంచినప్పుడు, కఠినమైన వాస్తవాన్ని ఎదుర్కోవలసి వచ్చింది. మక్కాలోనే కాదు, అరేబియా ద్వీపకల్పంలోనూ మరియు ప్రపంచం మొత్తం మీద ఇస్లామీయ బోధనలకు అనుగుణంగా వర్తించేవి దాదాపు ఏమీ లేవనే చెప్పాలి. ఆసమయంలో ప్రపంచం గాఢాంధకారంలో ఉంది. చీకటిలో నున్న దానిని వెలుగులోకి తీసుకు రావాలి. ఆ కాలంలో ఉనికిలోనున్న ఎన్నో నమ్మకాలు, మనో వైఖరులు, విలువలు మరియు రాజకీయ వ్యవస్థలు - ఇవన్నీ ఇస్లామ్‌తో ఢీకొన్నాయి. ప్రపంచంలో ఇవన్నీ శతాబ్దాల తరబడి పాతుకుపోయిన ఆచరణలు.

ఇస్లామ్ కేవలం ఈ నమ్మకాలను మార్చడానికి మాత్రమే రాలేదు. మనో వైఖరులు, విలువలు, ఆచారాలు మరియు నడవడికను మార్చడానికి, మరియు రాజకీయ వ్యవస్థను మరియు సామాజిక నియమాలను కూడా సమూలంగా మార్చడం కోసమే వచ్చింది. నిరంకుశ నాయకులు మరియు రాజులను తొలగించి వారి స్థానంలో ఇస్లామ్ (శాంతి) చట్ట ప్రకారం పాలించే నాయకత్వాన్ని ఉంచడం కొరకే ఇస్లామ్ వచ్చింది.

**ఇస్లామ్ తీసుకు వచ్చిన ఆ మార్పు విశ్వనియమాల ప్రకారమే వచ్చిందే తప్ప అద్భుతాలతో రాలేదు. కాని సంభవించిన ఆ మార్పు ఓ అద్భుతమనే చెప్పాలి.**

మార్పు కోసం ముహమ్మద్(స)వారి కాలంలో అమలు పరచిన విధానాన్ని, ముస్లిమ్ జాతి ఏ కాలంలోనైనా అమలు పరచగలిగితే ఇన్షా అల్లాహ్, అది ఈ భూమిపై విజయాన్ని మరియు స్థిరత్వాన్ని పొంద గలుగుతుంది.

మొట్టమొదట ముహమ్మద్(స)వారు తీసుకొచ్చిన **మార్పు** ఏమిటంటే తన అనుచరుల హృదయాలలో మార్పు తీసుకురావడం ద్వారా నైతికంగా వారిని గొప్పవారిగా చేయడం. అంటే ఇక్కడ **మార్పు ముందుగా వ్యక్తిగత స్థాయిలో జరిగింది.** ఆ మార్పు ద్వారా తన అనుచరులు గొప్ప లక్షణాలు పుణికి పుచ్చుకున్నారు. తన అనుచరులను ఉపయోగించి ప్రవక్త(స)వారు సమాజ స్థాయిలో మార్పు తీసుకువచ్చారు.

ప్రజలు చీకటి నుండి వెలుగులోకి, అజ్ఞానం నుండి జ్ఞానంలోకి, వెనుకబాటు తనం నుండి అభివృద్ధి పథంలోకి తీసుకు రాబడ్డారు. దాని ఫలితంగా ప్రజలు ఎన్నడూ చూడని ఓ సుందరమైన నాగరికత ప్రజల కళ్ళముందే రూపుదిద్దుకుంది.

ప్రవక్త(స)వారు తన సహచరుల నమ్మకాలలో, విలువలలో, నడవడికలలో మార్పు తీసుకురావడానికి ఖుర్ఆన్ సూచించిన విధానాన్ని మాత్రమే అనుసరించారు. దాని ఫలితంగా, మొత్తం ప్రపంచమే మారింది. ఇది మొదట మదీనాలో మొదలైంది, తరువాత మక్కాలో, ఆ తరువాత అరేబియా ద్వీపకల్పంలో మరియు ఆ తరువాత పర్షియా మరియు రోమన్ భూభాగాల్లో మార్పు సంభవించింది.

దురదృష్టవశాత్తు నేడు ఖుర్ఆన్ సూచించిన విధానాన్ని వదిలేసి, బిద్అత్ (కల్పించుకున్న స్వీయ) మార్గంలో సమాజంలోనూ మరియు ముస్లిములలోనూ మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తుండటం వలన, ముస్లిమ్ సమాజం ఎన్నో కష్టాలకు గురౌతుంది. ప్రశాంతతను కోల్పోయింది. అపనిందల పాలవుతుంది.

ప్రవక్త(స)వారు మక్కాలో గడిపిన కాలంలో, ఆయన(స) ప్రజల మూఢ నమ్మకాలను మార్చడమే ధ్యేయంగా పనిచేశారు. తన సహచరుల మనస్సులలో ఈమాన్ (విశ్వాసం) యొక్క అర్థాలను స్థిరంగా నాటుకునేలా చేశారు. అది ఎలా అంటే క్రింది ఖుర్ఆన్ ఆయత్ చూడండి :

**"మరియు ఏమీ? ఒక మరణించిన వ్యక్తి (అవిశ్వాసి)ని, మేము సజీవుని (విశ్వాసి)గా చేసి జ్యోతిని ప్రసాదించగా! దానితో ప్రజల మధ్య సంచరిస్తున్న వాడూ మరియు అంధకారం (అవిశ్వాసం)లో చిక్కుకుని, వాటినుండి బయటకు రాజాలని వాడూ ఇద్దరూ సమానులా? ఇదే విధంగా సత్యతిరస్కారులకు, వారు చేస్తున్న కర్మలు మనోహరమైనవిగా చేయబడ్డాయి."** (ఖుర్ఆన్ 6:122) (ఈ ఆయత్‌లో అల్లాహుతాలా సత్య తిరస్కారులను మృతులతోనూ మరియు విశ్వాసులను సజీవులతోనూ పోల్చాడు)

## సహచరుల నమ్మకాలను సరిదిద్దడం

ఇస్లామ్ మక్కాలో పున:ప్రారంభం కాక ముందు, అక్కడ నివశించే విగ్రహారాధకులకు 'అల్లాహ్' అంటే బాగా తెలుసు. ఏ సమయంలో వారు ఎవరిని ప్రార్థించినా సరే, కష్టమొస్తే లేక ప్రమాదం ముంచుకొస్తే అప్పుడు వారంతా కేవలం అల్లాహ్‌ని మాత్రమే అర్థించేవారు. అయితే 'అల్లాహ్' అనే పదానికి సంపూర్ణ అర్థం వారికి తెలియదు.

నేడు ప్రపంచంలో 150 కోట్లకు పైగా ముస్లిములున్నారు. వీరిలో కనీసం ఒక కోటిమందికైనా అల్లాహ్ అంటే ఏమిటో సంపూర్ణంగా తెలుసా? అని అడిగితే, 'తెలుసు' అని నమ్మకంగా చెప్పలేని పరిస్థితి నెలకొని ఉంది. కనీసం ఆనాటి మక్కావాసులకు తెలిసినంతైనా తెలుసుకున్నవారు నేటి ముస్లిమ్ సమాజంలో చాలా తక్కువమందే ఉన్నారు.

ఆరాధ్యుడు అంటే ఎవరో ఆరాధన అంటే ఏమిటో స్పష్టంగా తెలియాలి. లేకపోతే మానవ హృదయం జ్ఞాన వెలుగును స్పష్టంగా చూడలేదు.

**"మరియు అల్లాహ్ పేర్లు! అన్నీ అత్యుత్తమమైనవే, కావున మీరు వాటితో ఆయనను ప్రార్థించండి మరియు ఆయన పేర్ల విషయంలో సత్యం నుండి వైదొలగినవారిని విసర్జించండి. వారు తమ కర్మలకు ప్రతిఫలం పొందగలరు."** (ఖుర్ఆన్ 7:180)

అల్లాహ్ లక్షణాలను తెలిపే కొన్ని పేర్లను మక్కా నివాసులు నిరాకరించారు. అంతేకాకుండా ఆయన స్థాయికి సరిపోని కొన్ని పేర్లతో అల్లాహ్‌ను పిలిచేవారు. అవి తప్పుడు అర్థాలను ఇచ్చేవి. ఆయనకు లోపాలను కూడా ఆపాదించారు. అల్లాహ్‌కు కూడా అవసరాలుంటాయని మరియు ఆయనకు కూడా బిడ్డలు ఉంటారని భావించేవారు (అస్తగ్ఫిరుల్లాహ్!) అంతేకాకుండా ఫరిష్తాలు అల్లాహ్ యొక్క కుమార్తెలని మరియు జిన్నులను అల్లాహ్‌కు సాటిగా భావించేవారు.

క్రింది ఆయత్‌ల ద్వారా ఈ విషయం తెలుస్తుంది.

**"మరియు వారు, ఆయన (అల్లాహ్) సృష్టించిన జిన్నులను, అల్లాహ్‌కే సాటిగా కల్పిస్తున్నారు. మూఢత్వంతో ఆయనకు కుమారులు, కుమార్తెలు ఉన్నారని ఆరోపిస్తున్నారు. ఆయన సర్వలోపాలకు అతీతుడు, వారి ఈ కల్పనలకు అత్యున్నతుడు."** (ఖుర్ఆన్ 6:100)

**"మరియు వారు అల్లాహ్‌కేమో కుమార్తెలను అంటగడ్తారు - ఆయన సర్వలోపాలకు అతీతుడు - మరియు తమకేమో తాము కోరేది (నిర్ణయించుకుంటారు).** (ఖుర్ఆన్ 16:57)

కాబట్టి ముందుగా అల్లాహ్ పట్ల వారికున్న అభిప్రాయాలను **సవరించాలి.** ఆ తప్పుడు భావనలను తొలగించి సరియైన నమ్మకాలని విశ్వాసుల హృదయాలలో స్థిరపరచాలి. ఈ పని ఖుర్ఆన్‌తోనే సాధ్యమైంది.

అల్లాహ్ - ఒక్కడు, సృష్టికర్త, పోషకుడు, ఉనికిలో ఉన్నదానంతటికీ యజమాని, ఆయన మాత్రమే ఆరాధనకు యోగ్యుడు మరియు ఆయనకు మాత్రమే అతి సుందరమైన మరియు లోపరహితమైన ప్రత్యేక లక్షణాలు ఉన్నాయి.

ముహమ్మద్(స)వారి ధర్మ ప్రచారం (దావా)లో తొలిదశలు ఏమిటంటే విశ్వాసుల హృదయాల్లో అల్లాహ్‌పై, ఆయన దూతలపై, ఆయన గ్రంథాలపై, ఆయన ప్రవక్తలపై, తీర్పు దినంపై, అల్-ఖద్ర్‌పై మరియు దాని యొక్క మంచి చెడులపై విశ్వాసాన్ని నాటడం. మన ప్రభువైన అల్లాహ్‌కు మనపై ఎటువంటి హక్కులున్నాయో తెలిపారు. అఖీదా యొక్క వివిధ అంశాలను తన సహచరులకు బోధించారు.

● **అల్లాహ్ అన్ని లోపాలకు అతీతుడు.** లోపరాహిత్యాన్ని పూర్తిగా వివరించే విధంగా ఆయన గుణగణాలు వర్ణించబడ్డాయి. ఆయన ఒక్కరు. ఆయనకు భాగస్వామి లేరు. ఆయనకు సంతానం లేదు. ఆయన ఎవరికీ సంతానం కాదు.

● **అల్లాహ్‌యే అన్నింటికి సృష్టికర్త, పాలకుడు, పోషకుడు.**

> "నిశ్చయంగా, మీ ప్రభువైన అల్లాహ్‌యే ఆకాశాలను మరియు భూమిని ఆరు దినములలో సృష్టించాడు. ఆ పిదప తన సింహాసనాన్ని అధిష్టించాడు. ఆయన రాత్రిని పగటి వెంట ఎడతెగకుండా అనుసరింప జేసి, దాని (పగటి)పై కప్పుతూ ఉంటాడు. మరియు సూర్యచంద్ర నక్షత్రాలు ఆయన ఆజ్ఞకు కట్టుబడి ఉన్నాయి. నిశ్చయంగా, సర్వసృష్టి ఆయనదే! మరియు ఆజ్ఞ నడిచేది ఆయనదే. అల్లాహ్ ఎంతో శుభదాయకుడు, సర్వలోకాలకు పోషకుడు! (ఖుర్'ఆన్ 7:54)

● **అన్ని అనుగ్రహాలకు మూలం అల్లాహ్‌యే.** ఆ అనుగ్రహాలు చిన్నవి కావచ్చు లేదా పెద్దవి కావచ్చు మరియు అవి కనిపించేవైనా, లేక కనిపించనవియైనా సరే, అవి అన్నీ అల్లాహ్ నుండే వస్తాయి.

> మరియు మీకు లభించిన అనుగ్రహాలన్నీ కేవలం అల్లాహ్ నుండి. అంతేగాక మీకు ఆపదలు వచ్చినపుడు కూడా మీరు సహాయం కొరకు ఆయననే మొరపెట్టుకుంటారు కదా! (ఖుర్'ఆన్ 16:53)

● భూమిపైగాని ఆకాశాలలోగాని, అల్లాహ్‌కు కనిపించకుండా ఉండేది ఏదీ లేదు. ఆయనకు తెలియకుండా ఒక మనిషి తన మనస్సులో దాచుకున్నదిగాని బహిర్గతం చేసినదిగాని ఏదీ ఉండదు. అల్లాహ్ జ్ఞానం అన్నింటిపై ఉంటుంది.

> ''అల్లాహ్‌యే సప్తాకాశాలను మరియు వాటిని పోలిన భూమండలాన్ని సృష్టించి, వాటి మధ్య ఆయన తన ఆదేశాలను అవతరింపజేస్తూ వుంటాడు. నిశ్చయంగా, అల్లాహ్ ప్రతీదీ చేయగల సమర్థుడు మరియు వాస్తవానికి అల్లాహ్ తన జ్ఞానంతో ప్రతిదానిని పరివేష్టించి వున్నాడని మీరు తెలుసుకోవడానికి.'' (ఖుర్'ఆన్ 65:12)

● అల్లాహ్ ఆదేశం ప్రకారం ఆయన దూతలు మానవుల ఆచరణలను పుస్తకాలలో వ్రాస్తారు, చిన్నవీ, పెద్దవీ మరియు ప్రతీ విషయాన్ని. ప్రతీ వ్యక్తి యొక్క కర్మల పుస్తకం నిర్ణయించబడిన ఓ సమయాన ఆ వ్యక్తికి తెరచి చూపబడుతుంది.

> ''అతనితో బాటు ఒక పర్యవేక్షకుడైనా సిద్ధంగా లేనిదే - అతడు ఏ మాటనూ పలకలేడు'' (ఖుర్'ఆన్ 50:18)

● **ఇహలోకం - మానవునికి ఓ పరీక్ష :** అల్లాహ్ తన దాసులు ప్రేమించేది మరియు వారు కోరినదానికి వ్యతిరేక మైనది కలుగజేసి వారిని పరీక్షిస్తాడు. ఈ పరీక్ష ద్వారా ప్రతీ మనిషి యొక్క ధైర్యం, ప్రవృత్తి బయట పడతాయి. ఎవరైతే అల్లాహ్ ఆదేశాన్ని మరియు తీర్పుని స్వాగతించి సంతృప్తిని వ్యక్తపరుస్తారో మరియు బాహ్యంగానూ, తమ అంతర్యం లోనూ ఆయనకు లోబడి ఉంటారో వారు మేలుపొందిన వారు. ఎవరైతే అసంతృప్తితో మరియు ఆగ్రహంతో ఉంటారో, వారి ప్రతిఫలం అల్లాహ్ యొక్క ఆగ్రహమే!

> **''ఆయనే మీలో మంచిపనులు చేసేవారెవరో పరీక్షించటానికి, చావు-బ్రతుకులను సృష్టించాడు. మరియు ఆయన సర్వశక్తివంతుడు, క్షమాశీలుడు.''** (ఖుర్'ఆన్ 67:2)

● **అల్లాహ్‌పై ఎవరైతే ఆధారపడతారో** వారికి అల్లాహ్ మార్గాన్ని చూపుతారు మరియు సహాయపడతారు. వారు తమ జీవితాల్లోని అన్ని అంశాలలోనూ ఆయన సహాయాన్నే అర్థిస్తారు.

> **"నిశ్చయంగా, ఈ గ్రంథాన్ని అవతరింపజేసిన అల్లాహ్‌యే నా సంరక్షకుడు, ఆయనే సద్వర్తనులను మిత్రులుగా చేసుకుంటాడు."** (ఖుర్'ఆన్ 7:196)

● అల్లాహ్‌కు మనపై హక్కు ఉంది. ఆ హక్కు ప్రకారం ఆయనను తప్ప ఇతరులను ఆరాధించరాదు. ఆయనకు సమానంగా సాటి కల్పించడంగాని, ఆయనకు భాగస్వాములుగా ఎవరినైనా నిలబెట్టడంగాని చేయకూడదు.

> **''అలా కాదు! నీవు కేవలం అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించు మరియు కృతజ్ఞులలో చేరిపో!''** (ఖుర్'ఆన్ 39:66)

అల్లాహ్ దివ్య ఖుర్'ఆన్‌లో తౌహీద్ యొక్క అర్థాలను మరియు సూచనలను స్పష్టపరిచారు.

**మక్కా**లో ప్రారంభ దినాలలోనే తౌహీద్‌కు సంబంధించి పునాది వేయబడింది. విశ్వాసులు షిర్క్ నుండి పరిశుద్ధులయ్యారు. అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించారు.

**మదీనా**లో ఇస్లామీయ చట్టానికి సంబంధించి ఎన్నో అంశాలు శాసనాలు అయ్యాయి. ఉదాహరణకు తప్పనిసరిగా రమదాన్‌లో ఉపవాసం ఉండటం వంటి విషయాలు.

ఇస్లామీయ పునాదులు మక్కాలోనే వేయబడ్డాయిగాని మదీనాలో

కాదు. ముహమ్మద్(స)వారు కూడా ఆయనకు పూర్వం వచ్చిన ప్రవక్తలు చేసినట్లే చేశారు :

**అల్లాహ్ నూహ్(అ)వారి గురించి ఇలా చెప్పారు :**

"మరియు వాస్తవానికి మేము నూహ్‌ను అతని జాతివారి వద్దకు పంపాము. (అతను వారితో అన్నాడు): **నిశ్చయంగా నేను మీకు స్పష్టమైన హెచ్చరిక చేసేవాడిని మాత్రమే! మీరు అల్లాహ్‌ను తప్ప మరెవ్వరినీ ఆరాధించ కూడదని.** అలా చేస్తే నిశ్చయంగా ఆ బాధాకరమైన దినమున మీకు పడబోయే శిక్షకు నేను భయపడుతున్నాను." (ఖుర్'ఆన్ 11:25,26)

**అల్లాహ్ హూద్(అ)వారి గురించి ఇలా చెప్పారు :**

"మరియు ఆద్ జాతివారి దగ్గరికి వారి సహోదరుడు హూద్‌ను పంపాము. అతను ఇలా అన్నాడు : "**నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్‌నే ఆరాధించండి.** ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యదైవం లేడు. మీరు కేవలం అబద్ధాలు కల్పిస్తున్నారు!" (ఖుర్'ఆన్ 11:50)

**అల్లాహ్ సాలిహ్(అ)వారి గురించి ఇలా చెప్పారు :**

"ఇక సమూద్ వారి వద్దకు వారి సహోదరుడు సాలిహ్‌ను పంపాము. అతను అన్నాడు : "**నా జాతి ప్రజలారా! అల్లాహ్‌నే ఆరాధించండి.** ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యుడు లేడు. ఆయనే మిమ్మల్ని భూమి నుండి పుట్టించి, దానిలో మిమ్మల్ని నివశింప జేశాడు. కనుక మీరు ఆయన క్షమాభిక్ష వేడుకోండి, తరువాత ఆయన వైపునకే పశ్చాత్తాపంతో మరలండి. నిశ్చయంగా నా ప్రభువు దగ్గరలోనే ఉన్నాడు. (మీ ప్రార్థనలకు) జవాబిస్తాడు." (ఖుర్'ఆన్ 11:61)

**అల్లాహ్ షు'ఐబ్(అ)వారి గురించి ఇలా చెప్పారు :**

"ఇక మద్‌యన్ వారి వద్దకు వారి సహోదరుడైన షు'ఐబ్‌ను పంపాము. అతను అన్నాడు : "**ఓ నా జాతి ప్రజలారా! మీరు అల్లాహ్‌నే ఆరాధించండి.** ఆయన తప్ప మీకు మరొక ఆరాధ్యుడు లేడు. కొలతల్లో మరియు తూనికల్లో తగ్గించి ఇవ్వకండి. నేను నిశ్చయంగా, మిమ్మల్ని (ఇప్పుడు) మంచి స్థితిలో చూస్తున్నాను, కాని వాస్తవానికి మీపై ఆ రోజు చుట్టుముట్టబోయే శిక్షను గురించి నేను భయపడుతున్నాను. (ఖుర్'ఆన్ 11:84)

**ఈసా(అ)వారికి సంబంధించి అల్లాహ్ ఇలా చెప్పారు :**

"**నిశ్చయంగా అల్లాహ్ నా ప్రభువు మరియు మీ ప్రభువు కూడాను,** కావున మీరు ఆయననే ఆరాధించండి. ఇదే ఋజుమార్గము." (ఖుర్'ఆన్ 3:51)

క్లుప్తంగా చెప్పాలంటే, అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించడానికై సందేశహరులందరూ ప్రజలను పిలిచారు.

"మరియు వాస్తవానికి, మేము ప్రతి సమాజం వారి వద్దకు **ఒక ప్రవక్తను పంపాము.** (అతడన్నాడు) : "మీరు అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించండి. మరియు మిథ్యా దైవాల (తాగూత్) ఆరాధనను త్యజించండి. "వారిలో కొందరికి అల్లాహ్ సన్మార్గం చూపాడు. మరికొందరి కొరకు మార్గభ్రష్టత్వం నిశ్చితమై పోయింది. కావున మీరు భూమిలో సంచారం చేసి చూడండి, ఆ సత్య తిరస్కారుల గతి ఏమయిందో!" (16:36)

ముహమ్మద్(స)వారు **మువహ్హిద్**కు సజీవ ఉదాహరణగా ఉన్నారు. క్రింది ఆయత్‌లు చూడండి :

వారితో ఇలా అను : "**నిశ్చయంగా, నా ప్రభువు నాకు ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేశాడు. అదే సరైన ధర్మం - ఏక దైవ సిద్ధాంతమైన ఇబ్రాహీమ్ ధర్మం. అతను అల్లాహ్‌కు సాటి కల్పించే వారిలో చేరినవాడు కాడు!**"

(ఇంకా) ఇలా అను : "**నిశ్చయంగా, నా సలాత్, నా ఖుర్బానీ, నా జీవితం మరియు నా మరణం సర్వలోకాలకు ప్రభువైన అల్లాహ్ కొరకే! ఆయనకు ఎలాంటి భాగస్వామి (సాటి) లేడు. మరియు నేను ఇదే విధంగా ఆదేశించబడ్డాను మరియు నేను ముస్లిములలో మొట్టమొదటి వాడను!**"

ఇలా అను : **"ఏమీ? నేను అల్లాహ్‌ను వదిలి ఇతరులను ప్రభువులుగా అర్థించాలా? ఆయనే ప్రతిదానికీ ప్రభువు! ప్రతీ వ్యక్తి తాను సంపాదించిందే అనుభవిస్తాడు. మరియు బరువు మోసేవాడు ఎవ్వడూ ఇతరుల బరువును మోయడు. చివరకు మీరంతా మీ ప్రభువు వైపునకే మరలిపోవలసి ఉంది. అప్పుడు ఆయన మీరు ఏ విషయాలను గురించి భేదాభిప్రాయాలు కలిగి ఉండేవారో వాటిని మీకు తెలియజేస్తాడు."** (ఖుర్'ఆన్ 6:161-164)

**తన సహచరులకు ముహమ్మద్(స)వారు ఇచ్చిన శిక్షణ మంచి ఫలితాలను ఇచ్చింది.**

వారు కేవలం ఒక్కరైన అల్లాహ్‌ను మాత్రమే ఆరాధించారు. అల్లాహ్ ఆదేశాలకు విధేయత చూపారు. అణుకువను అలవరచుకున్నారు. తౌహీద్ ప్రకారమే వారి ఆచరణ ఉండేలా చేసుకున్నారు.

మక్కాలో అవతరించబడిన ఖుర్'ఆన్ ఆయత్‌లలో పదేపదే వచ్చే ఒక ప్రధాన అంశం ఏమిటంటే - **ముహమ్మద్(స)వారిని అల్లాహ్ తన సందేశహరుడుగా ఎన్నుకోవడం** గురించి ప్రస్తావించడం. ముహమ్మద్(స) సర్వమానవాళి కొరకు మరియు జిన్నుల కొరకు పంపబడ్డారని ఈ క్రింది ఆయత్‌లు ధృవీకరిస్తున్నాయి.

**అల్లాహ్ ఇలా చెప్పారు :**

"మరియు (ఓ ముహమ్మద్!) మేము నిన్ను సర్వమానవులకు శుభవార్త నిచ్చేవానిగా మరియు హెచ్చరిక చేసేవానిగా మాత్రమే

పంపాము. కాని వాస్తవానికి చాలామంది ప్రజలకు ఇది తెలియదు.'' (ఖుర్'ఆన్ 34:28)

**మరొక ఆయత్‌లో అల్లాహ్ చెబుతున్నారు :**

(ఓ ముహమ్మద్!) వారితో ఇలా అను : ''మానవులారా! నిశ్చయంగా, నేను మీ అందరి వైపునకు (పంపబడిన) అల్లాహ్ యొక్క సందేశహరుడను. భూమ్యాకాశాల సామ్రాజ్యాధిపత్యం ఆయనదే. ఆయన తప్ప మరొక ఆరాధ్యుడు లేడు, ఆయనే జీవన్మరణాలను ఇచ్చేవాడు. కావున అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుడు, **నిరక్షరాస్యుడైన ఈ ప్రవక్తను విశ్వసించండి.** అతను అల్లాహ్‌ను మరియు ఆయన సందేశాలను విశ్వసిస్తాడు. **అతనినే అనుసరించండి, అప్పుడే మీరు మార్గదర్శకత్వం పొందుతారు!''** (ఖుర్'ఆన్ 7:158)

**ఖుర్'ఆన్‌లో మరోచోట అల్లాహ్ చెప్పారు :**

మరియు (ఓ ముహమ్మద్!) జిన్నుల ఒక సమూహాన్ని మేము - ఖుర్'ఆన్ వినటానికి - నీ వైపునకు మొగ్గునట్లు చేసినప్పుడు, వారు అక్కడ చేరిన తరువాత పరస్పరం ఇలా మాట్లాడుకున్నారు: ''నిశ్శబ్దంగా వినండి!'' దాని (పఠనం) ముగిసిన తరువాత, వారు హెచ్చరిక చేసేవారిగా, తమ జాతివారి వైపునకు మరలిపోయారు.

వారు (జిన్నులు) ఇలా అన్నారు : **''ఓ మాజాతి వారలారా! వాస్తవంగా మేము మూసా తరువాత అవతరింప జేయబడిన ఒక గ్రంథాన్ని విన్నాము. అది దానికి పూర్వం వచ్చిన దానిని ధృవీకరిస్తుంది, సత్యం వైపునకు మరియు ఋజుమార్గం వైపునకు మార్గదర్శకత్వం చేస్తుంది.**

**''మా జాతివారలారా! అల్లాహ్ వైపునకు పిలిచేవానిని అనుసరించండి. మరియు ఆయన (అల్లాహ్)ను విశ్వసించండి. ఆయన మీ పాపాలను క్షమిస్తాడు మరియు మిమ్మల్ని బాధాకరమైన శిక్ష నుండి కాపాడుతాడు.** (ఖుర్'ఆన్ 46:29-31)

ఈ వ్యాసంలో ఇంతవరకూ అధ్యయనం చేసిన విషయాలను బట్టి మనకు బోధపడిన విషయం : **ఒక వ్యక్తి మనస్సులో అల్లాహ్ అంటే ఏమిటో స్పష్టమైన భావన ఉండాలి. అల్లాహ్ గురించి అపోహలు సత్యం ద్వారా తొలగించి అతనిని సవరించాలి. నేటి ముస్లిములలో చాలా మందికి ఈ సవరణ చాలా అవసరం. ఈ పునాది చాలా ధృడంగా ఉండాలి.**

అల్లాహ్ మనకు కనిపించరు. కాని అల్లాహ్ చూపులు మనల్ని అందుకుంటాయి. అల్లాహ్ మనకు కనిపించపోయినా, ఆయన కరుణను మాత్రం ప్రతీ నిమిషం మనం అనుభూతి చెందుతుంటాము. ఇదే విధంగా కనపడని రెండు ముఖ్యమైనవి ఉన్నాయి. వాటిపై విశ్వాసం చాలా అవసరం. వాటిని మనం అనుభూతి చెందలేము. కాని వాటిపై ఉండే మన విశ్వాసాన్ని 'విశ్వాస పునాదిపై నిర్మించబడిన సుందరమైన భవనం'తో పోల్చవచ్చు. **ఆ విషయాలు ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ....**

## ప్రవక్త(స)వారి జీవితం మన ఆత్మ విశ్వాసాన్ని పెంచుతుంది

**'ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర'** శీర్షికలో అందించే వ్యాసాలు కేవలం ఆయన జీవితంలో జరిగిన కొన్ని సంఘటనలను వివరించడం కోసం మాత్రమే ఉద్దేశించబడినవి కావు. శీర్షిక ప్రారంభం నుండి ప్రతీ విషయం విశ్లేషిస్తూ అందివ్వ బడుతుంది. ఓ కథలాగా చెప్పాలని భావించి ఉంటే, ఇన్షా అల్లాహ్ ఈ పాటికే ఈ శీర్షిక పూర్తయిపోయి ఉండేది. ముహమ్మద్(స)వారు సకల లోకాలకు కారుణ్యంగా పంపబడ్డారని మరియు ఆయనలో మనకు ఆదర్శం ఉందని ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా చాలా స్పష్టంగా తెలియజేశారు. కాబట్టి ముహమ్మద్(స)వారి జీవితంలోని ప్రతీ చిన్న అంశాన్ని మన మేలు కొరకు ఉపయోగించు కోవాలి. ఓ ముస్లిమ్‌కు వ్యక్తిగత స్థాయిలో మాత్రమే కాకుండా, ఈయన జీవితం ద్వారా మొత్తం ముస్లిమ్ సమాజం ఎంతో లాభపడగలదు.

క్రిందటి సంచికలోనూ మరియు ఈ సంచికలోనూ 1400 సంవత్సరాల క్రితం జరిగిన ఓ అద్భుతానికి కారణమైన విషయాలను వివరించడం జరిగింది. రాబోయే 3, 4 వ్యాసాలలో కూడా మరిన్ని వివరాలు ఉంటాయి. ఇవి చెప్పడానికి గల కారణం, ఆ అద్భుతం మరలా జరిగే అవకాశం ఉంది, ఇన్షా అల్లాహ్! ఆ అద్భుతం కోసం ఏ విధమైన మార్పులు అవసరమో, ఎటువంటి కృషి అవసరమో అర్థం చేసుకోవాలి.

ప్రవక్త(స)వారు ప్రారంభ దినాలలో ఇస్లామ్ బోధించినప్పటి మక్కా విగ్రహారాధకుల పరిస్థితి కంటే, నేటి ముస్లిమ్ సమాజ పరిస్థితి గొప్పగా ఏమీ లేదు. అంతకంటే అధ్వాన్నంగా తయారైంది. **ఆనాడు విగ్రహారాధకులు తమ కష్టకాలాలలో 'అల్లాహ్'ను మాత్రమే గుర్తు చేసుకునేవారు. కాని నేడు ముస్లిములమని చెప్పుకునేవారు ఆ స్థాయికి ఇంకనూ చేరుకోలేదనే చెప్పాలి.**

కాబట్టి ముహమ్మద్(స)వారు మక్కాలో తన అనుచరుల హృదయాలలో నాటిన అంశాలను, వారికి ఆయన(స) ఇచ్చిన శిక్షణను జాగ్రత్తగా మనం అధ్యయనం చేయవలసి ఉంది. వాటిని మన జీవితానికి అన్వయించుకుని, తదనుగుణంగా మారడానికి ప్రయత్నించాలి. ఆ మార్పు నిజంగా మనలో వస్తే, అపజయం అన్నది మన దరిదాపుల్లో ఉండదు. సంతోషం, ప్రశాంతత ఎల్లప్పుడూ మనతోనే ఉంటాయి. **కష్టాలు మనల్ని కదిలించలేవు.**

ప్రపంచ పాలకులు మరియు రాజకీయ నాయకులు తప్పనిసరిగా తెలుసుకోవలిసిన ముహమ్మద్(స)వారి ప్రియ అనుచరుని జీవితచరిత్ర

ప్రపంచానికి నిజమైన ప్రజాస్వామ్యాన్ని అందించిన ధర్మం - ఇస్లామ్

రెండవ ఖలీఫా

# ఉమర్ బిన్ ఖత్తాబ్

రజి అల్లాహుతాలా అన్హు

8

● అతి నిరాడంబరుడు

● ప్రపంచంలోని అతి పెద్ద భూభాగానికి నాయకుడు

అవినీతి అధికారులకు సింహస్వప్నం ●

ఓ దశాబ్దంపాటు నూటికి నూరు శాతం ప్రజాస్వామ్య పరిపాలన అందించిన ప్రజానాయకుడు

ఎటువంటి తిరుగుబాటులకు అవకాశం రానివ్వని ఉత్తమ పాలకుడు

ప్రజలకే కాకుండా మూగజీవాలకూ న్యాయం చేకూర్చిన అత్యంత దైవభీతిపరుడు

(గత సంచిక తరువాయి ...)

## ఉహద్ యుద్ధం ...

ఉహద్ యుద్ధం పూర్తయ్యాక అబూ సుఫ్యాన్ అడిగిన ప్రశ్నకు ఉమర్(రజి)వారు ప్రతిస్పందిస్తూ, "మరణించిన మా వారు స్వర్గంలో ఉన్నారు మరియు మరణించిన మీ వారు నరకంలో ఉన్నారు"అని చెప్పిన ఆయన జవాబు క్రిందటి సంచికలో ప్రచురించాము. అబూ సుఫ్యాన్ మరియు ఉమర్(రజి)వారి సంభాషణ అక్కడితో పూర్తికాలేదు.

అబూ సుఫ్యాన్ మరికాస్త ముందుకు వచ్చి "ఓ ఉమర్! అల్లాహ్ సాక్షిగా నిన్ను అడుగుతున్నాను, మేము ముహమ్మద్(స)ని చంపామా?" అతడు ఆ విధంగా అడగడానికి గల కారణం 'ఇబ్నె ఖమిఅహ్' అనే ముష్రిక్ సైనికుడు ఇలా ప్రకటించాడు, "నిశ్చయంగా, నేను ముహమ్మద్(స)ని చంపాను" అబూ సుఫ్యాన్ అడిగిన ప్రశ్నకు స్పందిస్తూ, ఉమర్(రజి)వారు చెప్పారు, "లేదు, మరియు నిశ్చయంగా ఆయన నీవు ఇప్పుడు చెబుతున్నది వింటున్నారు."

తరువాత అబూ సుఫ్యాన్ చెప్పాడు, "ఇబ్నె ఖమిఅహ్ కంటే నాకు మీరు మిక్కిలి నిజాయితీ పరులు మరియు నమ్మకస్తులు." (అంటే మీరు చెబుతున్నది నిజమని నేను నమ్ముతున్నాను అని అర్థం)

ఇక్కడ మనం గమనించవలసిన ముఖ్య విషయం : అబూ సుఫ్యాన్ ముగ్గురి గురించి మాత్రమే ప్రశ్నించాడు. వారు : ముహమ్మద్(స)వారు, అబూ బక్ర్(రజి)వారు మరియు ఉమర్(రజి)వారు. ఈ ముగ్గురే ముష్రిక్‌ల లక్ష్యమని అర్థమౌతుంది. ఎందుకంటే ముహమ్మద్(స)వారు గనుక లేకపోతే ఇస్లామ్ నెమ్మది నెమ్మదిగా లేకుండా పోతుంది. అబూ బక్ర్ మరియు ఉమర్(రజి)వారి నాయకత్వ లక్షణాలు కూడా మక్కా వారికి బాగా తెలుసు.

ప్రారంభంలో అబూసుఫ్యాన్ అడిగిన ప్రశ్నలకు ముహమ్మద్(స)వారు నిశ్శబ్దం పాటించమని తన సహచరులకు సూచించారు. ఎందుకంటే అడిగిన వారికి అంత స్థాయి నివ్వదలచుకోలేదు. కాని ఎప్పుడైతే వారు తమ విగ్రహాలను కీర్తించడం ప్రారంభించారో, వెంటనే ముహమ్మద్(స) తన అనుచరులకు ఆదేశించారు, అతని మాటలకు సమాధానం చెప్పమని మరియు ఆ మాటలను తిప్పి కొట్టమని మరియు అల్లాహ్‌యే గొప్పవాడని మరియు ముస్లిములు ఆయన సైనికులు మరియు దాసులు అని, చివరికి వారిదే విజయమని ప్రకటించడానికి. ఉమర్(రజి) జరిగే ప్రతీ సంఘటన నుండి ముహమ్మద్(స)వారి ద్వారా ఓ పాఠాన్ని నేర్చుకునేవారు. ఈ పాఠాలే ఆయనను తరువాయి కాలంలో ప్రజలు మెచ్చే గొప్ప నాయకుడిగా తయారు చేశాయి.

## బనూ ముస్తలిఖ్ పోరాటం

బనూ ముస్తలిఖ్ తెగ నాయకుడైన హారిస్ బిన్ దిరార్ యుద్ధ సన్నాహాలు చేస్తున్నాడని ముహమ్మద్(స)వారికి సమాచారం అందింది.

ముహమ్మద్(స)వారికి తమపై వ్యతిరేకంగా జరుగుచున్న యుద్ధ సన్నాహం గురించి సమాచారం అందగానే, వారిని ఎదుర్కోవడానికి ముస్లిమ్ సైన్యాన్ని సిద్ధం చేశారు. ముస్లిములతో పాటుగా చాలామంది కపట విశ్వాసులు కూడా ఆ యుద్ధంలో పాల్గొన్నారు. యుద్ధంలో విజయం సాధించాక లభించే యుద్ధసంపదలో కొంత భాగాన్ని పొందవచ్చునేది వారి ఆశ. కాని వారి హృదయంలో అల్లాహ్‌పై విశ్వాసం లేదు. ప్రవక్త(స)వారు అంటే వారి మనస్సులలో విధేయత ఎంతమాత్రమూ లేదు.

**"అల్లాహ్‌పై విశ్వాసం లేని అటువంటి కాపట్యం కలవారు ముస్లిములతో ఎలా యుద్ధానికి బయలుదేరారు?"** అని మీకు సందేహం రావచ్చు. ప్రవక్త(స)వారికి అల్లాహ్ తప్పక సహాయం చేస్తారని, ముస్లిములే విజయం సాధిస్తారనే విషయంలో మాత్రం కపట విశ్వాసులకు పూర్తి నమ్మకముంది.

యుద్ధం ప్రారంభమైంది. బనూ ముస్తలిఖ్ తెగలో కొందరు చనిపోయారు. కొందరు పారిపోయారు. మిగిలిన పురుషులు, స్త్రీలు ముస్లిములకు యుద్ధ ఖైదీలుగా చిక్కారు. ముహాజిర్, అన్సార్ పదాల గురించి ఇక్కడ ఒకసారి గుర్తుచేస్తున్నాము. **ముహాజిర్** అంటే మక్కా నుండి వలస వచ్చిన ముస్లిమ్ మరియు **అన్సార్** అంటే ముహాజిర్‌కు సాయం అందించిన ముస్లిమ్. అంటే ఒకరు వలసవచ్చినవారు మరియు మరొకరు వలస వచ్చిన వారికి సాయం చేసినవారు.

ఈ యుద్ధం మురైసీ అనే బావి దగ్గర జరిగింది. నీటి విషయంలో అక్కడే ఓ ముహాజిర్ మరియు ఓ అన్సార్ మధ్య తగాదా జరిగింది. అంటే ఇద్దరు ముస్లిముల మధ్య జరిగిన తగాదా ఇది. ఒక ముహాజిర్, ఒక అన్సార్ పిరుదులపై తన్నాడు. అన్సార్ వ్యక్తి గాయపడ్డాడు. ఆ అన్సార్ తన తోటి అన్సారులను మరియు ముహాజిర్ తన తోటి ముహాజిర్లను పిలవడం జరిగింది. ఈ విషయం ప్రవక్త(స)వారికి తెలియజేయబడింది.

ఆయన(స) వెంటనే గొడవ జరిగిన చోటుకు వెళ్ళి **"అజ్ఞాన కాలపు నినాదం ఏమిటి?**' (అంటే రక్షణ కోసం ప్రాంతం, జాతి, తెగల ఆధారంగా పిలుస్తారా?)

**'ఆ నినాదాన్ని వదిలేయండి. అది ఏహ్యమైనది.'**

ప్రతీ ముస్లిమ్ తన తోటి ముస్లిమ్‌కు సహాయం చేయాలి. అతడు

అణచివేసేవాడైనా లేక అణిచివేతకు గురైనా వాడైనా సరే. అణచివేతకు గురియైనవానికి సహాయం అందించడం అంటే స్పష్టంగా అర్ధమౌతుంది. కాని అణిచేవాడికి సహాయం అందించడమంటే ఏమిటి? అతనిని ఆ పని నుండి ఆపడమే అతనికి చేసే సహాయం.

ప్రవక్త(స)వారి మాటల వలన ఆ తగాదా సమసిపోయింది. ఆ తగాదాకి కారణమైన ఇద్దరిలో ఒకరైన ఆ ముహాజిర్ పేరు జహ్జా (రజి) మరియు అన్సార్ పేరు 'ఇబ్నె వబ్రా అల్-జుహనీ' (రజి). ఈ తగాదాలో ముహాజిర్ దోషమే ఎక్కువ ఉంది. అన్సార్ వ్యక్తి గాయపడ్డాడు. ఉబాదా బిన్ సామిత్(రజి) అనే సహాబీ ఆ అన్సారీకి విషయాన్ని వివరించారు. అతను అర్ధం చేసుకుని జహ్జా(రజి)ని క్షమించమని కోరాడు. ఈ సంఘటనలో అణచినవాడు మరియు అణిచివేతకు గురియైన వారిద్దరూ సోదరులైపోయారు.

ముందుగానే చెప్పుకున్నాం, కపట విశ్వాసులు యుద్ధసంపదలోని వాటాపై అత్యాశతోనే ముస్లిమ్‌లతో కలిశారని. ఆ కపట విశ్వాసులకు నాయకుడు - 'అబ్దుల్లాహ్ బిన్ ఉబై'. ఇతర కపటవిశ్వాసులు చెప్పుకునే విధంగానే ఇహలోక ప్రయోజనాల కోసమే ఇతను కూడా తనను తాను ముస్లిముగా చెప్పుకుంటాడు . కాని అతడు తన హృదయంలో రసూలుల్లాహ్(స) మరియు ముస్లిములపై శతృత్వాన్ని కలిగి ఉన్నాడు.

ముహాజిర్లు మరియు అన్సారుల మధ్య జరిగిన తగాదాను గొప్ప అవకాశంగా భావించి వారి మధ్య ఘర్షణ పెంచాలనుకున్నాడు.

కాబట్టి అతడు కపట విశ్వాసులతో సమావేశం ఏర్పరిచాడు. అయితే, రెచ్చగొట్టే ప్రసంగం చేశాడు. అన్సార్‌ల నుద్దేశించి, "ఇదంతా మీపైకి మీరే తెచ్చుకున్నారు. వారిని మీ భూభాగంలో చేర్చుకున్నారు. మీ సంపదను వారితో పంచుకుని, వారు మీచే పోషించబడి బలంగా తయారై మీపైనే తిరగ బడుతున్నారు. మీ జీవితాలను మీరే దయనీయంగా మార్చుకున్నారు" అని చెప్పుకొచ్చాడు. "కాబట్టి భవిష్యత్‌లో ముహాజిర్లను వదిలేసి వారికి సహాయం చేయకుండా ఉంటే వారు ఇతర ప్రాంతాలకు వెళ్ళిపోతారని" చెప్పాడు.

"అల్లాహ్ సాక్షి!, మనం మదీనా నగరానికి తిరిగి వెళ్ళిన తరువాత, నిశ్చయంగా గౌరవనీయులమైన (మనం), అక్కడ వున్న తుచ్ఛమైన వారిని తప్పక వెడలగొడ్దాం."

ఇతడు తన స్వంత కపట వర్గాన్ని మరియు అన్సారులను 'గౌరవనీయులు గాను', (అల్లాహ్ క్షమించాలి) ప్రవక్త(స)వారిని మరియు ముహాజిర్‌లను 'అల్పమైనవారు'గానూ వర్ణించాడు.

అక్కడే ఉన్న జైద్ బిన్ అర్ఖమ్(రజి) ఇతని ప్రసంగం విని, వెంటనే అతని మాటలను తిప్పి కొట్టారు. **"అల్లాహ్ సాక్షి! నీవే అల్పబుద్ధి గలవాడివి. నీచమైన మరియు హేయమైనవాడివి. ముహమ్మద్(స)వారు అల్లాహ్ వలన గౌరవం పొంది మరియు ముస్లిములు చూపే ప్రేమతో విజేత అయ్యారు."**

అబ్దుల్లాహ్ బిన్ ఉబై అతని కపటత్వాన్ని పైకి తెలియకుండా జాగ్రత్త పడేవాడు. కాబట్టి జైద్ బిన్ అర్ఖమ్(రజి) నుండి తీక్షణమైన ఎదురుదెబ్బ తగిలేసరికి, తన కాపట్యం బయటపడిపోతుందని అర్ధం చేసుకుని జైద్ బిన్ అర్ఖమ్(రజి)ను క్షమాపణకోరి తను కేవలం తమాషాగా అన్నానని, దాని అర్ధం రసూలుల్లాహ్(స)వారికి వ్యతిరేకంగా చెప్పినట్లు కాదని సర్ది చెప్పాడు.

కాని జైద్ బిన్ అర్ఖమ్ ఆ సమావేశాన్ని వదిలి రసూలుల్లాహ్(స)వారికి ఈ విషయాన్ని చేరవేశారు. ఈ విషయం ప్రవక్త(స)వారిని కలత చెందేలా చేసింది. ఆ సమయానికి జైద్ బిన్ అర్ఖమ్(రజి) నవ యువకుడు. కాబట్టి ప్రవక్త(స)వారు అడిగారు : "ఓ అబ్బాయి! నీవు అబద్ధం ఆడటం లేదు కదా!" జైద్ బిన్ అర్ఖమ్(రజి) అల్లాహ్‌పై ప్రమాణం చేసి చెప్పారు: "నేను ఈ మాటలను నా చెవులారా విన్నాను." ప్రవక్త(స) అతనితో అన్నారు : "నీవు ఇది అనుమానంతో చెప్పడం లేదుగా?" జైద్ బిన్ అర్ఖమ్(రజి) మరలా అదే సమాధానం చెప్పారు

ఈ వార్త ముస్లిమ్ సైన్యం అంతటా తెలిసిపోయింది. ఎవరూ ఏమీ మాట్లాడలేదు. జైద్ బిన్ అర్ఖమ్(రజి), తన జాతి గౌరవించే నాయకునిపై అపనింద వేశాడని మరియు అతనితో బాంధవ్యాన్ని వేరుచేసుకున్నాడని కొందరు అన్సారులు అన్నారు. జైద్ బిన్ అర్ఖమ్(రజి) అల్లాహ్‌పై ప్రమాణం చేసి '**ఖజ్‌రజ్ తెగ మొత్తంలో ఇబ్నె ఉబై (అంతవరకూ) తనకు చాలా ప్రియమైన వాడని, కాని అతడు రసూలుల్లాహ్(స)వారికి వ్యతిరేకంగా బాధకలిగించే పదాలు పలికినప్పుడు తాను తట్టుకోలేక పోయానని**' చెప్పారు. "**అతను ఒకవేళ నా తండ్రియైనా సరే, నేను ప్రవక్త(స)వారికి అతను మాట్లాడినదానిని గురించి తెలియజేసేవాడినని**" అన్నారు

ఈ విషయం ప్రవక్త(స)వారికి తెలియజేయ బడినప్పుడు, ఆయనతో ఉమర్(రజి) ఉన్నారు. **ఉమర్**(రజి) అన్నారు : **"ఓ రసూలుల్లాహ్!(స) ఈ కపట విశ్వాసి శిరస్సు ఖండించడానికి అనుమతి నివ్వండి."**

**"అతనిని వదిలేయి లేకపోతే ప్రజలు ముహమ్మద్(స) తన సహచరులను చంపుకుంటున్నాడని అంటారు"** అని ముహమ్మద్(స)వారు చెప్పారు.

ఆ కపట విశ్వాసనాయకుని కుమారుని దగ్గరకి వెళ్ళి ఉమర్(రజి) చెప్పారు. కొడుకు మాత్రం నిజాయితీ పరుడు మరియు నిజమైన ముస్లిమ్. అతడు వెంటనే రసూలుల్లాహ్(స)వారి వద్దకు వెళ్ళి చెప్పారు:

**'నా తండ్రి మాట్లాడిన మాటలకు అతను చంపబడాలని మీరు కోరితే, అతనిని చంపడానికి నాకు అనుమతి నివ్వండి మరియు ఇక్కడ నుండి మీరు లేవడానికి ముందే అతని తలను మీ ముందుకు తీసుకువస్తాను. నా తల్లిదండ్రులకు ఎంతో విధేయుడుగా మరియు సేవ చేసేవాడిగా నాకంటే ఎక్కువ ఎవరూ లేరనే విషయానికి మొత్తం ఖజ్‌రజ్ తెగే సాక్షి! కాని నేను అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరుని(స)కి హానిచేసినవాడిని సహించలేను. మీరు గనుక మరెవరినైనా నా తండ్రిని చంపమని అనుమతిస్తే, అతడు ఆయనని చంపుతాడు. తరువాత నేను నా తండ్రిని చంపిన వ్యక్తి స్వేచ్ఛగా నడిచి వెడుతుండగా చూసినప్పుడు, తెగ అసూయ నన్ను జయించి అతనిని చంపడానికి నన్ను ప్రేరేపించవచ్చు. అది నన్ను శిక్షకు గురిచేస్తుందని నేను భయపడుతున్నాను.'**

రసూలుల్లాహ్(స)వారు చెప్పారు : "**అతనిని చంపే ఉద్దేశ్యం నాకు లేదు, అతనిని చంపమని మరెవరికీ నేను ఆదేశించలేదు**".

యుద్ధం నుండి తిరుగు ప్రయాణంలో సర్వసాధారణంగా ప్రవక్త(స)వారి అలవాటు ఏమిటంటే ఓ నిర్ణీత సమయంపాటు ఆగుతారు. అయితే ఈ సంఘటన జరిగాక, రసూలుల్లాహ్(స)వారు అలవాటుకు భిన్నంగా అసాధారణ సమయంలో వెంటనే మదీనా వైపు ప్రయాణం ప్రారంభించారు. ఆయన(స) తన ఒంటె ఖస్వా పై కూర్చుండి బయలుదేరారు. అందరూ అనుసరించారు.

ముహమ్మద్(స)వారు ఆ కపట విశ్వాసిని చంపడానికి ఉమర్(రజి)వారికి అనుమతించి ఉంటే, ఆ పనిని శతృవులు బలమైన ఆయుధంగా వాడుకునే అవకాశం ఉండేది. దాని వలన జరిగే మేలు కంటే నష్టం ఎక్కువ ఉంటుంది.

శతృవులు సైతం ఓ విషయాన్ని మెచ్చుకుంటారు. అదేమిటంటే, ముహమ్మద్(స)వారిని ఆయన సహచరులు ప్రేమించినంతగా ఒక వ్యక్తి

మరో వ్యక్తిని ప్రేమించడు అని. 'అబ్దుల్లాహ్ బిన్ ఉబయ్' శిక్షకు ఖచ్చితంగా అర్హుడే. అందులో ఎటువంటి సందేహం లేదు. కాని ఏ విషయాన్ని అయితే శత్రువులు మెచ్చుకుంటున్నారో, ఆ శత్రువులే ముహమ్మద్(స)వారు తన సహచరులను చంపుకుంటున్నాడనే విషయాన్ని ప్రచారం చేస్తారు.

**కందకం యుద్ధం :** దీని గురించి సల్మాన్ ఫార్సీ(రజి)వారి గురించి వ్రాసిన వ్యాసంలో చదవండి. ఈ యుద్ధంలో కందకం వెంబడి ముఖ్యమైన చోట్లలో ఒకచోట ఉమర్(రజి)వారిని నియమించారు.

## అల్-హుదైబియా ఒప్పందం

ప్రవక్త(స)వారు తమ వైపునుండి ఓ రాయబారిని ఖురైష్‌ల వద్దకు పంపాలనుకున్నారు. ఆయన మరియు ఆయన సహచరులు 'ఉమ్రహ్' పూర్తి చేసుకున్న వెంటనే మదీనా వచ్చేయాలనేది ఆయన(స) సంకల్పం. '**ఖర్రాస్** బిన్ ఉమయ్యా అల్-ఖుజాఈ'ని రాయబారిగా ఎన్నుకున్నారు. ఆయన అత్-తాబ్ అనే పేరుగల ఒంటెనెక్కి ప్రవక్త(స)వారి యొక్క సందేశాన్ని తీసుకుని మక్కా ఖురైష్‌ల దగ్గరికి బయలు దేరాడు.

ఆయన మక్కాలో అడుగుపెట్టాక, ఖురైష్‌లు ఆయనకి మాట్లాడే అవకాశాన్ని కూడా ఇవ్వలేదు. వారు అతని ఒంటెను చంపేశారు మరియు ఖర్రాస్‌ని కూడా చంపాలని ప్రయత్నించారుగాని కొందరు వారిని ఆపారు.

ఖర్రాన్(రజి) వెంటనే 'హుదైబియా'కు వెనుతిరిగారు మరియు రసూలుల్లాహ్(స)వారికి ఏమి జరిగిందో తెలియజేశారు. ఖర్రాస్(రజి)వారికి అవమానం జరిగినప్పటికీ ముహమ్మద్(స)వారు మరొక రాయబారిని పంపాలని నిర్ణయించుకున్నారు. మొదట ఆయన(స) ఉమర్(రజి)వారిని పంపాలని అనుకున్నారు. ఉమర్(రజి)వారు తనకు బదులుగా, ఉస్మాన్(రజి) వారిని పంపితే బావుంటుందని సూచించారు.

ఉమర్(రజి)వారు అలా చెప్పడానికి ఓ బలమైన కారణం ఉంది. రాయబారిగా వెళ్ళే వ్యక్తికి అక్కడ అతనికి సంబంధించిన తెగవారు ఉన్నట్లయితే, వారి నుండి సహకారం ఉంటుంది. ఉమర్(రజి)వారికి సహకరించే వారెవరూ అక్కడ లేరు. ఉస్మాన్(రజి)వారి వంశానికి సంబంధించినవారు అక్కడ ఉన్నారు.

ఈ విషయాలు ప్రవక్త(స)వారికి కూడా బాగా తెలుసు. అంతేకాకుండా ఉమర్(రజి)వారు మరో విషయం కూడా చెప్పారు. ఒకవేళ ప్రవక్త(స)వారు తనను వెళ్ళమని ఆదేశిస్తే, తప్పకుండా వెళతానన్నారు. ప్రవక్త(స)వారు ఎటువంటి సమాధానం ఇవ్వలేదు. ఉస్మాన్(రజి)వారి గురించి ఉమర్(రజి) సూచించాక, ప్రవక్త(స)వారు ఉస్మాన్(రజి)వారిని తన దగ్గరకు పిలుపించు కున్నారు. ఆయన వచ్చాక రసూలుల్లాహ్(స)వారు ఆయనతో చెప్పారు:

**"ఖురైష్‌ల దగ్గరకు వెళ్ళండి మరియు వారికి తెలియజేయండి మేము ఎవరితోనూ యుద్ధం చేయడానికి రాలేదు. బదులుగా, ఈ గృహాన్ని (కాబా) దర్శించడానికి మరియు దాని పవిత్రతను గౌరవించడానికి వచ్చామని. మాతో హదీలున్నాయి** (అంటే ఖుర్బానీ కోసం తీసుకువచ్చిన ఒంటెలు ఉన్నాయి) **మరియు మేము వాటిని జిబహ్ చేసి తరువాత వెళతాము."**

హుదైబియా ఒప్పందం అంగీకారం అయిపోయింది. అయితే ఇంకనూ ఆ ఒప్పందం వ్రాయబడటానికి ముందే సహచరులు దానికి తీవ్ర వ్యతిరేకతను చూపారు. (**ఇది అవిధేయత ఎంత మాత్రం కాదని పూర్తి విషయాలు చదివితే అర్థమౌతుంది**) ఆ ఒప్పందంలోని 2 విషయాలపై వారికి ఆగ్రహం కలిగింది.

మొదటిది - మక్కానుండి మదీనాకు ముస్లిములు ఎవరైనా వలస వస్తే వారిని వెనక్కి తిరిగి పంపి వేయాలి. (కాని ఖురైష్‌లు మాత్రం ఎవరైనా మదీనా నుండి మక్కా వస్తే వెనక్కి పంపించరు) మరియు రెండవది ఏమిటంటే మక్కాలో ప్రవేశించకుండా కనీసం ఆ సంవత్సరంలో ఉమ్రహ్ చేయకుండానే, హుదైబియా ప్రాంతం నుండి మదీనాకు ముస్లిములు వెళ్ళిపోవాలి. ఈ విషయంలో తీవ్రంగా అభ్యంతరం తెలిపినవారు ముగ్గురు : 1. ఉమర్ బిన్ అల్-ఖత్తాబ్(రజి), ఉసైద్ బిన్ హుదైర్(రజి) మరియు సాద్ బిన్ ఉబాదహ్(రజి).

ఈ హుదైబియా ఒప్పందానికి అభ్యంతరం తెలిపేందుకు ఉమర్(రజి) ముహమ్మద్(స)వారి దగ్గరకు వెళ్ళారు. ఆయన(రజి) అడిగారు : "మీరు అల్లాహ్ యొక్క సందేశహరులు కాదా?". ప్రవక్త(స)వారు సమాధానం చెప్పారు, "ఔను" (నేను రసూలుల్లాహ్‌నే అని అర్థం). "మరియు మేము ముస్లిములు కాదా?" "ఔను".

ఉమర్(రజి)వారు అడిగారు, "వారు బహుదైవారాధకులు కాదా?" "ఔను". ఉమర్(రజి)వారు అన్నారు, "అప్పుడు మనమెందుకు మనధర్మ విషయంలో దైన్యాన్ని స్వీకరించాలి?"

**ముహమ్మద్(స)వారు ఏది చేసినా అల్లాహ్ ఆదేశం ప్రకారమే చేస్తారు.**

ప్రవక్త(స)వారు చెప్పారు : "**నిశ్చయంగా, నేను అల్లాహ్ యొక్క సందేశ హరుడను మరియు నేను ఆయనకు (అల్లాహ్‌కు) అవిధేయత చూపను.**"

మరొక ఉల్లేఖనం ప్రకారం ముహమ్మద్(స)వారు ఉమర్(రజి)వారితో చెప్పారు, **"నేను అల్లాహ్‌కు దాసుడను మరియు ఆయన సందేశహరుడను. నేను ఆయన ఆదేశానికి వ్యతిరేకంగా చేయలేను మరియు ఆయన నన్ను నిర్లక్ష్యం చేయరు."**

ఉమర్(రజి)వారికి ప్రవక్త(స)వారి తీర్పుపై ఎటువంటి సందేహమూ లేదు. ఈ ఒప్పందంలోని విషయాలు ఆయనకు అర్థం కాలేదు. ఆ ఒప్పందం ఖురైష్‌లకు మేలు చేసేదిగా పైకి కనిపిస్తుంది. కాని అది ముస్లిములకే మేలు చేసింది. అది తరువాయి కాలంలో తెలిసింది.

ఉమర్(రజి)వారు మరో విషయం కూడా అడిగారు, "మనం కాబాకు వస్తామని మరియు దాని చుట్టూ తవాఫ్ చేస్తామని మీరు మాకు చెప్పలేదా?" ప్రవక్త(స)వారు చెప్పారు : "ఔను, కాని ఈ సంవత్సరమే దాని దగ్గరకు మనం వస్తామని మీకు తెలియజేసానా?" ఉమర్(రజి) అన్నారు, "లేదు". ప్రవక్త(స)వారు చెప్పారు : **"నిశ్చయంగా మీరు దాని దగ్గరకు వచ్చి దాని చుట్టూ తవాఫ్ చేస్తారు."**

ఉమర్(రజి)వారి ఆవేదనను మనం అర్థం చేసుకోవాలి. ఈ ఒప్పందం బహుదైవారాధకుల చేతిలో అవమానంగా భావించి ఆయన తట్టుకోలేక పోయారు. ఆయనకు ఇంకనూ బాధ తీరలేదు. అబూ బక్ర్(రజి)వారి దగ్గరికి వెళ్ళారు. ముహమ్మద్(స)వారిని అడిగిన ప్రశ్నలనే యధాతథంగా ఆయనను అడిగారు. ఆయన కూడా ముహమ్మద్(స)వారు చెప్పిన జవాబులే చెప్పారు. అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారికి ఉమర్(రజి)వారి నిజాయితీ తెలుసు. అందుకనే ఆయన మంచి సలహా ఇచ్చారు. ఇలా చెప్పారు, "**ప్రవక్త(స)వారి ఆదేశాన్ని అంటిపెట్టుకుని ఉండు. ఎందుకంటే నేను సాక్ష్యమిస్తున్నాను, ఆయన నిశ్చయంగా అల్లాహ్ యొక్క సందేశహరుడు మరియు ఏదైతే ఆదేశించారో అదే సత్యం మరియు అల్లాహ్ ఆయనను నిర్లక్ష్యం చేయరు.**"

**(41 వ పేజీ చూడండి)**

# Science of Hadith
# హదీస్ విజ్ఞానం

( గత సంచిక తరువాయి )

10

## బుఖారీ (ర)
### ( ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ )
(194 - 256 హి.)

### జ్ఞాన సముపార్జనకై చేసిన ప్రయాణాలు

తాను కోరిన వ్యక్తికి అల్లాహుతాలా జ్ఞానాన్ని ఇస్తారు. అల్లాహ్ అనుగ్రహంతో బుఖారీ(ర)వారు జ్ఞానం విలువను గ్రహించారు. జ్ఞానాన్ని సముపార్జించడం ఉత్తమ ఆచరణలలో ఒకటి. ఎందుకంటే జ్ఞానం లేనివాడికి ఏది మంచో ఏది చెడో తెలియదు. మనిషికి ఊహ తెలిసిన దగ్గరనుండి చనిపోయేవరకూ జీవితంలో ప్రతీ నిమిషం ఎలా బ్రతకాలో తెలిపే సంపూర్ణ జ్ఞానం ఖుర్'ఆన్ మరియు హదీస్‌లలో ఉంది. అందుకనే ఇస్లామ్‌లో జ్ఞానాన్ని ధార్మిక జ్ఞానం మరియు ప్రాపంచిక జ్ఞానం అంటూ వేర్వేరు జ్ఞానాలుగా విడదీయలేదు.

అయితే దురదృష్టవశాత్తు నేడు ఆ జ్ఞానాన్ని చీలికలు పేలికలుగా చేసుకుని అందులో కొంత భాగాన్ని మాత్రమే నేర్చుకోవడంతో, ఆలిమ్ కోర్సు పూర్తి చేసినవారెందరో బయటకు వచ్చాక స్వయంగా సంపాదించుకోలేక ఎవరో ఒకరిపై ఆధారపడవలసిన దుస్థితి ఏర్పడింది.

అటువంటి ఆలిమ్‌లు ఏదైనా మస్‌జిద్‌కి ఇమామ్‌గా నియమితులైతే, ఆ పరిసర ప్రాంతాలలో జరిగే హరామ్ కార్యకలాపాలని ఖండిస్తూ, ప్రజలకు ధర్మాన్ని బోధించాలి. కాని ఆ విధంగా బోధిస్తే, తనను 'ఇమామత్' ఉద్యోగం నుండి తీసేస్తారని, జీతం ఇవ్వకపోతే మరోపని చేసుకుని బతకలేమని భయపడి సత్యాన్ని ప్రజలకు చెప్పలేకపోతున్నారు.

అల్లాహ్ పట్ల భయం (తఖ్వా) ఉంటే ఏ ఆలిమ్ కూడా ఈ విధంగా భయపడనవసరం లేదు. భయపడ్డాడు అంటే అతని జ్ఞానం అతనికి ఉపయోగపడలేదు.

**జ్ఞానాన్ని సముపార్జించాలనే విద్యార్థులకు నిలువెత్తు ఉదాహరణ బుఖారీ(ర)వారు. ఈయన వంటి ముహద్దిస్‌ల జీవితాలను నేటి మదరసా విద్యార్థులు సరిగ్గా అర్థం చేసుకుంటే, తమపై ఉన్న బాధ్యత లేమిటో వారు అర్థం చేసుకో గలుగుతారు.**

ఖుర్'ఆన్ గ్రంథ రూపంలో మనకు అందుబాటులో ఉంది మరియు అది అల్లాహ్ యొక్క రక్షణలో ఉంది. ఇస్లామ్‌కి రెండవ మూలమైన ప్రవక్త(స)వారి సున్నత్ కూడా ప్రామాణికంగా ప్రజలందరికీ అందుబాటులో ఉండాలి. అందుకోసం ఆ కాలంలో హదీస్‌ల సేకరణ మొదలైంది. అదే విధంగా వాటి ప్రామాణికతపై పరిశోధనలు కూడా మొదలయ్యాయి. అటువంటి గొప్ప బాధ్యతను ఎందరో ముహద్దిస్‌లు తమ భుజాన వేసుకున్నారు.

బుఖారీ(ర)వారు హదీస్‌లను ప్రామాణీకరించడానికి అనుసరించిన విధానం ఆనాడే కాదు నేటికీ అత్యున్నతమైనదే. నేటి సైన్స్ అండ్ టెక్నాలజీ పరిశోధనలలో ఈ విధానం పూర్తిగా అనుసరించగలిగితే అమోఘమైన అభివృద్ధి సాధించవచ్చు. పాఠ్య పుస్తకాలలో ఇటువంటి విశ్వాసుల జీవితాలు మరియు వారు చేసిన కృషి గురించి తప్పనిసరిగా తెలియజేయాలి. ముస్లిమ్ టీచర్లు పాఠం చెప్పేటప్పుడు అవసరమైన చోట కనీసం ఉదాహరణలుగానైనా వీటిని చెబితే బావుంటుంది.

బుఖారీ(ర)వారు జ్ఞాన సముపార్జన కోసం సుదూర ప్రయాణా లెన్నింటినో చేశారు. ఆ ప్రయాణాలలో తీవ్రమైన ఆకలి, దప్పిక బాధలను సహించారు. ఎడారులలో ప్రయాణం. ఆయన పడిన కష్టం వృథా పోలేదు. ప్రస్తుతం మనం ఆయన చేసిన కృషి గురించి చదువు కుంటున్నామంటే ఆయన వ్రాసిన పుస్తకాన్ని మనం ప్రామాణిక గ్రంథంగా స్వీకరించామంటే, దానర్థం అల్లాహ్ ఆయన కష్టానికి ఎంత ప్రతిఫలం ఇచ్చారో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఇన్షా అల్లాహ్ ప్రళయం వచ్చేవరకూ ఆయన హదీస్ గ్రంథం ముస్లిములు చదువుతూనే ఉంటారు.

సుదూర ప్రాంతాలకి వెళ్ళి జ్ఞానాన్ని నేర్చుకునే విషయంపై వ్యాఖ్యానిస్తూ ఓ విద్వాంసుడు ఇలా అన్నారు: **"ఒక వ్యక్తి అష్-షామ్ యొక్క సుదూరపు సరిహద్దునుండి యెమన్ యొక్క సుదూరపు సరిహద్దు వరకూ ఓ వివేకవంతమైన మాటను వినడానికి ప్రయాణం చేసినా, ఆ ప్రయాణం వృథా కాదని నేను అనుకుంటున్నాను."**

ఇమామ్ బుఖారీ(ర)వారు విశ్వాసుల కొరకు ఓ అద్భుతమైన ఉదాహరణ. ఇస్లామీయ సైన్స్‌లను నేర్చుకోవడానికి, మరియు ప్రత్యేకంగా హదీస్ విజ్ఞానం (సైన్స్) నేర్చుకోవడానికి ఆయన లెక్కలేనన్ని ప్రయాణాలు చేశారు.

ఆయన విద్యకోసం చేసిన తొలి ప్రయాణం చాలా చిన్న వయస్సులోనే జరిగింది. అప్పుడు ఆయన తన మాతృమూర్తి మరియు సోదరునితో ఉన్నారు. హజ్జ్ పూర్తి చేశారు. "నేను నా తల్లిగారితో హజ్జ్ చేశాను. నా సోదరుడు నా తల్లిగారితో వెనక్కి మరిలారు (బుఖారాకు). కాని నేను వెనుకనే (మక్కాలో) ఉండిపోయాను హదీస్ జ్ఞానాన్ని నేర్చుకోవడానికి. నాకు 18 సంవత్సరాలు నిండేసరికి సహాబాలు మరియు తాబయీల ఉల్లేఖనాలు మరియు వారిచ్చిన తీర్పులను వ్రాయడం ప్రారంభించాను.

ఇబ్నె హజర్‌గారు తెలిపిన దానిని బట్టి 210 హిజ్రీలో బుఖారీ(ర) తొలి ప్రయాణం చేశారు. సహ్ల్ బిన్ సిర్రీ ఉల్లేఖనాల ద్వారా తెలిసిన విషయాలు: బుఖారీ(ర)వారు అష్-షామ్ మరియు ఈజిప్టు వెళ్ళారు, అరేబియా ద్వీప కల్పానికి రెండుసార్లు మరియు 'బస్రా'కు 4 సార్లు. మరియు అల్-హిజాజ్‌లో 6 సం॥లు నివశించారు. చాలాసార్లు ఇతర విద్వాంసులతో కలిసి కూఫా మరియు బాగ్దాద్ వెళ్ళారు. ఇంకా ఎన్నో ప్రదేశాలకు వెళ్ళారు.

బుఖారీ(ర)వారు ఏదైనా ఓ పట్టణాన్ని చేరుకుంటే అక్కడ విద్వాంసుల స్టడీసర్కిల్స్‌లో కూర్చునేవారు.

బుఖారీ(ర)వారు స్వయంగా చెప్పారు : "నేను ఒక వెయ్యి కంటే ఎక్కువమంది టీచర్లనుండి (ఉల్లేఖనాలను) వ్రాసుకున్నాను. మరియు నేను కలిగియున్న ప్రతీ హదీస్ యొక్క (ఉల్లేఖకుల) పరంపర నాకు జ్ఞాపకం ఉంది."

ముహమ్మద్ బిన్ అజ్‌హర్ సిజిస్తానీ చెప్పారు, "ఒకసారి నేను సులైమాన్ బిన్ హర్బ్ వారి సమావేశాలలో కూర్చున్నాను. బుఖారీ(ర)వారు కూడా అక్కడున్నారు మరియు ఆయన (సులైమాన్ గారు వినిపించే హదీస్‌లను) వింటున్నారుగాని ఆయన వ్రాసుకోవడం లేదు. ఒక స్టూడెంట్‌ని ఎవరో అడిగారు, 'అతనెందుకు ఏదీ వ్రాసుకోవడం లేదు?' ఆ విద్యార్థి సమాధానమిచ్చాడు, 'అతడు బుఖారా వెళ్ళి ప్రతీ (హదీస్) ఆయన జ్ఞప్తికి తెచ్చుకుని వ్రాసుకుంటారు.'

అల్లాహుతాలా బుఖారీ(ర)వారికి అత్యద్భుతమైన జ్ఞాపకశక్తి నిచ్చారు. ఇంతకు పూర్వం ఒక ఉదాహరణ ద్వారా ఆయన కున్న జ్ఞాపకశక్తి గురించి క్లుప్తంగా తెలిపాము. మరింత వివరంగా ఆ విషయాలు రాబోయే సంచికలో వివరిస్తాము, ఇన్షా అల్లాహ్.

ఆయన ఓ టీచర్‌గా బోధన ప్రారంభించడానికి పూర్వమే ఎన్నో పట్టణాలు తిరిగి ఎందరో విద్వాంసుల దగ్గర నేర్చుకున్నారు. ఆ తరువాతనే బోధించడం ప్రారంభించారు. ఏ హదీస్ అయినా ప్రామాణికం(సహీహ్) అని స్పష్టమైతేనే ఆయన దానిని తెలియజేసేవారు.

## హదీస్‌లను తిరస్కరించేవారి మరణం - కాఫిర్ మరణం అవుతుందా?

ఒకసారి ఇమామ్ బుఖారీ(ర)వారు చెప్పిన ఓ విషయాన్ని ముహమ్మద్ బిన్ అబూహాతిమ్ ఉల్లేఖించారు "నేను 18 సంవత్సరాల వయస్సులో అల్-హుమైదీ గారిని దర్శించాను. నేను ఆయన దగ్గరకు వెళ్ళేటప్పటికి, ఆయన మరొకరితో ఒక హదీస్ విషయంలో చర్చలో మునిగిపోయారు. అల్-హుమైదీగారు నన్ను చూసి ఆ వ్యక్తితో చెప్పారు, 'వచ్చిన వ్యక్తి మన మధ్య తీర్పు చెబుతాడు' వారిద్దరూ నాకు వారి వాదనలు వినిపించారు. మరియు అల్-హుమైదీగారికి అనుకూలంగా తీర్పు నిచ్చాను (ఆయన దగ్గర ఆధారాలు ఉన్నాయి కనుక). **ఆ వ్యక్తి అల్-హుమైదీగారిపై వ్యతిరేకతను కొనసాగిస్తూ మరియు ఆ వ్యతిరేక భావనతోనే ఆ వ్యక్తి చనిపోయి ఉంటే, అతడు ఒక కాఫిర్‌గా చనిపోయాడు.** (ఎందుకంటే అల్-హుమైదీగారి దగ్గర స్పష్టమైన ఆధారాలున్నాయి ఆయన చెప్పేది నిజమని చెప్పడానికి).

మనిషికి చావు అనేది ఏ సమయంలోనైనా రావచ్చు. ఖుర్ఆన్ ద్వారా గాని, హదీస్‌ల ద్వారా గాని ఓ విషయంలో ఆధారాలు లభించినప్పుడు లేదా ఎవరైనా ఆధారాలు చూపినప్పుడు, వాటిని తిరస్కరిస్తే, పశ్చాత్తాపపడి అల్లాహ్ నుండి క్షమాభిక్ష కోరుకునే లోపునే మరణం గనుక సంభవిస్తే, **ఆ విధంగా మరణించిన వ్యక్తి సత్యతిరస్కారిగా మరణిస్తాడని తెలుస్తుంది.**

కాబట్టి ఏదైనా ఓ హదీస్ గురించి విన్నప్పుడు, దానిని ఆయా హదీస్ గ్రంథాలలో వెతికి ధృవీకరించుకోండి. ఆ విధంగా కాకుండా, అవగాహన లేకుండా ఆ హదీస్ లేదనడంగాని, తప్పు అని అనడంగాని చేయకూడదు. ఒకవేళ ఆ హదీస్ ఉండి, అది సరియైనదే అయితే అప్పుడు మీరు ప్రవక్త(స)వారిని తిరస్కరించినట్లు అవుతుంది. ఒకే విషయానికి సంబంధించి ఎన్నో హదీస్‌లు ఉంటాయి. ఏ ఒక్క హదీస్ కూడా మరొక హదీస్‌ను ఖండించదు.

అందరూ ప్రాపంచిక వ్యవహారాలలో మునిగి తేలుతుండగా, ఆయన రాత్రనక పగలనక ఎల్లప్పుడూ ప్రవక్త(స)వారి మరియు ఆయన సహాబాల మాటలను, ఆచరణలను, విజయాలనే చెబుతుండేవారు. అవి వినేవారికి ఎలా ఉండేదంటే, ఆయన వారి మధ్యలోనే జీవించారేమో అని అనుకునే విధంగా ఉండేది. అంత స్థాయిలో ఆయన అధ్యయనం చేశారు.

ముహమ్మద్ బిన్ అబ్బాస్ అల్-ఫిరాబ్రీ చెప్పారు, "ఒకరోజు ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్ నాకు చాలా హదీస్‌లను ఉల్లేఖించారు. చివరికి ఆయన భయపడింది ఏమిటంటే నేను విసుగు చెందానేమోనని. కాబట్టి ఆయన నాతో అన్నారు, '**సంతోషంగా మరియు ప్రశాంతంగా ఉండండి,** ఎందుకంటే ఆటగాళ్ళు తమ ఆటలలోనూ, పనివాళ్ళు తమ పనులలోనూ, మరియు వ్యాపారులు తమ వ్యాపారాలలోనూ మునిగి ఉన్నారు. కాని మీ విషయం, మీరు ప్రవక్త(స)వారితో మరియు ఆయన సహచరుల మధ్య ఉన్నారు. నేను అన్నాను, అల్లాహ్ మీపై కారుణ్యం కురిపించుగాక, మీరనుకున్నట్లు (నేను విసుగు చెందడం) లేదు, బదులుగా నేను లాభపడ్డాను నాకు తెలుసు."

ముహమ్మద్ బిన్ యూసుఫ్ చెప్పారు, "ఒక రోజు రాత్రి నేను ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్(బుఖారీ)వారి ఇంట్లో ఉన్నాను. మరియు ఆ రోజు రాత్రి ఆయన 18 సార్లు నిద్రనుండి లేవడాన్ని లెక్కపెట్టాను. ఆయన లేచిన ప్రతీసారి, ఆయనకు జ్ఞాపకం వచ్చినదానిని వ్రాసుకునేవారు." మరొకరు కూడా ఇటువంటి సంఘటననే ఒకదానిని తెలియజేశారు.

బుఖారీ(ర)వారి స్నేహితులు సరదాగా కాలక్షేపం చేసే సమయంలో, ఈయన మాత్రం తన దృష్టి అంతా జ్ఞానం పైనే కేంద్రీకరించేవారు.

ఇమామ్ బుఖారీ(ర)వారు ధనవంతులే. కొందరు తమ పుస్తకాలలో

పేదవానిగా వర్ణించారు. బుఖారీ(ర)వారి తండ్రిగారు హదీస్ విద్యావేత్త. ఆయన 'హలాల్' మార్గంలోనే ప్రతీ దిర్హమ్ సంపాదించారు. ఈ విషయం శాంతిబాటలో బుఖారీ(ర)వారి పరిచయం వ్యాసంలో తెలియజేశాం. ఆయన సంపాదన పూర్తిగా హలాల్. సందేహాస్పదంగా అంటే అది హలాల్? లేక హరామ్? అని అనుమాన పడేవిధంగా ఒక్క దిర్హమ్ కూడా ఆయన సంపాదనలో లేదు. ఎంత ఐశ్వర్యవంతులైనా వేరే చోటికి ప్రయాణించి వెళ్ళినప్పుడు తనతో పాటు తెచ్చుకున్న డబ్బు అయిపోయే పరిస్థితి ఏర్పడవచ్చు. అటువంటి ఏదో ఒక పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని బుఖారీ(ర)వారిని పేదవారిగా కొందరు గ్రంథకర్తలు భావించి ఉండవచ్చు.

ఆయన తన ఆస్తిలో ఎక్కువ మొత్తాన్ని విద్య కోసం చేసే ప్రయాణాలకే ఖర్చు పెట్టేవారు. ఫలితంగా కొన్నిసార్లు ఎడారిలో సుదూర ప్రయాణాలలో తెచ్చుకున్న సొమ్ము మొత్తం ఖాళీ అయిపోయి తీవ్రమైన ఆకలి బాధను సహించవలసి వచ్చేది. ఇదంతా జ్ఞాన సముపార్జన కొరకే చేశారు. అయితే ఆయన ఇన్ని కష్టాలకు లోనైనా సరే, సహనంతో స్థిరంగా ఉండేవారు. ఒకసారైతే తీవ్రమైన ఆకలి బాధకు లోనయ్యారు. మరోసారి దుస్తుల సమస్య వచ్చింది. ఈయన సహనం మరియు స్థిరత్వం వృథా పోలేదు. **హదీస్ విజ్ఞానంలో నాయకుడయ్యారు.**

ముహమ్మద్ బిన్ అబూ హాతిమ్‌గారు ఇమామ్ బుఖారీ(ర)వారు చెప్పగా విని ఇలా తెలియజేశారు : "నేను ప్రయాణం ప్రారంభించాను ఆదమ్ బిన్ అబూ ల్యాస్‌ను కలవడానికి. మరియు నేను (ఆ ప్రయాణంలో) దూరంగా ఉన్నప్పుడు, నా సొమ్ము అయిపోయింది. నా పరిస్థితి ఎంత విపరీతంగా అయిపోయిందంటే, గడ్డి తినవలసినంత. అయినప్పటికీ నేను ఎవరికీ నా పరిస్థితి గురించి తెలియజేయలేదు. మూడవరోజు, ఎవరో నా దగ్గరకు వచ్చారు. ఆయనెవరో నాకు తెలియదు. అయినప్పటికీ దీనార్లు ఉన్న ఓ సంచి నాకు ఇచ్చి అన్నాడు, '**మీ కోసం ఈ సొమ్ము ఖర్చు పెట్టుకోండి**'."

**కేవలం అల్లాహ్ ముందు తప్ప ఎవరి ముందూ చేయి చాచని వారికి అల్లాహ్‌యే సహాయం చేస్తారు. కష్టానికి ప్రతిఫలం అల్లాహ్ ఈ లోకంలో కూడా ఇస్తారు. ఆయన తన తోటి విద్వాంసులచే మరియు గురువులచే గౌరవించ బడ్డారు.**

ముహమ్మద్ బిన్ అబూహాతిమ్ ఒకసారి అల్-హుసైనీ చెప్పిన దానిని ఉల్లేఖించారు, "ముహమ్మద్ బిన్ ఇస్మాయీల్(బుఖారీ)కి చాలా ప్రశంస నీయమైన లక్షణాలుండేవి, అయితే వాటిలోని మూడు ప్రత్యేక లక్షణాలు ఆయన నడవడికను తెలియజేస్తాయి : ఆయన చాలా తక్కువగా మాట్లాడేవారు. ఇతరులు కలిగి ఉన్నట్లు ఆయన దురాశ కలిగి ఉండేవారు కాదు. మరియు స్వయంగా ప్రజల వ్యవహారాలలో జోక్యం చేసుకునేవారు కాదు, బదులుగా ఆయన తన సమయాన్నంతా జ్ఞానానికే అంకితం చేశారు."

విద్యార్థిగానూ మరియు విద్వాంసునిగానూ ఆయన ఎదుర్కొన్న కష్టాలలో రెండింటిని ఈ సందర్భంగా ఇక్కడ చెప్పడం సముచితంగా ఉంటుంది. ఇమామ్ బుఖారీ(ర)వారు పేదవారు కాకపోయినప్పటికీ, ఆయన జ్ఞాన సముపార్జన కోసం చేసిన ప్రయాణాలలో కొన్నిసార్లు డబ్బు అంతా ఖర్చయిపోయేదని ఇప్పటికే చెప్పుకున్నాం.

ఉమర్ బిన్ హఫ్స్ అష్ఖర్ చెప్పారు, "మేము బస్రాలో బుఖారీ(ర) (ఉల్లేఖనాలను) వ్రాసుకుంటూ ఉండేవారము. ఆయన చాలా రోజులు కనిపించలేదు మరియు చివరికి ఆయన ఓ ఇంటిలో ఉన్నారని తెలుసుకున్నాము మరియు (బయటకి రావడానికి) ఆయనకు బట్టలు లేవు (మరో కొత్త జత బట్టలు కొనుక్కోవడానికి), ఆయన దగ్గర డబ్బు మిగిలి లేదు. కాబట్టి మేమంతా కొన్ని దిర్హములు ప్రోగుజేసి ఆయన సరంజామా కొనడానికి ఉపయోగించాము."

ప్రతీ వ్యక్తి తన ఆస్తిలో డబ్బు, బంగారం, వెండి, స్థిరాస్తులు కలిగి ఉంటాడు. కాని ఇమామ్ బుఖారీ(ర)వారి విషయంలో వీటితో పాటు ఆయన **తన చిన్నతనం నుండి సంపాదించుకున్న అమూల్యమైన జ్ఞానం** కూడా ఉంది. ఆయనకి జ్ఞాన సంపదే ముఖ్యం. ఆ విషయాన్ని తెలియజేసే ఓ సంఘటన.

అల్-ఫవాఇద్ అద్-దారిమిలో అల్-అజ్లూని తెలిపారు, ఇమామ్ బుఖారీ(ర) ఒకసారి జ్ఞాన సముపార్జన కోసం ఓడలో ప్రయాణించారు మరియు ఆయనతోపాటు వెయ్యి దీనార్లు తీసుకెళ్ళారు. ఆయన తోటి ప్రయాణీకులలో ఒకరు, తనపై ఇమామ్ బుఖారీగారు దయ చూపించే విధంగా బాహ్యమైన ప్రేమాభిమానాలను ప్రదర్శించాడు. ఆ సముద్ర ప్రయాణంలో ఆ మనిషి తరచుగా ఆయనతో సన్నిహితంగా ఉండటానికి ప్రయత్నించేవాడు. సుదూర ప్రయాణాలలో సాధారణ పరిస్థితులకంటే తొందరగా స్నేహబంధం ఏర్పడుతుంది. మరియు కాలం గడుస్తున్న కొద్దీ వారు కలిసి సమయాన్ని గడిపేవారు. ఇమామ్ బుఖారీ(ర)వారు ఆ వ్యక్తితో తన దగ్గర ఒక వెయ్యి దీనార్లు ఉన్నాయని తెలిపారు.

ఇమామ్ బుఖారీ(ర) డబ్బు గురించి చెప్పిన తరువాత, తరువాయి ఉదయం లేచి ఆ వ్యక్తి ఏడ్వడం మొదలు పెట్టాడు. పెడబొబ్బలు పెడుతూ, తన బట్టలను చింపేసుకుంటూ మరియు అతని ముఖాన్ని వాడే కొట్టుకుంటున్నాడు ఓ పెద్ద కష్టమేదో తన మీద విరుచుకు పడినట్లుగా. అతని సహ ప్రయాణీకులు అతనిని అడిగారు ఏమైందని మరియు అతడు మొదట్లో వారికి సమాధానమివ్వడానికి తిరస్కరించాడు, అతడు ఇంకా షాక్‌లోనే ఉన్నట్లుగా మరియు తన పరిస్థితి గురించి స్పష్టంగా చెప్పలేనట్లుగా. వారు పదేపదే అడుగగా తనకు ఏమి జరిగిందో చెప్పాడు, **"వెయ్యి దిర్హములు కలిగిన ఓ సంచి నాకుండేది మరియు నేను దానిని పోగొట్టుకున్నాను."** ఆ ఓడ సిబ్బంది ప్రయాణీకులను వెతకడం ప్రారంభించారు. ఒకరి తరువాత ఒకరుగా వెదకబడుతున్నారు మరియు ఏమి జరుగుతుందో గ్రహించాక, ఇమామ్ బుఖారీ(ర)వారు ఎవరూ చూడటం లేదని నమ్మకం కుదిరాక ఓడ ప్రక్క భాగం నుండి సముద్రంలోకి తన డబ్బు సంచిని విసిరేసారు. వెతకడానికి ఆయన వంతు వచ్చేటప్పటికి, ఆయన దగ్గర ఏమీ దొరకలేదు.

మొత్తం ఓడను మరియు ప్రయాణీకులను వెదికిన తరువాత ఏ డబ్బు సంచీ దొరకక పోవడంతో, కథ చెప్పిన ఆ వ్యక్తి దగ్గరకు ఆ ఓడ సంరక్షకులు వెళ్ళి తప్పుడు ప్రకటన చేసినందుకు మరియు వారిని ఇబ్బంది పెట్టినందుకు వాడిని కొట్టారు. ఆ ఓడ ఒడ్డుకు చేరగానే, ప్రయాణీకులు దిగడం ప్రారంభించారు. ఇదిలా ఉండగా, ఇమామ్ బుఖారీ(ర)వారి దగ్గరకు ఆ వ్యక్తి వెళ్ళి ఆయన ఆ డబ్బు సంచిని ఏమి చేశారని అడిగాడు.

**" నేను దానిని సముద్రంలో విసిరేసాను"** ఇమామ్ బుఖారీ(ర)వారు వాస్తవాన్ని చెప్పారు. "మీరు అంత సొమ్ము పోగొట్టుకున్న వాస్తవాన్ని సహనంతో అంగీకరిస్తున్నారా?" ఆ వ్యక్తి అడిగాడు ఆశ్చర్యంతో.

**"ఓ అజ్ఞాని! నీకు తెలియదా నా మొత్తం జీవితం రసూలుల్లాహ్(స) హదీస్‌లను సేకరించడానికి గడిపానని మరియు ప్రపంచం ఇప్పుడు నా విశ్వసనీయతను గుర్తించింది. అటువంటప్పుడు స్వయంగా దొంగతనం అపనిందకు లోనవడం నాకు తగుతుందా? మరియు నేను విలువైన ముత్యాన్ని (నా జ్ఞానాన్ని మరియు నేను సాధించినవాటిని) వదులుకోవాలా, నా జీవితంలో సంపాదించుకున్న కొన్ని దీనార్ల కోసం?"**

**సూక్ష్మ విషయాలను సైతం వదిలిపెట్టని ఆయన విధానం :** ఆయన సూక్ష్మవిషయాలను కూడా వదిలిపెట్టని పరిశోధకుడు. చిన్న విషయాన్ని కూడా ఆయన గ్రహింపు నుండి తప్పించుకోనిచ్చేవారు కాదు.

ఒకసారి ఇమామ్ బుఖారీ(ర)వారు చెప్పగా విని, దానిని ముహమ్మద్ బిన్ అబూ హాతిమ్ ఉల్లేఖించారు. "ఇతరుల వలే నేను హదీస్‌లను వ్రాసుకోలేదు. ఎవరైనా వ్యక్తి నాకు హదీస్ వినిపిస్తే మరియు అతడు తెలివైన వ్యక్తి అయితే, నేను అతని పేరును, అతని కున్యా, అతని వంశావళి మరియు అతడి హదీస్ ఉల్లేఖనా చరిత్రను అడిగేవాడిని. ఒకవేళ అతడు తెలివైన వ్యక్తి కాకపోతే, నేను అతనితో హదీస్‌ను దాని మూలం వరకూ ఉల్లేఖించమని అడిగేవాడిని మరియు తరువాత అతడు నాకు ఇచ్చిన వివరాలను వ్రాసుకునేవాడిని."

బుఖారీ(ర)వారి మాటలను అబ్దుర్రహ్మాన్ బిన్ ముహమ్మద్ బుఖారీ ఉల్లేఖించారు. "నేను అల్-హిజాజ్, ఇరాఖ్, అష్-షామ్ మరియు ఈజిప్టు ప్రాంతాలలో వెయ్యిమందిని (టీచర్లు, గురువులని) కలిశాను. మరియు నేను వారిని చాలా సందర్భాలలో కలిశాను." ఆయన వారిలో కొంతమంది పేర్లు తెలిపారు మరియు ఇలా చెప్పారు : "ఒక్క వ్యక్తి కూడా కాదనకుండా, వారు ఏకగ్రీవంగా ఈ క్రింది విషయాలను అంగీకరించారు :

**"ధర్మం అనేది మాట (ప్రసంగం) మరియు ఆచరణ. మరియు ఖుర్ఆన్ అల్లాహ్ యొక్క ప్రసంగం."**

ఈ 'హదీస్ విజ్ఞానం' శీర్షికలో హదీస్‌ల వర్గీకరణలో ఎన్నో రకాల హదీస్‌లను చెప్పడం జరిగింది. ఉల్లేఖకుడు నమ్మకస్తుడు, నిజాయితీపరుడు కాదని తెలిస్తే, ఆ ఉల్లేఖనాలని ఆయన తొలగించారు. ఆ విధంగా ఆయన వేల సంఖ్యలోని హదీస్‌లను తీసివేశారు.

శాంతిబాట జూన్, 2010 సంచిక నుండి జూలై, 2011 సంచిక వరకూ, అందించబడిన హదీస్ వర్గీకరణలు :

- **ఖుద్సీ, మర్ఫూ, మౌఖూఫ్, మఖ్తూ**
- **ముస్నద్, ముత్తసిల్, మున్‌ఖతి, ముఅల్లఖ్, ము'అదల్, ముర్సల్**
- **ముతవాతిర్, అహద్ (గరీబ్, అజీజ్)**
- **ముదల్లస్, తద్‌లీస్ (తద్‌లీస్ అల్-ఇస్నాద్, తద్‌లీస్ అల్-షుయూఖ్, తద్‌లీస్ అల్-తస్వియ్యహ్), ముసల్‌సల్**
- **షాజ్, మున్‌కర్, ముద్‌రజ్**
- **మ'లూల్/ము'అల్లల్, ముజ్‌తరిబ్, మఖ్‌లూబ్**
- **సహీహ్, హసన్, దయీఫ్, మౌదూ**

హదీస్ వర్గీకరణలను సామాన్యులకు సైతం అర్థమయ్యే విధంగా ఉదాహరణ పూర్వకంగా అందివ్వాలనే ఉద్దేశ్యంతోనే ఈ శీర్షికను ప్రారంభించాము. చివరి వర్గీకరణయైన 'సహీహ్, దయీఫ్, హసన్, మౌదూ' హదీస్‌ల గురించి వివరించి శీర్షికను ముగించేయాలని అనుకున్నాము. అయితే ఈ శీర్షికపై పాఠకులు వ్యక్తం చేసిన అభిప్రాయాలను బట్టి నేటి ముస్లిమ్ సమాజంలో కొన్ని అపోహలు నెలకొని ఉన్నాయని తెలిసింది. వాటిని తొలగించడానికి ఈ హదీస్ విజ్ఞానానికై కృషి చేసిన వారి గురించి చెప్పడం తప్పనిసరి అని భావించాము. అంతేకాకుండా బుఖారీ(ర)వంటి ఎందరో ముహద్దిస్‌లపై సరియైన అవగాహన లేకుండా కొంతమంది తప్పుడు ప్రసంగాలు విని వివిధ హదీస్ విద్వాంసుల మధ్య తారతమ్యాలు చూపుతున్నారు. ఇది సరికాదు. ముహద్దిస్ లందరూ హదీస్ విజ్ఞానాన్ని క్షేమంగా మనకు అందించాలని ఎంతో కృషి చేసినవారు. వారిపట్ల మనకు ఉండ వలసింది కృతజ్ఞతా భావం మరియు గౌరవం. ఏదైతే వారు బోధించారో దానినే ఆచరణలో చూపారు. ఈ శీర్షికలో వరుసగా ఎందరో ముహద్దిస్‌ల జీవిత చరిత్రలను, ఇన్షా అల్లాహ్, అందిస్తాము. అయితే మేము అందించే వరుస క్రమానికి, వారి జ్ఞాన స్థాయికి ఎటువంటి సంబంధమూ లేదు. అంటే ఈ శీర్షికలో చివరిగా చెప్పిన ముహద్దిస్‌గారు జ్ఞానంలో ఇతర ముహద్దిస్‌ల కంటే తక్కువ అని భావించ కూడదు. వరుసక్రమం అనేది మాకు అందుబాటులో ఉండే ప్రామాణిక సమాచారంపై ఆధారపడి ఉంటుంది. సేకరణ ప్రారంభించాము. ముందుగా సేకరించ గలిగిన వాటిని ముందుగా అందిస్తాము, ఇన్షా అల్లాహ్ **- శాంతిబాట టీమ్**

**(మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...)**

# జ్ఞానం అజ్ఞానం 7

## రాష్ట్రంలో పెరుగుతున్న రష్దీల సంఖ్య

**ప్రతీ ముస్లిమ్ చేత తప్పనిసరిగా చదివించవలసిన వ్యాసం**

జ్ఞానులకు ఉండే అజ్ఞానం ఏ విధంగా ఉంటుందో ఈ శీర్షిక ప్రారంభ వ్యాసంలో అంటే ఆగష్టు 2009లో వివరంగా ఎన్నో ఉదాహరణల ద్వారా తెలియజేశాం. అయితే ఆ సంచిక తొలి సంచిక కావడంతో తరువాయి కాలంలో చేరిన పాఠకులకు దానిని అందివ్వలేక పోయాము. మా వెబ్‌సైట్‌నుండి ఆ వ్యాసాన్ని ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. కొత్తగా జాయిన్ అయిన మా పాఠకుల కొరకు దాని నుండి ఒక ఉదాహరణను మాత్రం ఇక్కడ అందిస్తున్నాము.

చాలా కాలం క్రితం ఓ స్టాటిస్టిక్స్ పుస్తకంలో ఈ ఉదాహరణ గురించి చదవడం జరిగింది. రచయిత పేరు గుర్తులేదు. ఆ ఉదాహరణ ఏమిటంటే, ఓ కుటుంబ సభ్యులు వేరే ఊరికి ప్రయాణమై నడుస్తూ వెళుతున్నారు. దారిలో చిన్న నది తగిలింది. ఆ నదిలోతు ఎంతో వారికి తెలియలేదు. అటుగా వస్తున్న ఓ వ్యక్తిని, కుటుంబ యజమాని "బాబూ! ఇక్కడ నది లోతు ఎంత ఉంటుంది' అని అడిగాడు. అతను సమాధానంగా 3 అడుగులని చెప్పాడు. అంటే నది మధ్యలో లోతు : 3 అడుగులు. ఈ కుటుంబ యజమాని లెక్కల మాష్టారుగా పని చేస్తున్నాడు. వెంటనే, ఆయన తన జేబులోంచి కాగితం తీసి ఓ లెక్క చేశాడు. అదేమిటంటే, తన కుటుంబం యొక్క సగటు ఎత్తు ఎంత అని తెలుసుకునే లెక్క. తన పొడవు 6 అడుగులు, తన భార్య పొడవు 5 అడుగులు. తన పెద్ద కొడుకు ఎత్తు 2 అడుగుల 10 అంగుళాలు, చిన్న కొడుకు ఎత్తు 2 అడుగుల 2 అంగుళాలు. మొత్తం కలిపితే 16 అడుగులు వచ్చింది. వారు నలుగురు కనుక ఈ 16 అడుగులని 4 చేత భాగించాడు. ఫలితంగా సరాసరి ఎత్తు 4 అడుగులుగా వచ్చింది. నదిలోతు 3 అడుగులు కాబట్టి, తన కుటుంబం యొక్క సగటు ఎత్తు 4 అడుగులు కనుక, నది లోతుకంటే తమ కుటుంబపు సగటు ఎత్తు ఓ అడుగు ఎక్కువగానే ఉందని, క్షేమంగా అవతల ఒడ్డుకు వెళ్ళిపోవచ్చని తలంచి, ఆ లెక్కల మాష్టారు తన భార్య బిడ్డలతో సహా నదిలోకి దిగి, అవతలి ఒడ్డుకు చేరుకున్నాడు. తీరా ఒడ్డుకి చేరుకున్నాక చూస్తే తన ఇద్దరు పిల్లలు కనిపించలేదు. వారు నదిలో మునిగిపోయారు. మాష్టారుకి అర్థం కాలేదు. మరోసారి లెక్కగట్టాడు. ఈసారి కూడా ఫలితం 4 అడుగులే వచ్చింది. **లెక్కను కరెక్టుగా చేసినందుకు ఇతను జ్ఞానమున్న వ్యక్తి అవుతాడా?** లేక మునిగిపోకుండా ఉండాలంటే అందరి ఎత్తు కనీసం 3 అడుగులు దాటి ఉండాలనే చిన్న విషయాన్ని ఆలోచించనందుకు ఇతను **అజ్ఞాని** అవుతాడా?

నిజంగా ఈ జ్ఞానిలో ఎంతో అజ్ఞానం ఉంది.

ఈ మాష్టారుకి ఒక సబ్జక్టులో జ్ఞానముందిగాని, దానిని మరో రంగంలో ఉపయోగించు కోవడంలో ఫెయిల్ అయ్యారు. పై విషయం జ్ఞానమున్న ఓ వ్యక్తి యొక్క అజ్ఞానాన్ని తెలియజేసింది. ఇక అజ్ఞానుల విషయానికొస్తే మూర్ఖుడు తనకెంతో జ్ఞానం ఉందని అనుకుంటాడు. నేడు ఏదో ఒక రంగంలో పరిమిత జ్ఞానం పొందినవాళ్ళు ప్రపంచంలోని అన్ని రంగాలపై అనర్గళంగా మాట్లాడగలరని అనుకుంటున్నారు. ఒకప్పటి 10వ తరగతి వరకూ మాత్రమే చదువుకున్న వాళ్ళు కూడా, మిడి మిడి జ్ఞానంతో నేటి ఆధునిక సైన్స్‌పై వేదికలెక్కి ప్రసంగాలు ఇస్తున్నారు.

> **నేడు మన సమాజంలో ఇటువంటి అజ్ఞానుల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతుంది. ఏమిటీ దుస్థితి? ప్రళయం సమీపించినప్పుడు 'అజ్ఞాని'ని జ్ఞానిగా గౌరవిస్తారని ముహమ్మద్(స)వారు ఏనాడో చెప్పారు. ప్రస్తుతం అదే జరుగుతుంది.**

సల్మాన్ రష్దీ వ్రాసిన పుస్తకం (సెటానిక్ వెర్సెస్)లో ఏముంది అనే విషయాన్ని పక్కన పెడితే, ఆ పుస్తకం టైటిల్‌లోనే రచయిత యొక్క విషపూరిత భావన ప్రతిబింబిస్తుంది. అతడి వ్యక్తిగత జీవితాన్ని స్టడీ చేస్తే అతని మానసిక పరిస్థితి అర్థమౌతుంది. మనుషుల్లో షైతాన్‌లు ఉంటారనేది తెలిసిన విషయమే. దానికి ఒక ఉదాహరణే ఈ సల్మాన్ రష్దీ. ఇస్లామ్‌కి వ్యతిరేకంగా ఎవరైనా పుస్తకం వ్రాశారని తెలిస్తే చాలు, పాశ్చాత్యదేశాల వారు ఆనందంతో చిన్న పిల్లల్లా నేల మీద పడి కేరింతలు కొడతారు. సాహిత్యాన్ని గౌరవించడం కొరకే ఇదంతా చేస్తున్నామంటారు.

కాని వారు విలువిచ్చింది - **సాహిత్యానికా?** లేక **మత దురభిమానానికా?** అని సందేహపడ నవసరం లేదు. రెండవదే నిజం.

ఎందుకంటే సాహిత్యంలో మామూలు స్థాయికి కూడా చేరుకోని 'తస్లీమా నస్రీన్' వ్రాతలకు కూడా వారు ఉన్నత స్థాయిలో విలువిచ్చారంటే వారి భావనలను మనం అర్థం చేసుకోవచ్చు. ఆమె ఎప్పటికైనా సత్యం తెలుసుకోగలిగితే, తన వ్రాతలకు సిగ్గు (లజ్జ)కు లోనవుతుంది, ఇన్షా అల్లాహ్.

ఇటువంటి వ్యక్తులపై ఇస్లామ్ వ్యతిరేక ముద్రపడింది కాబట్టి వారు గొప్ప సెలెబ్రిటీలుగా పాశ్చాత్య దేశాలలో చెలామణి అవుతున్నారు. అయితే ఆ విధంగా వ్యతిరేక ముద్రపడకుండా ఇస్లామ్ కోసం పనిచేస్తున్నామని చెప్పే 'రష్దీ'లు కూడా మన రాష్ట్రంలో చాలామందే ఉన్నారు. వీరికి కూడా పాశ్చాత్యుల నుండి డైరక్టుగా కాకుండా, పరోక్షంగా వేతనాలు అందుతున్నాయి. వీరు తమ మీద ఇస్లామ్ అనుకూల ముద్ర వేయించు కున్నారు. ఆ ముద్ర చూసి ముస్లిములు కూడా భారీ ఎత్తున ఆర్థిక సహకారాలు అందజేసి ఓ మోస్తరు సెలెబ్రిటీ స్థాయికి వీరిని పెంచారు.

వీరికి అడుక్కోవడం, నోటి కొచ్చింది చెప్పడమే తప్ప అధ్యయనం చేయగలిగే సామర్థ్యం లేదు.

కనీస విద్యార్హతలు లేకపోయినా, మానసిక పరిపక్వత లేకపోయినా, తెలుగు భాష యొక్క కనీస స్థాయి వ్యాకరణం తెలియక పోయినా సరే పుస్తకాలు వ్రాసేస్తున్నారు. ఈ అజ్ఞానులకు సోదరైన తస్లీమా నస్రీన్ కంటే కూడా వీరి సాహిత్య స్థాయి ఇంకా తక్కువగా ఉంది.

### సమాజంపై చెడు ప్రభావం

మానసిక ఆరోగ్యం సరిగా లేనివారుగాని, మానసిక పరిపక్వత లేనివారుగాని పుస్తకాలు వ్రాస్తే ఆ వ్రాతలు సమాజంపై చెడు ప్రభావం చూపుతాయి. వ్యక్తిగత ఆరాధనలవైపు మొగ్గు చూపుతున్న నేటి సమాజంలో ఈ వ్రాతలు ప్రజలను సన్మార్గం నుండి తప్పిస్తాయి.

ఎవరైనా సరే ముందుగా తాము వ్రాసేది సత్యమని ధృవీకరించుకోవాలి. దాని కొరకు అధ్యయనం చేయాలి. ఆ అధ్యయనం కొరకు రోజులు పట్టవచ్చు లేదా నెలలు పట్టవచ్చు. కొన్ని సబ్జక్టులకు సంవత్సరాలు కూడా పట్టవచ్చు. బుఖారీ(ర)వారు ఎన్నో ప్రయాణాలు చేసి ఎంతోమంది గురువుల దగ్గర నేర్చుకుని తన అధ్యయనం పూర్తయ్యాకనే బోధించడం ప్రారంభించారు. ఒక ప్రామాణిక హదీస్ గ్రంథాన్ని మానవజాతికి అందించారు.

**మంచిని బోధించాలి. చెడును నిరోధించాలి. ప్రజలను మోసం చేసే వ్రాతలను 'అల్లాహ్‌పై విశ్వాసమున్న ప్రతీ ముస్లిమ్' ఖండించాలి.**

నాస్తికుడైన 'ఇ.ఏ.జబ్బార్' అనే ఓ వ్యక్తి తన ముస్లిమ్ పేరును ఉపయోగించుకుని ఖుర్'ఆన్ గ్రంథంపై, ఇస్లామ్‌పై తప్పుడు అనువాదాలతో చెడుగా వ్రాశాడు. సత్యంతో అతని వ్రాతలను ప్రారంభ సంచికలో ఖండించడం జరిగింది. హేతువాదిగా హేతువంటే ఏమిటో కూడా తెలియని ఓ వయస్సు పైబడిన రత్నాకర్‌గారు కక్కిన విషపూరిత సాహిత్యాన్ని ఇదే శాంతిబాటలో తిప్పి కొట్టడం జరిగింది. మరో సంచికలో వేరే మత ధర్మానికి చెందిన వ్యక్తి అవగాహనా రాహిత్యంతో వ్రాసిన వ్రాతలను ఖండించి, పాఠకులకు సత్యాన్ని తెలియజేయడం జరిగింది.

బురదలో బాగా పొర్లి వ్రాసేవారి వ్రాతలనయితే సభ్య సమాజమే 'ఛీ' అంటుంది. కాబట్టి అటువంటి వాటిని శాంతిబాటలో ప్రచురించము. ముస్లిముల ముసుగులో కపట విశ్వాసులు చేస్తున్న విషప్రచారాన్ని ఒక ప్రత్యేక పుస్తకం ద్వారా ఖండించాము.

### ఇస్లామ్‌పై తప్పుడు వ్రాతలతో శాంతిబాట వ్యాసాలను వ్యతిరేకిస్తూ ఇటీవల ఓ పుస్తకాన్ని ప్రచురించారు

ప్రామాణిక హదీస్‌ల ఆధారంతో 'శాంతిబాట' అందించిన జకాత్ ప్రత్యేక వ్యాసాలను వ్యతిరేకిస్తూ క్రిందటి సంవత్సరం ఓ చిరుపుస్తకం విడుదలైంది.

| | | |
|---|---|---|
| పుస్తకం పేరు | : | **జకాత్** |
| రచయిత(లు) పేరు | : | ప్రచురించ లేదు |
| ఫోన్ నంబర్లు | : | 9440306686, 9393105606 |

(2011 రమదాన్ తరువాత ఈ పుస్తకాన్ని ప్రచురించి, పంచారు)

ఒక పుస్తకం వ్రాయడానికి ఉండవలసిన కనీస జ్ఞానం కూడా వ్రాసిన వ్యక్తులకు లేదని పుస్తకం చదివిన వారికి స్పష్టంగా అర్థమౌతుంది.

పై పుస్తకంలో 13వ పేజీలో ఒక ఖుర్'ఆన్ ఆయత్ (2:273)ని ప్రస్తావించారు మరియు 14వ పేజీలో ఇలా వ్రాశారు :

**అబూజర్(రజి)వారి జీవితంలోని ఓ సంఘటనకు పై ఖుర్'ఆన్ వాక్యానికి (యుద్ధానికి) ఏ విధమైన సంబంధం లేదు. లేనివి ఉన్నట్లు, ఉన్నవి లేనట్టు, చిత్రీకరించి ప్రజలను మభ్య పెట్టడం కాదా? ఇది.**

పై మాటలను బట్టి రచయితలు ఎవరి వ్రాతలనో ఖండిస్తున్నారని స్పష్టంగా తెలుస్తూనే ఉంది. వారి పుస్తకంలో తొలి 13 పేజీలలో ఎక్కడా అబూజర్(రజి) గురించి ఎటువంటి వివరాలు లేవు. ఆయనను పరిచయం లేదు. మరియు ఆయన జీవితంలో జరిగిన ఆ సంఘటన ఏమిటో కూడా వివరించలేదు. అకస్మాత్తుగా 14వ పేజీలో పై విధంగా వ్రాస్తే, పుస్తకం చదివే వ్యక్తికి ఏమి అర్థం అవుతుంది? జరిగిన సంఘటన ఏమిటో చెప్పకుండా, దానికి మరియు ఖుర్'ఆన్ ఆయత్‌కి సంబంధం లేదు అని అంటే రచయితల రచనా పాటవం ఏ పాటిదో మరియు వారి వివేకం ఏ స్థాయిలో ఉందో పాఠకులు అర్థం చేసుకోగలరు.

ఒకవేళ ఆ సంఘటనను కూడా వారు వ్రాసి ఉంటే, ప్రజలను మభ్యపెట్టింది ఆ రచయితలే గాని శాంతిబాట కాదు అని చదివిన వారికి స్పష్టంగా తెలిసి పోతుంది. అంతేకాకుండా, ఉన్నది ఉన్నట్టుగా 'శాంతిబాట'లో వ్రాయబడిందని తెలుసుకుని, సదరు పుస్తక రచయితలనే 'ఛీ' అంటారని భయపడి ఆ సంఘటన గురించి వారు ఎటువంటి వివరాన్ని వ్రాయలేదు.

ఆ ఖుర్'ఆన్ ఆయత్‌తో పాటు తబూక్ దండయాత్రకు సంబంధించి అబూజర్(రజి)వారు తీసుకున్న నిర్ణయాన్ని కేవలం 'శాంతిబాట'లో మాత్రమే ఉదాహరించడం జరిగింది. ఇప్పుడు మా పాఠకులకు అర్థమై ఉంటుంది, ఆ రచయితలు 'శాంతిబాట' వ్యాసాలకు వ్యతిరేకంగా వ్రాశారని.

అంతేకాకుండా 20వ పేజీలో ఇలా వ్రాశారు :

**"కొంతమంది ఖుర్'ఆన్, హదీస్‌ల ఫీ సబీలిల్లాహ్ అనే పదాల సంఖ్యని మాత్రమే తీసుకుంటున్నారు, దాని ఉద్దేశ్యాన్ని మాత్రం వదిలి వేస్తున్నారు."**

శాంతిబాటలో మేము చెప్పేవరకూ ఖుర్'ఆన్‌లోని 43 ఆయత్‌లలో ఫీ సబీలిల్లాహ్ అనే పదాలున్నాయని వారికి తెలియదు. వాటిని జకాత్ విషయంలో ప్రత్యేకంగా ప్రస్తావించింది కూడా 'శాంతిబాట' మాత్రమే.

పై రెండు విషయాల ద్వారా శాంతిబాటలో ప్రచురితమైన జకాత్ వ్యాసాలను ఖండించడానికే 'రచయితల పేరులేని జకాత్ పుస్తకం', ప్రచురించబడింది అని అనడంలో ఎటువంటి సందేహం లేదు.

ఇది 'శాంతిబాట' వ్యాసానికి వ్యతిరేకంగా వ్రాయబడిన పుస్తకం అని వారి పుస్తకపు తొలిపేజీలోనే వ్రాసేసి ఉంటే, అప్పుడే చదివిన వ్యక్తి 'శాంతిబాట'ను కూడా చదువుతాడు. అలా చదివితే వీరి అజ్ఞానం బయటపడుతుందని భయపడి ఆ విషయాలు ఏవీ ప్రస్తావించ లేదు. పేరు చెప్పుకోవడానికి కూడా వారికి ధైర్యం చాలలేదు.

**అంతేకాదు ఆ రచయితలు ఖుర్'ఆన్‌ను, ముహమ్మద్(స)వారిని, సహాబాలను, ఖలీఫాలను ఏ స్థాయిలో వ్యతిరేకిస్తున్నారో ధర్మపరాయణులైన సహాబాలపై ఎటువంటి అపనిందలు వేస్తున్నారో, ఈ వ్యాసంలో వివరించాము.**

**ఖుర్'ఆన్ మరియు ఇస్లామ్‌పై వీరికి కనీస అవగాహన కూడా లేదు**

పుస్తకంలో మూడుచోట్ల అంటే పేజీ 4, పేజీ 15 మరియు పేజీ 19లలో వారు వ్రాసిన వాక్యాలు :

- **ఇస్లామ్ పురోగతి, ఉన్నతికై ఖర్చు చేసే ప్రతీ పైస, ప్రతి సేవ (ఫీ సబీలిల్లాహ్) అల్లాహ్ మార్గమే.**
- **ఇస్లామ్ పురోగతి, ఉన్నతికై ఖర్చు చేసే ప్రతి పైస, ప్రతి సేవలో ఏ ఒక్కదాన్ని తప్పించినా ఫీ సబీలిల్లాహ్ సంపూర్ణం కాదు.**
- **ఈ విధంగా 8 పద్దుల్లోనే అవసరమైన అన్ని సదుపాయాలు, ఇస్లాం ఉన్నతికి ఖర్చు చేసుకోవచ్చు. అల్‌హమ్‌దులిల్లాహ్.**

ప్రతీ పైస, ప్రతీ సేవ 'ఫీ సబీలిల్లాహ్' అయితే జకాత్‌ను ప్రతీ మంచి పనికి వాడమని అల్లాహ్ ఆదేశించి ఉండేవారు. "ప్రత్యేకంగా 8 కేటగిరిలను ఎందుకు చెప్పారు. అంతేకాకుండా వారికి **మాత్రమే** అని ఎందుకు చెప్పారు?" అని తనను తాను ప్రశించుకుంటే విషయం స్పష్టంగా అర్థమౌతుంది. అజ్ఞానికి మాత్రమే అది అర్థం కాదు.

ఇస్లామ్ పురోగతి కోసం మరియు ఉన్నతి కోసం జకాత్ ఖర్చు చేయాలా? **(ఇస్లామ్ - ఓ పరిపూర్ణ ధర్మం.** దానిని తగ్గించడం, అభివృద్ధి చేయడం వంటి అవసరం ఎంతమాత్రం లేదు. అటువంటి అవసరం లేని దానినే పరిపూర్ణం (perfect) అంటారు.)

బహుశా క్రింది ఖుర్'ఆన్ వాక్యం వారు చదివినప్పటికీ అర్థం కాలేదేమో!

**"... ఈనాడు నేను మీ ధర్మాన్ని మీ కొరకు పరిపూర్ణం చేసి, మీపై నా అనుగ్రహాన్ని పూర్తి చేశాను మరియు మీ కొరకు ఇస్లామ్‌ను ధర్మంగా సమ్మతించాను..."** (ఖుర్'ఆన్ 5:3)

ఇస్లామ్ ఉన్నతి కోసం డబ్బు ఖర్చు చేయనవసరం లేదు. అల్లాహ్ సమ్మతించిన ధర్మమే ఉన్నతమైనది.

**"నిశ్చయంగా, అల్లాహ్‌కు సమ్మతమైన ధర్మం కేవలం ఇస్లామ్ మాత్రమే ..."** (ఖుర్'ఆన్ 3:19)

ఈ రచయితల చెప్పాలనుకున్నది ఏమిటంటే 'దాయీలు' ఇతరుల దగ్గర నుండి పేదవారికి అందవలసిన **జకాత్** డబ్బులు దోచుకోవడానికి కారణం ఇస్లామ్ ఉన్నతి కోసం మరియు పురోగతి కోసం పనిచేయడానికి. అల్లాహ్ 1400 సంవత్సరాల క్రితమే ఇస్లామ్‌ను అభివృద్ధి చేసేశారనే విషయాన్ని గుర్తించకుండా, ఈ దాయీలే ఆ పని చేస్తామని ప్రజలకు మాయమాటలు చెబుతున్నారు. అంటే వీరంతా దాయీలను అల్లాహ్‌కు సమానంగా భావిస్తున్నారా? (అస్తగ్‌ఫిరుల్లాహ్) దాయీలను ఆ విధంగా భావిస్తూ ఎంత ఘోరమైన 'షిర్క్‌కు' పాల్పడు తున్నారో! **అసలు నిజం ఏమిటంటే, ప్రజలిచ్చే ప్రతీపైసా దాయీల ఆస్తులు పెంచుకోవడానికి మరియు ఇస్లామ్‌ను అవమానించడానికే ఉపయోగిస్తున్నారు.**

**దేశాభివృద్ధి ఎలా సాధించవచ్చో పేదరికాన్ని ఏవిధంగా నిర్మూలించాలో కొంచెం కూడా వీరికి తెలియదు.**

4వ పేజీలో ఇలా వ్రాశారు :

**"ఇది దేశ పేదరికం నిర్మూలించడానికి, దేశం అభివృద్ధి చెందడానికి తోడ్పాటు నిస్తుంది. ఈ సంగతి ప్రతి ముస్లిం దేశప్రజలకు చాటి చెప్పాలి"**

పేదరిక నిర్మూలన కోసం అల్లాహ్ జకాత్ అనే పన్ను ఏర్పాటు చేశారు. అది ధనిక ముస్లిముల నుండి వసూలు చేసి పేద ముస్లిములకు పంచవలసి ఉంది. రచయితలకు ఆ జకాత్ ఎవరికి ఇవ్వాలో కూడా తెలియనట్లుంది. పేదలకు అందవలసిన జకాత్‌ను, వారికి అందకుండా చేసి దాయీలకు, మరియు ఇతరులకు దోచిపెడుతుంటే, **పేదరికం ఎలా నిర్మూలించ బడుతుంది?** పేదరికం నిర్మూలించబడకుండా అడ్డుకునేది వీరే! అయినప్పటికీ సిగ్గులేకుండా పేదరిక నిర్మూలన గురించి మాట్లాడు తున్నారు.

ఏ దేశం అభివృద్ధి చెందాలన్నా అక్కడి ప్రజలు **నిజాయితీగా, కష్టపడి పనిచేయాలి.** సోమరిపోతులు ఉండకూడదు. అడుక్కుతినేవారు లేకుండా ఉండాలి. అంటే అడుక్కుతినే వారి పరిస్థితి మెరుగుపడాలి. కష్టపడి పనిచేయకుండా తిరిగేవారికి జకాత్ సొమ్ము ఇస్తూ వారిని సోమరిపోతుల్లా తయారుచేస్తూ దేశాన్ని అభివృద్ధి చెందమంటే, **అభివృద్ధి జరుగుతుందా?**

కష్టపడి పనిచేయమని ఇస్లామ్ చెబుతుంది. చేతి సంపాదనతో తినే ఆహారం ఉత్తమమైనదని ఇస్లామ్ బోధిస్తుంది. అందుకే సల్మాన్ ఫార్సీ(రజి) వంటి వారు గవర్నర్ అయినప్పటికీ, తన జీతాన్ని పేదవారికి పంచివేసి చాపలు, బుట్టలు అల్లి, వాటిని అమ్మగా వచ్చిన సంపాదనతోనే తినేవారు. ఆయనను లుఖ్మాన్ వంటి జ్ఞానితో పోల్చారు. **జ్ఞానులు కష్టపడి సంపాదించుకోగలరు.**

జ్ఞానం ఉందని అనుకునే అజ్ఞానులు మాత్రం కష్టపడి పని చేయకుండా, వాళ్ళూ వీళ్ళూ వేసే భిక్షం తిని బ్రతుకుతారు.

**"ఈ సంగతి ప్రతి ముస్లిం దేశ ప్రజలకు చాటి చెప్పాలట".** మన రాష్ట్రంలో ఉన్న ఇన్ని వేల పల్లెటూర్లలో ఏ ఒక్క పల్లెటూరిలోనయినా పేదరికాన్ని వీరు నిర్మూలించారా? మరి సిగ్గులేకుండా ఏమి సాధించేశారని చాటిస్తారు?

జకాత్ ఇవ్వడాన్ని ఏదో గొప్ప పనిచేసినట్లుగా వర్ణిస్తున్నారు. అది గొప్ప పనికాదు. తప్పనిసరిగా చేయవలసిన పని. దాని వలన సంపద వృద్ధి పొందుతుంది. కాబట్టి జకాత్ ఇచ్చేవానికే లాభం. అది పేదవాని అమానత్. వారి అమానత్ వారికి ఇవ్వాలి. ఆ సొమ్ముపై జకాత్ ఇవ్వవలసిన ధనికుడికి ఎటువంటి హక్కూ లేదు. తమ మేలు కోసం చేసేపనిని ఏదో త్యాగం చేసినట్లు వర్ణించనవసరం లేదు.

**ఫీ సబీలిల్లాహ్ (అల్లాహ్ మార్గంలో) అంటే ఏమిటో అర్థం చేసుకునే జ్ఞానం వీరికి లేదా? లేక అర్థమై కూడా ముస్లిమ్‌లను మోసం చేయడానికే తప్పుడు మాటలు మాట్లాడుతున్నారా?**

పేజీ 8లో ఇలా వ్రాశారు : **"పూర్తి ఖుర్‌ఆన్‌లో 43 వాక్యాలలో 'ఫీ సబీలిల్లాహ్' అనే పదాలున్నాయి. అందులో ఒకటి 9:60 ఆజ్ఞా. ఇంకా 42 వాక్యాలు ఉన్నాయి. అందులోని 26 వాక్యాలలో అల్లాహ్ యుద్ధాలలో పోరాడాలి, యుద్ధం చెయ్యాలి అనే ముస్లిములకు ప్రోత్సాహం, ఆజ్ఞాపించడం జరిగింది. ఈ పదాలకు జకాత్ పద్దుకు ఎట్టి సంబంధం లేదు."**

జ్ఞానమున్న వ్యక్తి ఎవరైనా ఖుర్‌ఆన్‌లో ఒక విషయం అర్థం కాకపోతే, దాని వివరణ కోసం ముందుగా ఖుర్‌ఆన్‌లోనే వెతుకుతాడు. ఖుర్‌ఆన్‌లో లభించక పోతే హదీస్ గ్రంథాలలో వెతుకుతాడు. 43 ఖుర్‌ఆన్ ఆయత్‌లలో ఫీ సబీలిల్లాహ్ పదాలు ఉన్నాయని ఆ పదాలను లెక్కించి శాంతిబాటలో చెప్పడం జరిగింది. ఈ 43 ఆయత్‌ల యొక్క తెలుగు అనువాదాలను కూడా 'శాంతిబాట' పత్రికలో అందించాము. ఎందుకంటే కేవలం ఆయత్ నంబర్లు మాత్రమే ఇస్తే, ఇటువంటి రచయితలు అబద్ధాలు చెప్పి ప్రజలను తప్పుదోవ పట్టించవచ్చని ఊహించాము. స్పష్టంగా చెప్పినా సరే ప్రజలను మోసం చేయడానికే నిర్ణయించుకుని వీరు ఓ పుస్తకాన్నే ప్రచురించి ప్రజలకు పంచారు. (**ఆ ప్రచురణ కూడా బహుశా జకాత్ సొమ్ముతోనే అయిఉంటుంది.**)

ఈ 43 ఆయత్‌లు 'ఫీ సబీలిల్లాహ్' అనే పదాన్ని చాలా స్పష్టంగా వివరించాయి. కాబట్టి 'జకాత్' అందుకోవలసిన 8 కేటగిరులలో ఒకటైన 'ఫీ సబీలిల్లాహ్' అంటే ఖుర్‌ఆన్ ప్రకారం (అంటే అల్లాహ్ ఆదేశం ప్రకారం) ముజాహిదీన్‌లకే ఇవ్వాలి. ప్రవక్త(స)వారు జకాత్‌గా వచ్చిన ఒంటెలను, హజ్జ్ కొరకు పేదలకు ఇచ్చారు. **జకాత్‌కు మరియు ఈ పదాలకు సంబంధం లేదని చెప్పడం ఖుర్‌ఆన్‌ను వ్యతిరేకించడమే!**

క్రింద ఇవ్వబడిన తఫ్సీర్ గ్రంథాలన్నీ 'ఫీ సబీలిల్లాహ్' అంటే అది ముజాహిదీన్‌ల కొరకే అని హదీస్‌ల ఆధారంగా చెప్పడం జరిగింది.

- ప్రవక్త(స)వారి అనుచరులైన **ఇబ్నె అబ్బాస్**(రజి)వారి తఫ్సీర్
- తఫ్సీర్ ఇబ్నె కసీర్ (హి. 701)
- తఫ్సీర్ అల్-జలాలైన్
- అబ్దుల్ గఫూర్ (1941)వారి వ్యాఖ్యాన సంహిత ఖుర్‌ఆన్
- మారిఫుల్ ఖుర్‌ఆన్
- అహసనుల్ బయాన్

శాంతిబాట ఆగష్టు, 2011 సంచికలో 35 నుండి 38వ పేజీ వరకూ **ఫీ సబీలిల్లాహ్** కోసం ఈ తఫ్సీర్ గ్రంథాలలో ఇచ్చిన వివరాలున్నాయి. చూడండి.
**www.saanthibaata.net**

11వ పేజీలో వ్రాశారు : **"యుద్ధాలకి జకాత్ పద్దుకి అస్సలు సంబంధం లేదు. ఖర్చు చేసిన సొమ్ము కూడా జకాత్ కాదు. 9:60 వాక్యానికి ముందే అన్ని యుద్ధాలు జరిగిపోయాయి."**

జకాత్‌ని యుద్ధాలకు ఇవ్వమని కాదు, ముజాహిదీన్‌లకు ఇవ్వమని చెప్పారు. జకాత్ వాక్యం అవతరించడానికి ముందే అన్ని యుద్ధాలు అయిపోయాయా? **ఎంతటి అజ్ఞానం!** వీరి అజ్ఞానాన్ని వివరంగా ఇక్కడ తెలియజేస్తున్నాము.

**తబూక్ దండయాత్రకి ఎప్పుడు బయలుదేరారు?**

హిజ్రీ 8వ సంవత్సరం పూర్తయ్యాక, 9వ సంవత్సరం మొదటి నెలలో 16 మందిని జకాత్‌ను వసూలు చేయడానికి ప్రవక్త(స)వారు పంపారు. అంటే జకాత్ గురించి అప్పటికే తెలిసిపోయింది కాబట్టి ఈ అజ్ఞానుల ప్రకారం యుద్ధాలు అయిపోయినట్లే. కాని ఆ తరువాత కొన్ని నెలలకు శత్రువులను కట్టడి చేయడానికి తబూక్ దండ్రయాత్ర అవసరమైంది. కాని ఆ యుద్ధం కోసం ఆర్థిక వనరులు, వాహనాలు, ఇతర యుద్ధ సామాగ్రి చాలా అవసరం. అప్పుడు ప్రవక్త(స)వారు యుద్ధం కోసం ఎవరికి చేతనైనంత వారిని దానంగా ఇవ్వమన్నారు.

ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్(రజి)వారు, అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)వారు భారీ మొత్తంలో ధనం మరియు ఒంటెలను దానంగా ఇచ్చారు. ఇంకా ఎందరో తమకు సాధ్యమైనంత తీసుకువచ్చారు. పేదవారు కూడా కొన్ని ఖర్జూరాలు తెచ్చారు.

ప్రవక్త(స)వారితో దండయాత్రకి వెళ్ళడానికి చాలా మందికి వాహనాలు లేవు. ఎడారిలో తీక్షణమైన ఎండలో ప్రయాణం చేయలి. వాహనాలున్న వారికే చాల కష్టమైన ప్రయాణం అది. అందరికీ వాహనాలు ప్రవక్త(స)వారు సమకూర్చ లేకపోయారు. వారి పరిస్థితి ఎలా ఉందో ఖుర్‌ఆన్‌లో అల్లాహుతాలా తెలియజేశారు.

**మరియు ఎవరైతే నీ వద్దకు వచ్చి వాహనాలు కోరినప్పుడు నీవు వారితో: "నా దగ్గర మీకివ్వటానికి ఏ వాహనం లేదు." అని పలికినప్పుడు, ఖర్చు చేయటానికి తమ దగ్గర ఏమీ లేదు కదా! అనే చింతతో కన్నీరు కార్చుతూ తిరిగిపోయారో, అలాంటి వారిపై కూడా ఎలాంటి నింద లేదు.** (ఖుర్‌ఆన్ 9:92)

ఆ విధంగా కన్నీరు కార్చిన వారిలో అబూజర్(రజి) ఒకరు. సైన్యంతోపాటు వెళ్ళలేకపోయినందుకు అబూజర్ చాలా విచారంగా ఉన్నారు. కాస్సేపటికి ఎలాగైనా సైన్యాన్ని చేరుకోవాలని నిశ్చయించుకున్నారు.

ఆయన తన కత్తిని, డాలును తీసుకుని కాలి నడకన బయలుదేరారు. ఆ మండుటెండలో ఎడారిలో కాలినడకన వెళ్ళడానికి ఎవరైనా సాహసించగలరా? నిజమే! అందరూ ఆ విధంగా సాహసించ లేరు. అల్లాహ్ ఆయన హృదయంలో అమోఘమైన 'ఈమాన్'ను ఉంచారు. ఆ విశ్వాసమే ఆయనను ఆ సాహసానికి పురిగొల్పింది. **అబూజర్(రజి) విశ్వాసం ముందు ఎడారి వేడి పోటీ పడలేకపోయింది.** విశ్వాసిదే విజయం అయింది.

తబూక్‌కు వెళుతున్న సైన్యం దారిలో ఓ చోట విశ్రాంతి కొరకు ఆగింది. ఆ వేడి ఎడారిలో ఎవరో వ్యక్తి తమవైపు వస్తున్నట్లు కొందరు ఆశ్చర్యంతో గమనించారు. దూరంలో ఎవరో తమను అనుసరిస్తున్నారని వారు ప్రవక్త(స)కి చెప్పారు. ప్రవక్త(స)వారికి అబూజర్(రజి) ప్రియమైన వారు. ఇస్లామ్ కొరకు జరిగే ఏ కృషిలోనైనా తన భాగాన్ని అబూజర్(రజి) ఎన్నడూ వదులుకోరని, ఆయన తన విశ్వాసాన్ని స్వచ్ఛంగా ఉంచు కుంటారని ముహమ్మద్(స)వారికి తెలుసు.

ప్రవక్త(స)వారు అటు వైపు చూసి చెప్పారు : **'అది అబూజర్'**.

ప్రవక్త(స)వారి చుట్టూ ఉన్నవారు ఆశ్చర్యపోయారు. **సైన్యాన్ని చేరుకోవడానికి ఇంత దూరం ఎలా రాగలిగాడాయన!** ఆ వ్యక్తి సైన్యానికి చాలా సమీపంగా వచ్చారు. ఔను! ఆ వ్యక్తి మరెవరో కాదు అబూజర్ (రజి).

ఇస్లామ్ మరియు ముస్లిములకు మద్దతుగా ఆయన ఒంటరిగా నడిచి వచ్చారు. ఆయన పట్టుదలని మెచ్చుకొని ఆయనను నరకాగ్ని వేడి నుండి రక్షించమని ప్రవక్త(స)వారు అల్లాహ్‌ను వేడుకున్నారు.

**ఆయన పేదవారు కనుకనే అంతటి వేడిలో ఎడారిలో నడుచుకుని వెళ్ళారు. ఓ వాహనాన్ని కూడా కొనలేకపోయారు. ఆయన వెళ్ళింది పోరాటానికి మాత్రమే. తన స్వంతానికి కూడా కాదు. అటువంటి విశ్వాసికి తన జీవనోపాధి కోసం తిరగడానికి సమయం ఎక్కడుంది?**

అంతేకాకుండా ఆయన కానుకలను స్వీకరించలేదు. ఆత్మాభిమానం గల మనిషి ఆయన. అల్లాహ్ మార్గంలో ప్రాణాన్ని సహితం త్యాగం చేయడానికి ఏ చిన్న అవకాశాన్ని వదులుకోని ఈ సన్మార్గులకు నేటి 'దాయీలు' సమానమా?

ఖుర్'ఆన్ ఆయత్ 9:60 అవతరణకు ముందుగానే అన్ని యుద్ధాలు అయిపోయాయని రచయితలు అజ్ఞానంతో వ్రాశారు. తబూక్ కంటే ముందే జకాత్ సేకరించడానికి అధికారులు వెళ్ళారు.

పేజీ 12లో ఇలా వ్రాశారు : **తమ ధన ప్రాణాలొడ్డి పోరాడటం ఫీ సబీలిల్లాహ్ లోనివే. తమ ధన ప్రాణాలొడ్డి పోరాడటమే ఫీసబీలిల్లాహ్ కాదు. చివరి 9 వాక్యాల లోని ఫీసబీలిల్లాహ్ పదాలకు యుద్ధాలకు సంబంధం లేదు.**

ఇది పూర్తిగా తప్పు. ఆ వాక్యాలని ఆగష్టు' 2011 శాంతిబాట 30,31 పేజీలలో చూడమని పాఠకులకు మనవి చేస్తున్నాము.

**ధార్మిక విద్యను అభ్యసించే విద్యార్థులకు జకాత్ ఇవ్వవచ్చా? విద్వాంసులకు జకాత్ ఇవ్వవచ్చా? ఆ అవసరం ఉందా?**

పేజి 13 మరియు 14లో ఇలా వ్రాశారు : **ధార్మిక విద్యను ఆర్జించే విద్యార్థులు, విద్వాంసులు అల్లాహ్ కార్యం కోసం తమ జీవితాలను అంకితం చేసినవారు కూడా ఈ కోవలోకి వస్తారు. వీరు పేదరికంలో మగ్గుతూ ఉన్నప్పటికీ నోరు తెరచి ఇతరులను ఏమీ అడగరు.**

**ఇస్లామ్‌లో సన్యాసం లేదు.** దాయీలు చేసే ప్రయాణాల గురించి చెబుతూ, వారేదో తమ జీవితాలను ఇస్లామ్ కోసం అంకితం చేసేశారని మాయమాటలు చెబుతున్నారు. వారు ప్రయాణం చేసేది ప్రజల డబ్బుతో. వారి తినేది ప్రజల డబ్బుతో. జీతంగానూ మరియు కమీషన్ల రూపంలో పొందేది కూడా ప్రజల సొమ్మే. **కష్టపడకుండా సంపాదిస్తున్నారు.** వీరే కాదు, ఈ ప్రపంచంలో ఉద్యోగరీత్యా లేదా వ్యాపార రీత్యా భార్యా బిడ్డలను వదిలి, ప్రయాణాలు చేసేవారు చాలామందే ఉన్నారు. కాబట్టి దాయీలు మరియు కొంతమంది ఆలిమ్‌లు భార్య బిడ్డలను వదిలి ఇస్లామ్‌కి అంకితం అయిపోయారని చెప్పడం నిజం కాదు. కేవలం ఇస్లామ్ పేరుతో వ్యాపారం చేస్తూ **పేద ప్రజల కడుపు కొడుతున్నారు.**

అల్లాహ్ కోసం సహాబాల కంటే ఎక్కువగా జీవితాలను అంకితం చేసిన వాళ్ళు ఎవరున్నారు? **నిజమైన విద్వాంసుడు అడుక్కోడు. స్వయంగా సంపాదించుకోగల జ్ఞానం అతనికి ఉంటుంది.** ఇస్లామ్ అటువంటి శిక్షణ ఇచ్చింది. సల్మాన్ ఫార్సీ(రజి) వారి గురించి ఇప్పటికే చెప్పుకున్నాం.

**ఇమామ్ షాఫయి(ర)** : గురువుగారి దగ్గర చదువుకోవడానికి డబ్బులేక ఇమామ్ షాఫయి(ర)వారు స్కూలు బయట నుండే పాఠాన్ని వినేవారు. ఆయన చాలా పేదవారు. ఆయన ఆసక్తిని గమనించి గురువుగారు ఉచితంగా విద్య నేర్పారు. ఆ స్కూలు నడపడానికి గురువు గారికి ఎవరూ జకాత్ ఇవ్వలేదు. స్కూలు నడపడానికి జకాత్ తీసుకుని ఉంటే, పిల్లల దగ్గర ఆయన ఫీజు ఎందుకు తీసుకుంటారు?

ఇమామ్ షాఫయి(ర)వారు చదువు పూర్తి చేసుకుని, వ్యాపారం చేసి ఐశ్వర్యాన్ని సంపాదించారు. ఆయన ఎంతటి విద్వాంసులో పాఠకులకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయన అల్లాహ్ కోసం తన జీవితాన్ని అంకితం చేయలేదా? చిన్నతనంలో డబ్బులేక చదువుకోసం ఇబ్బందులు పడ్డారు కదా. ఆయన కూడా 'జకాత్' మదరసాలకు గాని, మదరసాలో చదివే విద్యార్థులకు ఇవ్వమని చెప్పలేదు. ఎందుకని? **ఎందుకంటే అల్లాహ్ ఆ విధంగా ఆదేశించలేదు గనుక.** విద్యను నేర్చుకోమని ప్రవక్త(స)వారు ఎంతో ఎక్కువగా ప్రోత్సహించారు. కాని వారికి జకాత్ ఇవ్వమని చెప్పలేదు. **నఫిల్ దానాలు వాటి కొరకు ఇవ్వవచ్చు.**

**ఇమామ్ బుఖారీ(ర)** : బుఖారీ(ర)వారు జ్ఞానం నేర్చుకోవడానికి ఎంతో డబ్బు ఖర్చు పెట్టారు. వ్యాపారంలో పెట్టుబడి పెట్టారు. పేద విద్యార్థులకు ధన సహాయం చేసేవారు. హదీస్ విజ్ఞానంలో నాయకుడుగా గుర్తించబడ్డారు. ఈయన తన పూర్తి జీవితాన్ని హదీస్‌ల సేకరణకు అంకితం చేశారని తెలియదా? పేద విద్యార్థులకు ధనసహాయం చేసిన ఈ మహా విద్వాంసుడు, మదరసాలకు జకాత్‌ను ఇవ్వమని **ఎందుకు చెప్పలేదు?**

మదరసాల పేరుతో సేకరిస్తున్న జకాత్ సొమ్ము ఏ విధంగా దానిని సేకరించిన వారి జేబుల్లోకి పోతుందో శాంతిబాట బయటపెట్టింది. మస్జిద్‌లు కట్టడానికిసేకరించే సొమ్ములో లక్షల కమీషన్, ప్రతీ ధార్మిక సంబంధిత పనిలో కమీషన్‌కు అలవాటు పడిపోయిన వాళ్ళు ఏ విధంగా దోచుకుంటున్నారో శాంతిబాట వెనుకటి సంచికలలో చదవండి.

## ప్రవక్త(స)వారి అనుచరులను అవమానించిన రచయితలు

పేజీ 16లో ఇలా వ్రాశారు : **పూర్తి ఖుర్'ఆన్‌లో జకాత్ సొమ్మును అల్లాహ్ మార్గంలో (పద్దుని) ముజాహిదీన్‌లకు, యుద్ధాలకు మాత్రమే వినియోగించండి అని అల్లాహ్ ఎక్కడా ఆజ్ఞాపించలేదు. ...అలాగే ప్రవక్త(స) పది సంవత్సరాల తన మదీనా జీవితంలో జకాత్‌లోని ఫీ సబీలిల్లాహ్ పద్దును ముజాహిదీన్‌లకు, హజ్జ్ చేయని పేదవారిపైనే ఖర్చు చెయ్యండి అనే ఒక్క వచనం లేదు.**

ఖుర్'ఆన్ ఆయత్ 9:60లో చెప్పిన 8 కేటగిరిలకు సంబంధించిన వ్యక్తులకు **మాత్రమే** అని స్పష్టంగా చెప్పడం జరిగింది. రచయితలు ఏ స్థాయికి బరితెగించారో పై వాక్యమే చెబుతుంది. ఒక్క హదీస్ కూడా లేదట. అన్ని హదీస్‌లను వీరు చదివేశారా? ఎక్కడా లేదా? ఎన్నివేల హదీస్‌లను వీరు అధ్యయనం చేశారో చెప్పలేదు. మొత్తం హదీస్‌లను చదవకుండా లేదని ఎలా చెప్పగలరు?

**వీరు కళంకాన్ని ప్రవక్త(స)వారికి అంటించాలని చూస్తున్నారు.**

ఫీ సబీలిల్లాహ్ అంటే ఏమిటో ఖుర్'ఆన్‌లోనే స్పష్టంగా ఉన్నప్పుడు, దానిని ప్రవక్త(స)వారి నోటినుండే విన్నప్పుడు ఇంకా ఏమి కావాలి? జకాత్‌గా అందిన ఒంటెలను ప్రవక్త(స)వారే స్వయంగా పేదవారికి అందజేయలేదా హజ్జ్ కోసం?

**సహీహ్ బుఖారీ గ్రంథంలో,** సంపుటి 2లో నున్న 24వ పుస్తకం-జకాత్. ఈ పుస్తకంలో 49వ అధ్యాయం : 'అల్లాహ్ యొక్క ప్రకటన'. సూరహ్ తౌబాలోని 60వ ఆయత్ ఈ అధ్యాయంలో ప్రస్తావించడం జరిగింది. ఈ అధ్యాయంలోని మొదటి హదీస్ (నెం. 1468)కి ముందుగా ఇబ్నె అబ్బాస్(రజి), అల్-హసన్(రజి) మరియు అబుల్ 'ఆస్(రజి) చెప్పిన ఉల్లేఖనాలున్నాయి. అవి :

(٤٩) بابُ قَوْلِ اللهِ تعالى : ﴿وَفِى الرِّقَابِ وَالْغَرِمِينَ وَفِى سَبِيلِ اللَّهِ﴾ [التوبة: ٦٠]
وَيُذْكَرُ عَنِ ابنِ عَبَّاسٍ رَضِيَ اللهُ عَنْهُما : يُعْتِقُ مِنْ زَكاةِ، وَيُعْطِي في الحَجِّ. وَقالَ الحَسَنُ : اِنِ اشْتَرى أباهُ مِنَ الزَّكاةِ جازَ، وَيُعْطي في المُجاهِدِينَ وَالَّذي لَمْ يَحُجَّ. ثُمَّ تَلا ﴿اِنَّمَا الصَّدَقَٰتُ لِلفُقَرَآءِ﴾ [التوبة : ٦٠] الآيَةَ. في أيِّها أعطَيْتَ جَزَتْ. وَقالَ النَّبيُّ ﷺ : ((اِنَّ خالِداً احْتَبَسَ أَدْرُعَهُ في سَبِيلِ اللهِ)) وَيُذْكَرُ عَنْ أبي لاسٍ: حَمَلَنا النَّبيُّ عَلى اِبِلِ الصَّدَقَةِ لِلْحَجِّ.

**ఇబ్నె అబ్బాస్**(రజి) చెప్పారు, **(బానిసల) విముక్తి కొరకు** మరియు **హజ్ చేయడానికి** (పేద ప్రజల కొరకు) ఎవరైనా (జకాత్‌ను) ఖర్చు చేయవచ్చు.

**అల్-హసన్**(రజి) చెప్పారు, ''ఒకరు తన జకాత్‌తో **తన తండ్రిని బానిసత్వం నుండి విముక్తుడిని చేయడానికి** అనుమతి ఉంది మరియు దాని (జకాత్) నుండి (అల్లాహ్ మార్గంలో పోరాడే) **ముజాహిదీన్‌లకు** మరియు **హజ్ చేయని వారికి** ఇవ్వవచ్చు. ఆ తరువాత ఆయన 9:60 ఆయత్‌ను పఠించారు. అల్-హసన్ ఇంకా ఇలా కొనసాగించారు: **"మరియు వారిలో (ఎనిమిది రకాల మనుష్యులలో) ఎవరికైనా మీరు జకాత్ ఇస్తే, మీ ప్రతిఫలాన్ని పొందుతారు. అబుల్ 'ఆస్**(రజి) చెప్పారు, **జకాత్‌గా ఇవ్వబడిన ఒంటెలపై, హజ్ చేయడానికై రసూలుల్లాహ్**(స) **మమ్మల్ని ప్రయాణింప జేశారు**''.

అంటే ఈ రచయితల ప్రకారం, ముజాహిదీన్‌లకు, హజ్జ్ చేయని పేదవారిపై ఖర్చు చేయమని ప్రవక్త(స)వారు చెప్పలేదట, అంటే ప్రవక్త(స)వారు చెప్పని పనిని సహాబాలు చేస్తారా?

పేజీ 17లో ఇలా వ్రాశారు : **ప్రవక్త(స) అనుచరులు ఇబ్నె అబ్బాస్(రజి) అల్-హసన్(రజి)గార్లు జకాత్ సొమ్ములో బానిసత్వం నుండి విముక్తిడుని చేయడానికి అనుమతి ఉంది. మరియు దాని (జకాత్) నుండి ముజాహిదీన్‌లకు మరియు హజ్జ్ చేయని పేదవారికి ఇవ్వవచ్చు అని ఫీ సబీలిల్లాహ్ చేర్చారు.**

అంటే ప్రవక్త(స)వారు చెప్పకపోయినా సరే, ''ముజాహిదీన్‌లకు మరియు హజ్జ్ చేయని పేదవారికి ఇవ్వవచ్చని'' ఇబ్నె అబ్బాస్(రజి)వారు మరియు అల్-హసన్ వారు **చేర్చారట.** లేనిదానిని చేర్చితే బిద్'అత్ అంటారు. అంటే గౌరవనీయులైన సహాబీ బిద్'అత్‌కు పాల్పడినట్లు రచయితలు ఆరోపిస్తున్నారు.

**ఇంతకంటే నీచమైన ఆరోపణ ఏమైనా ఉందా?**

స్వయంగా బిద్'అత్ పనులు చేసే వారు మాత్రమే ధర్మ పరాయణులైన సహాబాలపై అపనిందలు వేస్తారు.

ముహమ్మద్(స)వారు **సన్మార్గం పొందిన ఖలీఫాలను** అనుసరించ మన్నారు. క్రింది హదీస్ చూడండి :

ఇర్బాజ్ బిన్ సారియహ్ చెప్పగా విని అబ్దుర్రహ్మాన్ బిన్ అమ్ర్ అస్-సులమీ ఉల్లేఖించారు : అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) మా హృదయాలను కదిలించేలా ప్రసంగించారు, అది మా కళ్ళని ప్రవహించేలా మరియు హృదయాలను ద్రవించేలా చేసింది. మేము అన్నాము : ఓ రసూలుల్లాహ్(స)! ఇది వీడ్కోలు ప్రసంగం. మాపై మీరేమి ఆదేశిస్తారు? ఆయన అన్నారు : నేను మిమ్మల్ని ఓ వెలుగు (బాట)పై వదులుతున్నాను. దాని రాత్రి దాని పగలు వలే ఉంటుంది. నేను వెళ్ళిన తరువాత ఎవరూ దాని నుండి తప్పుకోరు నాశనమయ్యేవాడు తప్ప. మీలో బ్రతికి ఉన్నవారు గొప్ప ఉపద్రవాన్ని చూస్తారు. నేను మీకు గట్టిగా చెబుతున్నాను **నా సున్నత్ నుండి మీకు తెలిసిన దానిని మరియు ధర్మ పరాయణత మరియు సన్మార్గం పొందిన ఖలీఫాలను అంటిపెట్టుకుని ఉండండి.** మరియు దానిని దంతాలతో (గట్టిగా) పట్టుకోండి. మరియు మీరు తప్పనిసరిగా విధేయత చూపాలి (మీ నాయకుడు) ఓ అబిసీనియా బానిస అయినప్పటికీ. ఎందుకంటే నిజమైన విశ్వాసి ముక్కుతాడు ఉన్న ఒంటె వంటివాడు, ఎక్కడికి దానిని నడిపిస్తే, అది విధేయత చూపుతుంది.
**(ఇబ్నెమాజా, సహీహ్, 43, పుస్తకం 1, అధ్యా. 6, సంపుటి 1)**

ఉమర్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరిలో జకాత్‌ను ఎవరికి ఇచ్చారో కనీసం తెలుసుకోవాలని ఎప్పుడైనా వీరు ప్రయత్నించారా? ప్రయత్నించాలనే ఆసక్తిగాని, అధ్యయనం చేయాలనే జ్ఞానంగాని వీరికి ఎలా ఉంటాయి? ఎందుకంటే వీరు అజ్ఞానులు కదా!

నలుగురు ఇమామ్‌లు మాత్రమే కాకుండా, 6 హదీస్ గ్రంథాలను మనకు అందించిన ఇమామ్ బుఖారీ(ర), ఇమామ్ ముస్లిమ్(ర), ఇమామ్ అబూదావూద్(ర), ఇమామ్ తిర్మిజీ(ర), ఇమామ్ అన్-నసాయీ(ర) మరియు ఇమామ్ ఇబ్నెమాజా(ర) కూడా 'ఫీ సబీలిల్లాహ్' అనే కేటగిరిలో ఏ మదరసాను గాని, ధార్మిక విద్యార్థులను గాని చేర్చలేదు. అటువంటప్పుడు బిద్'అత్‌కు చెందిన దాయీలు, దావా సంస్థల గురించి ఎందుకు చెబుతారు? బిద్'అత్ చేయవద్దనే చెబుతారు!

దాదాపు 700 సంవత్సరాల క్రితం తఫ్సీర్ గ్రంథాన్ని అందించిన 'ఇబ్నె కసీర్'గారు **'ముజాహిదీన్'లకు మాత్రమే** అని చాలా స్పష్టంగా చెప్పేసారు. ఆ తరువాత కాలంలో తఫ్సీర్ గ్రంథాలను అందించిన విద్వాంసులు అదే విషయాన్ని తెలిపారు. గత 50 లేదా 60 సంవత్సరాల కాలం నుండే ఈ బిద్'అత్ మొదలైంది.

15వ పేజీలో వాళ్ళు ఓ ఖుర్'ఆన్ ఆయత్ (2:261) ప్రస్తావిస్తూ ఇచ్చిన ఉదాహరణ : **మదరసాలకు, దావా సంస్థలకు, దాయీలకు, సొసైటీలకు, జీతాల చెల్లింపు కోసం, లైబ్రరీలకు, మస్‌జిద్‌లకు, ఇస్లామ్, ఇస్లామ్ టి.వి. ఛానళ్ళకు, పబ్లిషర్స్‌కు ... చేసే ఖర్చు పై వాక్యంలో చెప్పబడినంత పుణ్యం లభిస్తుంది అని అర్థం ఉంది.**

అర్థం ఉందని చెప్పారు. అందులో వారికి అంత అర్థం కనిపించిందా? దీనికి ఆధారం ఏమిటి? దావా సంస్థల వంటి బిద్'అత్ సంస్థలు, దాయీల వంటి సోమరిపోతులు ఆనాడు లేరు కదా, ఇస్లామిక్ టి.వి. చానళ్ళు లేవు, సొసైటీలూ లేవు. మరి వీటి గురించి ఎలా వ్రాశారు? బిద్'అత్ చేసేవారిని దూరంగా ఉంచమని ప్రవక్త(స)వారు చెప్పారు. అటువంటిది **బిద్'అతీలైన దాయీలకు, దావా సంస్థలకు జకాత్ ఇవ్వమని ఎలా చెబుతారు?**

**ఇప్పుడు జకాత్‌లోని ఫీ సబీలిల్లాహ్ పద్దు అసలు ఉద్దేశ్యాన్ని తెలుసుకునే ప్రయత్నం చేద్దాం. అల్లాహ్ విధించిన 8 పద్దుల్లో 7 పద్దుల వారికి అవసరాలు ఉంటే వారికి ఆర్థిక సాయం అందించి ఫీ సబీలిల్లాహ్ పద్దు నుంచి మన జిల్లాలో రోడ్లు వేసే అవసరం ఉంటే ఒక సంవత్సరం రోడ్లు వెయ్యవచ్చు. ఇంకో సంవత్సరం పచ్చదనం తగ్గితే చెట్లు నాటవచ్చు. మరో సంవత్సరం నీటి అవసరానికి బావులు తవ్వవచ్చు. ప్రక్క జిల్లాలలో వేరే అవసరాలు ఉంటే అందులో ఖర్చు చెయ్యవచ్చు.** (పేజీ 18)

జకాత్ సొమ్ముతో ఈ విధంగా చేయమని ప్రవక్త(స)వారి వచనం ఏదైనా మీకు కనిపించిందా? జకాత్ సొమ్ముతో ఏమేమి చేయాలో అల్లాహ్ మరియు ఆయన సందేశహరుడు **చెప్పని విషయాలను** రచయితలు తమ అజ్ఞానంతో వాటిని చేర్చి చేయవచ్చని చెప్పారు.

మామూలు దానాలు (నఫిల్ సదఖా) ఉపయోగించి పై పనులు అవసరమనుకుంటే చేయవచ్చు. వ్యక్తులకు (individuals) మాత్రమే జకాత్ ఇస్తారు.

అర్థించే పేదవానికి, అడగని పేదవానికి, బానిస విముక్తికి, జకాత్ సేకరించిన వ్యక్తికి, ముజాహిదీన్‌కి, హజ్జ్ చేసేవానికి, అప్పుల పాలైన వానికి, ప్రయాణంలో ధనం పోగొట్టుకున్న ప్రయాణీకునికి ..... ఈ విధంగా వ్యక్తులకి మాత్రమే ఇవ్వబడుతుంది గాని, సంస్థలకు కాదు. అంతేకాకుండా ఎనిమిదింటిలో, ఏడింటి అవసరాలకు నిజంగా డబ్బు ఖర్చుపెడితే, **ఇంకా ఏమి మిగులుతుంది?** మన దేశంలో, మన రాష్ట్రంలో పేదరికం ఏ స్థాయిలో ఉందో తెలియదా? ఏడింటి అవసరాల వరకూ ఎందుకు, మొదటి రెండింటికే డబ్బులు అందడం లేదు.

**పేదవారి హక్కులను పేదవారికి ఇవ్వాలి**

పేజీ 20లో వ్రాశారు : **అల్లాహ్, ఆయన ప్రవక్త ముహమ్మద్(స) విధించని హద్దులను విధిస్తున్నారు. మేమే ఇస్లామ్ మేధావులమని ప్రజలలో ఉపద్రవాలు సృష్టిస్తున్నారు. ఇది మంచి పద్ధతి కాదు.**

- అల్లాహ్ ఆదేశించినవారికి మాత్రమే జకాత్ ఇవ్వమని చెప్పడం మంచి పద్ధతి కాదా?
- సహాబీలు అనుసరించిన విధానం మంచి పద్ధతి కాదా?
- సన్మార్గం పొందిన ఖలీఫా అయిన ఉమర్(రజి)వారి విధానం మంచి పద్ధతి కాదా?

మేము పేదవారి హక్కులను వారికి ఇవ్వమని ముస్లిములను కోరాము. ఇస్లామ్‌కి వ్యతిరేకంగా ఏమీ కోరలేదు. కాని ఇస్లామ్‌కి వ్యతిరేకంగా పనిచేసే దాయీలు, అల్లాహ్ ఆదేశించినట్లు పేదలకు ఇవ్వకుండా, తమ జేబులను మాత్రమే నింప మంటున్నారు.

ఉదాహరణకు ఓ పదికోట్ల రూపాయల సొమ్ము జకాత్‌గా సేకరించ బడితే, దానిలో 5వేల రూపాయలో లేక పదివేల రూపాయలు మాత్రమే పేదవారికి వెళతాయి గాని మిగతా సొమ్ము అంతా కొందరు స్వార్థపరులే దోచేసుకుంటున్నారు. ఆ కొద్ది డబ్బు అయినా పేదలకు ఇస్తారనేది కూడా సందేహమే!

**అప్పులపాలైన వ్యక్తికి జకాత్ ద్వారా సహాయం చేయడం మీరెప్పుడైనా చూశారా?** అది అల్లాహ్ ఆజ్ఞ. అటువంటి వ్యక్తులకు అల్లాహ్ ఇవ్వమన్నారు. కాని వీరు ఇవ్వరు. నేడు బానిసలు లేరు గనుక, ఆ కేటగిరిలో ఎవరికీ చెల్లించ నవసరం లేదు. అదే విధంగా ముజాహిదీన్‌లు లేకపోతే, 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరిలో ఇవ్వనవసరం లేదు.

ఉపద్రవాలు సృష్టించే అసలు వ్యక్తులు ఎవరు? **పాఠకులే నిర్ణయించు కోవాలి.**

వేరే ధర్మం వారితో రహస్యంగా డిబేట్‌లు ఏర్పాటు చేసుకుని, డబ్బు కోసం ఇస్లామ్‌కి ద్రోహం చేయడానికి ప్రయత్నించేది **ఎవరు?** కలిసి ఉండే ముస్లిములను చీలికలుగా చేసి జమాత్‌ల మధ్య విద్వేషాన్ని రెచ్చగొట్టేది మరియు గొడవలకు కారకులు ఎవరు?

ముస్లిమ్ సమాజాన్ని నాశనం చేయాలనే సంకల్పంతో, పేదవారి డబ్బును స్వార్ధపరులకు దోచిపెట్టే సంకల్పంతో మాత్రమే రచయితలు ఆ పుస్తకాన్ని వ్రాశారు. అందుకోసం ధర్మపరాయణులైన సహాబాలను కూడా అవమానించారు. అల్లాహ్ ఆదేశాన్ని వక్రీకరిస్తున్నారు.

**మేము మేధావులమని ఏనాడూ చెప్పలేదు**

శాంతిబాట కేవలం అల్లాహ్ అనుగ్రహంతో మాత్రమే నడిచే పత్రిక. మా పేర్లకు ముందుగాని, వెనుకగాని మా డిగ్రీలు ఉంటాయే తప్ప బిరుదులేమీ ఉండవు. లక్షలు, కోట్ల రూపాయల ప్రజా సొమ్మును ప్రోగ్రామ్‌ల పేరుతో ఖర్చు పెడుతూ, వాటి కోసం ప్రచురించే పాంప్లెట్స్‌పై, వాల్ పోస్టర్లపై 'బిద్అత్ దాయీల' పేర్లకు మరియు 'ఆలిమ్‌ల' పేర్లకు ముందూ వెనుకా ఎటువంటి బిరుదులున్నాయో గమనిస్తే ఎవరికైనా తెలుస్తుంది, **ఎవరూ మేధావులుగా భావించుకుంటూ మేకతోలు కప్పుకుంటున్నారో!**

ఉదాహరణకు బిలాల్ గారి వంటి సహాబీ కోసం చెప్పేటప్పుడు, **'బిలాల్(రజి)'** అని మాత్రమే చెబుతారు. ఎటువంటి బిరుదును ఆయన పేరు ముందు తగిలించరు. మరి ఈ దాయీలకు గాని, ఆలిమ్‌లకు గాని బిరుదులు ఎందుకు? వీరు సహాబాల కాలిగోటితో పోల్చడానికైనా కనీస అర్హత కలిగి ఉన్నారా?

ఈ దాయీలని పొగుడుతూ ప్రోగ్రామ్స్‌లలో మాట్లాడటం వినగానే వెంటనే అటువంటి వ్యక్తి ముఖం మీద మట్టి కొట్టాలి సున్నత్ ప్రకారంగా. సకల పొగడ్తలన్నీ కేవలం అల్లాహ్ కొరకే!

మాకు ఇస్లామ్ పట్ల అవగాహన ఉంది. మంచి నియ్యత్ ఉంది. మాలో ఏ ఒక్కరూ అడుక్కోరు. ఒకరి ముందు చేయి చాచరు. కేవలం అల్లాహ్ ముందు మాత్రమే చేయి చాపుతారు. అల్లాహ్ మాకిచ్చిన గొప్ప టైటిల్ **'ముస్లిమ్'** అనే పదం. తన సృష్టికర్త 'అల్లాహ్' అని తెలుసుకుని, ఆయనకు మరియు ఆయన సందేశహరునికి విధేయత చూపాలని తెలుసుకుని తదనుగుణంగా ఆచరించే వారెవరైనా సరే మేధావే! ఆ మేధావే ముస్లిమ్. ప్రత్యేకంగా మేధావి అని భావించనవసరం లేదు మరియు చెప్పుకోనవసరం లేదు.

**మేము చెప్పే ప్రతీ విషయానికి ఆధారాలు చూపాము :**

> పేజీ 20లో వ్రాశారు : **ఖుర్'ఆన్, హదీస్‌లలో దీనికన్న మంచి ఆధారాలు ఉంటే, ప్రజలకు తెలియపరచాలి. అప్పుడు ముస్లిమ్ సమాజం మొత్తం దాని మీదే నడుద్దాం. ఇన్షా అల్లాహ్.**

దీనికన్న మంచి ఆధారాలు అంటే ఏమిటి? వీరు తమ పుస్తకంలో ఒక్క ఆధారం కూడా చూపలేదు. **ఒక్క హదీస్ గ్రంథం పేరుగాని, ఒక్క హదీస్ నంబర్‌గాని సూచించ లేదు.** మా ఆధారాలన్నింటిని శాంతిబాట ద్వారా చాలా స్పష్టంగా తెలియజేశాము. తొలిసారిగా తెలుగులో ఆధారాలన్నింటిని చూపింది కేవలం శాంతిబాట మాత్రమే.

వీరికి అసలు కళ్ళు ఉన్నాయా? అని సందేహం వస్తుంది. ఎందుకంటే జకాత్‌పై మేము అందించిన 4 వ్యాసాలలో 26 ప్రామాణిక హదీస్‌లను ఆధారంగా చూపాము. మేము చెప్పిన ప్రతీ విషయానికి హదీస్ ఆధారాన్ని తెలియజేశాము. తఫ్సీర్ గ్రంథాల రిఫరెన్స్‌లను ఇవ్వడమే కాకుండా ఆ గ్రంథాలనుండి ఆ పేజీలను స్కాన్ చేసి మరీ ప్రచురించాము. **వీరి మానసిక ఆరోగ్యం బావుండలేదేమో!**

మేము అధ్యయనం చేసిన హదీస్‌లు 709.

| గ్రంథం పేరు | హదీస్‌లు | పుస్తకం | అధ్యాయాలు | సంపుటి |
|---|---|---|---|---|
| 1. **సహీహ్ బుఖారీ** | 118 | 24 | 78 | 2 |
| 2. **సహీహ్ ముస్లిమ్** | 232 | 12 | 55 | 3 |
| 3. **అబూదావూద్** | స. 59<br>హ. 45 | 9 | 46 | 2 |
| 4. **తిర్మిదీ** | స. 30<br>హ. 16 | 5 | 38 | 2 |
| 5. **నసాయీ** | స. 130<br>హ. 33 | 23 | 100 | 3 |
| 6. **ఇబ్నెమాజా** | స. 26<br>హ. 20 | 8 | 28 | 3 |

**స.** - సహీహ్ (strong) **హ.** - హసన్ (good)

మరియు ఆధారాలుగా చూపిన హదీస్‌లు - 26.

**సహీహ్ ముస్లిమ్** 2393, 2408, 2405, 2433, 2436, 2439, 2290, 2396, **సునన్ అబూదావూద్** 1558, 1662, 1625, 1627, 1633, 1634, 1563, 1565, 1644, 1645, 1648, 1649, **సునన్ అన్ నసాయీ** 2480, 2488, 2481, **సహీహ్ బుఖారీ** 1483, 1479, **జామి అత్-తిర్మిజీ** 655

ప్రజలు మా ఆధారాలను అంగీకరించారు కనుకనే, వీరి జేబులు పూర్తిగా నిండటం లేదు. అందుకే 'జకాత్' పేరుతో ఒక పుస్తకాన్ని ప్రచురించే స్థాయికి దిగజారారు.

**కాలానుగుణంగా మార్చుకునే ఓ ఖాళీ ఆప్షనా?**

> పేజీ 19లో వ్రాశారు : **కాలానికి, ప్రాంతానికి, అవసరానికి అనుగుణంగా ఖర్చు చేసుకునే ఒక ఖాళీ ఆప్షన్ ఫీ సబీలిల్లాహ్. అల్లాహ్ ముస్లిమ్ సమాజానికి వదిలివేశాడు. ఈ విధంగా 8 పద్దుల్లోనే అవసరమైన అన్ని సదుపాయాలు, ఇస్లాం ఉన్నతికి ఖర్చు చేసుకోవచ్చు. అల్‌హందు లిల్లాహ్.**

ఖుర్'ఆన్‌లో అల్లాహుతాలా ఇలా చెబుతున్నారు :

> **"నిశ్చయంగా, మేమే ఈ ఖుర్'ఆన్‌ను, అవతరింపజేసినవారము మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడే వారం."** (ఖుర్'ఆన్ 15:9)

ప్రళయం వరకూ ఖుర్'ఆన్ ఎటువంటి మార్పులకూ, చేర్పులకూ గురి కాదు. అది అన్ని కాలాలకు అన్ని ప్రాంతాలకు ప్రళయం వరకూ

సరిపోతుంది. 'ఫీ సబీలిల్లాహ్' అనే కేటగిరి ఎవరికోసమో స్పష్టంగా 43 ఆయత్‌ల ద్వారా ఖుర్'ఆన్ గ్రంథమే తెలియజేస్తుంటే, దానిని వీరు కాలానుగుణంగా మారుస్తారట.

ఒక్క ఆయత్‌లో ఆదేశించినా సరే ప్రతి ముస్లిమ్ ఆ ఆయత్‌పట్ల విధేయత చూపాలి. షైతాన్ తిరస్కరించినట్లు తిరస్కరించ కూడదు. అటువంటిది 43 ఆయత్‌లను తిరస్కరించారు వీళ్ళు.

**అల్లాహ్ రక్షణలో ఉన్నదానిని వీరు మారుస్తారా? ఈ పుస్తకం చదివిన ముస్లిమ్‌ల స్పందన ఏమిటి? పుస్తకం ప్రచురించబడి ఎన్నో నెలలైనా సరే, ఈ రాష్ట్రంలోని జమాత్‌ల నాయకులు ఇవేమీ పట్టించుకోరా? ఇస్లామ్‌కి కనీస గౌరవం కూడా ఈ నాయకులు ఇవ్వడం లేదని స్పష్టంగా అర్థమౌతుంది. చెడును నిరోధించవలసిన నాయకులే స్వయంగా చెడును ప్రోత్సహిస్తున్నారు.**

అల్లాహ్ పట్ల వీరికి కొంచెం కూడా భయం లేదు. ముస్లిమ్ సమాజానికి వదిలేశానని అల్లాహ్ చెప్పారా? **నిర్ణయించ వలసింది అల్లాహ్‌యే గాని, ముస్లిమ్ సమాజం కాదు.**

నాయకుల సంగతి పక్కన పెట్టండి. **ఈ పుస్తకం చదివిన సామాన్య ప్రజానీకం ఏం చేస్తుంది?** అల్లాహ్‌పై ఆవగింజంత విశ్వాసమైనా మీ మనసుల్లో లేదా?

**సల్మాన్ రష్దీ, తస్లీమా నస్రీన్ వ్రాతను ఖండించిన వాళ్ళు, ఈ ఆంధ్రా రష్దీల వ్రాతలను ఎలా ప్రోత్సహించగలుగుతున్నారు? ఎందుకు ఖండించ లేరు? మన భారతదేశ చట్టం మనకు ఎన్నో హక్కులను కలిగించింది.**

ఆ జమాత్‌పై ఈ జమాత్, ఈ జమాత్‌పై ఆ జమాత్ బురద చల్లు కోవడానికి, కొట్టుకోవడానికి, తిట్టుకోవడానికి మాత్రం ముందుంటారు. ఇస్లామ్‌కి వ్యతిరేకంగా వ్రాసేవారిని కొట్టనవసరం లేదు మరియు తిట్ట నవసరం లేదు. అటువంటివి ఆపడానికి శాంతియుతంగా **మనదేశ రాజ్యాంగ పరిధిలో ఎందుకు ప్రయత్నించరు?**

మేము చెప్పిన ప్రతీ విషయానికి మా దగ్గర ఆధారాలున్నాయి. ప్రజల దగ్గరకు ఇప్పటికే అవి చేరిపోయాయి కూడా. మేము చెప్పినది తప్పు అని చెప్పడానికి ఇప్పటి వరకూ ఏ విద్వాంసుడి దగ్గరగాని, విద్వాంసులుగా స్వయంగా భ్రమపడేవారి దగ్గరగాని లేవు.

2010వ సంవత్సరం రమదాన్ నెల నుండి 'శాంతిబాట'పై విషం కక్కుతున్న దాయీలుగాని, ఆలిమ్‌లుగాని ఏ ఒక్క హదీస్ ఆధారాన్ని కూడా ఈనాటి వరకూ చూపలేకపోయారు. ఇన్షా అల్లాహ్ చూపలేరు. మేము 709 హదీస్‌లను అధ్యయనం చేశాము. ఆ ఆలిమ్‌లలో ఏ ఒక్కరైన మేము అధ్యయనం చేసిన హదీస్‌లలో కనీసం సగం హదీస్‌లైనా చదివారా? సగం హదీస్‌లైనా చదివి ఉంటే, వారిలో కొందరైనా అల్లాహ్‌కి భయపడి ఉండేవారేమో!

'దాయీ'లు డబ్బుకు కక్కుర్తిపడి నోటికొచ్చింది చెప్పి ఉండవచ్చు. కనీసం 'ఆలిమ్'లుగా చెప్పుకు తిరిగే వారికైనా అల్లాహ్ అంటే భయం లేదా?

ధక్షిణ భారతదేశంలో పేరున్న మదరసాలలో ఒకటైన ఒక మదరసాకి చెందిన ఆలిమ్ లందరికీ 'శాంతిబాట'లో చెప్పిన విషయం తెలుసు. మేము వ్రాసిన విషయాలు తప్పు అని ఇంతవరకూ ఎవరూ చెప్పలేకపోయారు. మేము వ్రాసింది వాస్తవమని బహిరంగంగా ఒప్పుకునేటంత ధైర్యం ప్రస్తుతం వారికి లేదు.

అల్లాహ్‌కు భయపడటానికి బదులు, మనుషులకు భయపడేవారు ఆలిమ్‌లైతే ఏమిటి? కాకపోతే ఏమిటి? వారు చదువుకున్న చదువు వృధా. చెడును నిరోధించడానికి బదులు, ఆ చెడును నిరోధించడానికి ప్రయత్నించే వారికి వ్యతిరేకంగా పనిచేస్తున్నారు. ప్రజలకు వాస్తవాన్ని ఎందుకు చెప్పడం లేదు? అల్లాహ్ నుండి శిక్షను ఆహ్వానిస్తున్నారా?

**మనవి**

అల్లాహ్‌పై కాస్తయినా విశ్వాసమున్న ముస్లిమ్ సోదరులకు మేము చెప్పేది ఒక్కటే. గుడ్డిగా ఎవ్వరినీ నమ్మవద్దు. ఖుర్'ఆన్ మరియు హదీస్‌లను మాత్రమే నమ్మండి. మేము అందించిన హదీస్‌లను మీరు చదివి, ఆ అనువాదాన్ని ఒరిజనల్ అరబీతో చెక్ చేసుకుని ధృవీకరించుకోండి. అవి వాస్తవమని తెలిసాక కూడా ఎవరైనా వాటిని తిరస్కరిస్తే, పశ్చాత్తాపపడి అల్లాహ్ క్షమాపణను వేడుకోకముందే వారి మరణం సంభవిస్తే, ఆ మరణం సత్యతిరస్కార (కాఫిర్) మరణం అవుతుంది. ఇదే సంచికలో 23వ పేజీ చూడండి.

కష్టాలు మనల్ని పరీక్షించడానికి రావచ్చు లేదా మనపై శిక్షగానూ రావచ్చు. అల్లాహ్ నుండి శిక్షను ఆహ్వానించవద్దు. కరువులు, వరదలు శిక్షగా వచ్చిన ఉదాహరణలు చరిత్రలో ఎన్నో ఉన్నాయి.

**ఇస్లామ్‌పై వ్యతిరేక వ్రాతలు ముష్రిక్‌లు వ్రాసినా, కాఫిర్లు వ్రాసినా, మునాఫిక్‌లు వ్రాసినా మా శక్తిమేర మేము ఖండిస్తాము. తప్పుడు ప్రచారం చేసే నేటి దాయీలకు మరియు ఆలిమ్‌లకు జకాత్ డబ్బు ఇచ్చి పోషించే ప్రతీ ఒక్కరూ ఆ పాపభారాన్ని మోయక తప్పదు. ఆలోచించుకోండి!**

"అల్లాహ్‌కు మా లెక్క మేము చెప్పుకుంటాం. అడిగే హక్కు మీకుందా" అని అడగవచ్చు. అడిగే హక్కు మాకుంది. మాకే కాదు, ప్రతీ ముస్లిమ్‌కీ ఉంది. **ఎందుకంటే జకాత్ పేదప్రజల హక్కు.** ఇది మొత్తం సమాజానికి సంబంధించినది.

- సాధారణంగా ఈ దాయీలందరూ చెబుతుంటారు, షిర్క్ చేసేవారి వెనుక సలాత్ (నమాజ్)చేస్తే అది స్వీకరించబడదు అని. అసలు షిర్క్ అంటే ఏమిటో వీరికి తెలుసా?
- ఖుర్'ఆన్ ఆయత్‌లను తిరస్కరించే దాయీల వెనుక సలాత్ చేస్తే అది స్వీకరించబడుతుందా?
- మునాఫిక్ (కపట విశ్వాసి) వెనుక సలాత్ చేస్తే అది స్వీకరించ బడుతుందా?
- పేద ప్రజల హక్కును దోచుకునేవారి వెనుక సలాత్ చేస్తే అది స్వీకరించ బడుతుందా?

సలాత్ (నమాజ్) విధానాలలోని స్వల్ప తేడాలను చాలా పెద్దవిగా చూపించి, వివిధ జమాత్‌ల మధ్య చిచ్చు రగిలించి వినోదాన్ని చూస్తున్నారు. సున్నత్‌కి వ్యతిరేకంగా వీరు చేస్తున్న పనుల వలన, మస్‌జిద్‌లకు వచ్చేవారి సంఖ్య తగ్గిపోయింది. ముస్లిముల ఐక్యతను పాడుచేస్తున్నారు.

ఎవరి నమాజ్ స్వీకరించబడుతుందో ఎవరిది స్వీకరించబడదో చెప్పలేరు. మంచి నియ్యత్‌తో మస్‌జిద్‌కు వెళ్ళండి. మీ నమాజ్ స్వీకరించబడాలని అల్లాహ్‌ను వేడుకోండి. మీ సలాత్ స్వీకరించబడే విధంగా మీ పరిస్థితులను మార్చగలిగేది ఆయనే! **ఎవరెన్ని రకాలుగా చెప్పినా, మస్‌జిద్‌లకు వెళ్ళడం మానుకోవద్దు. నమాజ్ విధానాల్లో చిన్న చిన్న తేడాలున్నా, నమాజ్ చేసేవారందరూ సోదరులే. ఒకరితో మరొకరు సౌమ్యంగా సున్నత్ ప్రకారం ప్రవర్తించాలి.**

ప్రస్తుతం మన సమాజంలో కేన్సర్ కణాల్లా వ్యాప్తి చెందుతున్న 'దావా వ్యవస్థ'ను సమూలంగా సమాజం నుండి పూర్తిగా తొలగించాలి. అప్పుడే ప్రజలకు మేలు జరుగుతుంది.

**'దావా' అనేది ప్రతి ముస్లిముపై నున్న బాధ్యత. ఏ విధంగా సలాత్(నమాజ్) ముస్లిముపై బాధ్యతగా ఉందో అదే విధంగా దావా కూడా ప్రతీ ముస్లిమ్‌పైనున్న బాధ్యత. ముస్లిమ్ అంటేనే మంచిని బోధించేవాడు మరియు చెడును నిరోధించేవాడు.**

మన సలాత్(నమాజ్)లు మనమే చేసుకోవాలి. మన దావా మనమే చేసుకోవాలి. అవి చేయడానికి **మనకు బ్రోకర్ల అవసరం లేదు.** మనకు ఆకలి వేసినప్పుడు వాళ్ళు భోజనం చేస్తే, మన కడుపు నిండుతుందా?

కాబట్టి మనలో ప్రతీ ఒక్కరూ మంచిని తెలుసుకుని బోధించే విధంగానూ, మరియు చెడును నిరోధించే విధంగానూ, ఇన్షా అల్లాహ్ ప్రయత్నించాలి.

**చాలామంది ముస్లిములు ఇలా చెబుతున్నారు** : మాకు ఇస్లామ్ గురించి చెప్పే జ్ఞానం లేదు. అందుకనే దాయీలపై ఆధారపడ్డాము అంటున్నారు. అల్లాహ్ మీ సృష్టికర్త అని మీకు తెలుసు. ముహమ్మద్(స)వారు అల్లాహ్ పంపిన ప్రవక్త అని తెలుసు. అబద్ధం మాట్లాడకూడదని, త్రాగుడు నిషేధమని, వ్యభిచారం నిషేధమని, పొరుగువానికి సహాయం చేయాలని, కుటుంబం పట్ల మంచిగా మసలుకోవాలని, ఇతరులకు హాని కలిగించేదానిని తొలగించాలని తెలుసు కదా!

మీకు తెలిసిన ఆ విషయాలనే ఆచరిస్తూ చెప్పండి. **అదే దావా.** తోటివారిని చిరునవ్వుతో పలకరించండి. ఇదంతా అల్లాహ్ మార్గమే. మీ నియ్యత్ బాగుంటే అల్లాహ్‌యే మీకు జ్ఞానాన్ని ఇస్తారు. ఎవరికైనా జ్ఞానం ఇచ్చేది అల్లాహ్‌యే.

మంచి చెడూ తెలుసుకోవడానికి ఖుర్'ఆన్ అర్థం చేసుకుంటూ చదవండి.. 'అల్లాహ్' పేరును తెలుగు అనువాదంలో కొందరు తీసివేసారు. అటువంటి అనువాద ఖుర్'ఆన్‌ను గాని లేదా ఖుర్'ఆన్ వాక్యాలను వక్రీకరించిన తెలుగు అనువాద ఖుర్'ఆన్‌నుగాని తీసుకోవద్దు. అల్లాహ్ పేరును కలిగి ఉండి, సాధ్యమైనంత వరకూ అరబీ వాక్యాల అర్థానికి దగ్గరగా ఉండే తెలుగు ఖుర్'ఆన్ చదవండి.

## బైతుల్ మాల్ ఎప్పుడు ప్రారంభించబడింది?

జకాత్ పుస్తకంలో 16వ పేజీలో వ్రాయబడిన మరొక అసత్యం

**ప్రవక్త(స) బైతుల్‌మాల్ నుండి యుద్ధ సామాగ్రి మరియు యుద్ధానికి అవసరమయ్యే ఏర్పాట్లను చేసేవారు. బైతుల్‌మాల్‌లో జకాత్ సొమ్ముతో పాటు సాధారణ దానాలు కూడా ఉండేవి.**

ప్రవక్త(స)వారు పాల్గొన్న చిట్టచివరి గజ్వా 'తబూక్'. దాని గురించి ఇప్పటికే చెప్పుకున్నాం. మదీనాలో అప్పుడు కరువు నెలకొని ఉంది. ప్రయాణం దాదాపు 1000 కిలోమీటర్లు. వారు ఆ దండయాత్రకి చాలీ చాలని ఆహారపదార్థాలతోనే బయలుదేరారు.

బైతుల్‌మాల్ ఉండి ఉంటే, అందులో యుద్ధ సామాగ్రి ఉంటే, ప్రవక్త(స)వారు ఈ దండయాత్ర కోసం దానంగా ఇవ్వమని తన ప్రజలను ఎందుకు కోరుతారు? ఇవ్వడానికి ఏ వాహనం లేదని ప్రవక్త(స)వారు చెప్పడం వల్లనే కదా, కొందరు కన్నీరు కార్చుతూ తిరిగిపోయారని ఖుర్'ఆన్‌లో స్పష్టంగా చెప్పడం జరిగింది. (చూడండి 9:92)

ప్రవక్త(స)వారి కాలంలో లభించిన సొత్తును ఎప్పటికప్పుడు పంచివేసేవారు. ఏదీ దాచి ఉంచేవారు కాదు. అబూబక్ర్ సిద్దీఖ్(రజి) వారు ఖలీఫాగా ఉన్న కాలంలో కూడా ఎప్పుడు అందిన సొమ్మును అప్పుడే పంచివేసేవారు. ఇబ్నె సాద్‌గారు చెప్పినదానిని బట్టి అబూ బక్ర్ సిద్దీఖ్(రజి)వారు 'బైతుల్ మాల్'ను నిర్దేశించినప్పటికీ, అది ఎల్లప్పుడూ మూసి ఉండేది. ఏదైనా సంపద అందగానే దానిని వెంటనే పంచి వేసేవారు. పంచివేయగా మిగిలినది దాచే పరిస్థితి ఏర్పడలేదు. ఆయన మరణించాక, బైతుల్‌మాల్‌లో లభించినది కేవలం ఒకే ఒక్క దిర్హమ్.

ఉమర్(రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో ప్రారంభంలో ప్రజలకు అదేవిధంగా పంచేవారు. కాని తరువాత తరువాత ముస్లిమ్ సామ్రాజ్యం విస్తరించే కొద్దీ, ఎన్నో ప్రాంతాల నుండి పన్నుల రూపంలో, చాలా సంపద మదీనా చేరడంతో, సహచరులతో చర్చించి ఉమర్(రజి)వారు బైతుల్‌మాల్ కోసం ఓ బిల్డింగ్‌ను కట్టించారు.

హిజ్రీ శకం 15వ సంవత్సరంలో ఉమర్(రజి)వారు బహ్‌రైన్‌కు అబూహురైరా(రజి)వారిని గవర్నర్‌గా నియమించారు. సంవత్సరం చివరిలో ఆయన అక్కడి నుండి సేకరించిన భూమి శిస్తు 5 లక్షల దిర్హములు మదీనాకు తీసుకు వచ్చారు. అప్పుడు ఉమర్(రజి)వారు తన సహచరులను సంప్రదించారు. అలీ(రజి)వారు ఏ సంవత్సరం వచ్చిన సంపదను ఆ సంవత్సరమే పంచాలని అభిప్రాయపడ్డారు. అయితే మిగిలిన సహచరులు బైతుల్‌మాల్ ఏర్పాటుకోసం, అందులో ఎకౌంట్స్ కూడా వ్రాత పూర్వకంగా ఉండాలని సూచించారు.

ఉమర్(రజి)వారు భవనాల నిర్మాణంలో పొదుపు పాటించేవారు. కాని బైతుల్‌మాల్‌ను మాత్రం చాలా ధృడంగా నిర్మించారు. బైతుల్‌మాల్ ఏర్పాటు మరియు దానిలో సంపదను దాచడం అనేది, ఉమర్(రజి)వారు

ఖలీఫాగా ఉన్నకాలంలోనే జరిగింది. అబ్దుల్లాహ్ బిన్ అర్ఖామ్(రజి)వారిని తొలి అధికారిగా నియమించారు. మరియు ఆయనకు సహాయకులుగా మరికొందరిని నియమించారు. కేవలం మదీనాలోనే కాకుండా వివిధ ప్రాంతాల ముఖ్యపట్టణాలలో కూడా బైతుల్‌మాల్ నిర్మింపజేశారు.

బైతుల్‌మాల్‌లో జకాత్‌తో పాటు, సాధారణ దానాలు ఉండేవని వ్రాశారు. బైతుల్‌మాల్‌లో అవి మాత్రమే కాదు, వివిధ పన్నుల రూపంలో వసూలైన సొమ్ము కూడా ఉంటుంది. కాని **జకాత్‌కు ప్రత్యేకమైన ఎకౌంట్ ఉంటుంది.** ఎందుకంటే జకాత్‌ను అల్లాహ్ ఆదేశించినవారికి తప్ప ఇతరత్రా ఖర్చుపెట్టకూడదు కనుక. అంతేకాకుండా, సేకరించిన జకాత్‌ను ముందుగా అక్కడి పేద ప్రజలకు పంచివేయడం ముహమ్మద్(స)వారి కాలం నుండే ఆచరణలో ఉంది. జకాత్‌ను తీసుకునే పేదవారెవరూ లేనప్పుడే అది బైతుల్‌మాల్‌కు చేరుతుంది. కొన్ని ఉల్లేఖనాల ద్వారా మనకు స్పష్టంగా తెలిసింది ఏమిటంటే, జకాత్‌గా లభించిన ఒంటెలు ఉండేవి. హజ్జ్ చేసే పేదవారికి వాటిపై ముహమ్మద్(స)వారు ప్రయాణింపజేసేవారు. పేదవారికి హజ్జ్ విధి కాదు. నిజమే! కాని ముహమ్మద్(స)వారు చేశారు కాబట్టి హజ్జ్ చేయాలను కునేవారికి సహాయం చేయవచ్చు. ప్రవక్త(స)వారి అనుచరులు కూడా అదే చేశారు.

**'జకాత్' అనే పుస్తకాన్ని వ్రాసిన రచయితలు ఇస్లామీయ చరిత్రపై కనీస అవగాహన కూడా లేకుండా వారికి అనుగుణంగా వారికి తోచినట్లు వ్రాసేసి, ప్రజలకు అసత్యాన్ని చెబుతున్నారు.**

**ముహమ్మద్(స)వారిపై ఘోరమైన అపనిందలు వేస్తూ, వేరే మత ధర్మం వారితో కలిసి ఓ మునాఫిక్ పన్నిన పన్నాగం గురించి, శాంతిబాట ఓ పుస్తకాన్ని ప్రచురించి, ముహమ్మద్(స)వారి మహోన్నతను చాటి చెప్పింది. ఆ వ్యక్తిపై ఒక జమాత్ వారు కొందరి సంతకాలతో కూడిన ప్రత్యేక సర్క్యులర్ విడుదల చేశారు ఆ జమాత్‌కు చెందిన అన్ని మస్‌జిద్‌లలో ప్రదర్శించడానికి. కాని అది జరగలేదు. కారణమేమిటి? ప్రవక్త(స)వారిని అవమానించిన వారిపై పుస్తకాలు వ్రాయకుండా, ప్రవక్త(స)వారిని ప్రేమించే వారిపై పుస్తకం వ్రాయడాన్ని బట్టి మునాఫిక్‌లు ఎంత ఐక్యతతో పనిచేస్తున్నారో, వారి కుట్రలు ఏమిటో స్పష్టమౌతున్నాయి. ఇప్పటికైనా జాగ్రత్త పడండి!**

**FORM IV**

*Statement about ownership and other particulars of SAANTHIBAATA Monthly (Telugu)*

1. Place of publication : D.No. 2-8-31, Kota Bazar, SAMALKOT-533440
East Godavari District, Andhra Pradesh

2. Periodicity of its publication : Monthly

3. Printer's Name : Md. ATHAHARULLAH
Nationality : Indian
Address : D.No. 4-1-6, Kota Bazar, Samalkot-533440
East Godavari District, Andhra Pradesh

4. Publisher's Name : Md. ATHAHARULLAH
Nationality : Indian
Address : D.No. 4-1-6, Kota Bazar, Samalkot-533440
East Godavari District, Andhra Pradesh

5. Editor's Name : Md. ATHAHARULLAH
Nationality : Indian
Address : D.No. 4-1-6, Kota Bazar, Samalkot-533440
East Godavari District, Andhra Pradesh

6. Names and addresses of individuals who own the newspaper and partners or shareholders holding More than one per cent of the total capital. : VELUGUBAATA EDUCATIONAL SOCIETY
(Regd. No. 569/2008)
D.No. 2-8-31, Kota Bazar, SAMALKOT-533440
East Godavari District, Andhra Pradesh

I, Md. Athaharullah, hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Date: 29th February, 2012
Samalkot

Sd/-
Md. ATHAHARULLAH
Publisher

**ముఖ్య గమనిక**

**ఈ వ్యాసంలో మేము చర్చించినది అంతా 'జకాత్' సొమ్ము విషయం గురించి మాత్రమే. ఎందుకంటే అది పేదప్రజల హక్కు కాబట్టి. ఇతర దానాలు, చందాలు ఏ పని కోసమైనా ఖర్చుపెట్టుకోవచ్చు. మంచికి ఖర్చు చేస్తే పుణ్యం లభిస్తుంది. బిద్'అత్ మార్గంలో ఖర్చు చేస్తే అల్లాహ్‌కు సమాధానం చెప్పుకోవలసి ఉంటుంది.**

ابنُ عبّاس

# ఇబ్నె అబ్బాస్ (రజి)

**అల్-హబ్ర్ వల్-బహ్ర్**

- **ఈ ఉమ్మత్ యొక్క విద్వాంసుడు**
- **ఖుర్'ఆన్ తఫ్సీర్ విద్వాంసుడు**
- **a scholar of this ummah**
- **a scholar of Quranic exegesis (Tafsir)**

ముహమ్మద్(స)వారి చిన్నాన్నగారి పేరు అబ్బాస్(రజి). అబ్బాస్(రజి) వారి కుమారుడే ఇబ్నె అబ్బాస్. (ఇబ్నె అబ్బాస్ అంటే అర్థం అబ్బాస్ గారి కుమారుడు). ఆయన పేరు 'అబ్దుల్లాహ్'. కాబట్టి ఆయన పూర్తి పేరు : అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్.

ఈయనను అల్-హబ్ర్ వల్-బహ్ర్ అంటారు. అంటే **జ్ఞాని మరియు సముద్రం.** సహాబాలు ఈయనను ప్రత్యేకంగా గౌరవించేవారు.

ఇబ్నె అబ్బాస్(రజి)వారి మాతృమూర్తి గారి పేరు ఉమ్మేల్ ఫజ్ల్ లుబాబహ్ బిన్త్ అల్-హారిస్(రజి). ఈమె ఇస్లామ్ స్వీకరించిన మహిళలలో రెండవవారు. ఈమె తన భర్త కంటే ముందే ఇస్లామ్ స్వీకరించారు. ప్రవక్త(స)వారి భార్యలలో ఒకరైన మైమూనా(రజి)వారు ఇబ్నె అబ్బాస్(రజి) వారి తల్లిగారికి సోదరి వరుస అవుతారు.

మక్కాలో ముస్లిములను హింసించడమే కాకుండా, ముహమ్మద్(స) వారి వంశమైన బనీ హాషిమ్ వంశస్థులను వెలివేశారు. ఆ వంశం వారంతా 3 సంవత్సరాలపాటు 'అబూ తాలిబ్ లోయలో' చాలా కష్టాలు అనుభవించారు. ఎందుకంటే వారితో మిగతా ప్రజలకు అన్ని రకాల సంబంధాలు తెగిపోయాయి. తీవ్రమైన ఆకలి బాధను అనుభవించారు. ఈ వంశంలో ముస్లిములతో పాటు అవిశ్వాసులు కూడా ఉన్నారు. చెట్ల ఆకులను తినవలసిన దుస్థితి ఏర్పడింది.

వారిలో ఇబ్నె అబ్బాస్(రజి)వారి తల్లిదండ్రులు కూడా ఉన్నారు. అప్పటికి ఇబ్నె అబ్బాస్ వారు తల్లి గర్భంలో ఉన్నారు.

ముహమ్మద్(స)వారు ఓ శుభవార్త వినిపించారు. ఈ విషయాన్ని ఇబ్నె అబ్బాస్(రజి)వారే స్వయంగా ఉల్లేఖించారు : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) లోయలో ఉన్నప్పుడు, నా తండ్రిగారు ఆయన(స) దగ్గరికి వచ్చి చెప్పారు : "ఓ ముహమ్మద్! ఉమ్మె ఫజ్ల్ గర్భవతి అని తెలుసుకున్నాను." ఆయన(స) చెప్పారు : **"బహుశా అల్లాహ్ ఇక్కడ మన ముఖాలు ఓ పిల్లవానితో ప్రకాశింపజేస్తారు."**

కష్టాలలో ఉన్నవారి మధ్య ఆశ జనించింది. ప్రవక్త(స)వారు 'మీ ముఖాలను ప్రకాశవంతం చేస్తాడు' అనలేదు. **'మన ముఖాలను ప్రకాశవంతం చేస్తాడు'** అని అన్నారు. కాబట్టి ఈయన ముస్లిములందరికీ శుభమే.

ఉమ్మె ఫజ్ల్(రజి) గర్భవతి కావడంతో ఆమె కష్టం ఇతరుల కంటే రెట్టింపు అయింది. ఒకవైపు ఆకలి బాధ. ఆమెకు ఓదార్పుగా ప్రవక్త(స)వారి భార్యయైన ఖదీజా(రజి)వారుండేవారు. అక్కడున్న వారికి రహస్యంగా ఎప్పుడైనా అందే ఆహారం నుండి ఖదీజా(రజి) ఆమెతో పంచుకునేవారు. ఇబ్నె అబ్బాస్(రజి) జన్మించే సమయం దగ్గరపడింది.

ఇబ్నె అబ్బాస్(రజి)వారు జన్మించాక, ఆయన తండ్రి ఆ బిడ్డను తీసుకుని ప్రవక్త(స)వారి వద్దకు వచ్చారు. ముహమ్మద్(స)వారు ఆ బిడ్డను తీసుకుని ఆ బిడ్డకోసం తన లాలాజలంతో **తహ్నీక్** చేసారు. (తహ్నీక్ అంటే ఖర్జూరాన్ని నమిలి బిడ్డ నోటిపై భాగంపై అద్దడం). ఆ బిడ్డ తొలి ఆహారమే ప్రవక్త(స)వారి లాలాజలం.

అందుకేనేమో ఇబ్నె అబ్బాస్(రజి)వారి నోరు సుందరమైన ఖుర్'ఆన్ పఠనాన్ని మరియు వివేకాన్ని పలుకగలిగింది.

మదీనాకు చేసిన హిజ్రత్‌కు 3 సంవత్సరాల ముందు ఈయన జన్మించారు. ముహమ్మద్(స)వారు మరణించే సమయానికి ఈయన వయస్సు 13 సంవత్సరాలు. ఇబ్నె అబ్బాస్(రజి)వారు భారీగా, అందంగా ఉండేవారు. ఆయన కూర్చుంటే ఇద్దరు కూర్చునేటంత జాగా పట్టేది.

ముజాహిద్ చెప్పారు : (అప్పటికి) మాకు తెలియదు ఎవరికోసమైనా రసూలుల్లాహ్(స)వారు తన లాలాజలంతో తహ్నీక్ చేశారని. బహుశా ఈయనే తొలి అదృష్టవంతుడు కావచ్చు.

సకలలోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స)వారి లాలాజలం, తల్లి గర్భం నుండి బయటకి వచ్చిన ఇబ్నె అబ్బాస్(రజి)వారికి తొలి ఆహారం అయింది. ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పారు : "మేము లోయలో ఉండగా మదీనాకు వలస వెళ్ళడానికి 3 సంవత్సరాల ముందుగా నేను పుట్టాను. మరియు నాకు 13 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మరణించారు." (అల్-బిదాయా వల్ నిహాయా)

ఇబ్నె అబ్బాస్(రజి)వారు తన తల్లిగారితో చిన్నతనంలోనే మదీనా వలస వెళ్ళిపోయారు. ఇబ్నె అబ్బాస్(రజి)వారు చాలా లేత వయస్సులో మదీనాకు వలస వచ్చినప్పటికీ ఆయన గురించి సీరత్ పుస్తకాల్లో ముహాజిరీన్‌లలో ఒకరిగా చెబుతారు.

ముహమ్మద్(స)వారు పిల్లలను చాలా ప్రేమగా చూసేవారు. ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఎక్కువగా ప్రవక్త(స)వారితోనే ఉండేవారు. ఒక విధంగా చెప్పాలంటే ఆయనను వదిలేవారు కాదు. ప్రవక్త(స)వారు ఇంటి దగ్గర ఉన్నా లేక ప్రయాణంలో ఉన్నా, మస్జిద్‌లో ఉన్నా, సహచరులతో సమావేశంలో ఉన్నాసరే ఇబ్నె అబ్బాస్‌గారు ఆయన(స)తోనే ఉండేవారు. ముహమ్మద్(స) వారంటే ఆయనకు ఎనలేని ప్రేమ. అంతేకాకుండా జ్ఞానాన్ని ప్రత్యక్షంగా ఆయన నుండే నేర్చుకోవాలనే కోరిక ఆయనది.

ముహమ్మద్(స)వారితో ఉన్న ఈ సాన్నిహిత్యమే ఆయన వ్యక్తిత్వం ఓ రూపుదిద్దు కోవడంలో మరియు ఆయన జ్ఞానంపైనా అపారమైన ప్రభావాన్ని చూపింది. ప్రత్యేకంగా ఈ సాన్నిహిత్యం తన తల్లిగారి

సోదరియైన మైమూనా(రజి)వారి ఇంటిలో ఎక్కువగా గడపటం వలన కూడా ఏర్పడింది.

## చిన్నతనంలోనే గొప్ప వివేకం

"నేను రాత్రి చివరి భాగంలో అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారి వద్దకు వచ్చాను మరియు నేను ఆయన(స)వెనుక సలాత్ చేశాను కాని ఆయన నా చేయి పట్టుకుని నన్ను ముందరకు లాగారు, నేను ఆయన ప్రక్కనుండేలా. కాని రసూలుల్లాహ్(స)వారు సలాత్ ప్రారంభించగానే నేను వెనక్కి వెళ్ళిపోయాను. రసూలుల్లాహ్(స)వారు సలాత్ చేశారు, తరువాత ప్రార్థన ముగిశాక అన్నారు : "నీకేమైంది? నేను నిన్ను నా ప్రక్కనుంచాను మరియు నీవు వెళ్ళిపోయావు?" నేను అన్నాను, **"ఓ రసూలల్లాహ్! ఎవరికైతే సర్వశక్తిమంతుడూ, సర్వాధికారియైన అల్లాహ్ (సందేశం) ఇచ్చారో వారి ప్రక్కన నిలుచుని ఎవరైనా సలాత్ చేయడం తగునా?"**

నా సమాధానం ఆయనను సంతోషింపజేసింది. మరియు ఆయన(స) అల్లాహ్‌కు దుఆ చేశారు, **నాలో జ్ఞానాన్ని మరియు వివేకాన్ని పెంచమని.** ......." (అల్ బిదాయా వన్ నిహాయా)

ఇబ్నె అబ్బాస్(రజి)వారి నుండి స'ఈద్ బిన్ జుబైర్ ఉల్లేఖించారు : "నేను ఒక రాత్రి మా పిన్నమ్మ మైమూనా(రజి)వారి ఇంట్లో ఉన్నాను మరియు నేను కొంత నీరు (వుదూ కోసం) ప్రవక్త(స)వారి కోసం సిద్ధం చేసి ఉంచాను. ఆయన(స) అడిగారు : "దీనిని ఎవరు ఉంచారు?" వారు చెప్పారు : "అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్". ఆయన(స) అన్నారు : **"ఓ అల్లాహ్! అతనికి (ఖుర్'ఆన్) భావాన్ని బోధించండి మరియు ధర్మావగాహనను అతనికి అనుగ్రహించండి."**

ఉమర్(రజి)వారు ఒకసారి అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి)వారిని పిలిచి మరియు ఆయనను దగ్గరగా తీసుకుని చెప్పారు : "నేను చూశాను, అల్లాహ్ యొక్క సందేశహరులు(స) ఒకరోజు నిన్ను పిలిచారు మరియు ఆయన నీ తలను నిమిరి మరియు లాలాజలాన్ని నీ నోటిలో వేసి చెప్పారు : **'ఓ అల్లాహ్! ఇతనిని అనుగ్రహించండి మరియు ఈయన నుండి జ్ఞానాన్ని వ్యాప్తి చేయండి'."**

జిబ్రాయిల్(అ)వారిని ఇబ్నె అబ్బాస్(రజి)వారు ప్రత్యక్షంగా చూశారు. అల్ బిదాయా వన్ నిహాయా (సంపుటి 8)లో ఇచ్చిన ఉల్లేఖనాన్ని బట్టి ముహమ్మద్(స)వారు అబ్బాస్(రజి)వారితో చెప్పారు : **"ఆయన జిబ్రాయిల్(అ) మరియు నీ కుమారుడు తన దృష్టి పోయేవరకూ మరియు అతనికి జ్ఞానం ఇవ్వబడేవరకూ చనిపోడు."**

## సాటిలేని విద్వాంసుడు

వాస్తవానికి ఇబ్నె అబ్బాస్(రజి)వారు సాటిలేని విద్వాంసుడు అని చెప్పాలి. అది ముహమ్మద్(స)వారి యొక్క దు'ఆ ఫలితం. అపారమైన జ్ఞానం ఆయనది.

ప్రముఖ సహాబాలు సైతం ఆయన జ్ఞానాన్ని మరియు విద్వాంసులలో ఆయనకు ఉన్న ఉన్నత స్థానాన్ని గుర్తించారు.

తావూస్‌గారికి ఇలా చెప్పబడింది : "నేను రసూలుల్లాహ్(స)వారి ప్రముఖ సహచరులను వదిలి ఈ కుర్రవాని (ఇబ్నె అబ్బాస్‌గారి) సహచర్యంలో ఉండేవాడిని." ఆయన చెప్పారు : **"నేను చూశాను 70మంది రసూలుల్లాహ్(స)వారి సహచరులను, వారు ఏదైనా ఒక విషయంలో అంగీకారానికి రాకపోతే, వారు ఇబ్నె అబ్బాస్(రజి)వారి మాటలవైపు మరలేవారు."**

విశ్వాసుల నాయకుడైన ఉమర్(రజి)వారు కష్టమైన కేసులను ఎదుర్కొన్నప్పుడు, ఇబ్నె అబ్బాస్(రజి)వారికి చెప్పేవారు : "మేము కష్టమైన కేసులతో ఎదుర్కోబడ్డాము, బహుశా నీవు వాటిని మరియు అటువంటి వాటిని పరిష్కరించగలవు." తరువాత ఆయన అతని అభిప్రాయం ప్రకారం చేసేవారు మరియు ఆయన దాని కొరకు మరి ఎవరినీ పిలిచేవారు కాదు."

ఉబైదుల్లాహ్ బిన్ అబ్దుల్లాహ్ బిన్ ఉత్బా చెప్పారు : "అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారి హదీస్‌లకు సంబంధించి ఈయన కలిగి ఉన్న జ్ఞానం కంటే ఎక్కువ జ్ఞానం గలవారిని (నేను చూడలేదు) లేక అబూబక్ర్(రజి), ఉమర్(రజి) మరియు ఉస్మాన్(రజి)వారి తీర్పులకు సంబంధించి ఎక్కువ జ్ఞానం గలవారిని లేక చట్టపరమైన అభిప్రాయాలను వెలువరించడంలో ఈయనను దాటిపోయిన వారిని నేను చూడలేదు."

హసన్‌గారు చెప్పారు, ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఖుర్'ఆన్ అవతరణ పరిస్థితుల గురించి జ్ఞానం కలిగి ఉన్నారు మరియు ఉమర్(రజి)వారు చెబుతుండేవారు. **"గొప్ప మానసిక పరిపక్వత గల అబ్బాయి ఇతడు, అతడు తెలుసుకోవాలనే కోరికగల నాలుకను మరియు అర్థం చేసుకోగల హృదయాన్ని కలిగి ఉన్నాడు."**

## ఖుర్'ఆన్ ఆయత్‌లకు వివరణ (తఫ్సీర్)

సర్వోన్నతుడైన అల్లాహ్ మాటలు : "***వాస్తవానికి భూమ్యాకాశాలు కలుసుకుని ఉండేవనీ అయితే మేము వాటిని పగులగొట్టి వేరు చేశామని*** (ఖుర్'ఆన్ 21:30)" గురించి ఇబ్నె ఉమర్(రజి)వారిని ఓ వ్యక్తి అడిగాడు మరియు ఆయన చెప్పారు: 'ఆ గురువు (షేక్) దగ్గరికి వెళ్ళి అడుగు మరియు తరువాత వచ్చి నాకు తెలియజెయ్యి.' కాబట్టి అతడు **ఇబ్నె అబ్బాస్**(రజి)వారి దగ్గరకు వెళ్ళి అడిగాడు మరియు ఆయన చెప్పారు: "ఆకాశాలు కలిసి ఉండేవి మరియు అవి ఎటువంటి వర్షాన్ని ఇవ్వలేదు మరియు భూమి కలిసిఉండేది మరియు ఏదీ మొలకెత్తించలేదు, తరువాత మొదటిది వర్షంచే చీలిపోయింది మరియు తరువాతది మొక్కలచే చీలిపోయింది. ఆ వ్యక్తి వెనక్కి వచ్చి ఇబ్నె ఉమర్(రజి)వారికి ఆయన ఏమి చెప్పారో తెలియజేసి అన్నాడు : **"నిశ్చయంగా, ఇబ్నె అబ్బాస్(రజి)వారికి ఖచ్చితమైన జ్ఞానం ఇవ్వబడింది."**

ఇబ్నె అబ్బాస్(రజి)వారు చెప్పారు : ఉమర్(రజి)వారు (తన) సమావేశాలలో హాజరవడానికి బద్ర్ యుద్ధంలో పాల్గొన్నవారికి అనుమతినిచ్చేవారు మరియు వారితోపాటు వెళ్ళడానికి నన్ను అనుమతించేవారు మరియు వారిలో కొందరు అన్నారు : "మీరు ఈ

కుర్రవాడిని అనుమతించారు, మరి మా పిల్లలలోని ఇటువంటి వారో?'' ఆయన అన్నారు : "ఇతడు మీకు తెలిసిన వారి నుండే". కాబట్టి ఒకరోజు, ఆయన వారికి (అంటే వారి పిల్లలకు కూడా) అనుమతి నిచ్చారు మరియు వారితోపాటు నాకు కూడా అనుమతి నిచ్చారు మరియు ఆయన వారిని ఈ సూరహ్ గురించి అడిగారు :

**"ఎప్పుడైతే అల్లాహ్ సహాయం వస్తుందో మరియు విజయం. మరియు నీవు ప్రజలను గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించడం చూస్తావో. అప్పుడు నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడు మరియు ఆయన క్షమాభిక్షను అర్థించు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు.** (110:1-3)''

వారు చెప్పారు : "సర్వశక్తివంతుడూ మరియు సర్వాధికారీ అయిన అల్లాహ్ తన ప్రవక్తను ఆదేశించారు ఆయన (అల్లాహ్) అతనికి విజయాన్ని అనుగ్రహించినప్పుడు క్షమాపణ కొరకు మరియు పశ్చాత్తాపాన్ని వేడుకోవడానికి.'' ఉమర్(రజి) అన్నారు, **"నీవేమి చెబుతావు, ఓ ఇబ్నె అబ్బాస్!"** నేను అన్నాను, "అది అలా కాదు, బదులుగా, ఆయన(అల్లాహ్) ప్రవక్త(స)వారికి మరణం సమీపిస్తున్న విషయాన్ని తెలియజేశారు. మరియు ఆయన చెప్పిన '**ఎప్పుడైతే అల్లాహ్ సహాయం వస్తుందో మరియు విజయం**' అంటే మక్కా విజయం. '**మరియు నీవు ప్రజలను గుంపులు గుంపులుగా అల్లాహ్ ధర్మంలో ప్రవేశించడం చూస్తావో**' *అంటే ఆ సమయంలో రాబోవు నీ మరణాన్ని ప్రకటించడం.* కాబట్టి "**అప్పుడు నీవు నీ ప్రభువు స్తోత్రంతోపాటు ఆయన పవిత్రతను కొనియాడు మరియు ఆయన క్షమాభిక్షను అర్థించు. నిశ్చయంగా, ఆయనే పశ్చాత్తాపాన్ని అంగీకరించేవాడు.**''

## జ్ఞానం కోసం అవిశ్రాంత కృషి

ప్రవక్త(స)వారి కాలంలో ముహమ్మద్(స)వారిని ఆయన నీడలా అనుసరించేవారు మరియు ప్రతీ మాట మరియు ఆచరణ కోసం ప్రవక్త(స)వారిని అడుగుతూ ఉండేవారు. ముహమ్మద్(స)వారి మరణం తరువాత, ఇబ్నె అబ్బాస్(రజి)వారు సహాబాలను అడిగేవారు మరియు ఆయన ప్రశ్నించడాన్ని కొనసాగించారు.

ఉబైదుల్లాహ్ బిన్ అలీ బిన్ అబీ రాఫె ఉల్లేఖించారు : ఇబ్నె అబ్బాస్ (రజి)వారు అబూ రాఫె దగ్గరకు వచ్చి అడిగేవారు ఫలానా ఫలానా రోజు ప్రవక్త(స)వారు ఏమి చేశారు? మరియు ఇబ్నె అబ్బాస్(రజి)తో ఒక వ్యక్తి ఉండేవారు ఆయన చెప్పింది ఆ వ్యక్తి వ్రాసేవాడు.

ఒకసారి ఒక హదీస్ గురించి ఆయన సహాబాలను అడిగితే, ఆ హదీస్ గురించి తెలిపే వ్యక్తి వివరాలు చెప్పారు. "కాబట్టి నేను అతని ఇంటికి వెళ్ళాను మరియు అతడు తన ఇంటిలో జుహ్ర్ సమయంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. కాబట్టి నేను అక్కడ క్రింద కూర్చున్నాను. మరియు అతడు బయటకు వచ్చి, నన్ను చూచి అన్నాడు : 'ఓ రసూలల్లాహ్(స)వారి సోదరుడా! మిమ్మల్ని ఇక్కడకు ఏది తీసుకు వచ్చింది? మీరు కబురు పంపితే, నేనే వచ్చేవాడిని.' నేను అన్నాను: '**నేను మీ దగ్గరకు రావడమే చాలా యుక్తమైనది, ఎందుకంటే నేను మిమ్మల్ని ఓ హదీస్ గురించి అడగాలి**'.''

చాలా నెమ్మదస్తుడాయన. అల్లాహ్ నిషేధించినవాటిని ఉల్లంఘిస్తే తప్ప ఎన్నడూ కోపగించుకునేవారు కాదు, ఆయన సంస్కారం గొప్ప స్థాయిలో ఉండేది, కారణం చిన్నతనం నుండి ప్రవక్త(స)వారితో ఉన్నారు గనుక.

## యుద్ధాలలో పాల్గొనడం

జ్ఞానాన్ని పొందడం, రాత్రుళ్ళు ప్రార్థనలలో నిలవడం, పగలు ఉపవాసం ఉండటం మరియు జీవనోపాధి కోసం కష్టపడటం మొదలైనవేమీ కూడా ఈ గొప్ప సహాబీని అల్లాహ్ మార్గంలో పోరాడటం నుండి నిరోధించ లేదు మరియు అల్లాహ్ యొక్క ధర్మాన్ని కాపాడు కోవడం నుండి మరియు శతృవులతో పోరాటం నుండి నిరోధించలేదు.

ఈ విధంగా సహాబాలు తమ ధర్మాన్ని అర్థం చేసుకున్నారు మరియు ఈ విధంగా ముహమ్మద్(స)వారు తన అనుచరులకు శిక్షణ నిచ్చారు. వారు రాత్రుళ్ళు ప్రార్థనలో గడపగలరు మరియు పగలు సైనికులుగా పోరాడగలరు.

ఆయన ఎన్నో యుద్ధాలలో పాల్గొన్నారు. అల్లాహ్ మార్గంలో పోరాడారు.

## ఆరాధన

ఆ విధంగా ఇబ్నె అబ్బాస్(రజి)వారి యొక్క ఒక రకమైన ఆరాధన మరో రకమైన ఆరాధనను నివారించ లేదు. అబ్దుల్లాహ్ బిన్ అబీ ములైకహ్ చెప్పారు : నేను ఇబ్నె అబ్బాస్(రజి)వారితో మక్కానుండి మదీనా వరకూ (ప్రయాణంలో) తోడుగా ఉన్నాను. మరియు ఎక్కడైనా ఆగినప్పుడు, ఆయన సగం రాత్రి నిలబడేవారు (ఖుర్ఆన్) పఠిస్తూ మరియు అల్లాహ్‌ను ఎక్కువగా కీర్తిస్తూ.''

తావూస్ చెబుతుండేవారు : " నేను ఎవరినీ చూడలేదు సర్వశక్తి వంతుడూ మరియు సర్వాధికారియైన అల్లాహ్ యొక్క పవిత్ర ఆదేశాలను ఇబ్నె అబ్బాస్ గారి కంటే ఎక్కువగా గౌరవించేవాన్ని. **అల్లాహ్ సాక్షి, నేనెప్పుడైనా ఏడవాలని అనుకుంటే, నేను ఆయనను జ్ఞాపకం చేసుకునే వాడిని**, నేను అలా చేయగలిగేవాడిని.''

సమ్మాక్ ఉల్లేఖనం. ఇబ్నె అబ్బాస్(రజి)వారి కంటిలోని నీరు ఇంకి పోయింది (కన్నీటి నాళాలు పొడిగా అయిపోయాయి) మరియు ఆయన తన దృష్టిని కోల్పోయారు, అయితే కంటిని బాగుచేసి తిరిగి నీరు ప్రవహించేలా చేయగలిగేవారు ఆయన దగ్గరకి వచ్చి చెప్పారు : "మీ కంటి సమస్యను మాకు వదిలేయండి, కాని మీరు 5 రోజుల పాటు సలాత్ చేయకుండా ఉండాలి.'' ఆయన అన్నారు : **"లేదు, అల్లాహ్ సాక్షి, నేను ఒక్క రకాత్‌ను కూడా వదలను,** ఎవరైతే ఉద్దేశ్య పూర్వకంగా ఒక్క సలాత్‌ని వదిలేసినా, అతడు సర్వశక్తి వంతుడూ మరియు సర్వాధికారియైన అల్లాహ్‌ను కలుస్తాడు మరియు ఆయన అతనితో కోపంగా ఉంటారని నాకు తెలియజేయబడింది.''

ముస్లిముల మధ్య బంధాన్ని బలోపేతం చేయని ఏ ఆచరణనైనా ఆయన లోపంగానే భావించేవారు. మరియు అది సహృదయంతో చేయకపోయినా మరియు పేదలు మరియు అభాగ్యుల పట్ల దయ

చూపనిది అయితే లోపంగా భావించేవారు. ఆయన చెప్పారు : ''ఓ ముస్లిమ్ కుటుంబ సభ్యులకు ఒక నెలపాటు లేక ఒక వారంపాటు లేదా అల్లాహ్‌కు ఇష్టపడినన్ని రోజులు ఆహారాన్ని సమకూరిస్తే అది నాకు ఎంతో ప్రియమైనది హజ్జ్ తరువాత హజ్జ్ చేసేదానికంటే.''

ఆయన కలిగి ఉన్న జ్ఞానం గురించి మరియు ఆయన నడవడిక గురించి అందరూ చాలా బాగా చెప్పేవారు. సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి) చెప్పారు : ''**ఇబ్నె అబ్బాస్ గారి కంటే గొప్ప వివేకం, నిశితమైన మేథస్సు, గొప్ప జ్ఞానం, మిక్కిలి నెమ్మదితనం కలిగి ఉన్నవారిని ఎవ్వరినీ నేను చూడలేదు**''.

అతా చెప్పారు : ''నేను ఇబ్నె అబ్బాస్(రజి)వారి సమావేశం కంటే మిక్కిలి ఘనమైనది చూడలేదు లేక (ధర్మాన్ని గురించి) బాగా అర్థం చేసుకున్నవారితో లేక ఎక్కువ భక్తి ప్రేరణను కలిగించే వారితో (సమావేశం కంటే). **ఖుర్'ఆన్ విద్వాంసులు ఆయనను అడుగు తుండేవారు. అరబీ భాషా పండితులు అడుగుతుండేవారు, కవులు ఆయనను అడుగుతుండేవారు మరియు వారంతా విశాలమైన (జ్ఞాని) నది నుండి తీసుకునేవారు.**

## రోమ్ రాజు అడిగిన 8 ప్రశ్నలు మరియు వాటికి ఇబ్నె అబ్బాస్(రజి)వారి జవాబులు

రోమ్ రాజు ము'ఆవియా(రజి)వారిని 8 ప్రశ్నలు అడిగారు : ము'ఆవియా(రజి)వారు ఇబ్నె అబ్బాస్(రజి)వారికి వాటి గురించి లేఖ వ్రాశారు. ఇబ్నె అబ్బాస్(రజి)వారు వాటికి సమాధానాలు వ్రాసి పంపారు. ఆ జవాబులను రోమ్ రాజు చదివి, చాలా ప్రభావితుడై చెప్పాడు : ''అల్లాహ్ సాక్షి, ఇది ము'ఆవియా నుండి కాదు, ఆయన మాటల నుండి కాదు, ఇది కేవలం ప్రవక్త(స)వారి కుటుంబం నుండే వచ్చింది.''

**1. అల్లాహుతాలాకు బాగా నచ్చిన ప్రసంగం ఏమిటి?**

జ. ''సుబహానల్లాహి వల్-హమ్దు లిల్లాహి, వలా ఇలాహ ఇల్లల్లాహు వల్లాహు అక్బర్, వలా హౌలా వలా ఖువ్వత ఇల్లా బిల్లాహ్'' (ఘనత అల్లాహ్‌కే, సకల పొగడ్తలు మరియు కృతజ్ఞతలు అల్లాహ్ కొరకే, ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప. అల్లాహ్ గొప్పవాడు. శక్తి లేదు మరియు బలం లేదు అల్లాహ్‌లో తప్ప)

**2. అల్లాహుతాలా సమక్షంలో బాగా గౌరవనీయుడైన దాసుడు ఎవరు?**

జ. దాసులలో బాగా గౌరవనీయుడైన దాసుడు ఆదమ్(అ). అతనిని అల్లాహ్ తన చేతితో సృష్టించాడు. అతనిలో ఆయన తన ఆత్మను ఊదాడు. ఆయన తన దూతలను అతని ముందు సజ్దా చేయించాడు. మరియు ఆయన అతనికి అన్ని వస్తువుల పేర్లు నేర్పాడు.

**3. అల్లాహుతాలా సమక్షంలో బాగా గౌరవనీయమైన దాసురాలు ఎవరు?**

జ. మర్యమ్(అ), ఇమ్రాన్ గారి కుమార్తె.

**4. ఆత్మలను నాలుగు కలిగి ఉన్నాయి, కాని అవి గర్భం నుండి బయటకు రాలేదు.**

జ. 1. ఆదమ్(అ) 2. హవ్వా(అ) 3.మూసా(అ)వారి చేతికర్ర (అది పాముగా మారింది) మరియు 4. ఇబ్రాహీమ్(అ)వారి గొఱ్ఱెపిల్ల (ఇస్మాయీల్(అ)వారికి బదులుగా జిబహ్ చేయబడింది. దానిని జిబ్రాయీల్(అ) తీసుకువచ్చారు). (మరొక వెర్షన్‌లో ఇలా చెప్ప బడింది) సాలిహ్(అ)వారి ఆడ ఒంటె.

**5. సమాధి తనలోని వ్యక్తితో కదిలింది.**

జ. తిమింగలం. ఇది యూనుస్(అ)వారిని మింగింది.

**6. భూమిపై ఒక ప్రదేశం అక్కడ సూర్యుడు ఒక్కసారే ఉదయించాడు.** (అంటే సూర్యునికి చూపబడిన భూభాగం)

జ. మూసా(అ)వారు కర్రతో కొట్టినప్పుడు సముద్రం రెండుగా చీలి బనీ ఇస్రాయీల్ దాటిపోవడానికి మార్గమిచ్చింది. అప్పుడు బయటపడిన సముద్రపు అడుగుభాగం.

**7. ఇంద్ర ధనుస్సు మరియు ఏమిటది.**

జ. భూమిపై నివశించువారు మునిగిపోకుండా రక్షణ

**8. అల్-మజర్రహ్**

జ. స్వర్గంలో ఒక ద్వారం

ఉమర్(రజి)వారు కొంతమంది ముహాజిరీన్ సహచరులతో కూర్చుని ఉన్నప్పుడు లైలతుల్ ఖద్ర్ గురించి కొందరు ప్రస్తావించారు. వారిలో కొందరు దాని గురించి విన్న ఓ విషయం చెప్పారు మరియు దానిని ప్రజలు అంగీకరించలేదు. ఉమర్(రజి)వారు ఇబ్నె అబ్బాస్(రజి) వారిని అడిగారు. ఆయన చాలా చక్కగా వివరించారు. ఈ విషయాన్ని రమదాన్ ప్రత్యేక సంచికలో అందిస్తాము, ఇన్షా అల్లాహ్.

ఉమర్(రజి)వారు బాగా ప్రభావితమై చెప్పారు : ''నేను రసూలుల్లాహ్(స)వారి దగ్గర నుండి విన్న దానిని ఏ ఒక్కరూ ధృవీకరించ లేదు. ఈ అబ్బాయి తప్ప ఇతడి మెదడులోని ఎముకలు ఇంకనూ దగ్గరగా కలవాల్సి ఉంది (అంటే ఇబ్నె అబ్బాస్ గారి వయస్సు తక్కువని అర్థం చేసుకోవాలి)''.

ఇబ్నె అబ్బాస్(రజి)వారు 71 సంవత్సరాలు జీవించారు. ఆయన తన జీవితాన్ని అల్లాహ్‌కు అంకితం చేశారు. ఆయన జీవితం ముస్లిమ్ సమాజానికి ఓ అనుగ్రహం. ఆయన ఖుర్'ఆన్ గ్రంథానికి తఫ్సీర్ వ్రాశారు.

ఆయన తాయిఫ్ నగరంలో హిజ్రీ శకం 68లో మరణించారు. మైమూన్ బిన్ మిహ్రాన్ చెప్పారు : నేను తాయిఫ్‌లో అబ్దుల్లాహ్ బిన్ అబ్బాస్(రజి) జనాజాకు హాజరయ్యాను. మరియు అతని శరీరాన్ని జనాజా సలాత్ కొరకు ఉంచినప్పుడు, ఒక తెల్లటి పక్షి వచ్చింది మరియు కఫన్‌పై వ్రాలి లోపలికి వెళ్ళింది. వారు దాని కోసం చూశారుగాని అది దొరకలేదు మరియు ప్రజలు జనాజా సలాత్ కొరకు వరుసలలో నిలుచున్నప్పుడు ఓ కంఠస్వరం వినిపించింది. మేము దానిని వినగలిగాము. కాని మేము చూడలేకపోయాము. (మరియు ఇలా చెప్పబడింది) **''ఓ తృప్తినొందిన ఆత్మా! నీ ప్రభువు సన్నిధికి మరలి రా! ఆనందిస్తూ మరియు ప్రియమైన దానివై! నీవు నా దాసులలో చేరిపో! మరియు నీవు నా స్వర్గంలో ప్రవేశించు!''** (ఖుర్'ఆన్ 89:27-30)

ఇబ్నె హనఫియ్యా చెప్పారు : "ఈ రోజు ఈ జాతి యొక్క జ్ఞాని మరణించారు". జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి)కి ఇబ్నె అబ్బాస్(రజి)వారి మరణం గురించి తెలిపినప్పుడు, ఆయన అన్నారు, **"ప్రజలలో ఎక్కువ జ్ఞానం కలవాడు మరియు ఎంతో నెమ్మదస్తుడు మరణించాడు మరియు ఆ విధంగా ఈ జాతి దుర్ఘటనచే కష్టాలపాలైంది. దీని నుండి తేరుకోలేదు."**

**ఈ మహావిద్వాంసుడి తఫ్సీర్‌ని అందరూ గౌరవించి ప్రామాణికంగా తీసుకున్నారు. మన రాష్ట్రంలోని కొందరు రషీదులు తప్ప.**

ఇబ్నె అబ్బాస్(రజి)వారు ఎటువంటి జ్ఞానం గలవారో పాఠకులకు ఇప్పుడు స్పష్టంగా అర్థమై ఉంటుంది. ప్రవక్త(స)వారి దు'ఆ ఫలితమే ఈ సహాబాకు అనుగ్రహించబడిన 'జ్ఞానం.' అందరు సహాబాలు ఈయన మాటలతో ఏకీభవించేవారు.

ఉమర్(రజి)వంటి అమీరుల్ మోమినీన్ ఇబ్నె అబ్బాస్(రజి)వారి విషయంలో ఏమాత్రం సందేహించేవారు కాదు. ఇంత గొప్ప జ్ఞాని వ్రాసిన తఫ్సీర్ నుండి మరియు ఆయన ఉల్లేఖనాల నుండి 'ఫీ సబీలిల్లాహ్' (అల్లాహ్ మార్గంలో) అంటే 'ముజాహిదీన్'లకి మాత్రమే జకాత్ చెల్లించాలి అని 'శాంతిబాట' ప్రచురించింది.

ఆ నిజాన్ని భరించలేని 'జకాత్' పుస్తక రచయితలు ఆ మహాజ్ఞానిని 'బిద్అతీ'గా చిత్రీకరించారు. **ఈ రచయితల గురించి దీని ముందరి వ్యాసమైన "జ్ఞానం-అజ్ఞానం" లో వివరించాము.** ఒక సహాబీ గురించి చెప్పేటప్పుడు, ఆయన విశిష్ఠత ఏమిటో తెలుసుకోవాలి. ఇబ్నె అబ్బాస్(రజి)వారే 'చేర్చారు' అని, ఇతర తఫ్సీర్ గ్రంథకర్తలు 'కలిపేశారు' అని వారికి ఇష్టం వచ్చినట్లు వ్రాసేశారు.

ఈ మహా విద్వాంసుడిని ఆ విధంగా ఫీ సబీలిల్లాహ్‌లో 'చేర్చారు' అంటూ ఆయనను బిద్'ఆతీగా అవమానించారు - 'జకాత్' అనే పుస్తకాన్ని వ్రాసిన రచయితలు.

ఖుర్'ఆన్‌లో 'ఫీ సబీలిల్లాహ్' అంటే ఏమిటో అందరి కంటే చాలా స్పష్టంగా చెప్పగల మహావిద్వాంసుడు - ఇబ్నె అబ్బాస్(రజి)వారు. ఖుర్'ఆన్ తఫ్సీర్‌లో మహా విద్వాంసుడైన ఇబ్నె అబ్బాస్(రజి)వారి మాటలు అజ్ఞాన రచయితలకు మరియు అజ్ఞాన దాయిలకు మరియు అవినీతిపరులైన కొందరు ఆలిమ్‌లకు రుచించ లేదు. స్వర్గశుభవార్తలు అందుకున్న సహాబాలు సైతం ఎటువంటి సందేహం లేకుండా ఇబ్నె అబ్బాస్(రజి)వారి తఫ్సీర్‌ని స్వీకరించారు.

### హదీస్ తిరస్కారులు

**'జకాత్' పుస్తకాన్ని వ్రాసినవారు ఏ జమాత్‌కి చెందినవారైనా సరే లేక ఏదో ఒక జమాత్ ముద్ర తమపై వేసుకున్న వారైనా సరే, వారు హదీస్‌లను తిరస్కరించేవారు మరియు సహాబాలపై నిందలు వేసేవారని స్పష్టంగా తెలిసిపోయింది. చేసిన ఈ నీచమైన పనికి వారు పశ్చాత్తాప పడి ఇస్లాహ్ చేసుకుంటే అల్లాహ్ తప్పక క్షమిస్తాడు. ఆయన గఫూర్రహీమ్!**

(21 వ పేజీ తరువాయి భాగం ...)

## ముస్లిమ్ అనే టైటిల్ చాలు. ఇస్లామ్ గౌరవం చాలు

జెరుసలెంతో జరిగే శాంతి ఒప్పందంపై సంతకం చేయడానికి 2వ ఖలీఫాయైన ఉమర్(రజి)వారు తన సేవకునితో బయలుదేరారు. ఒకే ఒక ఒంటె ఉంది. ఇద్దరూ వంతులు వేసుకున్నారు. అంటే సేవకుడు ఒంటెపై ప్రయాణం చేస్తే, ఉమర్(రజి)వారు కాలినడకన ఒంటెను నడిపించాలి. కొంత దూరం ప్రయాణించాక సేవకుడు దిగితే, ఉమర్(రజి)వారు ఒంటెపై ప్రయాణం చేస్తారు. ఇలా ప్రయాణం జరుగుతుండగా జెరూసలెం దగ్గరైంది. ఆ సమయంలో సేవకుడు ఒంటెపై కూర్చుని ఉన్నాడు. అప్పుడు సేవకుడు అన్నాడు, **"ఓ విశ్వాసుల నాయకుడా! నేను నా వంతు వదిలేస్తున్నాను. నేను ఒంటెపై కూర్చుండగా, మీరు ఒంటెను నడపడం ప్రజల దృష్టిలో అసంబద్ధంగా కనిపిస్తుంది."** ఉమర్(రజి)వారు సమాధానమిచ్చారు, **"లేదు! నేను అన్యాయం చేయను. మనందరికీ ఇస్లామ్ యొక్క గౌరవం చాలు."**

ఎవరైనా ఓ ముస్లిమ్ పురుషుడుగాని, ఓ ముస్లిమ్ స్త్రీ గాని వస్తూ ఉండటం చూస్తే, 'ముస్లిమ్' వస్తున్నారని ప్రజలు గౌరవించేలా ఉండాలి. ఆ వచ్చే వ్యక్తి ధనవంతుడైనా లేక పేదవాడైనా సరే, కలెక్టర్ అయినా సరే లేక స్వీపర్ అయినా సరే గౌరవాన్ని పొందగలగాలి. ఇస్లామ్‌ను ఆచరిస్తే ప్రతీ ముస్లిమ్ అంతటి గౌరవాన్ని పొందగలడు.

***అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో ఇలా చెప్పారు :*** "అల్లాహ్ వైపునకు పిలిచి మంచి పనులు చేసి, నేను **ముస్లిమ్**ను అని ప్రకటించే వ్యక్తిమాట కంటే మంచిమాట మరెవరిది కాగలదు" (ఖుర్'ఆన్ 41:33)

ముస్లిమ్ అనే టైటిల్‌ని మనకు ఇచ్చింది స్వయంగా 'అల్లాహ్'యే. అల్లాహ్ ఇచ్చిన టైటిల్ కంటే మంచి టైటిల్ మరొకటి ఉంటుందా? ముస్లిమ్ మంచిని బోధించాలి మరియు ఆచరించాలి. చెడును నిరోధించాలి. ఈ బాధ్యతను అల్లాహ్ ప్రతీ ముస్లిమ్‌పై ఉంచారు.

నేడు లక్షలు, కోట్లు ఖర్చుపెట్టి వేరే చోటు నుండో లేక విదేశాల నుండో ఎవరినో పిలిపించి, వారికి ఆడంబరమైన సౌకర్యాలెన్నో కలుగజేస్తున్నారు. ప్రత్యేకమైన విమానాలలో తీసుకు వస్తున్నారు. ఇదంతా ప్రజల సొమ్మే! ఆ డబ్బుతో ఎందరో నిరుపేదలు తమ ఆకలిని తీర్చుకోగలుగుతారు. అంత డబ్బు ఖర్చుపెట్టి వారిని తీసుకువచ్చేది ఎవరికి మేలు చేయడానికి?

ఉమర్(రజి)వారు తమ స్వాధీనంలోకి వచ్చిన ఓ దేశంతో శాంతి ఒప్పందం చేసుకోవడానికి వెళ్ళారు. అది దేశానికి సంబంధించిన అతి ముఖ్యమైన విషయం. కాబట్టి దాని కొరకు బైతుల్‌మాల్ నుండి డబ్బు ఖర్చు చేయవచ్చు. కాని ప్రజాసొమ్మును పొదుపు చేయడానికి ఒకే ఒక ఒంటెతో, ఓ సేవకుడిని తీసుకుని కొంత సత్తుపిండిని తీసుకుని బయలు దేరారు. ఓ సువిశాల భూభాగానికి చెందిన నాయకుడు దుమ్ము కొట్టుకు పోయిన బట్టలతో మరో దేశానికి చేరాడు. ఆ బట్టలపై ఎన్నో అతుకులు.

**ఓ సేవకుడిని ఒంటెపై కూర్చుండబెట్టి ప్రక్కన నడుచుకుని వస్తున్న దేశాధ్యక్షుడిని చూడగానే, శాంతి ఒప్పందం చేసుకోబోయే ప్రజలకు ఇస్లామ్ యొక్క ఔన్నత్యం అర్థమైంది. అంతేకాదు, ఆ విధంగా ఉమర్(రజి)వారు వస్తారని వారి గ్రంథాలలో ముందుగానే చెప్పబడింది.**

### మనిషి కోతినుండి పరిణామం చెందాడనే

THEORY OF EVOLUTION

# డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు.

# రాతి యుగం ఓ చారిత్రక అబద్ధం

మానవులందరికీ పితామహుడు మరియు అల్లాహ్ యొక్క తొలి ప్రవక్తయైన ఆదమ్(అ)వారి గురించి, బాలబాలికలకు ప్రత్యేకం శీర్షికలో డిశంబర్'10 సంచికలో స్పష్టంగా వివరించాము. ఆయన కాలం నుండే వ్యవసాయం ప్రారంభమైంది. వారు వస్త్రాలు ధరించారు. 3వ ప్రవక్త ఇద్రీస్(అ)వారి ద్వారా టైలరింగ్ మరియు వ్రాయడం మొదలైంది. నూహ్(అ)వారు ఓడను నిర్మించారు. కాబట్టి మానవుడు ఈ భూమిపై అడుగు పెట్టినప్పటి నుండి సంస్కారంతో ఒక విధానం ప్రకారమే జీవనాన్ని ప్రారంభించడం జరిగింది.

మనిషి కోతి నుండి రూపాంతరం చెందాడనే సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన దగ్గర నుండి, ఆ అసత్యాన్ని నిజంగా చూపడానికి చరిత్రను దానికణుగుణంగా మార్చి వ్రాశారు. మన పాఠ్య పుస్తకాల ద్వారా చిన్నతనం నుండి అవే నేర్చుకుంటున్నాము. చిన్నతనం నుండే ఓ అసత్యం మన మనస్సులలో నాటుకు పోయేలా చేస్తున్నారు. ఇటువంటి సిద్ధాంతం ద్వారా మనం ఏ విధంగా మోసగించబడ్డామో స్పష్టంగా తెలుసు కోవడానికి అనువైన ఓ పుస్తకం **"A Historical Lie - The Stone Age"** దీనిని టర్కీ దేశానికి చెందిన హారున్ యహ్యా వ్రాశారు. శాంతిబాట ప్రారంభంలో ఈయన వ్యాసాలను కొన్నింటిని అందించాము. పాఠకుల నుండి విశేష ఆదరణ లభించింది. ఈ పుస్తకాన్ని పూర్తిగా గాని లేదా ముఖ్యవిషయాలను గాని యథాతథంగా ఈ శీర్షికలో ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

## 2 ఈ భూమిపై మానవ జీవితం ఎప్పుడు ప్రారంభమైంది?

క్రిందటి సంచికలో వేల సంవత్సరాల క్రితం మానవులు తయారు చేసిన పనిముట్లు, వస్తువులు, అభరణాల గురించి ఫొటోలతో సహా వివరించాము. ఆ వివరాలు చదివిన తరువాత సాధారణంగా ఎవరికైనా ఉదయించే తొలి ప్రశ్న **'మానవుడు ఈ భూమి మీద కాలుమోపి ఇప్పటికి ఎంతకాలం అయింది?'** ఈ ప్రశ్నకు ఖచ్చితమైన జవాబు ప్రస్తుత పరిస్థితులలో ఎవ్వరూ చెప్పలేరు. మన దగ్గరున్న ఆధారాలు అందుకు సరిపోవు. మాకు అల్లాహ్ ఇచ్చిన జ్ఞానాన్ని బట్టి ఖుర్ఆన్‌లో అల్లాహుతాలా ఆ విషయం మనకు తెలియజేయలేదని భావిస్తున్నాము. ఒకవేళ ఆయన ఆ వివరాలు ఇచ్చి ఉన్నప్పటికీ, మన జ్ఞానానికి అవి ఇంకనూ అందలేదేమో! వాటిని భవిష్యత్తులో ఖుర్ఆన్ నుండి అర్థం చేసుకోవచ్చేమో నిజం అల్లాహ్‌కే తెలుసు.

తొలిమానవుడు ఎన్ని సంవత్సరాల క్రితం ఈ భూమిపై కాలు మోపాడో, దానికి సంబంధించి స్పష్టమైన వివరాలు లేవు. అయితే ఆ కాలాన్ని అంచనా వేయడానికి ప్రయత్నించవచ్చు.

ఏ విధంగా అంటే ఓ మంచి రెడీమేడ్ షర్ట్‌ను చూపించి, దాని ఖరీదును అంచనా వేయమని ఎవరైనా మనల్ని అడిగితే, కరెక్ట్‌గా చెప్పలేక పోయినా సరే, అది 50 రు॥లు కంటే ఎక్కువే ఉంటుంది అని మాత్రం నమ్మకంగా చెప్పగలం. ఎందుకంటే టైలర్‌గారు చొక్కా కుట్టడానికే 50 రు॥లు తీసుకుంటారు కాబట్టి. ఆ చొక్కా అసలు ఖరీదు 500 రు॥లు కావచ్చు లేదా 5000 రు॥లు కూడా కావచ్చు. కాని దాని ఖరీదు 50 రు॥ల కంటే తక్కువ ఉండదని సందేహం లేకుండా చెప్పగలుగుతాం.

ఇదే విధంగా ఖుర్ఆన్ మరియు హదీస్‌ల ద్వారా లభించిన కొన్ని వివరాలను బట్టి కనిష్ట కాలాన్ని మనం కూడా అంచనా వేయవచ్చు. కోడిగుడ్డు నుండి వెంట్రుకలు పీకడానికి ప్రయత్నించే పెద్ద మనుష్యులు కూడా మన మధ్యలో ఉన్నారు కాబట్టి, మేము ముందుగానే చెప్పేదేమిటంటే, **ఇది కేవలం అంచనా మాత్రమే.** ఖచ్చితమైనది కాదు.

అల్లాహ్ యొక్క చిట్టచివరి ప్రవక్త మరియు సందేశహరులైన ముహమ్మద్(స)వారి వయస్సు 63 సంవత్సరాలు. క్రింది సహీహ్ హదీస్‌ల ద్వారా ఈ విషయం స్పష్టంగా చెప్పవచ్చు. 40 సంవత్సరాల వయస్సులో ముహమ్మద్(స)వారికి ప్రవక్త పదవి లభించింది. దాదాపు 23 సంవత్సరాల పాటు ఆయన ప్రజలకు ధర్మాన్ని బోధించారు. ధర్మాన్ని అల్లాహ్ పరిపూర్ణం చేసిన కొన్ని రోజులకు ఆయన మరణం సంభవించింది. ఈ విధంగా ముహమ్మద్(స)వారి వయస్సు 63 సంవత్సరాలు అని చెప్పడానికి బలమైన ఆధారాలున్నాయి.

హమ్మామ్ బిన్ మునబ్బిహ్ ఉల్లేఖనం. ఇది రసూలుల్లాహ్(స)వారి నుండి అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ఆయన ఎన్నో హదీస్‌లను ఉల్లేఖించారు. దానిలో ఇది ఒకటి. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ఈసా బిన్ మర్యమ్(అ)వారి

బంధువులలో నేను ఆయనకు బాగా సన్నిహితుడిని ఇహలోకంలో మరియు పరలోకంలో.' వారు అడిగారు : 'అది ఎలా? ఓ రసూలల్లాహ్?' ఆయన(స) చెప్పారు : 'ప్రవక్తలు సోదరులు. వారి తల్లులు వేర్వేరు కాని వారి ధర్మం ఒక్కటే మరియు మా మధ్య ప్రవక్త లేడు.' **(సహీహ్ ముస్లిమ్, 6132, పుస్తకం 43, అధ్యా. 40, సంపుటి 6)**

ముహమ్మద్ బిన్ జుబైర్ బిన్ ముతిమ్ తన తండ్రి నుండి ఉల్లేఖించారు. ప్రవక్త(స)వారు చెప్పారు : "**నేను ముహమ్మద్** మరియు **నేను అహ్మద్** మరియు నేను అల్ మాహీ అంటే నా ద్వారా అవిశ్వాసం చెరిపేయబడుతుంది. మరియు నేను అల్-హాషిర్ అంటే నా తరువాతే ప్రజలంతా సమావేశపరచ బడతారు. (పరలోకంలో) మరియు నేను అల్-ఆఖిబ్." **అల్-ఆఖిబ్ అంటే ఆయన తరువాత మరొక ప్రవక్త ఉండరు. (సహీహ్ ముస్లిమ్, 6105, పుస్తకం 43, అధ్యా. 34, సంపుటి 6)**

అనస్ బిన్ మాలిక్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారు 63 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు మరణించారు మరియు అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు 63 సంవత్సరాల వయస్సున్నప్పుడు మరణించారు మరియు ఉమర్(రజి)వారు 63 సంవత్సరాల వయస్సున్నప్పుడు మరణించారు. **(సహీహ్ ముస్లిమ్, 6091, పుస్తకం 43, అధ్యా. 32, సం.6)**

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) మక్కాలో దివ్య సందేశాన్ని అందుకుంటూ 13 సంవత్సరాలు గడిపారు మరియు మదీనాలో పది సంవత్సరాలు మరియు ఆయనకు 63 సంవత్సరాల వయస్సున్నప్పుడు మరణించారు. **(సహీహ్ ముస్లిమ్, 6097, పుస్త. 43, అధ్యా. 33, సం. 6)**

ఖుర్ఆన్‌లో మరో ప్రవక్తగారి వయస్సు కూడా ప్రస్తావనకు వచ్చింది. క్రింది ఖుర్ఆన్ ఆయత్ చూడండి :

మరియు వాస్తవానికి, మేము నూహ్‌ను అతని జాతివారి వద్దకు పంపాము. అతను వారి మధ్య **యాభై తక్కువ వేయి సంవత్సరాల వరకు నివశించాడు.** చివరకు వారు దుర్మార్గాన్ని విడనాడనందుకు, వారిని తుఫాను పట్టుకుంది. (ఖుర్ఆన్ 29:14)

పై ఖుర్ఆన్ ఆయత్ ప్రకారం, నూహ్(అ)వారికి ప్రవక్త పదవి లభించాక తన జాతి వారి వద్దకు పంపబడ్డారు. తన ప్రజలను 950 సంవత్సరాలపాటు అల్లాహ్ మార్గం వైపు పిలిచారు. ఆ తరువాత జల ప్రళయం వచ్చింది. నూహ్(అ)వారు మరియు ఆయనతో పాటు నావలో ఉన్న సన్మార్గులు మరియు ఇతర జీవులు తప్ప మొత్తం నాశనం కాబడింది. ఆ తరువాత ఆయన ఎంతకాలంపాటు జీవించారో మనకు తెలియదు. కొన్ని ఉల్లేఖనాల ప్రకారం నూహ్(అ)వారికి 800 సం॥ల వయస్సులో ప్రవక్త పదవి లభించిందని, జల ప్రళయం తరువాత మరో 500 సంవత్సరాలు జీవించారని మరియు ఆ విధంగా ఆయన వయస్సు 2500 సం॥లుగా చెప్పడం జరిగింది. కాని **వాటి ప్రామాణికత గురించి మా దగ్గర స్పష్టమైన ఆధారం లేదు.** నిజం అల్లాహ్‌కే తెలుసు. అయితే ఖుర్ఆన్ ద్వారా మనకు స్పష్టంగా తెలిసిన విషయం - నూహ్(అ)వారు ప్రజలను 950 సంవత్సరాలు అల్లాహ్ మార్గంవైపు పిలిచారని.

అంతేకాకుండా పైన తెలిపిన ఖుర్ఆన్ ఆయత్ ప్రకారం, ఖచ్చితంగా నూహ్(అ) వయస్సు 1000 సంవత్సరాలకు తక్కువ కాదు అనేది వాస్తవం. 'బాలబాలికలకు ప్రత్యేకం' శీర్షికలో నూహ్(అ)వారి కంటే ముందు వచ్చిన ముగ్గురు ప్రవక్తలు - ఆదమ్(అ), షీస్(అ) మరియు ఇద్రీస్(అ) గురించి వివరించాము. మాకు లభించిన వివరాలను బట్టి ఈ ముగ్గురి వయస్సులు వరుసగా 930, 912 మరియు 356 సం॥లు. ఇద్రీస్(అ)వారికి మునిమనమడు నూహ్(అ).

ఈ ఇద్దరి మధ్య కొన్ని తరాల వ్యత్యాసముంది. ఇప్పటికాలంలో ఒక తరం అంటే 70 లేదా 80 సంవత్సరాలు కావచ్చు. కాని ఆ కాలంలో ఒక తరం అంటే ఎన్ని సంవత్సరాలో తెలియదు. కాబట్టి ఒక ప్రవక్తగారి తరువాత మరొకరికి ప్రవక్త పదవి వెంటనే రావచ్చు లేదా వారి మధ్య తరాల అంతరం ఉండవచ్చు. ముహమ్మద్(స)వారి కంటే ముందు వచ్చిన ప్రవక్త గారు ఈసా(అ). వీరిద్దరి మధ్య దాదాపు 500 సం॥ల కాల వ్యత్యాసం ఉంది. ఈసా(అ)వారి కంటే ముందు వచ్చిన ఓ 18 మంది ప్రవక్తల యొక్క వయస్సులు కలిపితే 6000 సంవత్సరాలు దాటుతుంది. ఈసా(అ)వారి కాలం నుండి ఇప్పటి వరకూ దాదాపు 2000 సంవత్సరాలు గడిచాయి. కాబట్టి ఈ రెండూ కలిపితే 8000 సం॥లు దాటింది. ఒక ప్రవక్త గారికి మరియు మరొక ప్రవక్తగారికి మధ్య ఉండే కాలం కేవలం 100 సంవత్సరములే అని అనుకుంటే ఆదమ్(అ)వారి దగ్గర నుండి నేటి మనకాలం వరకూ గల కాల వ్యవధి 10,000 సంవత్సరముల కంటే ఎక్కువేనని పైన తెలిపిన 20మంది ప్రవక్తల వయస్సులను బట్టి అనుకోవచ్చు.

కాని ఖుర్ఆన్‌లో ప్రస్తావించబడిన ప్రవక్తలందరి వయస్సుల గురించి సమాచారం లేదు. ఇబ్రాహీం(అ), లూత్(అ), ఇస్మాయీల్(అ)వారు ఒకే కాలంలో జీవించారు. అదే విధంగా మూసా(అ) మరియు హారున్(అ) ఒకేకాలంలోనూ, ఈసా(అ) మరియు యహ్యా(అ)కూడా ఒకే కాలంలో జీవించారని ఖుర్ఆన్ ద్వారా తెలుస్తుంది.

మరొక విషయమేమిటంటే ఆదమ్(అ)వారి కాలం నుండి ముహమ్మద్(స)వారి వరకూ ఉన్న మధ్య కాలంలో దాదాపు 1,24,000 మంది ప్రవక్తలను అల్లాహ్ పంపారని ముస్నద్ అహ్మద్‌లోని ఓ ఉల్లేఖనం ద్వారా తెలుస్తుంది.

ఈ పై సమాచారాన్ని బట్టి ఓ కనిష్ఠ కాల వ్యవధిని అంచనా వేద్దాం. ఏకకాలంలో ఇద్దరు, ముగ్గురు ప్రవక్తలు ఉన్నట్లు తెలుసుకున్నాము. ప్రతీ కాలంలోనూ ఆ విధంగా లేరు. ఎందుకంటే ముహమ్మద్(స)వారి కాలంలో మరో ప్రవక్త ఎవరూ లేరు. ముందరి పేజీలోని హదీస్ చూడండి. అయినప్పటికీ అంచనా కోసం ఒకే కాలంలో 100 మంది ప్రవక్తలు ఉన్నారని అనుకుందాం. ఆ వందమంది 90 సం॥లు తరువాత మరణించారని అనుకుందాం.

వారి మరణం తరువాత మరో 100 మంది ప్రవక్తలు జన్మించారని అనుకుందాం. అంటే మొదటి 100 మంది జన్మించిన 90 సంవత్సరాలకు రెండవ దఫా మరో 100 మంది జన్మించారు. అప్పుడు వారి మధ్య కాలవ్యవధి 90 సంవత్సరాలు అవుతుంది. ఈ విధంగా లెక్కగడితే, 1240 x 90 = **1,11,600** సం॥లు అవుతుంది.

అంటే తొలి ప్రవక్తయైన ఆదమ్(అ)వారి నుండి చివరి ప్రవక్త ముహమ్మద్(స)వారికి మధ్య నున్న కాలం 1 లక్ష సంవత్సరాల కంటే ఎక్కువే.

ఒకవేళ ప్రపంచంలో ఒకేకాలంలో 100 మంది కాకుండా 50మంది ప్రవక్తలు మాత్రమే జీవిస్తే, అప్పుడు ఈ వ్యవధి **2 లక్షల సంవత్సరాలు** దాటుతుంది. ఇద్దరు ప్రవక్తల మధ్య కాలం 90 సం॥లు కాకుండా 450 సం॥లు అయితే ఆ కాల వ్యవధి **10 లక్షల సంవత్సరాలు** దాటుతుంది. మరియు ఒకేసారి కేవలం 10మంది ప్రవక్తలు మాత్రమే ఉండి, ఒక తరం ప్రవక్తలకు మరియు తరువాయి తరం ప్రవక్తలకు మధ్యనున్న కాలం 450 సం॥లు అయితే, అప్పుడు మనిషి ఈ భూమి మీద అడుగుపెట్టి **55 లక్షల సంవత్సరాలు** దాటుతుంది.

**పైన పేర్కొన్న అంచనాలన్నింటి ప్రకారం తొలి మానవుడు ఈ భూమిపైకి వచ్చిన దగ్గర నుండి ఇప్పటికి ఒక లక్ష సంవత్సరాల కంటే ఎక్కువే కావచ్చుగాని తక్కువయ్యే అవకాశం కనిపించడం లేదు.**

**1 లక్ష సంవత్సరాల కంటే ఎక్కువే!**

ఇప్పుడు పాఠకులకు బాగా అర్థమై ఉండవచ్చునని భావిస్తున్నాము. ఏ విధంగానైతే ఓ మంచి రెడీమేడ్ చొక్కా ఖరీదు 50రు॥ల కంటే ఎక్కువ ఉంటుందని అంచనా వేయగలిగామో, అదే విధంగా తొలి మానవుడు ఈ భూమిపైకి వచ్చి ఒక లక్ష సంవత్సరాలకంటే ఎక్కువే అవుతుందని అంచనా వేశాము. **ఈ శీర్షికలోని వ్యాసాలు అర్థం కావాలంటే తప్పనిసరిగా పై అంచనా వేయవలసి ఉంది.**

ఒకవేళ మానవజీవితం కేవలం 20వేల సంవత్సరాల క్రితమే భూమిపై ప్రారంభమైందని ఎవరైనా అనుకుంటే, 50వేల సంవత్సరాల క్రితం తయారు చేయబడిన పనిముట్ల గురించి మేము వివరాలు ఇచ్చినప్పుడు, వారి నమ్మకం ప్రకారం 50వేల సంవత్సరాల క్రితం మానవ జీవితం లేదు కాబట్టి ఆ పనిముట్లు ఎవరు చేశారోనని సందేహంలో పడతారు.

ఆ సందేహం రాకుండా ఉండటానికే పై విషయాలను చర్చించడం జరిగింది.

**ఈ వ్యాసంలో ఇంతవరకూ తెలిపిన విషయాలు, శాంతిబాట టీమ్ చే వివరించబడినవి మాత్రమే.** ఈ శీర్షికకు మూలమైన హారున్-యహ్యాగారి పుస్తకంలోనివి కావు. **పాఠకులు గమనించగలరు.** శాంతిబాటలో అందించే ప్రతీ విషయం అందరికీ అర్థం కావాలి కాబట్టి, అవసరమైన వివరణలు సందర్భాన్ని బట్టి అందించడానికి అల్లాహ్ పేరుతో ప్రయత్నిస్తున్నాము.

**మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ...**

## కొత్తగా చేరిన పాఠకులకు మా విన్నపం

మాకు ఉన్న పోస్టల్ లైసెన్స్ ప్రకారం
ప్రతీ నెల 15వ తారీఖున
శాంతిబాట పోస్ట్ చేయవలసి ఉంది.
ఒకొక్కసారి కొన్ని వ్యాసాల పరిశోధన కొరకు ఎక్కువ సమయం అవసరమౌతుంది. సాంకేతిక సమస్యల వలన కూడా పత్రిక ఆలస్యం కావచ్చు.

**సంవత్సర చందా వివరాలు :**

**రూ. 200/- పోస్టల్ మనియార్డర్ (M.O.) ద్వారా**

**క్రింది ఎడ్రస్‌కు పంపండి.**

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**
2-8-31, కోట బజార్, సామర్లకోట-533440
మనియార్డర్ చేయగానే 9491103017కి ఫోన్ చేసి
తెలియజేయవలసిందిగా కోరుతున్నాము

**ఎక్కువ చందాలను పంపగోరువారు**
**క్రింది ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**
SBI A/c No. 10428633092
Waltair, Visakhapatnam-530003
Contact : Dr. N. Srinivasa Rao, Cell:9491103017
velugubaata@gmail.com
info@saanthibaata.net

**మొదటి సంవత్సరం సంచికలు**
(తొలి సంచిక ఆగష్టు 2009 మినహా)
**మరియు 2వ సంవత్సరం సంచికలు కావలిసిన వారు**
**రూ. 365/- మనియార్డర్ చేయగలరు.**

**కేవలం ఏదో ఒక ఆర్టికల్ మాత్రమే అవసరమైతే**
**మా వెబ్‌సైట్ www.saanthibaata.net నుండి**
**ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.**

మీ కవర్‌పై ఉండే ఎడ్రస్ స్లిప్‌పై మీ ఫోన్ నంబర్ లేకపోయినా లేక మీ నంబర్ మారినా ఆ నంబర్‌ను వెంటనే మాకు తెలియజేయండి.

15

# తిరిగి గూటికి

దైవధర్మం అనేది ఏ ఒక్కరి సొత్తో కాదు. ప్రకృతిలాగే ఇది అందరికీ చెందుతుంది. ఈ వాస్తవాన్ని ఆలస్యంగానైనా సరే చాలా మంది తెలుసుకుంటున్నారు. ప్రస్తుతం ఇస్లాం (శాంతి) ధర్మం ప్రపంచంలో అత్యంత వేగంతో విస్తరిస్తుంది. ఈ ధర్మంపై బురద చల్లడానికి పాశ్చాత్యులు చేస్తున్న కృషి వలన, ఈ ధర్మవ్యాప్తి తగ్గడానికి బదులు దీని వేగం మరింత పెరుగుతూ వస్తుంది. ఈ ధర్మాన్ని ఆచరించడం అనేది 'మత మార్పిడి' ఎంత మాత్రం కాదు. దారి తప్పిన సోదరి లేదా సోదరుడు తిరిగి తన పయనించవలసిన దారిని చేరుకోవడం వంటిది. ఇలా తిరిగి గూటికి చేరుకున్న ఓ సోదరి గురించి గాని, ఓ సోదరుని గురించి గాని ఈ శీర్షికలో పరిచయం చేయబడుతుంది.

ఇస్లాం ధర్మంలో అడుగిడిన వీరిని కొత్త ముస్లింలు లేదా నవముస్లింలు తోటి ముస్లిం సోదరసమాజం పిలుస్తుంది. అయితే ఇస్లాం పట్ల అవగాహన లేని కొంతమంది 'ముస్లిం' సోదరులుగాని, విద్వాంసులుగాని ఈ నవముస్లింల పట్ల ప్రవర్తించే తీరు కొంతమేర అభ్యంతరకరంగానూ, ప్రియ ప్రవక్త ముహమ్మద్ (స) వారి సాంప్రదాయానికి వ్యతిరేకంగానూ ఉంటుంది. ఇస్లాం పట్ల అవగాహన ఉన్నవారు వీరిని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంటున్నారు. దారి తప్పిన తమ సోదరుడు లేదా సోదరి తిరిగి తన గూటికి చేరుకున్నారన్న ఆనందోత్సాహం వారిలో స్పష్టంగా కనిపిస్తుంది.

ఇస్లాం ధర్మాన్ని అవగాహన చేసుకుంటే, ఏ ధర్మానికి చెందినవారైనా సరే, ఇది ఖచ్చితంగా దైవధర్మమనే విషయాన్ని అంగీకరిస్తారు. కాని ఈ ధర్మాన్ని ఆచరించడానికి మనో ధైర్యం కావాలి. దైవ భీతికలవారికి ఇది సునాయాసంగా లభిస్తుంది. కుటుంబానికో, సమాజానికో భయపడటం వల్లనో లేదా ఇతరత్రా కారణాల వల్లనో అల్లాహ్ ధర్మానికి చాలామంది దూరంగా ఉన్నారు.

అలాగే కొత్తగా 'ఇస్లామ్'లోకి వచ్చిన వారికి చాలా సందేహాలుంటాయి. ఒక్కసారిగా అన్ని పుస్తకాలనూ వారు చదువలేరు. ధర్మావగాహనకు కూడా వారికి కొంత సమయం పడుతుంది. అనుభవజ్ఞుల వివరణలు వీరికి చాలా అవసరం. ఇంతకు ముందరి జీవన విధానంలోని కొన్ని అభ్యంతరకరమైన అలవాట్లు నుండి దూరం కావడానికి వారిలో కొందరికి మరికొంత సమయం పట్టవచ్చు. వారు ప్రారంభంలో ఓ ప్రత్యేకమైన అవస్థకు గురై ఉంటారు. వారికి ప్రవక్తగారి సాంప్రదాయ ప్రకారం సౌమ్యంగా, సహనంతో అన్ని విషయాలను ఆకళింపు చేసుకొనేలా చేయడం, వారికి తోడుగా ఉండడం మనందరి బాధ్యత.

ఈ శీర్షిక ద్వారా వీలుని బట్టి నవ ముస్లిం సోదరులకు ఎదురయ్యే ఇబ్బందులు, వాటిని సునాయాసంగా అధిగమించడానికి ఖుర్'ఆన్, హదీసుల వెలుగులో పరిష్కారాలను కూడా అందించే ప్రయత్నం జరుగుతుంది, ఇన్షా అల్లాహ్.

### నవ ముస్లిమ్? | New Muslim?

*అబూబక్ర్ సిద్దీఖ్(రజి), ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి), ఉస్మాన్ బిన్ అఫ్ఫాన్ (రజి), అలీ బిన్ అబీ తాలిబ్(రజి) మొదలైన విశ్వాసులంతా ఇస్లామ్ స్వీకరించిన వారే! వీరిని నవముస్లిములుగా ఎవరూ పరిచయం చేయలేదు. నమాజ్ చేయడం నేర్చుకునే వరకో లేక మస్జిద్ అలవాటు అయ్యే కొన్ని రోజుల వరకో తోటి ముస్లిములకు తెలియడానికై 'నవముస్లిమ్' అనే పదాన్ని వారి కొరకు ఉపయోగించవచ్చు. కాని వారికి ఇస్లామ్ ధర్మంపై పూర్తి అవగాహన ఏర్పడి ఇస్లామ్ ప్రకారం వారి ఆచరణ ఉన్నప్పుడు, ఎన్ని సంవత్సరాలైనా సరే వారిని 'నవ ముస్లిములు'గా పరిగణించడం సరికాదు.*

### ఏ భాష అయినా ఒక్కటే! | అంతా సమానమే!

ఖుర్'ఆన్ అరబీ భాషలో అవతరించింది. అరబీ భాష ముస్లిములకు అతి ముఖ్యమైన మరియు నేర్చుకోవలసిన భాష. 'ఉర్దూ' భాష భారతీయ భాషలలో ఒక భాష మాత్రమే. 'ఉర్దూ' అంటే మార్కెట్ అని అర్థం. ఇది అరబ్బులు మరియు భారతీయుల మధ్య వ్యాపార లావాదేవీల కొరకు తయారైన భాష. అరబీ భాష కాకుండా, ఇతర ఏ భాష అయినా ముస్లిములకు ఒక్కటే! ఇస్లామ్‌లో రంగు, తెగ, లేమి, కలిమి, భాష, ప్రాంతం మొ॥న వాటిని బట్టి ఎటువంటి ప్రాముఖ్యతా లేదు. అందరూ సమానమే! కేవలం ధర్మ పరాయణత మాత్రమే ముస్లిముల స్థాయిని నిర్దేశించే కొలమానం. తెలుగు మాట్లాడేవారి కొరకు ఒక మస్జిద్, వేరే భాష మాట్లాడేవారికి మరొక మస్జిద్ ఏర్పాటు చేయాలని చేసే ఏ ప్రయత్నమైనా సున్నత్‌కి వ్యతిరేకమైనదే! అందరినీ కలిపి ఉంచే ధర్మమే ఇస్లామ్ (శాంతి).

**నవ ముస్లిముల సమస్యలపై ప్రత్యేక వ్యాసం – 8**

*శాంతిబాట మొదటి సంవత్సరంలో విదేశాలలో ఇస్లామ్ స్వీకరించిన ఏడుగురు సోదరీమణుల గురించి తెలియజేయడం జరిగింది. ద్వితీయ సంవత్సరం తొలి సంచికయైన ఆగష్టు'10 సంచికలో నవముస్లిములు ఎదుర్కొంటున్న సమస్యలను వివరిస్తూ ఓ సోదరుడు ఆవేదన వ్యక్తం చేస్తూ వ్రాసిన లేఖను అందించాము.* ***ఆ సమస్యలకు ఖుర్'ఆన్ మరియు సున్నత్ విధానంలో పరిష్కార మార్గాన్ని ఇన్షా అల్లాహ్ తరువాయి సంచికలలో అందిస్తామని చెప్పడం జరిగింది.*** తరువాయి సంచికలలో కొన్నింటికి ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో పరిష్కారం అందించాము. వాస్తవ సంఘటనల ద్వారా సమస్యల పరిష్కారాన్ని తెలియజేసే ఉద్దేశ్యంతో ముహమ్మద్(స)వారి అనుచరులైన బిలాల్(రజి), అబూజర్(రజి), సల్మాన్ ఫార్సీ (రజి), అబూ ఉబైదా(రజి), సాద్ బిన్ అబీ వఖ్ఖాస్(రజి), అమ్ర్ బిన్ ఆస్(రజి)వారి జీవితచరిత్రలను క్లుప్తంగా అందించడం జరిగింది. ఇవన్నీ చదివితే ఎవరికైనా తమ సమస్యలు పైన వివరించిన విశ్వాసుల సమస్యల కంటే చాలా చిన్నవిగా కనిపిస్తాయి. సులువుగా తమ సమస్యలను పరిష్కరించుకో గలమనే మనో ధైర్యం వారిలో ఏర్పడుతుంది. ఈ సంచిక నుండి విశ్వాస స్త్రీల జీవితచరిత్రలను ఓ ఆరు నెలల పాటు అందించాలని అల్లాహ్ పేరుతో సంకల్పించాము. **ఇస్లామ్‌లో తొలి షహీదా యైన సుమయ్యా (రజి) వారి గురించి క్లుప్తంగా ఈ సంచికలో మీకు అందిస్తున్నాము.**

# సుమయ్యా బిన్త్ ఖబాత్ (రజి)

**కుటుంబ సమేతంగా ఇనుప తొడుగులు ధరింపజేసి ఎడారి ఎండలో పరుండబెట్టారు.**

**ఒక చేయి ఒక ఒంటెకు, మరో చేయి మరో ఒంటెకు కట్టారు.**
**ఆ రెండు ఒంటెలను వ్యతిరేక దిశలలో నడిపినా సరే, ముహమ్మద్(స)వారు బోధించిన సత్యధర్మాన్ని విడిచిపెట్టేది లేదని ధైర్యంగా చెప్పి ప్రాణాన్ని సైతం లెక్క చేయని ఓ వయస్సు పైబడిన మహిళ మన సుమయ్యా(రజి).**

**స్త్రీ జాతికి గర్వకారణం ఈ సోదరి.**

**హింసను, రాక్షసత్వాన్ని సహనంతో తట్టుకునే స్థైర్యాన్ని ముస్లిములకు ఇస్లామ్ కలుగజేస్తుంది. కాని ఇస్లామ్ హింసను ప్రోత్సహిస్తుంది అని చెబుతూ అసత్యాన్ని ప్రజలలో ప్రచారం చేస్తున్నారు - రాక్షసత్వంతో మానవత్వంపై దాడులు చేస్తున్న నేటి పాశ్చాత్యులు**

**శాంతి, సహనాలకు ప్రతిరూపం - ఇస్లామ్**

- స్వేచ్ఛ నొసంగబడిన బానిస
- ఇస్లామ్ స్వీకరించిన తొలి 7గురిలో ఒకరు
- తొలి షహీదా. మరణానికి ముందే స్వర్గ శుభవార్తను అందుకున్న మహిళ

ముహమ్మద్(స)వారికి ప్రవక్త పదవి లభించిన తరువాత, ఇస్లామ్ కోసం ప్రాణ త్యాగం చేసిన తొలి వ్యక్తి ఓ మహిళ. ఈ వ్యాసం ప్రపంచ మహిళా దినోత్సవం నాడు ప్రారంభించబడటం కాకతాళీయంగానే జరిగింది. మహిళలు పురుషులకు తీసిపోరని ప్రకటనలిచ్చే పబ్లిసిటీ మహారాణులకు ఈ వ్యాసం వలన కనువిప్పు కలుగు తుందని భావిస్తున్నాము. ప్రాణ త్యాగం చేసిన ముస్లిమ్ మహిళ పేరు సుమయ్యా(రజి). **'ఆరాధ్యుడు ఒక్కడే'** అని తమ విశ్వాసాన్ని ప్రకటించి నందుకు మక్కా బహుదైవారాధకులు అంతా కలిసి స్వల్ప సంఖ్యలో ఉన్న ముస్లిములపై దారుణమైన హింసలకు పాల్పడ్డారు. ఆ హింసల గురించి చదువుతుంటేనే వెన్నులో చలి మొదలౌతుంది. శారీరకంగా బలంగా ఉండే యువకులు ఆ హింసలకు కొంతైనా సహించగలిగే అవకాశముంది. కాని సుమయ్యా(రజి)ని హతమార్చే సమయానికి ఆమె యువతి కారు. ఆమె ముగ్గురు యువకులకు మాతృమూర్తి. వయస్సు పైబడిన మహిళ ఆమె. ఇస్లామ్ స్వీకరించిన తొలి 7గురు వ్యక్తులలో ఆమె 5వ వారు.

ముగ్గురు సోదరులు యమన్ నుండి తమ సోదరుడుని వెదుకుతూ మక్కా నగరాన్ని చేరారు. వారిలో ఒకరు యాసిర్(రజి) మరియు మిగిలిన ఇద్దరి పేర్లు హారిస్ మరియు మాలిక్. యాసిర్(రజి) అక్కడి సంస్కృతిని అనుభవ పూర్వకంగా తెలుసుకున్నారు. కొన్నాళ్ళ తరువాత యాసిర్(రజి) అక్కడి జీవితం నచ్చడంతో శాశ్వతంగా అక్కడే ఉండి పోవడానికి నిర్ణయించు కున్నారు. మిగిలిన ఇద్దరూ యెమన్‌కు తిరిగి వెళ్ళి పోయారు.

అక్కడ వేరే దేశం నుండి వచ్చినవారు శాశ్వతంగా స్థిరపడాలంటే ఆ కాలంలో మక్కాలో అమలులో ఉండే ఆచారం ప్రకారం అక్కడి పౌరులలో ఎవరో ఒకరు కొత్త వ్యక్తికి మద్దతుగా మరియు జామీనుగా ఉండాలి. అప్పుడే అక్కడ నివశించడానికి అర్హత లభిస్తుంది. ఖురైష్ తెగలో ఉన్నత వంశాలలో ఒకటైన బనూ మఖ్జూమ్‌కు చెందిన అబూ హుదైఫా గారిని తనకు జామీనుగా ఉండేలా యాసిర్(రజి)వారు ఎంచుకున్నారు. అబూహుదైఫా ధనవంతుడు.

అబూ హుదైఫా గారి సంరక్షణలో ఉన్న యాసిర్ ఆయనను అభిమానించేవారు. అబూ హుదైఫా మరియు యాసిర్(రజి)వారు ఒకరి గురించి ఒకరు బాగా అర్థం చేసుకున్నారు. వారి మధ్య మంచి స్నేహబంధం ఏర్పడింది. అబూ హుదైఫా గారికి చాలా తెలివైన మరియు సున్నిత మనస్కురాలైన ఓ బానిస స్త్రీ ఉండేది. ఆమె పేరు సుమయ్యా(రజి).

అబూహుదైఫా తన అభిమానానికి పాత్రురాలైన సుమయ్యా(రజి)ని యాసిర్(రజి)వారికి ఇచ్చి వివాహం చేశారు. ఆమె స్వేచ్ఛను పొందిన తరువాత యాసిర్(రజి)వారు వివాహం చేసుకున్నారు. భర్త ఖురైష్ తెగకు చెందిన వ్యక్తి సంరక్షణలో ఉండగా, భార్య స్వేచ్ఛనొందబడిన మహిళ. ఈ ఇద్దరి మంచి నడవడిక గురించి మక్కా సమాజంలో బాగా తెలుసు.

వారి జీవితం సంతోషంగా సాగుతుంది. వారికి ఒక కుమారుడు జన్మించాడు. వారు అతనికి అమ్మార్ అని పేరు పెట్టారు. అబూ హుదైఫా మంచి మనిషి. సుమయ్యా(రజి)వారికి బానిసత్వం నుండి స్వేచ్ఛ నివ్వడమే కాకుండా వివాహం తరువాత కూడా ఆ దంపతులకు సహాయ సహకారాలు అందించేవారు.

యాసిర్(రజి)వారికి మరో ఇద్దరు కుమారులు కలిగారు. వారి పేర్లు అబ్దుల్లాహ్ మరియు హారిస్. చివరి కుమారుడు ఇస్లామ్ ప్రారంభానికి ముందే చంపబడ్డాడు.

ఖురైషులు పిల్లలను పెంచే తరహాలోనే తమ కుమారులను కూడా ఆ దంపతులు ఎంతో శ్రద్ధగా పెంచారు. తల్లిదండ్రుల ప్రేమానురాగాలతో ఆ కుమారులు మంచి నడవడికతో పెరిగి పెద్దవారయ్యారు. అబూ హుదైఫా చనిపోయారు.

అల్లాహ్ యొక్క చిట్టచివరి ప్రవక్తయైన ముహమ్మద్(స)వారికి అల్లాహ్ ప్రవక్త పదవినిచ్చారు. అల్లాహ్ తన దూత ద్వారా ముహమ్మద్(స)వారిపై సందేశాన్ని అవతరింప జేశారు. ఆయన(స) సత్య ధర్మాన్ని ప్రజలకు బోధించడం ప్రారంభించారు. మక్కా నివాసులకు ముహమ్మద్(స)వారి సత్య బోధన ఓ పిడుగుపాటులా అనిపించింది. మఖ్జూమ్ తెగవారు ఈ కొత్త ధర్మంపట్ల విపరీతమైన ద్వేషాన్ని పెంచుకున్నారు. అబూ హుదైఫా గారి కుటుంబం దీనికి చెందినదే. ఈ తెగకు నాయకుడు అబుల్ హకమ్ బిన్ హిషామ్. అయితే ఈ ద్రోహి పేరు 'అబూ జహ్ల్'గా అందరికీ బాగా తెలుసు.

ఈ కొత్త ధర్మానికి చెందిన వార్త యాసిర్(రజి)వారి కుటుంబానికి కూడా చేరింది. మఖ్జూమ్ తెగ వారి సంరక్షణలో ఉన్న వీరికి ఆ తెగకు మరియు ఆ తెగనాయకుడైన అబూజహ్ల్‌కు ఇస్లామ్ పట్ల ఎంత ద్వేషభావముందో కూడా బాగా తెలుసు.

అయినప్పటికీ యాసిర్(రజి)వారికి ఈ కొత్త ధర్మం గురించి ప్రత్యక్షంగా ప్రవక్త(స)వారి దగ్గరే వినాలనే కోరికతో అర్ఖామ్(రజి) వారి ఇంటిలో ప్రవక్త(స)వారిని కలిశారు. ప్రవక్త(స)వారి నోటి వెంట మధురమైన సందేశాన్ని వినగానే, ఇస్లామ్ పట్ల ఆయన మనస్సు మొగ్గు చూపింది. ఆయన వెంటనే భార్య దగ్గరకి వచ్చి ఆ గొప్ప ధర్మం గురించి తాను విన్నది తెలియజేశారు.

భర్త నుండి వివరణ విన్న తరువాత ఆమె కూడా ఇస్లామ్ పట్ల సుముఖత వ్యక్తం చేశారు. వారిద్దరూ తమ కుమారులతో ఇస్లామ్ గురించి చర్చించారు. వారు కూడా తమ తల్లిదండ్రుల బాటనే ఎంచుకున్నారు. ఆ మొత్తం కుటుంబం వేగంగా ప్రవక్త(స)వారిని చేరి, ఇస్లామ్‌ను ప్రకటించింది.

ఆ సమయంలో వారికి తెలియక పోవచ్చు, **"వారి శాశ్వత జీవితం స్వర్గంలోనే గడుపబడుతుందని మరియు ప్రళయం వరకూ ఆ కుటుంబం చేసిన త్యాగం గురించి ముస్లిమ్‌లంతా చెప్పుకుంటారని."** సత్యం కోసం త్యాగం చేయడం మామూలు విషయమేమీ కాదు. అంతేకాదు, దానికి ప్రతిఫలం కూడా సాధారణ స్థాయిలో ఉండదు.

ఈ కుటుంబం ఇస్లామ్ స్వీకరించిందని తెలియగానే బనూ మఖ్జూమ్ తెగ రెచ్చిపోయింది.

యాసిర్(రజి)వారి చేత ఇస్లామ్‌ను వదిలి పెట్టేలా చేయడానికి ఆ తెగ నాయకులు ప్రయత్నించి విఫలమయ్యారు. ఆయన భార్యను కూడా అడిగారు. ఆమె నిర్భయంగా ఇస్లామ్‌పై తన విశ్వాసాన్ని వారి ముందే ప్రకటించారు. వారి అహం దెబ్బతింది. దారుణ హింసకు గురి చేస్తామని బెదిరించారు. ఆ కుటుంబం బెదిరిపోలేదు. సన్మార్గాన్ని వదిలే ప్రసక్తి లేదని, వారి హింసకు బెదిరేది లేదని స్పష్టం చేసేసారు.

వారిని గొలుసులతో కట్టి మక్కా ఎడారి ప్రాంతానికి ఈడ్చుకు పోయి మండే ఎండలో వేడి ఇసుకలో పడేశారు. వారిని కొట్టారు, తన్నారు గాని వారు ఇస్లామ్ వదలలేదు. శత్రువుల కోపం చాలా తీక్షణంగా మారింది. వయస్సు పైబడిన మహిళ అని కూడా చూడకుండా సుమయ్యా(రజి)వారిని కూడా ఘోరంగా హింసించారు. కాని హింస పెరిగే కొద్దీ, ఆమె విశ్వాస బలం కూడా పెరుగుతూనే ఉంది.

ఆ సమయానికి ముస్లిమ్ సమాజం చాలా బలహీనమైన స్థితిలో ఉంది. యాసిర్(రజి)వారి కుటుంబానికి ఏ విధమైన సహాయం చేయలేని పరిస్థితి. సకలలోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స)వారు సహితం వారికి సహాయం 'దుఆ' ద్వారానే చేయగలిగారు. ప్రవక్త(స)వారి దుఆ అంటే సాధారణమైనది కాదు. దానిని అల్లాహ్ అంగీకరిస్తారు.

తరచుగా వారిని అగ్నితో కాల్చి నీటిలో ముంచేవారు స్పృహ కోల్పేయేంతవరకూ. ఒకసారి ప్రవక్త(స)వారు ఓ ప్రాంతంగుండా వెళు తున్నప్పుడు సుమయ్యా(రజి)వారిపై లోహపు తొడుగును ఉంచి మరియు ఆమె కుటుంబ సభ్యులని మండుతున్న ఎండలో నేలపై

పరుండబెట్టడాన్ని గమనించారు.

అటువంటి శాడిస్ట్ పని చేస్తున్నందుకు మక్కా బహుదైవారాధకులు సిగ్గుపడటానికి బదులు ఆనందించేవారు. వారి దయనీయమైన స్థితిని ప్రవక్త(స)వారు చూడలేకపోయారు. వారి నుద్దేశించి చెప్పారు, **"సహనం వహించండి, ఓ యాసిర్ కుటుంబీకులారా! నిస్సందేహంగా మీకు స్వర్గం వాగ్దానం చేయబడింది."**

స్వర్గపు వాగ్దానం మరెక్కనుండో కాదు, సకలలోకాలకు కారుణ్యమైన తమ ప్రియతమ ప్రవక్త(స) వారి నుండే విన్నారు. ఆ మాటలు వారి విశ్వాస బలాన్ని పెంచాయి.

చివరికి మఖ్జూమ్ తెగ నాయకుడు అబూ జహ్ల్ వచ్చి చూసాడు సుమయ్యా(రజి)వారి విశ్వాస బలమెంతుందో.

అబూ జహ్ల్ ఆమె కుడి చేయి మరియు కుడి కాలిని ఒక ఒంటెకు మరియు ఎడమచేతిని మరియు ఎడమ కాలిని మరొక ఒంటెకు కట్టి అరిచాడు : **"ఓ సుమయ్యా(రజి)! ముహమ్మద్(స)వారి ధర్మాన్ని విడిచి పెడతావా?"**

**"ఓ అబూజహ్ల్! ఈ ఒంటెను ఒకవైపు మరియు మరొక ఒంటెను వ్యతిరేక దిశలో పోనిచ్చినా సరే నేను ముహమ్మద్(స)వారి ధర్మాన్ని ఎన్నటికీ వదలను."**

ఆమెను ఒప్పించి సన్మార్గం నుండి తప్పించడానికి ప్రయత్నించి భంగపడ్డాడు. ఆమెను భయపిస్తూ ఆమె ముఖం ముందు బరిశను కదిపాడు. కాని ఆమె వాడిని లెక్కపెట్టకుండా నవ్వి ఊరుకున్నారు. ఆ అహంకారి ఆమెకున్న ఆ అసాధారణమైన ధైర్యాన్ని చూచి సహించలేక బరిశతో ఆమె పొట్టపై పొడవడానికి కదిలాడు, కాని అతి చేతినుండి జారి ఆమె మర్మాంగాలను గాయపరచింది. ఆమె(రజి) మరణించారు.

**వాస్తవానికి ఆమె జయించారు. తొలి షహీదాగా ఆమె ఈ ప్రపంచంలో పేరు నమోదు చేసుకుని, అల్లాహ్ కరుణతో పరలోకంలో స్వర్గానికి అర్హత సాధించు కోగలిగారు. ఆమెను జయించలేక సిగ్గుతో తలదించుకున్నాడు సత్య తిరస్కారి అయిన అబూజహ్ల్. వాడికి ఇహలోకంలో అవమానం పరలోకంలో ఘోరశిక్ష.**

ఈ సంఘటన హిజ్రత్‌కు 7 సంవత్సరాలకు పూర్వం జరిగింది. తరువాత ఆమె భర్త కూడా ఖురైష్‌ల హింసకు బలైపోయారు.

ఒకసారి వారి హింసల నుండి తప్పించుకుని అమ్మార్(రజి) ప్రవక్త(స)వారిని చేరుకున్నారు. అమాయక ముస్లిములపై జరుగుతున్న ఈ వేధింపు ఎప్పటికి ఆగిపోతుందని మరియు వారు ఎప్పుడు శాంతిగా ఊపిరి పీల్చుకో గలుగుతారని, హద్దులు దాటిపోయిన వారి హింసల గురించి ఆయన ముహమ్మద్(స)వారిని ఆవేదనతో అడిగారు.

**యాసిర్ కుటుంబాన్ని నరకాగ్ని నుండి రక్షించి మేలుచేయమని అల్లాహ్‌ను ప్రార్థించి ముహమ్మద్(స)వారు అమ్మార్(రజి)వారిని ఓదార్చారు.**

తల్లిదండ్రులు ఇద్దరూ షహీదులు కావడంతో, అమ్మార్(రజి) ప్రవక్త(స)వారి ఆదరాభిమానాలలో ప్రత్యేక స్థానాన్ని సంపాదించు కున్నారు. అమ్మార్(రజి) వారిని ఆయన(స) ప్రేమగా **ఇబ్నెసుమయ్యా** అని పిలిచేవారు. ముహమ్మద్(స)వారు తరచుగా యాసిర్(రజి) కుటుంబాన్ని ప్రశంసించేవారు.

**ఇస్లామ్‌లో స్త్రీ స్థానం ఉన్నతమైనదే!** స్త్రీ ఎక్కువా? లేక పురుషుడు ఎక్కువా? అని చర్చించుకోవలసిన అవసరం లేదు. మానవ విలువల దృష్ట్యా ఇద్దరూ సమానమే అయినప్పటికీ ధర్మ పరాయణత మరియు త్యాగనిరతి ఎవరికి ఎక్కువ ఉంటే వారే ఎక్కువ. కాబట్టి అది వ్యక్తులను బట్టే ఉంటుంది గాని, పుట్టుకను బట్టి కాదు.

**ఓ మానవులారా! నిశ్చయంగా మేము మిమ్మల్ని ఒక పురుషుడు మరియు ఓ స్త్రీ నుండి పుట్టించాము మరియు మీరు ఒకరినొకరు గుర్తించు కోవడానికి మిమ్మల్ని జాతులుగా మరియు తెగలుగా చేశాము. నిశ్చయంగా మీలో ఎక్కువ దైవభీతి గలవాడే, అల్లాహ్ దగ్గర ఎక్కువ గౌరవం కలవాడు.** (ఖుర్'ఆన్ 49:13)

ఈ కుటుంబం తాము నమ్మిన ధర్మంపై స్థిరంగా ఉండటానికై తమ జీవితాలని త్యాగం చేసింది. సత్యం కొరకు మరియు పరలోకంలో ప్రతిఫలాన్ని పొందడానికే వీరు జీవించారు. ఇటువంటి వారికోసం అల్లాహ్ ఖుర్'ఆన్‌లో ఇలా చెప్పారు,

**నిశ్చయంగా, అల్లాహ్ విశ్వాసుల నుండి వారి ప్రాణాలను వారి సంపదలను కొన్నాడు. కాబట్టి నిశ్చయంగా, వారి కొరకు స్వర్గముంది. వారు అల్లాహ్ మార్గంలో పోరాడి (తమ శత్రువులను) చంపుతారు మరియు చంపబడతారు. మరియు ఇది తౌరాత్, ఇంజీల్ మరియు ఖుర్'ఆన్‌లలో ఆయన చేసిన వాగ్దానం సత్యమైనది. మరియు తన వాగ్దానాన్ని నెరవేర్చటంలో అల్లాహ్‌ను మించినవాడు ఎవడు? కావున మీరు ఆయనతో చేసిన వ్యాపారానికి సంతోషపడండి. మరియు ఇదే ఆ గొప్ప విజయం.** (ఖుర్'ఆన్ 9:111)

ఇస్లామ్‌కి శతృవూ మరియు క్రూర నాయకుడైన అబూ జహ్ల్ బద్ర్ యుద్ధంలో చంపబడ్డాడు. ముహమ్మద్(స)వారు అమ్మార్(రజి)వారికి కబురు పంపి **"నీ తల్లి మరణానికి అల్లాహ్ బదులు తీసుకున్నారు"** అని చెప్పారు.

సుమయ్యా(రజి)వారి జీవితాన్ని విపులంగా తెలియజేయాలని ఎన్నో పుస్తకాలను శోధించాము. కాని ఎక్కువ సమాచారం లభించలేదు. ప్రస్తుతానికి ఈ క్లుప్త సమాచారాన్నే ఇవ్వగలిగాము. ఇన్షాఅల్లాహ్ భవిష్యత్తులో అదనపు సమాచారం లభిస్తే తెలియజేస్తాము.

ధర్మపరాయణత, త్యాగనిరతిలో ముస్లిమ్ స్త్రీ, పురుషులు ఒకరి కొకరు పోటీపడ్డారు.

**ముస్లిమ్ సమాజం - పురుషాధిక్య సమాజం కాదు.**

**ధర్మాధిక్య సమాజం**

మరో మోమినా గురించి ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...

# ఖుర్'ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 23

**ఫి'లె సులాసీ ముజర్రద్** — **మూలం లోని ఆఖరి అక్షరం و లేక ي అయినప్పుడు** (مادّے کا آخری حرف و یا ی ہو) — فِعل ثلاثي مُجَرَّد نَاقِص

| Meaning | Urdu | | | | | |
|---|---|---|---|---|---|---|
| **పఠించుట** to recite | تلاوت کرنا | تِلَاوَة (తిలావతున్) | تَلٍ (తలిన్) | اُتْلُ (ఉత్లు) | يَتْلُو (యత్లూ) | تَلَا (తలా) |
| **పిలుచుట, ప్రార్థించుట** to call; to pray | پکارنا، بلانا | పిలుపు دُعَاء (దు'ఆఉన్) | పిలిచినవాడు دَاعٍ (దా'ఇన్) | పిలువు/ ప్రార్థించు اُدْعُ (ఉద్'ఉ) | పిలుస్తాడు/ ప్రార్థిస్తాడు يَدْعُو (యద్'ఊ) | పిలిచాడు/ ప్రార్థించాడు دَعَا (ద'ఆ) |
| **క్షమించుట** to forgo | معاف کرنا | عَفْو (అఫ్వున్) | عَافٍ ('ఆఫిన్) | اُعْفُ (ఉత్ఫు) | يَعْفُو (యత్ఫూ) | عَفَا ('అఫా) |
| **కోరుట, అర్థించుట** to want; to seek | یادتی کرنا؛ چاہنا | بَغْي (బగ్‌యున్) | بَاغٍ (బాగిన్) | اِبْغِ (ఇబ్‌గి) | يَبْغِي (యబ్‌గీ) | بَغَى (బగా) |
| **ప్రవహించుట** to flow | جاری ہونا، چلنا | جَرَيَان (జరయాన్) | جَارٍ (జారిన్) | اِجْرِ (ఇజ్రి) | يَجْرِي (యజ్రీ...?) | جَرَى (జరా) |
| **ప్రతిఫలమిచ్చుట** to reward | بدلہ دینا | جَزَاء (జజాఉన్) | جَازٍ (జాజిన్) | اِجْزِ (ఇజ్జి) | يَجْزِي (యజ్జీ) | جَزَى (జజా) |
| **తీర్పు ఇచ్చుట, నెరవేర్చుట** to decree; to fulfil | فیصلہ کرنا؛ پورا کرنا | قَضَاء (ఖజాఉన్) | قَاضٍ (ఖాజిన్) | اِقْضِ (ఇఖ్జి) | يَقْضِي (యఖ్జీ) | قَضَى (ఖజా) |
| **తగిఉండుట, తృప్తిపడుట** to suffice | کافی ہونا؛ ضرورت پوری کرنا | كِفَايَة (కిఫాయతున్) | كَافٍ (కాఫిన్) | اِكْفِ، (ఇక్ఫి) | يَكْفِي (యక్ఫీ) | كَفَى (కఫా) |
| **మార్గం చూపుట** to guide: to direct | راستہ بتانا | هُدًى (హద్‌యున్) | هَادٍ (హాదిన్) | اِهْدِ (ఇహ్‌ది) | يَهْدِي (యహ్‌దీ) | هَدَى (హదా) |
| **భయపడుట** to fear | ڈرنا، خوف کھانا | خَشْيَّة (ఖషియ్యతున్) | خَاشٍ (ఖాషిన్) | اِخْشَ (ఇఖ్‌ష) | يَخْشَى (యఖ్‌షా) | خَشِيَ (ఖషియ) |
| **తృప్తి పడుట, సంతోషంగా ఉండుట** to be satisfied, to be content | راضی ہونا؛ راضی ہونا، خوش ہونا | رِضْوَان (రిజ్వానున్) | رَاضٍ (రాజిన్) | اِرْضَ (ఇర్జ) | يَرْضَى (యర్జా) | رَضِيَ (రజియ) |
| **మరచిపోవుట** to forget | بھول جانا | نِسْيَان (నిస్‌యానున్) | نَاسٍ (నాసిన్) | اِنْسَ (ఇన్స) | يَنْسَى (యన్స) | نَسِيَ (నసియ) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.** *ఈ 23నెలల్లో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 73.3*

ఈ నెల నేర్చుకున్న పదాలు 891 (అంటే ఈ పేజీలోని పదాలు ఖుర్'ఆన్‌లో 891 చోట్ల చూడవచ్చు) **source: www.emuslim.com**

# జిన్నాలు మరియు చేతబడి

3 సీరియల్

## మనిషికుండే బలహీనతలే కొందరికి జీవనాధారం

***శారీరక లేదా మానసిక సమస్యలతో బాధపడేవారు సంబంధిత డాక్టర్‌ని సంప్రదించండి.***

క్రిందటి సంచికలో కలలలో (స్వప్నాలలో) షైతాన్ మనిషితో ఎలా ఆడుకుంటాడో మరియు వాని ఆటలు సాగకుండా ఏమి చేయమని ముహమ్మద్(స)వారు మనకు సూచించారో మొదలైన విషయాలను హదీస్‌ల ద్వారా వివరించాము. అంతేకాకుండా పూర్తి రాత్రి ప్రశాంతంగా నిద్రపోవడానికి ఆచరించవలసిన విధానం కూడా తెలియజేశాము.

రాత్రివేళలోనే కాకుండా ఇతర వేళలలో కూడా ఏయేవిధంగా షైతాన్ ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తాడో మరియు ఏయే చేష్టలు షైతాన్‌కు చెందినవో తెలియ జేసేందుకు కొన్ని ప్రామాణిక హదీస్‌లను ఈ వ్యాసంలో అందిస్తున్నాము. ప్రతీ సమస్యకు ఓ పరిష్కార మార్గముంది. ఈ వ్యాసంలో తెలియజేసే ఆ పరిష్కార మార్గాలు చాలా సులువైనవి మాత్రమే కాకుండా జ్ఞాపకం పెట్టుకోవడానికి కష్టం కానటువంటివి.

**ఎవరైనా తనకు తప్పనిసరిగా హాని కలిగించే శత్రువుని ఇంటికి పిలిచి, భోజనం పెట్టి తన ఇంటిలోనే అతడు నివశించే అవకాశాన్ని కల్పిస్తారా?**

ఎంతమాత్రం కల్పించరు.

కాని మనిషి తనకు తెలియకుండానే తనకు హాని కలిగించే షైతాన్‌కి అన్ని సౌకర్యాలు కలుగజేస్తున్నాడు. అది ఎలాగని అంటారా? క్రింది హదీస్‌లు చదవండి.

### షైతాన్‌కు ఆహారం మరియు రాత్రి గడపటానికి నివాసం

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పగా ఆయన విన్నారు : ఒక మనిషి తన ఇంటిలో ప్రవేశించినప్పుడు మరియు లోనికి ప్రవేశిస్తుండగా మరియు ఆహారాన్ని తింటుండగా **అల్లాహ్** అజ్జ వజల్ల్ పేరును ప్రస్తావిస్తే, షైతాన్ చెబుతాడు : **"రాత్రి ఉండటానికి మీకు స్థలం లేదు మరియు రాత్రి భోజనం లేదు"**. ఒకవేళ అతడు (ఆ మనిషి) ప్రవేశించి అల్లాహ్ పేరు ప్రస్తావించ లేదు. ఇంటిలో ప్రవేశించినప్పుడు, షైతాన్ చెబుతాడు : **"రాత్రి గడపటానికి మీకు స్థలం దొరికింది."** మరియు ఒకవేళ అతడు ఆహారం తినేటప్పుడు అల్లాహ్ పేరు చెప్పకపోతే అతడు (షైతాన్) అంటాడు : **"మీకు ఉండటానికి స్థలం దొరికింది మరియు రాత్రి భోజనం." (సహీహ్ ముస్లిమ్, 5262, పుస్తకం 36. అల్-అష్‌రిబ, అధ్యా. 13, సంపుటి 5)**

ఇంటిలో ప్రవేశించినప్పుడు మరియు ఆహారం తినేటప్పుడు అల్లాహ్ పేరు చెప్పడం కష్టమైన పనికాదు కదా! ఆ విధంగా చెప్పడానికి మీరు ఖర్చు పెట్టవలసింది కూడా ఏమీ లేదు కదా! నిర్లక్ష్యం వహిస్తే స్వయంగా మీరే మీ ఇంటిని ఆ రాత్రి షైతాన్‌కి నివాసంగానూ, మీ ఆహారాన్ని షైతాన్‌కి ఆహారంగానూ చేస్తూ నష్టపోతున్నారు. అంతేకాకుండా షైతాన్ ప్రభావం ఉందని చెప్పి మంత్రగాళ్ళ దగ్గరికి వెళ్ళి వందలు, వేలు ఖర్చు చేస్తున్నారు. ఆ విధంగా షైతాన్ మీ సొమ్మును వేరే మార్గంలో ఖర్చు చేయిస్తున్నాడు. మంత్రగాళ్ళకు కాకుండా మీ సొమ్మును **పేదవారి కొరకు, అభాగ్యుల కొరకు, అనాథల కొరకు** ఖర్చుపెడితే మీరు ఖర్చు పెట్టే ప్రతీ పైసా మిమ్మల్ని అల్లాహ్ అనుగ్రహానికి పాత్రున్ని చేస్తుంది.

**ప్రవక్త(స)వారు చెప్పినట్లు చేస్తే ఆహారంలో మనకు అల్లాహ్ ప్రసాదించిన శుభాన్ని పొందుతాము మరియు షైతాన్‌కి ఆహారం లేకుండా చేయగలుగుతాము, ఇన్షా అల్లాహ్.**

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: **"మీలో ఒకరు ఓ అన్నపు ముద్దను క్రింద పడవేస్తే, అతడు దానిని తీసుకోవాలి. దానిపైనుండి దుమ్ము తొలగించాలి. తరువాత అతడు దానిని తినాలి,** మరియు దానిని షైతాన్ కొరకు వదల కూడదు మరియు అతడు తన చేతిని వస్త్రంతో తుడవకూడదు తన వ్రేళ్ళను నాకేవరకూ, ఆహారంలోని ఏ భాగంలో శుభం (బరకత్) ఉందో అతనికి తెలియదు కాబట్టి.'' **(సహీహ్ ముస్లిమ్, 5301, పుస్తకం 36, అధ్యా. 18, సంపుటి 5)**

మనం తినే ఆహారంలో అల్లాహ్ వైపు నుండి శుభాలు పొందితే, ఆ ఆహారం వలన మనకెంతో మేలు కలుగుతుంది. కొంతమంది వ్యాపారం చేస్తారు. ఎంత చేసినా ఆ వ్యాపారంలో ఏదీ కలిసిరాదు. కొంతమంది ఎంత తిన్నప్పటికీ అది శరీరానికి పెద్దగా మేలు చేయదు. వీటికి కారణం వాటిలో శుభాలు లేకపోవడమే. అల్లాహ్ ఆదేశించినట్లు మరియు ముహమ్మద్(స)వారు బోధించినట్లు చేస్తే శుభాలు కలుగుతాయి.

**ఆహారాన్ని వ్యర్థం చేయకూడదు.**

మనం తింటున్న ఆహారంలో ఏ భాగంలో మనకొరకు శుభం ఉంచబడిందో మనకు తెలియదు. అది మొత్తం ఆహారంలో ఉండదు.

ఒకొక్కసారి మనం తినేటప్పుడు కొన్ని అన్నం మెతుకులు లేదా ఓ మెతుకు క్రింద పడిపోవచ్చు. ఆ పడిపోయిన వాటిలోనే శుభం ఉండి ఉండవచ్చు. చేతి వ్రేళ్ళకు అంటుకుని ఉన్నదానిని పూర్తిగా నాకిన తరువాత చేతులు శుభ్రం చేసుకోవాలి. ఆహారంగల పాత్రలను ఏదైనా ఓ పరిశుభ్రమైన వస్త్రంపైనో, చాప పైనో ఉంచి తింటే, తినేటప్పుడు దానిపై పడిన మెతుకులలకు దుమ్ము దూళి అంటుకోదు. అప్పుడు వాటిని మామూలుగా తినివేయవచ్చు. అలా కాకుండా వాటికి ఏదైనా అంటుకుంటే దానిని కడిగి లేదా తగిన విధంగా శుభ్రం చేసుకుని తినాలి. కాబట్టి ఆహారాన్ని వృథా చేయకూడదు.

మనం పిలువకుండా మన ఇంటిలోకి చొచ్చుకొని వచ్చే షైతాన్‌ని రాకుండా ఆపాలి. **కాని మేలు చేయడానికి వచ్చేవారిని ఆపకూడదు.** మనం పిలువకుండా అల్లాహ్ నుండి కారుణ్యాన్ని తీసుకువచ్చే అల్లాహ్ దూతలను (ఫరిష్తాలను) మన ఇంటిలోనికి వచ్చే విధంగా ఏర్పాట్లు చేసుకోవాలి. కాని దీనికి విరుద్ధంగా ఉంది నేటి పరిస్థితి. ఆ పరిస్థితులు అర్థం కావడానికి క్రింది హదీసును చదవండి.

అబూతల్హా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు "అల్లాహ్ దూతలు కుక్కను లేక చిత్తరువును కలిగి ఉన్న ఇంటిలోనికి ప్రవేశించరు." (సహీహ్ బుఖారీ, 3322, పుస్తకం 39, అధ్యా.11, సంపుటి 4)

మన ఇంటిలో కుక్కలు గాని, చిత్తరువులు (pictures)గాని ఉండ కూడదు. కాని అటువంటి వాటిని ఉంచడం నేడు ఎందరికో ఫ్యాషన్ అయిపోయింది. కుక్కలను పెంచడం ఓ స్టేటస్ సింబల్‌గా మారిపోయింది. రాకూడని షైతాన్ మన ఇంట్లోకి వచ్చే విధంగా అవకాశాలు కల్పించి, తప్పకుండా రావాలని మనం కోరుకునే 'అల్లాహ్ దూతలు' మన ఇంట్లోకి రాకుండా చేయడం **దౌర్భాగ్యం కాక మరేమిటి?**

## మగరిబ్ సమయంలో ఏమి చేయాలి?

*(సూర్యాస్తమయం నుండి రాత్రి మొదటి భాగం మధ్య ఉండే కాలం)*

జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : "రాత్రి రెక్కలు పరుచుకున్నప్పుడు లేక రాత్రి సమీపించినప్పుడు, మీ పిల్లలను (బయటకి వెళ్ళకుండా ఇంటిలో) ఆపండి. నిశ్చయంగా ఆ సమయంలో షైతాన్‌లు బయటికి వస్తాయి మరియు రాత్రి భాగం కొంత గడిచినప్పుడు, వారిని వెళ్ళనివ్వండి. మరియు ద్వారాన్ని (తలుపుని) మూసి వేయండి. మరియు అల్లాహ్ పేరును ప్రస్తావించండి. నిశ్చయంగా షైతాన్ మూసి ఉన్న తలుపును తెరవలేడు. మరియు నీటితిత్తులను కట్టి వేయండి మరియు అల్లాహ్ పేరును ప్రస్తావించండి మరియు మీ పాత్రలను కప్పివేసి అల్లాహ్ పేరును ప్రస్తావించండి వాటిపై ఏదో ఒకటి అడ్డుగా ఉంచినప్పటికీ (కర్రపుల్ల అయినా సరే) మరియు (చమురు) దీపాలను ఆర్పివేయండి. (**సహీహ్ ముస్లిమ్, 5250, పుస్తకం 36. అల్-అష్‌రిబహ్, అధ్యా. 12, సంపుటి 5**)

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: "మీ (పెంపుడు) జంతువులను మరియు పిల్లలను సూర్యాస్తమయం అయినప్పుడు బయటకు వెళ్ళనివ్వకండి, రాత్రి మొదటి భాగం పూర్తయ్యే వరకూ, సూర్యాస్తమయం అయినప్పుడు నిశ్చయంగా షైతాన్‌లు బయటికి వస్తాయి రాత్రి యొక్క మొదటి భాగం పూర్తయ్యే వరకూ. (**సహీహ్ ముస్లిమ్, 5253, పుస్తకం 36. అల్-అష్‌రిబహ్, అధ్యా. 12, సంపుటి 5**)

జాబిర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: "పాత్రలను కప్పివేయండి, నీటితిత్తులను కట్టివేయండి, తలుపును మూయండి మరియు (చమురు) దీపాలను ఆర్పివేయండి, **నిశ్చయంగా షైతాన్ నీటితిత్తులను విప్పనూలేడు, తలుపును తెరవనూ లేడు, పాత్రలపై కప్పిన దానిని తొలగించనూ లేడు.** మీలో ఒకరికి అతని పాత్రలపై ఉంచడానికి ఓ పుల్ల తప్ప ఏదీ దొరకకపోతే అల్లాహ్ పేరును ప్రస్తావించడానికి, అతడు అలా చేయాలి. ఎందుకంటే ఎలుక ప్రజల ఇళ్ళకు నిప్పు పెట్టవచ్చు.

ఖుతైబహ్ తన హదీస్‌లో "తలుపు మూయండి" ప్రస్తావించ లేదు. (**సహీహ్ ముస్లిమ్, 5246, పుస్తకం 36. అల్-అష్‌రిబహ్, అధ్యా. 12, సం.5**)

పెంపుడు జంతువులను, చిన్న పిల్లలను మగ్‌రిబ్ సమయంలో బయటికి పంపడం మంచిది కాదని తెలుస్తుంది. రాత్రివేళ తీసుకో వలసిన కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు ప్రవక్త(స)వారు బోధించారు.

(1) త్రాగునీరు ఆ రోజులలో అరేబియాలో నీటి తిత్తులలో భద్రపరిచేవారు. వాటిని తెరచి ఉంచకుండా వాటి మూతులను కట్టి వేయాలి. లేకపోతే షైతాన్ ఆ నీటిని కలుషితం చేస్తాడు. కట్టిన తిత్తులను షైతాన్ తెరవలేడు. ఈ రోజులలో నయితే బిందెలలో నీటిని ఉంచుతున్నారు. వాటిపై మూతలు ఉంచాలి. అల్లాహ్ పేరు చెప్పాలి. (2) పాత్రలను కప్పి ఉంచాలి. కప్పడానికి ఏదీ లేకపోతే ఓ కర్రముక్కనైనా పైన ఉంచాలి. అప్పుడు పాత్రలో నున్న వాటిని షైతాన్ ముట్టుకోలేడు. కప్పి ఉంచిన వాటి మూతలను కూడా తొలగించలేడు.

**కాని సినిమాలలో చూపించే కల్పిత సంఘటనలు ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కల్పితాన్ని చూసి భయపడటం ఎందుకు? సత్యాన్నే నమ్మాలి.**

అల్లాహ్ పేరును ప్రస్తావిస్తే సరిపోతుంది కదా! **'బిస్మిల్లాహ్'** అని ఓ చిన్న మాట చెప్పలేరా? షైతాన్‌కి ఎందుకు భయపడాలి? **అల్లాహ్ పేరును పలకనవసరం లేదని ప్రచారం చేసే మూర్ఖుల అజ్ఞానం గురించి ఇదివరకే ఎన్నోసార్లు శాంతిబాటలో వివరించాము.**

అల్లాహ్ పేరును వదిలేసి 'దేవుడు', 'దేవుడు' అనడం వలన ఏమి

కోల్పోతున్నారో, ఎంత ప్రయోజనాన్ని దూరం చేసుకుంటున్నారో ఇప్పటికైనా అర్థం చేసుకోవాలి. మానవులలో షైతాన్‌కి మిత్రులున్నారు. తమ మిత్రుడి కోసం 'అల్లాహ్' పేరును ముస్లిముల ఇళ్ళల్లో పలకనివ్వకుండా చేద్దామని వారు నిరంతరం శ్రమిస్తూనే ఉన్నారు. అటువంటి వారికి వ్యతిరేకంగా అల్లాహ్ అనుగ్రహంతో నిరంతరం వారి దుర్మార్గాన్ని శాంతిబాట కూడా బయట పెడుతూనే ఉంది.

(4) రాత్రి పడుకునే ముందు దీపాలు ఆర్పడం మరియు పొయ్యిలో నిప్పులు ఆర్పడం కూడా చాలా ముఖ్యమైన విషయం. ఒకవేళ ఏదైనా ఎలుక దీపాన్ని పడగొడితే ఆ మంట అక్కడ ఉన్న బట్టలకు అంటుకోవచ్చు. తద్వారా ఇల్లు కాలిపోయే ప్రమాదం ఉంది.

కాబట్టి పై విధంగా ప్రవక్త(స)వారు మన శ్రేయస్సు కోసం సూచించినట్లు చేస్తే, భౌతికంగానూ, మానసికంగానూ మనకు చాలా మేలు జరుగుతుంది. రోజులో ఓ 10 లేదా 15 నిమిషాలు బద్ధకించకపోతే పై పనులను చేయడం చాలా సులభం. పైసా ఖర్చులేని పని.

## అవుజు బిల్లాహి మినష్ షైతానిర్ రజీమ్

**1. దూషించే సమయంలో / కోపానికి లోనైన సమయంలో -**

సులైమాన్ బిన్ సురద్ ఉల్లేఖనం. ఇద్దరు వ్యక్తులు దూషించుకుంటున్నారు అల్లాహ్ యొక్క సందేశహరుని(స) సమక్షంలో. వారిలో ఒకరి కళ్ళు ఎర్రగా మారాయి మరియు అతడి మెడ నరాలు ఉబికాయి. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: “నాకొక పదం తెలుసు, ఒకవేళ దానిని అతడు పలికితే, దానినుండి (కోపం నుండి) బయటపడతాడు : **అవుజు బిల్లాహి మినష్ షైతానిర్ రజీమ్** (నేను అల్లాహ్ రక్షణను అర్థిస్తున్నాను శపించబడిన షైతాన్ నుండి).'' ఆ వ్యక్తి అన్నాడు : ''నన్ను పిచ్చివాడని అనుకుంటున్నారా?” **(సహీహ్ ముస్లిమ్, 6646, పుస్తకం 45. అల్-బిర్ వస్-సిలాహ్ వల్ అదబ్, అధ్యా. 30, సంపుటి 6)**

**2. గాడిద ఓండ్రపెట్టిన సమయంలో -**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు : ''ఎప్పుడైతే మీరు కోడి కూయడాన్ని వింటారో, అల్లాహ్ అనుగ్రహానికై అర్థించండి, అది అల్లాహ్ దూత (ఫరిష్తా)ను చూసింది కాబట్టి. ఎప్పుడైతే గాడిద ఓండ్ర పెట్టడాన్ని మీరు వింటారో షైతాన్ నుండి అల్లాహ్ రక్షణను వేడుకోండి, అది షైతాన్‌ను చూసింది కాబట్టి. **(సహీహ్ ముస్లిమ్, 6920, పుస్తకం 48. అల్-జిక్ర్ వల్ దు'ఆఉ వత్ తౌబా వల్ ఇస్తిఘ్ఫార్, అధ్యా. 20, సంపుటి 7)**

**3. షైతాన్ జోక్యం చేసుకుందని గ్రహించిన సమయంలో -**

ఉస్మాన్ బిన్ అబిలాస్(రజి) ప్రవక్త(స)వారి వద్దకు వచ్చి చెప్పారు: “ఓ రసూలల్లాహ్! షైతాన్ నాకు మరియు నా సలాత్ (ప్రార్థన)కు మరియు నా పఠనానికి మధ్య జోక్యం చేసుకుంటున్నాడు. మరియు అతడు నాలో గందరగోళం కలిగిస్తున్నాడు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : “అది **ఖిన్‌జబ్**గా పిలువబడే షైతాన్. మరియు నీవు దాని ప్రభావాన్ని గ్రహించినప్పుడు అతని నుండి అల్లాహ్ రక్షణను అర్థించు (అవుజు బిల్లాహి మినష్ షైతానిర్ రజీమ్) మరియు నీ ఎడమవైపు మూడుసార్లు ఉమ్మివెయ్యి (పొడిగా). అతడు చెప్పారు : “నేను ఆ విధంగా చేశాను మరియు అల్లాహ్ వానిని నా (దగ్గర)నుండి పోయేలా చేశారు.” **(సహీహ్ ముస్లిమ్, 5738, పుస్తకం 39. అస్-సలామ్, అధ్యా. 25, సంపుటి 6)**

అంటే ప్రవక్త(స)వారు చెప్పినట్లే ఆయన చేశారు. కాబట్టి షైతాన్ ఆయన విషయంలో జోక్యం కలిగించుకోకుండా అక్కడి నుండి పోయాడు.

## షైతాన్‌ని అనుకరించవద్దు

జాబిర్(రజి) ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: “ఎడమ చేతితో తినకండి, **నిశ్చయంగా** షైతాన్ ఎడమ చేతితో తింటాడు కాబట్టి.” **(సహీహ్ ముస్లిమ్, 5264, పుస్తకం 36. అల్-అష్‌రిబహ్, అధ్యా. 13, సంపుటి 5)**

మనం ముహమ్మద్(స)వారిని మాత్రమే అనుసరించాలి. అల్లాహ్ ఆదేశం ప్రకారమే ఆయన(స) జీవించారు. ఆయన(స) కుడి చేతితో తినేవారు మరియు కుడిచేతితో తినమని బోధించారు. అయితే ఇందుకు విరుద్ధంగా షైతాన్ అల్లాహ్ ఆదేశాన్ని తిరస్కరించి ఈ విరుద్ధమైన వాటిని ప్రోత్సహిస్తాడు. కాబట్టి షైతాన్‌ను ఎట్టి పరిస్థితులలోనూ మనం అనుకరించరాదు.

## పుట్టిన పిల్లవాని ఏడుపుకు కారణం

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ''పసివాని ఏడుపు అతడు పుట్టినప్పుడు షైతాన్ గిల్లడం వల్లన.” **(సహీహ్ ముస్లిమ్, 6136, పుస్తకం 43. అల్-పదాయిల్, అధ్యా. 40, సంపుటి 6)**

## షైతాన్ మనలో అనుమానాలు రేకెత్తించవచ్చు. రక్తం వలే మనలో ప్రవహిస్తాడు.

అనస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు తన భార్యలలోని ఒకరితో ఉన్నారు మరియు ఓ వ్యక్తి ఆయన(స) ప్రక్కనుండి వెళ్ళారు. ఆయన(స) అతనిని పిలిచారు మరియు అతడు వచ్చాడు మరియు ఆయన(స) చెప్పారు : “ఓ ఫలానా, ఈమె నా ఫలానా భార్య.” అతడు అన్నాడు, **“ఓ రసూలల్లాహ్! నేను ఎవరి గురించైనా అనుమానించవచ్చుగాని, మీ గురించి అనుమానపడను.”** అల్లాహ్ యొక్క సందేశహరులు(స) అన్నారు : “షైతాన్ మనిషిలో ప్రవహిస్తాడు రక్తం వలే.” తరువాయి హదీస్‌లో (5679) ఇలా ఉంది **“షైతాన్ మనిషిలో ప్రవహిస్తాడు రక్తం వలే మరియు వాడు**

**మీ హృదయాలలో ఏదైనా చెడు పుట్టించవచ్చని నేను భయ పడుతున్నాను."** **(సహీహ్ ముస్లిమ్, 5678, పుస్తకం 39, అధ్యా. 13, సం.6)**

షైతాన్ మానవులలో అనుమానాలను పుట్టిస్తాడు. ఇది చాలా ప్రమాదకరమైనది. మనలో రక్తంలా ప్రవహిస్తాడు కాబట్టి మన శరీరంలోని ప్రతీ అవయవం ద్వారా చెడు కార్యం జరిపించడానికి ప్రయత్నించే అవకాశముంది. ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా మనం చేసే ఏ పని అయినా మంచిదో లేక చెడ్డదో తెలుసుకోగలం. కాబట్టి చెడు చేయాలని తలంపు వస్తే, అది షైతాన్ ప్రభావం అని తెలుసుకోవాలి.

అదే విధంగా మనం చేసే పనులు ఎవరికైనా అనుమానం కలిగిస్తాయని మనకు అనిపించినప్పుడు వాటిని స్పష్టం చేయడం వలన, వారిలో ఆ అనుమానాలు కలుగకుండా చేసినవాళ్ళమవుతాము. ఏ వ్యక్తి ద్వారా అయితే ఆ విషయం చేరబోతుందో, ఆ వ్యక్తికే ముందుగా స్పష్టం చేసేస్తే ఇక ప్రతీ వ్యక్తికి వివరణ ఇవ్వవలసిన అవసరముండదు.

## ఆవులింతకు కారణం

సుహైల్ బిన్ అబీ సాలిహ్ ఉల్లేఖనం. అబూ స'ఈద్ ఖుద్రీ (రజి) యొక్క ఒక కుమారుడు మా తండ్రిగారికి చెబుతుండగా నేను విన్నాను. అతని తండ్రి చెప్పారు : అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు: "మీలో ఒకరు ఆవలించినప్పుడు, అతడు తన నోటిపై చేతినుంచాలి, **నిశ్చయంగా** షైతాన్ దానిలో ప్రవేశిస్తాడు కాబట్టి" **(సహీహ్ ముస్లిమ్, 7491, అధ్యా. 9, సంపుటి 7)**

అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఆవులింత షైతాన్ నుండి వస్తుంది కాబట్టి మీలో ఒకరికి ఆవులించడం అవసరమనుకుంటే, అతడు దానిని అణచుకోవాలి అతనికి సాధ్యమైనంత ఎక్కువగా." **(సహీహ్ ముస్లిమ్, 7490, అధ్యా. 9, సం.7)**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, "ఆవులింత షైతాన్ నుండి (వస్తుంది) మరియు మీలో ఎవరైనా ఆవులిస్తే, అతడు తన ఆవులింతను ఎంత ఎక్కువ వీలైతే అంతగా ఆపాలి, మీలో ఎవరైనా 'హా' అని అన్నట్లయితే, షైతాన్ నవ్వుతాడు. **(సహీహ్ బుఖారీ, 3289, పుస్తకం 39, అధ్యా.11, సం.4)**

అంటే షైతాన్ యొక్క ప్రతీ ఎత్తుగడని మనం ఆపవచ్చు, ఇన్షా అల్లాహ్! ఆవులింత వచ్చినప్పుడు చేతిని అడ్డుపెట్టుకోవడం కష్టమైన పనేమీ కాదు కదా!

## కంఠస్వరం మాత్రమే వినబడితే

సుహైల్ ఉల్లేఖనం. "నా తండ్రి నన్ను బనూ హారిసా వద్దకు పంపారు - నాతో ఉన్నది మా బానిస లేక మా స్నేహితుడు. అతనిని పేరుతో పిలుస్తూ ఓ గోడ వెనుక నుండి కంఠస్వరం వినబడింది. నాతో ఉన్న వ్యక్తి గోడపైనుండి చూచాడు. కాని ఏదీ చూడలేదు (అంటే ఏమీ కనిపించలేదు). నేను అది నా తండ్రి దగ్గర ప్రస్తావించాను. మరియు ఆయన అన్నారు : ఒకవేళ అది జరుగుతుంది అని నాకు తెలుసుంటే నేను నిన్ను పంపి ఉండే వాడిని కాదు. కాని (భవిష్యత్తులో) ఒకవేళ నీవు ఏదైనా స్వరం వింటే (మరియు ఏదీ నీకు కనిపించకుండా ఉంటే) సలాత్ యొక్క అజాన్ (సలాత్‌కై పిలుపు) పలుకు. అబూహురైరా ఉల్లేఖిస్తుండగా నేను విన్నాను, అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : సలాత్ యొక్క అజాన్ చెప్పి నప్పుడు, **నిస్సందేహంగా షైతాన్ వెంటనే పారి పోతాడు గాలి వదులుతూ."** **(సహీహ్ ముస్లిమ్, 858, పుస్తకం 4. అస్-సలాత్, అధ్యా. 8, సంపుటి 1)**

పై హదీస్ ద్వారా ఓ ప్రత్యేకమైన సందర్భంలో 'అజాన్' పలకడం వలన మేలు కలుగుతుంది.

## షైతాన్ కొన్ని ఆలోచనలు కలుగజేస్తాడు. వాటిని ఆపాలి.

హిషామ్ బిన్ ఉర్వా ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు: "షైతాన్ మీలో ఒకరి దగ్గరికి వచ్చి అడగవచ్చు : 'ఎవరు ఆకాశాలను సృష్టించారు? ఎవరు భూమిని సృష్టించారు? మరియు అతడు చెబుతాడు "అల్లాహ్". **(సహీహ్ ముస్లిమ్, 344, పుస్తకం 1. అల్-ఈమాన్, అధ్యా.60, సంపుటి 1)**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు : షైతాన్ ఒక వ్యక్తి దగ్గరకు వచ్చి అడుగుతాడు : "ఫలానా-ఫలానా ఎవరు సృష్టించారు?". అతనిని వాడు అడుగుతూనే ఉంటాడు (ఇలా ప్రశ్నించే) వరకూ : "ఎవరు నీ ప్రభువును సృష్టించారు?" అది (ఆ విధంగా ప్రశ్నించడం) అంతదూరం వరకూ వెళితే, ఆ (ప్రశ్నలు వింటున్న) వ్యక్తి అల్లాహ్ నుండి రక్షణ అర్థించాలి మరియు అటువంటి ఆలోచనలను ఆపాలి. **(సహీహ్ ముస్లిమ్, 345, పుస్తకం 1. అల్-ఈమాన్, అధ్యా.60, సంపుటి. 1)**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) నాతో చెప్పారు : "వారు నిన్ను ఎల్లప్పుడూ అడుగుతూనే ఉంటారు, ఓ అబూహురైరా, వారు (చివరకు ఇలా) చెప్పే వరకూ! **ఈయన అల్లాహ్, కాని అల్లాహ్‌ను ఎవరు సృష్టించారు?"** అతడు (అబూహురైరా) చెప్పారు : "నేను మస్జిద్‌లో ఉండగా, కొందరు ఎడారివాసులు నా దగ్గరకు వచ్చి అడిగారు : "ఓ అబూహురైరా, ఈయన అల్లాహ్, కాని అల్లాహ్‌ను ఎవరు సృష్టించారు?" **అతడు కొన్ని రాళ్ళబెడ్డలను చేతిలోకి తీసుకుని మరియు వారివైపు విసిరి**, ఆయన అన్నారు : "లేవండి! లేవండి! నా మిత్రుడు(స) సత్యం చెప్పారు." **(సహీహ్ ముస్లిమ్, 349, పుస్తకం 1. అల్-ఈమాన్, అధ్యా.60, సంపుటి 1)**

కొన్ని విషయాలలో వాదనలు పెట్టుకోకూడదు. అక్కడి నుండి వారిని

దూరంగా పంపాలి. లేదా మనమైనా దూరంగా వెళ్ళిపోవడం మంచిది. మన రాష్ట్రంలో మునాఫిక్‌లు (కపట విశ్వాసులు) అధిక సంఖ్యలో ఉన్నారు. వారు చాలామంది మునాఫిక్‌లను తయారుచేస్తున్నారు. ఖుర్‌ఆన్ మరియు హదీస్‌లపై ప్రజలకు అనుమానపు ఆలోచనలు కలిగేలా ప్రయత్నిస్తున్నారు. అటువంటివారితో **'మేము అల్లాహ్‌ను విశ్వసించాము'** అని చెప్పి అక్కడి నుండి తప్పుకోవడమే మేలు.

## షైతాన్‌ని ఏడిపించవచ్చు. ఎలా?

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ఆదమ్ కుమారుడు (అంటే మానవుడు) సజ్దా యొక్క ఆయత్ పఠిస్తాడు మరియు సజ్దా చేస్తాడు, **షైతాన్ అక్కడి నుండి వెళ్ళి ఏడుస్తాడు** మరియు (ఇలా) చెబుతాడు : ''వాని పాడుగాను'' - మరియు అబూకురైబ్ ఉల్లేఖనాన్ని బట్టి ''నా పాడుగాను, ఆదమ్ కుమారుడు సజ్దా చేయమని ఆదేశించబడ్డాడు మరియు అతడు సజ్దా చేశాడు. కాబట్టి స్వర్గం అతనిది. నేను సజ్దా చేయాలని ఆదేశించబడ్డాను మరియు నేను తిరస్కరించాను. కాబట్టి నరకాగ్ని నాది. **(సహీహ్ ముస్లిమ్, 244, పుస్తకం 1. అల్-ఈమాన్, అధ్యా.35, సంపుటి 1)**

అల్లాహ్ గురించి మరియు స్వర్గం - నరకం గురించి మానవుల కంటే ముందుగానూ మరియు బాగా తెలిసింది షైతాన్‌కే. వాడికి ఆ విషయాలలో ఎటువంటి సందేహం లేదు. మానవుడు సృష్టించబడటానికి ముందే షైతాన్ ఉన్నాడు. అల్లాహ్ పట్ల ఎంతో భయభక్తులు గలవాడు షైతాన్. అయితే తొలి మానవుడైన ఆదమ్(అ)వారి ముందు సజ్దా చేయమంటే, ఫరిష్తాలు చేశారు గాని షైతాన్ అహంకారంతో చేయలేదు. ఆ విధంగా అల్లాహ్ యొక్క ఒకే ఒక ఆదేశాన్ని తిరస్కరించడం వలన పరలోకంలో శపించబడి అక్కడ నుండి బహిష్కరించబడి భూమిని చేరుకున్నాడు. నరకం వాడికి నిర్ణయమై పోయింది. ఇక్కడ ఒక ముఖ్య విషయాన్ని గమనించాలి. అల్లాహ్ యొక్క ఏ ఒక్క ఆదేశాన్ని కూడా తిరస్కరించకూడదు.

అల్లాహ్ ఏ విధంగానైతే ఆదేశించారో ఆ విధంగా ఈ భూమిపై ముస్లిములు అల్లాహ్‌కు సజ్దా చేస్తారు. ఏ విధంగా అయితే షైతాన్ అల్లాహ్ ఆదేశాన్ని తిరస్కరించి శపించబడ్డాడో ఓ మానవుని కారణంగా, అదే విధంగా మానవుని చేత అల్లాహ్‌కు సజ్దా చేయకుండా ఆపడానికి షైతాన్ మరియు వాని అనుచరులు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటారు. ఎంతోమంది అమాయకులు షైతాన్ వలలో పడిపోయి సలాత్ (నమాజ్)లు చేయడం మానివేశారు. అల్లాహ్‌కు సజ్దా చేసి, తద్వారా అల్లాహ్ అనుగ్రహాన్ని పొందడమే కాకుండా, షైతాన్‌ని ఏడిపించవచ్చు కూడా. కాని **అలా చేయడానికి బదులు షైతాన్‌కి భయపడి ప్రజలు ఏడుస్తున్నారు.** ఏడిపించ వలసింది పోయి, ఏడుస్తుండటం నేటి ప్రజల దౌర్భాగ్యం.

ఒక సందర్భంలో... అల్లాహ్ యొక్క సందేశహరులు(స) (ఉమర్ గారితో) చెప్పారు, ''ఎవరి చేతులలో నా ఆత్మ ఉందో ఆయన సాక్షి, ఎప్పుడైనా నీవు ఒక దారిలో వెళుతుండటం షైతాన్ చూస్తే, వాడు నీది కాని (మరో) మార్గంలో వెళతాడు.'' **(సహీహ్ బుఖారీ, 3294, పుస్తకం 39, అధ్యా.11, సంపుటి 4)**

కాబట్టి అల్లాహ్ పట్ల మనకుండే భయభక్తులతో (తఖ్వాతో) షైతాన్‌ని ఏడిపించవచ్చు మరియు భయపెట్టవచ్చు. అయితే దీనికి విరుద్ధంగా ప్రజలు భయపడుతున్నారంటే, వారి తఖ్వా ఏ స్థాయిలో ఉందో ఓసారి ఆలోచించుకోవాలి!

## షైతాన్ మనచేత మన సోదరునికి హాని కలిగించవచ్చు

హమ్మామ్ బిన్ మునబ్బిహ్ చెప్పారు : ''అల్లాహ్ యొక్క సందేశహరులు(స) నుండి అబూహురైరా(రజి)వారు ఇదే మాకు ఉల్లేఖించారు'' మరియు ఆయన ఎన్నో హదీస్‌లను ప్రస్తావించారు వాటిలో ఒకటి : ''అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు: మీలో ఎవ్వరూ మీ సోదరునివైపు ఆయుధం యొక్క మొన ఉంచరాదు, మీకు తెలియదు బహుశా షైతాన్ అతని చేయిజారేలా చేయవచ్చు (తద్వారా ఆయుధం గుచ్చుకుని సోదరుడు చనిపోవచ్చు) మరియు అతడు నరకపు గోతిలో పడిపోవచ్చు.'' **(సహీహ్ ముస్లిమ్, 6668, పుస్తకం 45, అల్-బిర్ర్, అధ్యా. 35, సంపుటి 6)**

ఒకొక్కసారి చిన్న విషయాలే పెద్ద ప్రమాదానికి దారితీస్తాయి. ఇహలోకం లోనూ మరియు పరలోకంలోనూ మనకు నష్టాన్ని కలిగించవచ్చు. అటువంటి విషయాలను ఎన్నింటి గురించో ప్రవక్త(స)వారు మనల్ని ముందుగానే హెచ్చరించారు.

## పగటివేళ రక్షణ

క్రిందటి సంచికలో రాత్రివేళ పూర్తిగా షైతాన్ నుండి అల్లాహ్ రక్షణ పొందడానికి ఖుర్‌ఆన్ ఆయత్‌లను అందించడం జరిగింది. పగలు కూడా షైతాన్ నుండి రక్షణ పొందడానికై పఠించ వలసిన వాటిని దిగువున ఇచ్చాము.

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, **"ఒకరు రోజులో 100సార్లు "లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లాషరీక లహు, లహుల్ ముల్కు వ లహుల్ హమ్‌దు వ హువ అలా కుల్లి షైఇన్ ఖదీర్"** (ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప. ఆయన ఒక్కరు మరియు ఆయనకు భాగస్వామి లేడు. (విశ్వ) సామ్రాజ్యాధిపత్యం ఆయనదే మరియు ఆయనకే సమస్త పొగడ్తలన్నీ, మరియు ఆయనే ప్రతీదీ చేయగల సమర్థుడు'', (అని) చెబితే పదిమంది బానిసలకు విముక్తి కలిగించినంత పుణ్యం లభిస్తుంది మరియు వంద సత్కార్యాలు అతని ఖాతాలో వ్రాయబడతాయి, మరియు ఒక వంద చెడుకార్యాలు అతనివి తుడిచి వేయబడతాయి అతని ఖాతా

నుండి, మరియు ఆ రోజు ఉదయం నుండి సాయంత్రం వరకు షైతాన్ నుండి అతడు రక్షింపబడతాడు. మరియు ఎవరూ అతని కంటే అధికం కాదు, అతని కంటే ఎక్కువ చేసినవాడు తప్ప." **(సహీహ్ బుఖారీ, 3293, పుస్తకం 39, అధ్యా.11, సంపుటి 4)**

ఒక్కటి ముఖ్యంగా గుర్తు పెట్టుకోండి. మీరు వందసార్లు చదివినప్పుడు, చదువుతున్న ప్రతీసారి చదివే ప్రతీ పదం మీకు అర్థమయ్యేలా, కంఠస్థం చేయడం మంచిది.

## షైతాన్ మన పిల్లలను సమీపించకుండా మరియు వశపరచుకోకుండా మనం ఏమి చేయాలి?

చిన్న పిల్లలను మగ్‌రిబ్ సమయంలో బయటకు వదలవద్దని చెప్పిన విషయాలను ముందు పేజీలలో చెప్పుకున్నాము. నేడు **చాలామంది భార్యాభర్తలకు తెలియని ఒక ముఖ్యమైన విషయం ఉంది.** ఆ విషయాన్ని తెలుసుకుని, తదనుగుణంగా వారు ఆచరిస్తే పిల్లలకు ఎంతో రక్షణ ఉంటుంది.

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, "మీలో ఎవరైనా తన భార్య దగ్గరకి (శారీరకంగా కలవడానికి) వస్తే, "బిస్మిల్లా, అల్లాహుమ్మ జన్నిబ్ నష్షైతాన వ జన్నిబిష్ షైతాన మా రజఖ్‌తనా" (అల్లాహ్ పేరుతో, ఓ అల్లాహ్! మమ్మల్ని షైతాన్ నుండి రక్షించు మరియు నీవు మాకివ్వబోయే సంతానాన్ని షైతాన్ నుండి రక్షించు) చెబితే మరియు (ఆ దువా చేసుకున్న సమయంలో జరిగిన కలయిక వలన) అతనికి సంతానం కలిగితే, షైతాన్ దానికి (ఆ సంతానానికి) హాని కలిగించడు." **(సహీహ్ బుఖారీ, 3271, పుస్తకం 39, అధ్యా.11, సం.4)**

ఇబ్నె అబ్బాస్(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, "మీలో ఎవరైనా తన భార్య దగ్గరికి (శారీరకంగా కలవడానికి) వస్తే, "ఓ అల్లాహ్! షైతాన్ నుండి నన్ను రక్షించు, మరియు షైతాన్‌ని ఆపు నీవు మాకివ్వబోయే సంతానాన్ని సమీపించకుండా" (అని) చెబితే మరియు ఆ స్త్రీ గర్భాన్ని ధరిస్తే, **షైతాన్ ఆ బిడ్డకు హానిగాని, వానిని వశపరచుకోవడం గాని చేయలేడు.**" (సహీహ్ బుఖారీ, 3283, పుస్తకం 39, అధ్యా.11, సంపుటి 4)

**క్రింది ఖుర్'ఆన్ వాక్యంలో మర్యమ్(అ) తల్లిగారు చేసిన దుఆ ఉంది**

ఇమ్రాన్ భార్య ప్రార్థించింది : "ఓ నా ప్రభూ! నిశ్చయంగా, నేను నా గర్భము నందున్న శిశువును నీ సేవకు అంకితం చేయటానికి మొక్కుకున్నాను, కావున నా నుండి దీనిని తప్పక స్వీకరించు. నిశ్చయంగా, నీవే సర్వం వినేవాడవు, సర్వజ్ఞుడవు." తరువాత ఆమె ఆడశిశువు (మర్యమ్)ను ప్రసవించినప్పుడు, ఆమె ఇలా విన్నవించు కున్నది : "ఓ నా ప్రభూ! నేను ఆడశిశువును ప్రసవించాను" - ఆమె ప్రసవించినదేమిటో అల్లాహ్‌కు బాగా తెలుసు మరియు బాలుడు బాలిక వంటివాడు కాడు - **"మరియు నేను ఈమెకు మర్యమ్ అని పేరు పెట్టాను. మరియు నేను ఈమెను మరియు ఈమె సంతానాన్ని శపించబడిన షైతాన్ నుండి రక్షించడానికి, నీ శరణు వేడుకుంటున్నాను."** (ఖుర్'ఆన్ 3:35-36)

స'ఈద్ బిన్ ముసైయిబ్ ఉల్లేఖనం. అబూహురైరా(రజి)వారు చెప్పారు. "ప్రవక్త(స)వారు చెప్పారు, 'పుట్టిన ఏ బిడ్డనైనా అది పుట్టగానే షైతాన్ ముట్టుకుంటాడు, అది (బిడ్డ) ఏడుస్తుంది గట్టిగా షైతాన్ చేత ముట్టుకోబడినందుకు, మర్యమ్ మరియు ఆమె కుమారుడిని తప్ప ... అబూహురైరా(రజి)వారు తరువాత చెప్పారు, "పఠించు, నీవు కోరితే ... "మరియు నేను ఈమెను మరియు ఈమె సంతానాన్ని శపించబడిన షైతాన్ నుండి రక్షించడానికి, నీ శరణు వేడుకుంటున్నాను. (ఖుర్'ఆన్ 3:36)" **(సహీహ్ బుఖారీ, 4548, పుస్తకం 65. అత్-తఫ్సీర్, అధ్యా.2, సంపుటి 6)**

మర్యమ్(అ)వారి తల్లిగారు చేసిన దు'ఆ ఫలితంగా, షైతాన్ మర్యమ్(అ)వారిని మరియు ఆమె కుమారుడైన ఈసా(అ)వారిని ముట్టుకోలేదు. **మీకు పుట్టబోయే బిడ్డను కూడా షైతాన్ ముట్టుకోకుండా** ఉండాలంటే ప్రవక్త(స)వారు చేసిన దు'ఆ చదవండి.

## మరికొన్ని షైతాన్ చేష్టలు

అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం. ప్రవక్త(స)వారి వద్ద చెప్పబడింది, ఒక వ్యక్తి రాత్రి నుండి ఉదయం వరకూ పడుకున్నాడు (అంటే సూర్యోదయం అయిపోయే వరకూ). ప్రవక్త(స)వారు చెప్పారు, "ఇతడే ఆ వ్యక్తి అతని చెవులలో షైతాన్ మూత్రం పోశాడో." మరొక రివాయత్‌లో ఒక చెవిలో అని చెప్పారు. **(సహీహ్ బుఖారీ, 3270, పుస్తకం 39, అధ్యా.11, సంపుటి 4)**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశ హరులు(స) చెప్పారు, "మీరు నిద్రపోతుండగా, షైతాన్ మీ ప్రతీ ఒక్కరి తల వెనుక మూడు ముడులు వేస్తాడు, మరియు అతడు ప్రతి ముడికి జోకొడుతూ అక్కడ ఇలా చెబుతాడు, "రాత్రి చాలా పొడవైనది కాబట్టి నిద్రపో." ఆ వ్యక్తికి మెళుకువ వచ్చి అల్లాహ్‌ను జ్ఞాపకం చేసుకున్నట్లయితే ఒక ముడి ఊడిపోతుంది, మరియు అతడు వుదూ చేసుకున్నప్పుడు రెండవ ముడి విడిపోతుంది మరియు అతడు సలాత్ చేసినప్పుడు అన్ని ముడులు విడిపోతాయి మరియు అతడు ఉదయం చురుగ్గా మరియు మంచి హృదయంతో మంచి తీరులో నిద్ర లేస్తాడు, లేకపోతే బద్ధకంగా మరియు మంచి మనస్సుతో కాకుండా మరియు మంచి తీరు కాకుండా లేస్తాడు." **(సహీహ్ బుఖారీ, 3269, పుస్తకం 39, అధ్యా.11, సంపుటి 4)**

అబూహురైరా(రజి)వారి ఉల్లేఖనం. ప్రవక్త(స)వారు చెప్పారు, "మీలో ఎవరైనా నిద్ర నుండి లేచి వుదూ చేస్తే, అతడు తన ముక్కు లోనికి నీరు తీసుకుని దానిని చీదాలి మూడుసార్లు.

ఎందుకంటే షైతాన్ అతని ముక్కు పైభాగాన రాత్రంతా ఉంటాడు.'' **(సహీహ్ బుఖారీ, 3295, పుస్తకం 39, అధ్యా.11, సంపుటి 4)**

ఉదయం లేచినప్పుడు, పగటివేళ రక్షణ కొరకు, ఇంట్లో ప్రవేశించినప్పుడు, భోజనం చేసేముందు, భార్యాభర్తలు కలిసేముందు, మగరిబ్ వేళలో, ఆవులించినప్పుడు మొ॥న సందర్భాలలో ఏమేమి చేయాలో ఈ వ్యాసంలో వివరంగా చెప్పడం జరిగింది. చాలా సులభమైన ఈ పనులు అలవాటు చేసుకోండి.

ఈ పనుల వలన అల్లాహ్ నుండి రక్షణ మాత్రమే కాకుండా, సవాబ్ (పుణ్యం) కూడా లభిస్తుంది. మీ ఇండ్లను షైతాన్‌కు నిలయాలుగా కాకుండా, అల్లాహ్ యొక్క దూతలు ప్రవేశించేలా జాగ్రత్త పడండి.

**మీరు ఏ మాంత్రికుడి దగ్గరకు వెళ్ళనవసరం లేదు. మరియు ఆ విషయంలో నయాపైసా ఖర్చు కూడా చేయనవసరం లేదు.**

*మరికొంత భాగం ఇన్షాఅల్లాహ్ వచ్చే సంచికలో ...*

## మానసిక వ్యాధులు

ఎన్నో మానసిక వ్యాధులను అర్థం చేసుకోక పోవడం వలన లేక వాటిపై సరియైన అవగాహన లేకపోవడం వలన దయ్యం పట్టిందని, జిన్నులు / షైతాన్‌లు పట్టాయని, చేతబడి జరిగిందని భావించి సకాలంలో సరియైన వైద్యాన్ని అందించకపోవడం వలన ఎన్నో కుటుంబాలు నాశనమై పోతున్నాయి.

అల్లాహ్ దయవలన నేడు ఎన్నో మానసిక వ్యాధులు విజయవంతంగా నయం చేయబడుతున్నాయి.

మెంటల్ హాస్పిటల్ అనగానే అందరికీ నోటిలో నానే పదం 'పిచ్చాసుపత్రి'. పిచ్చిని నయం చేసే డాక్టర్‌గారిని పిచ్చి డాక్టరు అని వెటకారంగా మాట్లాడడం వింటూ ఉంటాం. వాస్తవానికి ఈ ఆరోగ్యశాల పిచ్చివారి కోసమే కాదు, మానసిక వ్యాధులున్న రోగులందరి కోసం. ఇది మానసిక వైద్యశాల.

**శరీరానికి రోగం వచ్చినట్లే మనస్సుకు కూడా రోగం వస్తుంది. ఒక మనిషి ఆరోగ్యంగా ఉన్నాడని చెప్పాలంటే అతడి శారీరక ఆరోగ్యం బాగున్నంత మాత్రాన సరిపోదు. మానసిక ఆరోగ్యం కూడా బాగుండాలి.**

ప్రపంచ ఆరోగ్య సంస్థ (W.H.O.) నిర్వచించిన దాని ప్రకారం ఆరోగ్యం అంటే అది పూర్తిగా శారీరక, మానసిక, సామాజిక క్షేమానికి సంబంధించినది. మరియు అది కేవలం వ్యాధిలేకపోవడమో లేక శారీరక బలహీనత లేకపోవడం మాత్రమో కాదు.

తనకున్న సామర్థ్యమేమిటో తాను తెలుసుకోగలగాలి. జీవితంలో సాధారణంగా ఎదురయ్యే ఒత్తిడులకు తట్టుకోగలగాలి. మానసిక ఆరోగ్యం గురించి ప్రతీ ఒక్కరూ ఆలోచించాలి. కేవలం మానసిక రుగ్మత కలిగినవారు మాత్రమే కాదు.

అల్లాహ్ ఆదేశించినట్లు మరియు ముహమ్మద్(స)వారు బోధించినట్లు ఆచరణ ఉంటే, పరిపూర్ణ ఆరోగ్యాన్ని (శారీరక, మానసిక, సామాజిక ఆరోగ్యం) తప్పనిసరిగా నూటికి నూరుపాళ్ళు పొందవచ్చు. హదీస్‌లను అధ్యయనం చేసేవారికి ఈ విషయం చాలా స్పష్టంగా తెలుస్తుంది.

**మానసిక ఆరోగ్య సమస్యలు సమాజం మొత్తాన్ని ప్రభావితం చేస్తాయి. ఇది ప్రపంచాభివృద్ధికే సవాల్ అవుతుంది. ఏవర్గమూ మానసిక వ్యాధుల విషయంలో రక్షణ కలిగి లేదు.**

ఇది ఎక్కువగా పేదవారిలో, నిరుద్యోగులలో, నిరాశ్రయులలో, తక్కువ చదువుగలవారిలో, హింసకు బలైనవారిలో, వలస వచ్చినవారిలో, శరణార్థులలో, మోసపోయిన లేదా అవమానించబడిన స్త్రీలలో, పిల్లలలో, బాల్యానికి మరియు యౌవన దశకు మధ్యలో ఉన్నవారిలో

**ఉదయం నుండి సాయంత్రం వరకూ రక్షణ**

لا اِلهَ اِلّا اللهُ وَحدَهُ لا شَرِيکَ لَهُ، لَهُ المُلکُ ولَهُ الحَمدُ و هُوَ علی کُلِّ شَيءٍ قَدِيرٌ

**లా ఇలాహ ఇల్లల్లాహు వహ్‌దహు లాషరీక లహు లహుల్ ముల్‌కు వ లహుల్ హమ్‌దు**

**వ హువ అలా కుల్లి షైఇన్ ఖదీర్**

**ఆరాధ్యుడు లేడు అల్లాహ్ తప్ప, ఆయన ఒక్కరు మరియు ఆయనకు భాగస్వామి లేడు.**

**(విశ్వ) సామ్రాజ్యాధిపత్యం ఆయనదే మరియు ఆయనకే సమస్త పొగడ్తలన్నీ.**

**మరియు ఆయనే ప్రతీదీ చేయగల సమర్థుడు.**

మరియు వృద్ధాప్యంలో పోషణకు నోచుకోని వారిలో బాగా ప్రబలి ఉన్నాయి.

- ప్రపంచవ్యాప్తంగా నేడు 45 కోట్ల మంది మానసిక లేదా నడవడిక రుగ్మతలతో బాధపడుతున్నారు.
- 15 కోట్ల కంటే ఎక్కువమంది మానసిక ఒత్తిడి (డిప్రెస్సన్)కి ఏదో ఒక సమయంలో లోనవుతున్నారు.
- దాదాపు 10 లక్షల మంది ప్రతీ సంవత్సరం ఆత్మహత్య చేసు కుంటున్నారు.
- దాదాపు 2 కోట్ల 50 లక్షల మంది సిజోఫ్రెనియాతో బాధపడు తున్నారు.
- దాదాపు 3 కోట్ల 80 లక్షల మంది ఎపిలెప్సీతోనూ మరియు
- 9 కోట్ల కంటే ఎక్కువమంది మద్యం లేక మత్తుమందుల వాడకం వలన వివిధ రుగ్మతలకు లోనవుతున్నారు.
- ప్రతీ నాలుగు కుటుంబాలలోని ఒక కుటుంబంలో కనీసం ఒక వ్యక్తికి మానసిక వ్యాధి ఉంది.

కాబట్టి ఈ మానసిక వ్యాధులు ఎంత ముఖ్యమైనవో ఆలోచించండి.

### Psychiatric Disorders

సైకియాట్రిక్ డిజార్డర్ అనేది ఓ వ్యాధి. అది ఒక వ్యక్తి యొక్క ప్రవర్తనలో, ఇతరులతో ముచ్చటించడంలో మరియు దైనందిన జీవితంలో చేసే పనులలో జోక్యం చేసుకుంటుంది. DSM (The Diagnostic and Statistical Manual of Mental Disorders) సైకియాట్రిక్ వ్యాధులను వర్గీకరించింది. DSM-IV-TR యొక్క మానసిక వ్యాధుల జాబితా :

- Adjustment disorders
- Anxiety disorders
- Delirium, dementia, amnestic, and other cognitive disorders
- Disorders usually first diagnosed in infancy, childhood or adolescence, such as learning disorders or communication disorders
- Dissociative disorders
- Eating disorders
- Factitious disorders
- Impulse-control disorders
- Mental disorders due to a general medical condition
- Mood disorders
- Other conditions of clinical importance
- Personality disorders
- Schizophrenia and other psychotic disorders
- Sexual and gender identity disorders
- Sleep disorders
- Somatoform disorders
- Substance-related disorders

**పై మానసిక వ్యాధులను కలిగినవారు మానసిక వైద్యనిపుణుడిని సంప్రదించకపోవడానికి కారణం బహుశా సిగ్గు, నిరాకరణ, భయం లేదా ఇతర కారణాలు ఏమైనా కావచ్చు. కాని తొలి దశలోనే డాక్టర్‌ని సంప్రదిస్తే చాలా తొందరగా సంపూర్ణ మానసిక ఆరోగ్యాన్ని పొందే అవకాశం ఉంది.**

కొన్ని కేసులలో అయితే, మానసిక వ్యాధి గలవారి వలన ఆ వ్యక్తికే కాకుండా ఇతరులకు కూడా ప్రమాదముంటుంది.

మానసిక వ్యాధి లక్షణాలు అకస్మాత్తుగా కనిపించేవి కావు. అలా అకస్మాత్తుగా కనిపించడం చాలా అరుదుగా జరుగుతుంది. చాలా కేసులలో, ఈ లక్షణాలు కాలక్రమేణా అభివృద్ధి చెందుతూ ఉంటాయి.

ఒక వ్యక్తిలో ఏదైనా తేడా గమనించగలిగేది ముఖ్యంగా ఆ వ్యక్తి యొక్క స్నేహితులు మరియు కుటుంబ సభ్యులు. అంటే వీరు ఆ వ్యాధిని పూర్తిగా బయటపడకముందే గమనించ గలుగుతారు. కాబట్టి ముందుగానే సైక్రియాట్రిస్ట్‌ను సంప్రదించడం వలన చాలా మేలు జరుగుతుంది. తక్కువ మెడిసిన్‌తో నయం కాబడుతుంది. ఆ వ్యక్తి కెరియర్ ఎక్కువ నష్టం కాకుండా కాపాడబడవచ్చు.

సైక్రియాట్రిస్ట్‌ని కలవడం సిగ్గుగా భావించకూడదు. సైక్రియాట్రిస్ట్ దగ్గరికి కేవలం పిచ్చి ఉన్నవారే వెళ్ళరు. జ్వరం వస్తే సిగ్గుపడకుండా డాక్టర్ దగ్గరికి ఎలా వెళతామో అదే విధంగా మానసికంగా వచ్చే చిన్న చిన్న రుగ్మతలను కూడా డాక్టర్ గారితో సంప్రదించవచ్చు. కొన్ని కేసులలో మెడిసిన్ అవసరం లేకుండానే అమూల్యమైన సలహాలతో నయం చేసే అవకాశం కూడా ఉంది. అయితే **సైక్రియాట్రిస్ట్‌ని మీ శ్రేయస్సు కోరే ఓ స్నేహితుడిగా భావించాలి.**

ఈ మానసిక వ్యాధులకు ఖచ్చితమైన కారణం చెప్పడం కష్టం. ఈ సబ్జక్టులో ప్రావీణ్యం గలవారు నమ్మేదేమిటంటే ఇవి వారసత్వం మరియు కొన్ని అనుకోని సంఘటనల/ప్రవర్తనల/పరిస్థితుల సమిష్టి ఫలితం కావచ్చు అని. ఒకటి మానసిక వ్యాది అని మరొకటి శారీరక వ్యాధి అని వేర్వేరుగా వాటి రెండింటి మధ్య ఖచ్చితంగా ఓ గీత గీయలేము. **వాటి మధ్య తేడా ఇంకా అస్పష్టంగానే ఉంది.** పరిశోధనలు జరుగుతూనే ఉన్నాయి.

పై జాబితాలో పేర్కొన్న మానసిక వ్యాధులలో ఒక్కొక్క దానిని క్లుప్తంగా ఉదాహరణలతో **ఇన్షా అల్లాహ్ వచ్చే సంచిక నుండి అందిస్తాము.**

భార్యాభర్తల నుద్దేశించి ఖుర్'ఆన్‌లో అల్లాహ్ ఇలా తెలియజేస్తున్నారు :


వారు మీకు వస్త్రాలు, మీరు వారికి వస్త్రాలు (2:187) | They are clothing for you and you are clothing for them | هُنَّ لِبَاسٌ لَّكُمْ وَأَنتُمْ لِبَاسٌ لَّهُنَّ




అల్లాహ్ యొక్క సందేశహరులు (స) చెప్పారు : (సహీహ్ ముస్లిమ్, 3649, పుస్తకం 17, అధ్యా.19, సంపుటి 4)

**"ఈ ప్రపంచం తాత్కాలిక సుఖం. ప్రపంచంలోని తాత్కాలిక సుఖాలన్నింటికంటే ఉత్తమమైనది ధర్మపరాయణురాలైన స్త్రీ (భార్య)"**

*వస్త్రాలు నగ్నత్వం నుండి కాపాడుతూ మనకు గౌరవాన్నిస్తాయి. అదే విధంగా భార్య గౌరవాన్ని భర్త మరియు భర్త గౌరవాన్ని భార్య కాపాడాలి. కుటుంబంలో భార్యాభర్తలకు వేర్వేరు బాధ్యతలున్నాయి. వారి మధ్య హెచ్చుతగ్గుల గురించి ఆలోచించ వలసిన అవసరం లేదు. ఇద్దరిలో ఎవరికీ ఎక్కువ తఖ్వా ఉంటుందో, ఎవరు తమ బాధ్యతను అల్లాహ్ ఆదేశించిన దాని ప్రకారం నిర్వర్తిస్తారో వారికే అల్లాహ్ దృష్టిలో ఎక్కువ విలువ ఉంటుంది. కాబట్టి భార్యాభర్తలు ధర్మ పరాయణతలో, బాధ్యతలను నిర్వహించడంలో, ఒకరి గౌరవాన్ని మరొకరు కాపాడటంలో పోటీపడాలి. భార్యాభర్తల సంబంధంలో > (ఎక్కువ), < (తక్కువ), = (సమానం) వంటి గుర్తులు ఉండవలసిన అవసరం లేదు. కొన్ని విషయాలలో భర్త అధికుడైతే, మరికొన్ని విషయాలలో భార్య ఆధిక్యత వహిస్తుంది. సంతోషంగా బ్రతకవలసిన ఎన్నో కుటుంబాలు చీలిపోయి విడాకుల కోసం పరితపించడమో, మానసిక క్షోభకు గురికావడమో జరుగుతుంది. సలాత్ (నమాజ్) ఎలా చేయాలీ, సౌమ్ (ఉపవాసం) ఎలా ఉండాలీ, ఖుర్'ఆన్‌ను అరబీలో ఎలా చదవాలీ, ఈ విషయాలు తెలుసుకుంటే చాలు అని నేటి ముస్లిమ్ సమాజంలోని స్త్రీలు అనుకుంటున్నారు. వివాహం జరిగినప్పుడో లేక జరిగిన తరువాతైనా సరే ఒక ఇల్లాలిగా తాను నిర్వహించవలసిన బాధ్యతలేమిటో, వాటి గురించి అల్లాహ్ ఏమి ఆదేశించారో తెలుసుకోవడానికి ప్రయత్నించడం లేదు. తల్లి తన కుమార్తెకు బంగారు నగలు, బట్టలు, ఇతర సామాన్లు ఇవ్వడం గురించి ప్రాధాన్యత ఇస్తుంది గాని, తన కూతురు ఇహలోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా బ్రతకడం కోసం అవసరమైన శిక్షణ ఇవ్వడం లేదు. ఓ మాతృమూర్తి తన కుమార్తె వివాహ సమయాన ఎటువంటి విషయాలు చెప్పి, భర్తతో పంపారో ఈ వ్యాసంలో చదవండి. మహిళ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తిస్తే ఓ గొప్ప సమాజం మన ముందుంటుంది.*




క్రిందటి సంచికలో పరిచయ వ్యాసం ద్వారా ఓ మాతృమూర్తి తన కుమారుని చదువువిషయంలో మరియు మరో మాతృమూర్తి తన కుమార్తె వైవాహిక జీవితం విషయంలో ఎటువంటి శ్రద్ధ తీసుకున్నారో మరియు ఇస్లామ్‌లో స్త్రీ స్థానాన్ని క్లుప్తంగా వివరించడం జరిగింది.

ఈ సంచిక నుండి ఒక స్త్రీ యుక్తవయస్సు నుండి మరణం వరకూ ఆమెకున్న హక్కుల సాధన మరియు బాధ్యతల నిర్వహణ ఏ విధంగా ఉండాలో ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల వెలుగులో చర్చించ బడుతుంది, ఇన్షా అల్లాహ్.

## వివాహం ఎందుకు?

అందరికీ తెలిసిన విషయమే అయినప్పటికీ, మరోసారి గుర్తు చేసుకుందాం - ఈ భూమిపై అడుగుపెట్టిన తొలి మానవ జంట

ఆదమ్(అ) మరియు హవ్వా(అ). వీరిద్దరూ భూమిపై జన్మించలేదు, పరలోకంలో సృష్టించబడ్డారు. వారికి సంతానం కలిగింది ఈ భూమిపైనే. అక్కడి నుండి మానవజాతి అభివృద్ధి జరిగింది. (శాంతిబాట జనవరి, 2011 సంచిక చదవండి)

స్త్రీ, పురుషుల కలయిక లేకుండా మానవజాతి లేదు. ఆ కలయిక కోసం వివాహం తప్పనిసరి. అది సృష్టికర్త విధించిన ధర్మం. యుక్త వయస్సుకు చేరిన తరువాత ఓ స్త్రీ మరియు ఓ పురుషుని మధ్య జరిగే ఒప్పందమే వివాహం. ఆ ఒప్పందానికి సాక్ష్యులు తప్పనిసరి. అటువంటి ఒప్పందం ద్వారా ఓ కుటుంబం ఏర్పడుతుంది. వివాహానికి పూర్వం వారిద్దరివి వేర్వేరు జీవితాలు. వివాహ బంధం ద్వారా వారిద్దరిదీ ఉమ్మడి జీవితం అవుతుంది. ఆ విధంగా వారు జీవిత భాగస్వాములు.

అంతేకాకుండా, వారిద్దరి మధ్య ఉండేది కేవలం యాంత్రిక సంబంధం కాదు. కేవలం పిల్లలకు జన్మనిచ్చే యంత్రాలు కాదు భార్యాభర్తలంటే. వారిరువురికి ఒకరిపై మరొకరికి హక్కులున్నాయి. ఆ హక్కులు కూడా వారు నెరవేర్చ వలసిన బాధ్యతలపైనే ఆధారపడి ఉన్నాయి. కాబట్టి బాధ్యతలు వదిలేసి తమ తమ హక్కుల గురించే మాట్లాడలేరు.

సృష్టికర్త తమపై ఉంచిన బాధ్యతలను నిర్వహిస్తూ భర్త తన భార్య హక్కులను గౌరవిస్తూ వాటిని భంగపరచకుండా ఉంటే, అదే విధంగా భార్య తన భర్త హక్కులకు భంగం కలిగించకుండా గౌరవిస్తే, వారి మధ్య నున్న వివాహబంధం అల్లాహ్‌చే ఆశీర్వదించబడుతుంది. అది వారి జీవితాన్ని సంతోషమయం చేస్తుంది.

**"ఆయనే, మిమ్మల్ని ఒకే వ్యక్తి నుండి సృష్టించాడు మరియు అతని నుండియే జీవిత సౌఖ్యం పొందటానికి అతని భార్యను పుట్టించాడు..."**
(ఖుర్‌ఆన్ 7:189)

అంటే భార్యాభర్తలు రెండు వేర్వేరు శరీరాలను కలిగి ఉన్నారు గాని, వారిద్దరూ వేర్వేరు కాదు.

## వివాహ వయస్సు

ఇది చాలా ముఖ్యమైన విషయం. ఈ విషయాన్నే ప్రముఖంగా చెబుతూ, ఇస్లామ్‌పై మరియు ముహమ్మద్(స)వారిపై కొందరు దుష్ప్రచారం చేస్తున్నారు. కనుక ఈ విషయం కాస్త వివరంగా ఇక్కడ చర్చించడం జరిగింది.

ప్రతీ దేశంలోనూ స్త్రీ, పురుషులకు కనిష్ఠ వివాహ వయస్సును నిర్ణయించారు. మన దేశంలో స్త్రీకి కనీసం 18 సం॥లు, పురుషునికి కనీసం 21 సం॥లు నిండి ఉండాలి. అంటే ఈ వయస్సుకు ముందుగా వివాహాలు చేసుకోవడం చట్టవిరుద్ధం. స్త్రీ వివాహ వయస్సు జపాన్‌లో 13 సం॥లు, చైనాలో స్త్రీ, పురుషులకు కనీసం 14 సం॥లు నిండి ఉంటే చాలు. 12 సం॥ల వయస్సులో ఆడపిల్ల వివాహం కొన్ని దేశాలలో ఇప్పటికీ చట్టబద్ధమే.

అమెరికాలోని అన్ని రాష్ట్రాలలోనూ వివాహానికై ఒకే వయోపరిమితి లేదు. ఆ దేశంలోని ఐయోవా, ఇండియానా, అర్కాన్‌సస్ రాష్ట్రాలలో వివాహానికి కనిష్ఠ వయోపరిమితి 14 సం॥లు.

ఇక **తల్లిదండ్రులు అంగీకరిస్తే** అమెరికాలోని Massachusetts రాష్ట్రంలో 12 సంవత్సరాలకే ఆడపిల్ల వివాహం చేసుకోవచ్చు. HAWAII (హవాయి) రాష్ట్రంలో అయితే తల్లిదండ్రుల **అంగీకారం లేకపోయినా సరే** 16 సంవత్సరాలకే వివాహాలు చేసుకోవచ్చు.

**ఇక కాలిఫోర్నియా రాష్ట్రంలోనయితే, తల్లిదండ్రుల అనుమతి ఉంటే చాలు, ఏ వయస్సులోనైనా పిల్లలు పెళ్లి చేసుకోవచ్చు. అంటే తల్లిదండ్రులు ఒప్పుకుంటే 5 సం॥లకు కూడా వివాహం చేసుకోవచ్చు!**

ఎన్నో ప్రయత్నాల తర్వాత, 1886 సం॥లో **అమెరికాలో స్త్రీ యొక్క కనిష్ఠ వివాహ వయస్సును 7 సం॥ల నుండి 10 సం॥లకు పెంచారు**. కాని ఆ దేశంలోని డెలవేర్ రాష్ట్రంలో మాత్రం 7 సం॥ల కనిష్ఠ వయోపరిమితిని అప్పటికి అలాగే ఉంచేశారు.

అంటే ఓ 100 సం॥ల క్రితం అమెరికాలో వివాహ వయస్సు 7 నుండి 10 సం॥లు మాత్రమేనని స్పష్టంగా తెలుస్తుంది. అమెరికాలో ఒకో రాష్ట్రంలో ఒకో చట్టం ఉందన్నమాట. 100 సం॥ల క్రితం బ్రిటన్‌లో కనిష్ఠ వివాహ వయస్సు 11 సం॥లే.

ముహమ్మద్(స)వారు జీవించిన కాలంలో అరేబియాలో వివాహ వయస్సు ఎలా ఉండేదో క్రింద ఉదాహరణ పూర్వకంగా వివరించడం జరిగింది.

### వధూవరుల వయస్సులలో మిక్కిలి వ్యత్యాసం ఆ రోజుల్లో సర్వ సాధారణమైన విషయం

1. ముహమ్మద్(స) వారి తొలి వివాహం : ముహమ్మద్(స) వారు తన కంటే వయస్సులో 15 సం॥లు ఎక్కువున్న విధవరాలైన ఖదీజా(రజి)ని వివాహమాడారు. అప్పటికి ఆమె వయస్సు 40 సం॥లు.

2. జైద్ బిన్ హారిసా(రజి) తనకు దాదాపు 20 - 25 సం॥ల వయస్సు ఉన్నప్పుడు దాదాపు 55 సంవత్సరాల వయస్సున్న ఉమ్మె అయ్‌మన్(రజి)వారిని వివాహం చేసుకున్నారు. వీరిద్దరి వయోబేధం దాదాపు 30 - 35 సం॥లు ఉంటుంది. ఈ మహిళ ఎవరో తెలుసా? ముహమ్మద్(స) వారి తల్లిగారికి సేవకురాలు. ముహమ్మద్(స) వారిని పెంచిన సేవకురాలైన ఈమెను, ముహమ్మద్(స) వారిచే పెంచబడిన జైద్ బిన్ హారిసా(రజి) వారు వివాహం చేసుకున్నారు.
   ఇక్కడ **వధువు** - ముహమ్మద్(స) వారిని పెంచిన మహిళ. **వరుడు** ముహమ్మద్(స) వారిచే పెంచబడినవారు.
   (ముహమ్మద్(స) వారికి దాదాపు 44 సం॥ల వయస్సున్నప్పుడు జైద్(రజి) వివాహం జరిగింది. ప్రవక్త(స) వారి వయస్సును బట్టి జైద్(రజి) వారి వయస్సు మరియు ఉమ్మె అయ్‌మన్(రజి) వారి వయస్సు అంచనా వేయడం జరిగింది. వారి ఖచ్చిత వయస్సు అల్లాహ్‌కే తెలుసు.)

3. ఉమర్(రజి)వారు, తన గారాల కుమార్తెయైన హఫ్సా(రజి)వారి భర్త చనిపోయిన తరువాత, ఆమెకు రెండవ వివాహం చేయదలచారు. అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారితో ఆయన తన కుమార్తెను వివాహం చేసుకోమని అడిగారు. ఆయన అంగీకరించక పోవడంతో ఆవేదన చెందారు. అబూబక్ర్ సిద్దీఖ్(రజి)వారు ఉమర్(రజి)వారి కంటే పెద్దవారు. తన గారాల కుమార్తెను, తన కంటే 10 సం॥లు పెద్దవారైన స్నేహితునికిచ్చి వివాహం చేయడానికి ఉమర్(రజి) ప్రయత్నించారంటే, అప్పటి కాలపు పరిస్థితులను అర్థం చేసుకోవాలి. ఆ రోజుల్లో ఇటువంటి వివాహాలు సర్వసామాన్యం.

4. ముహమ్మద్(స) తాతగారి పేరు అబ్దుల్ ముత్తలిబ్. ఈయన కుమారుని పేరు అబ్దుల్లా. ఈయనే ముహమ్మద్(స) వారి తండ్రి. అబ్దుల్ ముత్తలిబ్ గారు, తన కుమారుని వివాహాన్ని 'ఆమినా బిన్తె వహ్బ్' తో చేశారు. ఈమె ముహమ్మద్(స) వారి తల్లిగారు. ఈమె యొక్క కజిన్ 'హాలా'ను అబ్దుల్ ముత్తలిబ్‌గారు తన కుమారునితో వివాహం జరిపించిన రోజునే వివాహం చేసుకున్నారు. హాలా వారి వయస్సు, ముహమ్మద్(స) వారి మాతృమూర్తి గారి వయస్సు దాదాపు సమానం. **అంటే తన కొడుకు వివాహం జరిగిన రోజునే తన కోడలు వయస్సున్న ఓ అమ్మాయిని ఆయన వివాహం చేసుకున్నారు.**

5. ప్రవక్త(స)వారి ముఖ్య అనుచరుడు మరియు రెండవ ఖలీఫా అయిన 'ఉమర్(రజి)', అలీ(రజి) వారి కుమార్తెను వివాహమాడారు. ఆమెను వివాహం చేసుకునే సమయానికి, ఉమర్(రజి) వారి వయస్సు ఆమె తాతగారి వయస్సంత ఉంటుంది.

పై విషయాలను బట్టి, 1400 సం॥ల క్రితం అరేబియాలో స్త్రీ తనకంటే బాగా చిన్న వయస్సున్న వ్యక్తిని గాని, లేదా బాగా పెద్ద వయస్సున్న వ్యక్తిని గాని వివాహం చేసుకున్నారని, అదే విధంగా పురుషుడు తనకంటే వయస్సులో పెద్దయైన మహిళనుగాని లేదా చిన్న వయస్సులోనున్న **యువతిని** గాని వివాహం చేసుకున్నారని స్పష్టంగా తెలుస్తుంది.

ముహమ్మద్(స) వారికి 25వ యేట వివాహం జరిగింది కదా! ఆయన(స)కు ప్రవక్త పదవి 40 సం॥లకి లభించింది. ఈ 15 సం॥ల మధ్య కాలంలోనే ఆయనకు ఒక కుమారుడు పుట్టి చనిపోవడం, ఆ తరువాత నలుగురు కుమార్తెలు పుట్టడం, వారిలో ముగ్గురు కుమార్తెలకు వివాహాలు కూడా అయిపోవడం జరిగింది. అంటే చిన్న వయస్సులలోనే ముగ్గురి కుమార్తెల వివాహాలను ప్రవక్త(స) జరిపించారని తెలుస్తుంది.

ఇప్పటికే ప్రపంచంలోని వివిధ దేశాలలో నిర్ణయించిన వివాహ వయస్సుల గురించి వివరించడం జరిగింది. ఏ ప్రాతిపదికన ఈ వివాహ వయస్సులు నిర్ణయించారు? అని అడిగితే వారి దగ్గర సరియైన సమాధానం ఉండదు.

**అసలు వివాహ వయస్సును ఎలా నిర్ణయించాలి?**

వివాహం ద్వారా ఓ కుటుంబం తయారౌతుంది. కుటుంబానికి సంబంధించి రెండు ముఖ్యమైన అంశాలున్నాయి. అవి :

(1) కుటుంబం సజావుగా నడవడానికి కావలిసిన 'సంపాదన'

(2) ఇంటిని చక్కదిద్దుకోవడం.

ఇంటిని చక్కదిద్దడం అంటే సామాన్యమైన విషయం కాదు. వంట చేసి, బట్టలుతికితే సరిపోదు. పిల్లలకు తొలి బడి అమ్మ ఒడి కదా! పిల్లలకు సభ్యతా సంస్కారాలు నేర్పే తొలి గురువు కూడా అమ్మే! అందుకే '**ఊయల ఊపే అమ్మ చేతులే ఊళ్ళు ఏలతాయి**' అంటారు. నేటి ఆధునిక స్త్రీ తనకున్న ఈ గొప్ప గౌరవ బాధ్యత నుండి తప్పుకుని సంపాదనా మార్గం పట్టడంతో కుటుంబాలు ఛిన్నాభిన్నమై పోతున్నాయి. పిల్లలలో సభ్యతాసంస్కారాలు కానరావటం లేదు.

ఇలాంటి విపరీత పరిస్థితులు రాకుండా ఉండేందుకు, పురుషుడు 'సంపాదన' బాధ్యతను స్వీకరించవలసి ఉంటే, స్త్రీ ఇంటి బాధ్యతలను స్వీకరించవలసి ఉంది. రెండూ ముఖ్యమైనవే.

**పైన చెప్పినట్టుగా స్త్రీ పురుషులపై ఉన్న బాధ్యతలను దృష్టిలో ఉంచుకుని, వారి వివాహ వయస్సును నిర్ణయించవలసి ఉంది.**

**పురుషుని వివాహ వయస్సు :** పురుషుడు సంపాదనాపరుడు అయ్యాకనే వివాహం చేసుకోవాలి. కాబట్టి పురుషుని వివాహ వయస్సు విషయంలో వివిధ సమాజాల మధ్య వ్యత్యాసం ఉంటుంది. ఖచ్చితంగా ఫలానా వయస్సులోనే వివాహం చేసుకోవాలి అని చెప్పడం కష్టం.

ఉదాహరణకు చదువుకుని, ఆ చదువుల ద్వారా ఉద్యోగం పొంది సెటిల్ అవ్వాలను కునేవారు, ప్రస్తుతం 25 సం॥లు పైబడ్డాకనే వివాహాలు చేసుకుంటున్నారు. చిన్న వయస్సులలోనూ, అలాగే పెద్ద వయస్సులలోనూ చేసుకునే పెళ్ళిళ్ల సంఖ్య బాగా తక్కువే.

**ఈ రోజుల్లో అన్ని రంగాలలోనూ పోటీ పెరిగింది. జీవితంలో సెటిల్ కావడానికి ఎక్కువ సమయం పడుతుంది. అంటే యుక్తవయస్సు వచ్చేసినా సరే, వివాహం ఆలస్యంగా చేసుకోవలిసిన పరిస్థితి ఏర్పడింది.**

ఓ 50 లేదా 100 సం॥ల క్రితం, ఇప్పటికంటే చిన్న వయస్సులలోనే మగవారి పెళ్లిళ్లు జరిగేవి. ఆ రోజుల్లో 10వ తరగతి చదివితే, మంచి ఉద్యోగం లభించేది. ఈ రోజుల్లో M.Sc., M.A., M.Com. లు చదివినా, వాటితో పాటు ఏ డాక్టరేట్ డిగ్రీయో ఉండవలసిన ఆవశ్యకత ఏర్పడింది.

**కాబట్టి మగవాని వివాహ వయస్సు కాలాన్ని బట్టి మరియు ఉపాధి లభ్యమయ్యే మార్గాలను బట్టి, మరియు ప్రాంతాలను బట్టి మారుతూ ఉంటుంది.**

**స్త్రీ వివాహ వయస్సు :** ఏ స్త్రీ అయినా సరే, ఆమె డాక్టర్ అయ్యాకనో లేదా పోస్ట్‌గ్రాడ్యుయేట్ అయిన తర్వాతనో పెళ్లి చేసుకుంటానంటే, అందులో అభ్యంతరం చెప్పవలసిందేమిలేదు. ఖచ్చితంగా ఫలానా వయస్సులోనే ఆమె వివాహం చేసుకోవాలన్న నియమమేమీ లేదు.

**స్త్రీ చదువుకుంటే సమాజమంతా చదువుకున్నట్లేనని మహాప్రవక్త ముహమ్మద్(స) వారు ప్రబోధించారు.**

ఈ రోజున LKG, UKG నుండి మొదలై 30 సం॥ల వయస్సు వచ్చేవరకూ చదువుకునేందుకు ఎన్నో రకాల కోర్సులున్నాయి. కాని ఓ 50 సం॥ల క్రితం, ఏ స్త్రీ అయినా సరే 10వ తరగతి చదువుకుంటే చాలు, ఆమెను విద్యావంతురాలు అనేవారు. మరో 100 సం॥లు వెనక్కి వెడితే, అన్ని సంవత్సరాల చదువు కూడా స్త్రీకి అవసరం రాలేదు. చదవడం, వ్రాయడం వస్తే చాలు అనుకునేవారు.

అలాగే అప్పట్లో కుటుంబంలో భార్యాభర్తలిరువురు ఉద్యోగం చేయవలసిన అవసరం లేదు. ఇప్పుడు కూడా కొన్ని కుటుంబాలలో అవసరం లేకపోయినా చేస్తున్నారు. వ్యాపారాలలో మరియు వారి పనులలో భర్తకు తమ వీలైనంతమేర చేదోడుగా భార్యలుఉండేవారు. చిన్నతనం నుండే కాయకష్టం చేసేవారు. ఆయా కాలాలలో స్త్రీకి యుక్తవయస్సు రాగానే వివాహం చేసేవారు. అప్పట్లో స్త్రీ కుటుంబాన్ని ఎలా చక్కదిద్దాలో తన తల్లి దగ్గర నేర్చుకునేది. అదే వివాహం చేసుకోవడం కొరకు స్త్రీకి ముఖ్య అర్హతగానూ మరియు ముఖ్యమైన విద్యగానూ ఉండేది.

మగవాని వివాహ వయస్సు సంపాదనతో ముడిపడి ఉండటంతో, అతనికి యుక్త వయస్సు వచ్చినా సరే వివాహం చేసుకునే అవకాశం లేకపోయేది.

కాని స్త్రీకి సంపాదించవలసిన అవసరం లేదు కాబట్టి, ఆమెకు యుక్త వయస్సు రాగానే వివాహం జరిపేవారు.

**ఈ యుక్త వయస్సు అనేది ప్రపంచవ్యాప్తంగా ఒకటేనా?**

ఒకే ఊరిలో ఉండే, ఒకే రకమైన తెగవారిలో కూడా బాలికలందరూ ఒకే వయస్సులో పుష్పవతులు అవ్వరు కదా! పుష్పవతి అయ్యే వయస్సుకూడా కాలాన్ని బట్టి, మరియు ప్రాంతాన్ని బట్టి మారుతూ ఉంటుంది. జాతుల బట్టి కూడా మారుతుంటుంది.

పుష్పవతి అయిన తర్వాత బాలిక, యుక్తవయస్సు వచ్చిన యువతిగా మారుతుంది. ఆరోగ్యవంతురాలై యుండి శారీరక ధారుడ్యంకల బాలిక రజస్వల అయిన తర్వాత పెళ్లికి అర్హత పొందుతుంది.పుష్పవతి కావడమనేది సాధారణంగా ఏ వయస్సులో జరగవచ్చు మరియు వాటికి సంబంధించిన కొన్ని వైద్య శాస్త్ర విషయాలు తెలుసుకోవడం కూడా ఈ సందర్భంగా చాలా అవసరం. పుష్పవతి కావడం అంటే 'యవ్వనవతి' కావడం. అసలైన తెలుగులో చెప్పాలంటే, 'పెద్దమనిషి' కావడం.

**ఈ యవ్వనం ఎప్పుడు వస్తుంది ?**

న్యూయార్క్ నుండి ఒక స్త్రీ, తన కూతురి సమస్యకు పరిష్కారం కోసం అలన్ గ్రీన్ అనే డాక్టర్‌గారికి ఇ-మెయిల్ ఇవ్వడం జరిగింది. ఆ సోదరి యొక్క సమస్య ఏమిటంటే :

**"తన కూతురుకి 9 సం॥ల వయస్సునుండే బహిష్టు అవుతుందని, తన వయస్సుకు సమానమైన పిల్లలకంటే పొడవుగా ఉందని మరియు ఆమె ఎద 7 సం॥ల వయస్సునుండే అభివృద్ధి చెందుతుండటం వలన భయపడి, తన కూతురి పెరుగుదలలో ఏదైనా మార్పు వస్తుందా?"** అని

అంటే ఆమె కూతురు 9 సం॥లకే యవ్వనవతి అయింది. 7 సం॥ల నుండే యవ్వనానికి సంబంధించిన లక్షణాలు ఆమె తన కుమార్తెలో గమనించారు.

ఈ సోదరి ప్రశ్నకు జవాబుగా డాక్టర్ గారు కొన్ని ముఖ్యవిషయాలను తెలియజేశారు. (1) యవ్వనం సాధారణంగా ఎప్పుడు రావచ్చో (2) శీఘ్రంగా యవ్వనవతి అయితే ఎలాంటి పరిస్థితులలో ఆ యువతికి వైద్యపరీక్షలు చేయించాలో (3) ఎవరి విషయంలో వైద్య పరీక్షల యొక్క అవసరం లేదో మొదలైన విషయాలను తెలియజేశారు.

వాటిని క్లుప్తంగా ఇక్కడ అందిస్తున్నాము.

కొంతమంది బాలికలు శీఘ్రంగా యవ్వనాన్ని (**Precocious Puberty**) పొందుతారు. అమెరికాలో నివశించే Caucasian* బాలికలలో ఎద మరియు మర్మాంగంపై వెంట్రుకలు (pubic hair) పెరగడం 7 సం॥ల లోపే ఆరంభమౌతుంది. ఇదే దేశంలో నివశిస్తున్న ఆఫ్రికన్ బాలికలలో అయితే ఈ పెరుగుదల 6 సం॥ల లోపే జరుగుతుంది. అయితే ఈ ఆఫ్రికన్ బాలికల యొక్క మెడికల్ కండిషన్‌ని పరీక్ష చేయవలసి ఉందని చెబుతున్నారు.

కాని 6 సం॥ల తర్వాత యవ్వనవతి అయిన వారిలో ఆరోగ్య సమస్యలు ఉండడం చాలా అరుదని చెప్పారు.

ఈ శీఘ్రయవ్వనమనేది బాలికలలో 7 లేదా 8 సం॥లకు ముందుగా, అలాగే బాలురలో 9 సం॥లకు ముందుగా వస్తుంది. అంతేకాకుండా, ఈ శీఘ్ర యవ్వనం బాలురలో కంటే బాలికలలోనే 10 రెట్లు సామాన్యం అని చెప్పడం జరిగింది.

ఐదున్నర సంవత్సరాల వయస్సులో గర్భిణీ కావడం రిపోర్ట్ చేయబడిందని డాక్టర్‌గారు చెప్పారు. థాయ్‌లాండ్‌లో 9 సం॥లకే ఓ అమ్మాయి బిడ్డను కన్నది. పెరు లోని లిమా ప్రాంతంలోని 'లినా మెడినా', 5 సంవత్సరాల 7 నెలలకే సిజేరియన్ ద్వారా బిడ్డను ప్రసవించింది.

సాధారణంగా చాలా ప్రాంతాలలో 10 నుండి 13 సంవత్సరాల మధ్య బాలికలు పుష్పవతులౌతారు. అయితే వీరి ఎదుగుదల కోసం ఏ దృగ్విషయం కారణమౌతుందో, అటువంటి దృగ్విషయమే 8 సం॥ల వయస్సులో పుష్పవతి అయిన యువతి ఎదుగుదలలో కూడా కారణమౌతుంది అని 'అక్టా పిడియాట్రికా' అనే మరో జర్నల్‌లో జనవరి 2007లో (Vol. 93(7), p. 874-879) రిపోర్ట్ చేయడం జరిగింది.

కాబట్టి బాలికలకు 'యవ్వనం' 6 సం॥ల నుండి 13 సం॥ల మధ్య

ఎప్పుడైనా రావచ్చు. 7 సం॥లు దాటాక 'యవ్వనం' పొందిన బాలికలలో శీఘ్రయవ్వనం మూలంగా వచ్చే ఆరోగ్య సమస్యలు ఏమీ ఉండవు. అంతేకాకుండా, సెక్స్‌పరమైన అభివృద్ధి ఏ వయస్సులోనైనా ప్రారంభం కావచ్చు. ఐదున్నర సంవత్సరాలకే బిడ్డను కన్నవారున్నారు. 9 సం॥లకు బిడ్డను కన్నవారున్నారు. బాలిక 'పెద్దమనిషి' కావడం సాధారణ పరిస్థితులలో అయితే, 10 సం॥ల నుండి 13 సం॥ల మధ్యలో జరుగుతుంది. **ఎప్పుడైతే బాలిక 'యువతి' అయిందో, నెల నెలా రుతుస్రావం మొదలైందో, ఆమెకు గర్భధారణ సామర్థ్యం ఉన్నట్లే. అలా అయితేనే రుతుస్రావం మొదలౌతుంది.**

**పుష్పవతి అయిన వెంటనే యువతికి వివాహం చెయ్యవచ్చా?**

ప్రస్తుత డాక్టర్లు అలాంటి వివాహం ఆమెకు ప్రమాదమని చెబుతున్నారు. ప్రమాదమా? నిజమేనా?

కొందరు స్త్రీలు 25 సం॥లు పైబడిన తర్వాత వివాహం చేసుకుని, దాంపత్య జీవితం ప్రారంభమయ్యాక వారు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మరియు గైనిక్ సమస్యల గురించి డాక్టర్ సలహాల కోసం పత్రికలను సంప్రదించడం చూస్తూనే ఉన్నాం.

ఇదిలా ఉంటే, పల్లెటూర్లలో కాయకష్టం చేసుకుంటూ బ్రతుకుతూ, పుష్పవతి అయిన ఒకటి, రెండు సంవత్సరాల లోపునే వివాహం చేసుకుని, పిల్లలను కని ఆరోగ్యంగా జీవించే స్త్రీలు కూడా ఉన్నారు.

వీటిని బట్టి తెలిసేదేమిటంటే, సమస్యలు అనేవి స్త్రీ యొక్క శరీరతత్త్వంపై, ఆమె యొక్క ఆరోగ్యంపై ఆధారపడి ఉంటాయి గాని కేవలం వయస్సుపై మాత్రమే కాదు.

రెండు సంవత్సరాల క్రితం 'సాక్షి' దినపత్రికలో 'ఫ్యామిలీ' ఎడిషన్‌లో విజయవంతులైన 60 సం॥ల పైబడిన మహిళల గురించి ఎన్నో ఆర్టికల్స్‌ని చదివాం. వారికి చిన్నతనంలోనే పెళ్లిళ్లు అయ్యాయన్న విషయాలు తెలిసాయి. ఆ మాతృమూర్తుల గురించి వారి సంతానం చాలా గొప్పగా చెప్పడం కూడా చదివాం. ఓ రిటైర్డ్ ఉద్యోగి తన తల్లి గురించి గొప్పగా చెబుతూ, ఆమెకు కుమారుడిగా పుట్టడం తన అదృష్టంగా చెప్పుకొచ్చారు. ఆమె ఇంకనూ బ్రతికే ఉన్నారు. ఆమె స్వాతంత్ర్య పోరాటంలో కూడా పాల్గొన్నారు. చిన్న వయస్సులోనే ఆమె భర్త మరణించారు. ప్రముఖ హిందీ నటి, షర్మిలాఠాగూర్ గారు వారి అమ్మమ్మగారికి 5వయేట వివాహం జరిగిందని చెప్పారు. ఈ ఉదాహరణలన్నీ కూడా ఓ 100 సం॥ల లోపున జరిగినవే.

**అంటే చిన్న వయస్సులోనే వివాహాలు చేసుకుని, సంతోషంగా జీవితాన్ని గడిపిన మాతృమూర్తులెందరో ఉన్నారు. వైద్యపరమైన సమస్యలను నేడు కనుగొంటున్నారు. నేడు కొందరు స్త్రీలలో సమస్యలున్నాయి. కాబట్టి, ఆ రోజుల్లోనూ అటువంటి సమస్యలు ఉండవచ్చని డాక్టర్ల ఊహ కావచ్చు. అంతే!**

వంద సంవత్సరాల పూర్వం 10 సంవత్సరాల వయస్సుగల బాలికతో ఇప్పటి 10 సంవత్సరాల బాలికను పోలిస్తే, వారి మధ్య బేధం ఉంటుందా? ఉండదా? మీరే చెప్పండి.

వంద సంవత్సరాల క్రితం బాలిక, ఇప్పటి బాలిక కంటే ఖచ్చితంగా బలంగా ఉంటుంది. ఈ రోజున మనం తినే ఆహారం, త్రాగే నీరు, పీల్చే వాయువు అన్నీ కూడా కలుషితమై పోయాయి. కల్తీ అధికం. కృత్రిమ ఆహారం. ఈ రోజు చిన్న వయస్సులోనే బి.పి., షుగర్ సమస్యలు వస్తున్నాయి. కాస్త మసాలా ఎక్కువవేసి వండితే, తిన్నవారికి ఎసిడిటీ సమస్య. అంతా బలహీనమే!

200 సం॥ల క్రితం లేదా 300 సం॥ల క్రితం లేదా మరింత వెనక్కి అంటే ఓ వెయ్యి సంవత్సరాల క్రితం మనుష్యులు ఎలా ఉండి ఉంటారు? ఖచ్చితంగా మనకంటే చాలా బలంగా ఉండి ఉంటారు. అందులో ఎటువంటి సందేహం లేదు.

కాబట్టి 1400 సం॥ల క్రితం జీవించిన ముహమ్మద్(స) వారి కాలంలో వివాహానికి సంబంధించిన ముఖ్యమైన విషయాలు మూడు:

1. మగవాడు సంపాదనాపరుడై యుండాలి. భార్యాబిడ్డలను పోషించగలగాలి. అతడు యుక్తవయస్కుడై యుండాలి. అతని వయస్సు స్త్రీ వయస్సు కంటే ఎక్కువైనా, తక్కువైనా వివాహ విషయంలో ఎటువంటి పట్టింపులూ లేవు.
2. స్త్రీ పుష్పవతి అయివుండాలి. ఆమె తనను పోషించగలిగిన భర్తను ఎన్నుకుంటుంది. స్త్రీ పెద్ద వయస్సు మహిళ అయివుండి, తనకన్నా చిన్న వయస్సున్న వ్యక్తిని గాని లేదా తన కంటే పెద్ద వయస్సుగల వ్యక్తిని గాని వివాహం చేసుకోవచ్చు.
3. భర్త చనిపోయి వైధవ్యం పొందిన మహిళలు కూడా వివాహం చేసుకునేవారు.

అంటే ఇస్లామ్ ప్రకారం, ఓ అమ్మాయి తనకు యుక్త వయస్సు వచ్చిన తరువాత తనకిష్టమైనప్పుడు, ఉదాహరణకు ఎప్పుడైనా చేసుకోవచ్చు. చదువు పూర్తయ్యాక ఏ 25 సంవత్సరాలలో నిండిన తరువాత చేసుకోవచ్చు. లేదా ఏ 20 సంవత్సరముల వయస్సులోనో వివాహం చేసుకోవచ్చు. అది ఆ స్త్రీ యొక్క వ్యక్తిగత విషయం. కాబట్టి ఫలానా వయస్సులోనే వివాహం జరపాలని ఇస్లామ్ ఎటువంటి హద్దులు ఏర్పరచ లేదు.

ఇన్షా అల్లాహ్, మహిళలకు సంబంధించి మరెన్నో ముఖ్యాంశాలు వచ్చే సంచికలో ...

# పాఠకుల అభిప్రాయాలు

**రాతియుగం ...**

చరిత్రలో రాతియుగం అనేది వాస్తవంగా లేదని, అది ఒక కల్పితమని ఆధారాలతో అందివ్వబడిన ఈ శీర్షిక తొలి వ్యాసానికి మంచి స్పందన వచ్చింది. వివిధ విద్యార్హతలు కలిగిన పాఠకుల నుండి అభిప్రాయాలు అందాయి. తొలి మానవుడు ఈ భూమిపై అడుగుపెట్టినప్పటి నుండి సంస్కారంతోనే జీవించాడు అనే విషయం వాస్తవం. అల్లాహ్‌ను విశ్వసించిన వారికి ఈ విషయం స్పష్టంగా తెలుసు. ఖుర్‌ఆన్‌కు వ్యతిరేకంగా వ్రాయబడినవి అబద్ధాలని స్పష్టంగా ఆధారాల ద్వారా పాఠకులు తెలుసుకుని అభినందించారు. అల్-హమ్‌దులిల్లాహ్!

**ముస్లిమ్ మహిళ ...**

ఈ కొత్త సీరియల్ పరిచయం వ్యాసం చూసి పాఠకులు తమ స్పందన తెలియజేశారు. వారు కోరిన అంశాలు ఇన్షా అల్లాహ్ రాబోయే వ్యాసాలలో ప్రచురించబడతాయి. వాటిని ప్రచురించాలని ముందుగానే నిర్ణయం జరిగింది. ఒక స్త్రీ పుట్టుక నుండి మరణించే వరకూ, అల్లాహ్ ఆదేశించినట్లు ఏ విధంగా వ్యవహరించాలో ప్రతీ విషయం చాలా వివరంగా అందించడానికే ప్రయత్నం చేస్తున్నాము. కొందరు సోదరీమణులు చెప్పుకోలేని విషయాలుంటాయి. అటువంటి అన్ని విషయాలు ప్రవక్త(స)వారు సూచించిన విధంగా సంస్కార వంతమైన భాషలో ఇన్షా అల్లాహ్ తెలియజేస్తాము.

**అల్లాహ్ - ఖుర్‌ఆన్ - ముహమ్మద్(స) ...**

ఈ వ్యాసానికి అత్యధిక సమయం పట్టింది. సమాజంలో నెలకొని ఉన్న వివిధ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని, వాటి అన్నింటికి ఒకే పరిష్కారంగా చాలా సమయాన్ని ఈ వ్యాసం కొరకే కేటాయించి అందించడం జరిగింది. **ముందుగా ఖుర్‌ఆన్ వాక్యాలతో మాత్రమే వివరణ ఇవ్వడం జరిగింది.** ఈ ప్రస్తుత సంచికలో హదీస్‌ల ద్వారా వివరణ ఇవ్వడానికి అన్ని ఏర్పాట్లు చేసుకున్నాం. అయితే స్థలాభావం వలన అందివ్వలేకపోయాము. ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో ప్రచురిస్తాము. ఒకే వ్యాసాన్ని ఖుర్‌ఆన్ ఆయత్‌ల ద్వారా ఒకసారి, హదీస్‌ల ద్వారా మరోసారి అందివ్వడానికి గల కారణాలు ఇప్పటికే చాలామందికి అర్థమై ఉంటాయి. కొన్ని దుష్ప్రచారాల వ్యాప్తిని నిరోధించే వేక్సిన్‌గా ఈ వ్యాసాలు ఇన్షా అల్లాహ్ పనిచేస్తాయి.

**తల్లిదండ్రులను దూషించడంపై ...**

సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ముహమ్మద్(స)వారి నోటి వెంట వెలువడిన ఓ ఆణిముత్యం గురించి క్రింది హదీస్‌లో చదవండి.

అబ్దుల్లాహ్ బిన్ అమ్ర్(రజి)వారి ఉల్లేఖనం. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, “ఒక వ్యక్తి తన తల్లిదండ్రులను **దూషించడం ఘోరపాపాలలో ఒకటి**”. (ప్రజలచే) ఇలా అడగబడింది, “**ఓ రసూలుల్లాహ్(స)! ఒక వ్యక్తి ఎలా తల్లిదండ్రులను దూషిస్తాడు?**” ప్రవక్త(స)వారు చెప్పారు, “ఆ వ్యక్తి మరో వ్యక్తి తండ్రిని దూషిస్తాడు మరియు రెండవ వాడు మొదటి వాడి తండ్రిని దూషిస్తాడు మరియు అతని తల్లిని దూషిస్తాడు. (సహీహ్ బుఖారీ, 5973, పుస్తకం 78, అధ్యా.4, సంపుటి 8)

కొన్ని సమస్యలు వచ్చిన తరువాత మాత్రమే వాటి పరిష్కారం కోసం ఆలోచిస్తాము. ముందు జాగ్రత్తలు తీసుకుంటే కొన్ని సమస్యలు రాక పోవచ్చు. తన ఉమ్మత్‌లో రాబోవు ముస్లిమ్ తరాలకు కొన్ని సమస్యలు రాకుండా ఉండాలని ముహమ్మద్(స)వారు ఆణిముత్యాలవంటి ఎన్నో సూచనలు ఇచ్చారు. వాటిని వదిలేయడం వలన ముస్లిములు నేడు సమస్యలలో చిక్కుకుంటున్నారు. క్రింది హదీస్ కూడా చదవండి.

అబూహురైరాగారి(రజి) ఉల్లేఖనం : గ్రంథప్రజలు ‘తౌరాత్’ను హెబ్రూలో చదివి, దానిని అరబీ భాషలో ముస్లిములకు వివరిస్తుండేవారు. అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు : “**గ్రంథప్రజలు చెప్పేది నిజమనిగాని, అబద్ధమని గాని చెప్పవద్దు.** కాని (బదులుగా) చెప్పండి, ‘మేము అల్లాహ్‌ను మరియు ఏదైతే మాపై అవతరింపబడిందో దానిని మరియు ఏదైతే మీపై అవతరింప బడ్డాయో వాటిని విశ్వసిస్తున్నాము”.

**(సహీహ్ బుఖారీ, నెం. 7362, సంపుటి 9, పుస్తకం 96, అధ్యాయం:25)**

సాధారణంగా ముస్లిములు ఎదుటి ధర్మంవారు చెప్పేవాటిపై కామెంట్ చేయరు. కాని కొందరు అవివేకులు తాము ముస్లిముల ప్రతినిధులమని చెప్పుకుంటూ ఇతర ధర్మాలతో వాదనకు దిగి, ఏదైతే ప్రవక్త(స)వారు చేయవద్దని చెప్పారో, ఆ చేయకూడని వాటినే చేస్తూ ఎదుటివారి గ్రంథాలలోని కొన్ని విషయాలు తప్పు అని మరికొన్ని విషయాలు ఒప్పు అనడం ప్రారంభించారు.

**ఎదుటి ధర్మం వారికి కావలసింది కూడా ఇటువంటి అవివేకుల వ్యాఖ్యలే!** ఆ వ్యాఖ్యలను అడ్డం పెట్టుకుని ఎదుటివారు దూషణకు దిగారు. అది కూడా నీచస్థాయిలో ముహమ్మద్(స)వారి వ్యక్తిత్వంపై. వారికి తెలుసు **ముస్లిములు ఏ ప్రవక్తనూ దూషించరని, ప్రవక్తలందరినీ గౌరవిస్తారని.** ఇదే అదనుగా మునాఫిక్‌లు (కపట విశ్వాసులు) ఆ ధర్మం వారితో కలిసి ఇస్లామ్‌పై చెడు ప్రచారానికి సహాయపడుతున్నారు. ఫలితంగా ఒకనాడు తినడానికి తిండి కూడా సరిగ్గా లేని కపటవిశ్వాసులు, నేడు ఆ ధర్మం వాళ్ళు చేస్తున్న ఆర్థిక సహకారంతో ఆస్తులు, బంగారం, భవనాలు సంపాదించుకున్నారు. వాళ్ళు ఎంత సంపాదించుకున్నారన్నది మనకు అనవసరం. ఎందుకంటే హరామ్ సొమ్ము తిన్నవాళ్ళే ఇహలోకం మరియు పరలోకంలో నష్టపోతారు కాబట్టి. కాని ఆలోచించవలసింది

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా** velugubaata@gmail.com **కు పంపండి.**

వారి వలన మన ముస్లిమ్ సమాజానికి జరగుతున్న నష్టం గురించి.

ఇస్లామ్‌పై తప్పుడు వ్రాతలు ఓ మతధర్మం వారు శతాబ్దాల తరబడి వ్రాస్తూనే ఉన్నారు. వారి గురించి ప్రజలకు తెలుసు. అయితే ఇప్పుడు **మునాఫిక్‌లు కూడా పుస్తకాలు వ్రాస్తున్నారు.** కరపత్రాలు ప్రచురిస్తున్నారు. వ్రాసినవారు ముస్లిములే అని ముస్లిమ్ సమాజం భ్రమపడుతుంది. కాని వారు కాపట్యం కలవారని తెలుసుకునేసరికి నష్టం జరిగిపోతుంది.

చాలా జిల్లాలలో 'మీ ఖుర్ఆన్ గ్రంథం కంటే మా గ్రంథమే సరియైన దని మీ ముస్లిములే చెబుతున్నారని" చెబుతూ ఓ డిబేట్ సిడిని ముస్లిములకు ఓ మతధర్మంవారు పంచుతున్నారని మాకు చాలామంది సమాచారం అందించారు. మానవోత్తముడైన ముహమ్మద్(స) వారిపై మేము ప్రచురించిన పుస్తకం పంపమని వారంతా మమ్మల్ని కోరుతున్నారు.

ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం పుస్తకం కావాలని రాష్ట్రం నలుమూలల నుండి ఎందరో పాఠకులు అడుగుతున్నారు. దాదాపు ఒక సంవత్సరం పూర్తిగా పరిశోధించి వ్రాసిన ఆ పుస్తకాన్ని ఉచితంగా అందించాలనే సంకల్పంతో 3000 కాపీలు మాత్రమే ప్రచురించి శాంతిబాట చందాదారులకు ఉచితంగా అందించాము. మా వెబ్‌సైట్‌లో కూడా ఆ పుస్తకాన్ని ఉంచాము.

మేము ఎవరి దగ్గరా ఫండ్స్ సేకరించము మరియు జకాత్ సొమ్ము స్వీకరించము. ఈ పుస్తకాన్ని డిమాండ్‌కు తగిన విధంగా ప్రచురించాలంటే మాపై ఆర్థికంగా చాలా భారం పడుతుంది. అందుకని ఈ పుస్తకాన్ని కొత్తగా తీర్చి దిద్ది నామమాత్రపు వెలకి అందించాలని అను కుంటున్నాము. ఆ విషయం త్వరలో శాంతిబాటలో ప్రకటిస్తాము.

ఆ పుస్తకాన్ని ఏదో విధంగా ప్రచురించి మీకు ఇస్తాము, బాగానే ఉంది. కాని ఆ పుస్తకంలో మేము చేసిన అభ్యర్ధనను **ఎందుకు పట్టించుకోవడం లేదు?** ఇతర మతధర్మాలవారితో డిబేట్‌లు జరగకుండా చూడమని, ఇతర ధర్మాల వారిని విమర్శిస్తూ ప్రసంగాలు జరగకుండా చూడమని మనవి చేశాము. ముస్లిములు ధన సహాయం చేయకపోతే చాలా వరకూ ఈ డిబేట్‌లు మరియు ప్రసంగాలు జరగవు.

ఇస్లామ్ ఔన్నత్యాన్ని తగ్గించడానికి, ముహమ్మద్(స)వారిపై నిందలకు అవకాశం కల్పిస్తూ కపట విశ్వాసులు దొంగ డిబేట్లు ఏర్పాటుచేశారని తెలిశాక కూడా సభ్య సమాజం ఏం చేస్తుంది? ఆ సిడిని చూసిన ముస్లిములలో అల్లాహ్‌పై ఆవగింజంతైనా విశ్వాసం లేదా? **ముహమ్మద్(స)వారిపై కొద్దిగా కూడా ప్రేమ లేదా?**

మన భారతదేశంలో పోలీస్ వ్యవస్థ మరియు న్యాయవ్యవస్థ ఉన్నాయని కూడా తెలియదా? ఒక వ్యక్తికి తన తండ్రిని ఎవరైనా దూషించారని తెలిస్తే, ఆ దూషించినవానిపై పరువునష్టం దావా వేస్తానని హెచ్చరిస్తాడు. అంతేకాదు ఆ పనిచేయడానికి అతనికి ఎవరి సహాయం అవసరం లేదు. ఒక్కడే కోర్టుకెళ్ళగలడు.

మరి ముస్లిములలోని విశ్వాసులకు తల్లిదండ్రులకంటే మరియు అన్నిటికంటే ఎక్కువ ప్రేమకు అర్హులు ముహమ్మద్(స)వారు. మరి ఆయనపై దూషణలకు దిగితే **ఆవేదన చెందుతూ కూర్చుంటారా?**

ముహమ్మద్(స)వారి బోధన చదివారు కదా. కాబట్టి మీరు ఎవరినీ దూషించనవసరం లేదు. దూషించేవారి గురించి శాంతియుతంగా చట్టానికి తెలియజేయండి చాలు. ఆ విధంగా శాంతిధర్మం యొక్క ఔన్నత్యం ప్రజలు తెలుసుకునేలా చేయండి. ఇది ప్రాక్టికల్ దావా.

అవినీతి అనేది అన్ని రంగాలలోకి ప్రాకిపోయింది. డబ్బు కోసం ఎటువంటి పనికైనా సిద్ధపడేవారున్నారు. ఒక మతధర్మం వారు ముస్లిమ్ పేర్లు కలిగి ఉన్న కొంతమంది అవినీతిపరులను ఎంచుకుని వారిచేత ఒక ప్రక్క ఇస్లామ్‌కి వ్యతిరేక ప్రచారం చేయిస్తున్నారు. ఇటువంటి వ్యక్తులనే మునాఫిక్‌లు (కపట విశ్వాసులు) అంటారు. మరో ప్రక్క comparative study పేరుతో ఇస్లామ్ ధర్మం గురించి కనీస అవగాహన లేని కొందరు 'డిబేట్'లు నిర్వహిస్తున్నారు. వాటిని ఆసరాగా చేసుకుని 'ఇస్లామ్'పై **విష ప్రచారం** జరిగేలా అవకాశం కల్పిస్తున్నారు.

**పత్రిక ఆలస్యం ...**


పత్రిక ఆలస్యానికి గల కారణాలు క్రిందటి సంచికలో స్పష్టంగా తెలియజేశాము. ఇస్లామ్ కొరకు ఓ ముఖ్యమైన సేవ చేసే అవకాశం అనుకోకుండా ఫిబ్రవరి నెలలో శాంతిబాట టీమ్‌కు అల్లాహ్ దయవలన లభించింది. ఎంతో విలువైన ఆ పని వలన ఈసారి కూడా కొంచెం ఆలస్యమైంది.

**మేము పత్రికను ఫలానా టైమ్‌కి ఖచ్చితంగా ఇస్తామని వాగ్దానమేమీ చేయలేదు. సమయానికి అందించడానికి అల్లాహ్ పేరుతో మా శాయశక్తులా మేము ప్రయత్నిస్తున్నాము. చందా దారులు కూడా సమయానికి డబ్బు పంపకపోవడం వలన కూడా మాకు చాలా ఇబ్బందులు ఎదురౌతున్నాయి. పత్రిక ఆలస్యం గురించి మాకు ఒకరిద్దరు ఫోన్ చేసి** ఉపన్యాసం ఇవ్వడానికి ప్రయత్నించారు. **శాంతిబాటలోని వ్యాసాలు మరియు వివరణలు చదివాక కూడా వారు అలా మాట్లాడటం సరికాదు. దయచేసి ఎవరికైనా ఏదైనా కారణం చేత పత్రిక నచ్చకపోతే నిర్మొహమాటంగా తెలియ జేయండి. వారికి పత్రిక ఆపేసి మిగతా సొమ్ము వాపసు చేస్తాము. ఇస్లామ్‌కు సంబంధించి ప్రామాణిక విషయాలను ముస్లిము సోదరులకి అందించాలనే మంచి సంకల్పంతోనే అల్లాహ్ పేరుతో ఈ పత్రిక ప్రారంభించాము. ఇది వ్యాపార పత్రిక ఎంతమాత్రం కాదు. సత్యాన్ని తెలుసుకోవాలని కోరుకునే పాఠకులకు మా పత్రిక అందితే చాలు. బలవంతంగా చదివించే కోరికైతే మాకు లేదు.**

**ఈ సంచికలో ఇవ్వబడిన మొత్తం హదీస్‌లు : 46**

**సహీహ్ బుఖారీ** : 3322,3289,3294,3293,3271,3283,4548,3270, 3269,3295,5973,7362 **సహీహ్ ముస్లిమ్** : 4043,4048,6132,6105, 6091,6097,5262,5301, 5250,5253,5246,6646,6920,5738, 5264,6136,5678,5679, 7491,7490,858,344,345,349,244, 6668 **సునన్ అబూదావూద్** : 3674,3675,3676,3682,3681,3683 **సునన్ ఇబ్నెమాజా** : 43

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** Saanthibaata Printing House, 19-1-447, Hanuman Statue Center, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440, **Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650


www.saanthibaata.net
New Look!
హోమ్
saanthibaata
శాంతిబాట
The first Islamic Research Magazine in Telugu.
Saanthibaata is a monthly magazine registered with Registrar of Newspapers for India, New Delhi. It was started on the first day of Ramadan, i.e. 23 August, 2009 at Samalkot, East Godavari District, Andhra Pradesh, India.
A source for the most authentic information about Islam in Telugu
SAANTHIBAATA
CLICK HERE
www.saanthibaata.com
డౌన్‌లోడ్ మేగజైన్
saanthibaata
FIRST YEAR
5 Single Issues 3 Combined Issues
Location
website visited from 23 countries
బుక్స్
FREE BOOKS
ముహమ్మద్
దుష్ప్రచారం
Download Free
www.saanthibaata.net
www.saanthibaata.com
Designed & Maintained by SAANTHIBAATA TEAM

**SAANTHIBAATA MONTHLY** **January & February, 2012** Samalkot-533440 (East Godavari Dist.)
**Registered with Registrar of News Papers for India** **RNI Reg. No. APTEL/2009/29650**
**Postal Concessional Registration No. AP/KD/140/2011-2013**

# మత్తు కలిగించే ప్రతీదానిని ఇస్లామ్ నిషేధించింది

**ఓ విశ్వాసులారా! నిశ్చయంగా మద్యపానం, జూదం, బలిపీఠం మీద బలి ఇవ్వడం (అన్సాబ్) మరియు శకునానికై బాణాల ప్రయోగం (అజ్లామ్) ఇవన్నీ కేవలం అసహ్యకరమైన షైతాన్ చేష్టలు, కావున మీరు సాఫల్యం పొందాలంటే వీటిని వదిలేయండి.** (ఖుర్'ఆన్ 5:90)

حَدَّثَنَا عُثْمَانُ بْنُ أَبِي شَيْبَةَ قَالَ : حَدَّثَنَا وَكِيعُ بْنُ الْجَرَّاحِ
عَنْ عَبْدِ الْعَزِيزِ بْنِ عُمَرَ، عَنْ [أَبِي طُعْمَةَ] – مَوْلَاهُمْ –
وَعَبْدِ الرَّحْمَنِ بْنِ عَبْدِ اللهِ الْغَافِقِيِّ وَأَنَّهُمَا سَمِعَا ابْنَ عُمَرَ
يَقُولُ : قَالَ رَسُولُ اللهِ ﷺ : ((لَعَنَ اللهُ الْخَمْرَ وَشَارِبَهَا
وَسَاقِيَهَا وَبَائِعَهَا وَمُبْتَاعَهَا وَعَاصِرَهَا وَمُعْتَصِرَهَا وَحَامِلَهَا
وَالْمَحْمُولَةَ إِلَيْهِ)).

**అల్లాహ్ యొక్క సందేశహరులు (ముహమ్మద్ ﷺ) చెప్పారు:**

**"అల్లాహ్ శపించారు - ఖమ్ర్ (మద్యం)ని మరియు దానిని తాగిన వాడిని, దానిని పోసిన వాడిని, దానిని అమ్మిన వాడిని, దానిని కొన్నవాడిని, దానిని పిండిన వానిని, ఎవని కొరకు అది పిండబడిందో వాడిని, దానిని మోసుకెళ్ళే వాడిని మరియు ఎవరి కోసమైతే తీసుకెళ్ళబడుతుందో వాడిని."**

(అబూదావూద్, హసన్, 3674, పుస్తకం 25, అధ్యా. 2, సంపుటి 4)

THE MESSENGER OF ALLAH, MUHAMMAD ﷺ SAID:
Every drink that intoxicates is Haraam

**ఏ ప్రాంతంలో వారికైనా సరే, మద్యం నిషేధమే!**
**శారీరక, మానసిక ఆరోగ్యాలను పాడుచేసే మద్యాన్ని మానాలి**

Visit
**www.saanthibaata.net**
23 దేశాలలోని తెలుగు పాఠకులచే వీక్షించబడుతున్న తెలుగు ఇస్లామీయ వెబ్‌సైట్